

# ఆర్వీయార్

(రాళ్లభండి వెంకటేశ్వరరావు)

## 85వ జయంతి విశేష సంచిక

# సాహిత్య తత్వానికి దారిదీపం


భారత స్వాతంత్ర్య సమర చరిత్ర
ఆర్వీయార్
CHANDRA





# సాహిత్య తత్వానికి దారి దీపం

ఆర్వియార్ ప్రజ్ఞ బహుముఖమైంది. వృత్తిపరంగా ఇంగ్లీషు అధ్యాపకుడు. అధ్యాపకుడే కాదు గొప్ప అధ్యయనశీలి. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు సాహిత్యాల మీద పట్టు వుంది. 'చదువులలో మర్మమెల్ల చదివితి' అన్నట్లు ఈ మూడు భాషల సాహిత్య మర్మాలు తెలిసినవాడు. దీనికితోడు యూనివర్శిటీలో విద్యార్థి ఫెడరేషన్‌లో క్రియాశీల కార్యకర్త. అక్కడ మార్క్సిజంతో పరిచయం, అధ్యయనం మొదలైంది. సాహిత్యతత్వాన్ని విశ్లేషించే సూక్ష్మ దృష్టికి మార్క్సిజం ఆలంబనం అయింది. ఆర్వియార్ 20 వరకు స్వీయ రచనలు చేశారు. అవి కేవలం సాహిత్య విమర్శకే పరిమితం అయినవి కావు. మార్క్సిజం పాఠాలు, చరిత్ర, సంస్కృతి వగైరాలతోపాటు పిల్లల కోసం ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు, స్పోకెన్ ఇంగ్లీషు తదితరాలున్నాయి. ఆయన బహుముఖ ప్రజ్ఞకు ఇవన్నీ నిదర్శనాలుగా నిలుస్తాయి. తెలుగు సాహిత్యం మీద నాకు తెలిసి ఐదు పుస్తకాలున్నాయి. రాశిలో తక్కువే అయినా వాసి గల రచనలు. అందులో సాహిత్యతత్వం ఒక అపురూపమైంది. సాహిత్యతత్వాన్ని అవగాహన చేసుకోవడానికి నాటికీ, నేటికీ అదొక దారి దీపం.

కుటుంబరావు శైలి మీద, శ్రీశ్రీ ఆలంకారికత మీద రాసిన సుదీర్ఘ వ్యాసాలు ఆర్వియార్ పరిశోధనకీ, సూక్ష్మ దృష్టికీ తార్కాణాలుగా ఎప్పటికీ నిలిచి వుంటాయి. 20వ శతాబ్ది తెలుగు కవుల మీద ఆర్వియార్ చేసిన రేడియో ప్రసంగాల పుస్తకంలో వున్నవి చిన్న చిన్న వ్యాసాలే అయినా ఉద్దండులైన పలువురి కవులపై 'సాహిత్య పరంగా' ఇచ్చిన తీర్పులు ఆయన సాహిత్య దృక్పథానికి అద్దం పడతాయి. స్వాతంత్ర్య సమర చరిత్ర, మతం-మార్క్సిజం, భగవద్గీత-మార్క్సిజం, ఆంధ్ర సాహిత్య చరిత్రలాంటి స్వీయ రచనలలో మార్క్సిస్టు పరిశీలనా పద్ధతి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 140 పైగా పుస్తకాలను అనువాదం చేసి రాటు తేలిన అనుభవంతో రాసిన 'అనువాదాలు - ఆవిష్కరణలు - అవస్థలు' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం ఆశ్చర్యం కలిగించదు. ఆయన పుస్తకాలు, అనువాదాలు, వ్యాసాలకే పరిమితం కాలేదు. 'పనికొచ్చే ముక్క' పేరుతో విశాలాంధ్ర, ఆంధ్రభూమిలో ఆరు సంవత్సరాలపాటు ఒక శీర్షికను నిర్వహించారు. ఇతివృత్తం వర్తమాన రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలే. ఇవి వారం వారం రాసే తేలికపాటి రచనలు కావు. ప్రతి దానిలోనూ పలు భాషా సాహిత్యాల గుబాళింపు వుంటుంది. అలాంటి శీర్షిక ఆయన మాత్రమే నిర్వహించగలరు.

ఆర్వియార్ గొప్ప సంభాషణా చతురుడు. ఆయన రచనలకంటే, ప్రసంగాలకంటే ఆయనతో సంభాషణ ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది. ఆయన మేధో సంపత్తి విశ్వరూపం కనిపిస్తుంది. ఆర్వియార్ గొప్ప స్నేహశీలి, మనం ఫోన్ చేయకపోతే ఆయనే చేస్తారు. 'మనకి కించిత్తు కష్టం వస్తే ఆయన చలించిపోతారు. హుటాహుటిన పరామర్శకి వస్తారు. ఇంటికి వెళితే చాటంత ముఖం చేసుకుంటారు. ఇక ఆయన సహచరి సుందరమ్మ గారి చేతి వంట తినకుండా రావడం అసాధ్యం. ఆర్వియార్ చేసిన బహుముఖ సాహిత్య సేవ విస్మరణకు గురైందని చెప్పలేము. కాని రావలసిన గుర్తింపు మాత్రం రాలేదు. ఈ ప్రత్యేక సంచిక ఆర్వియార్ బహుముఖ సాహిత్య సేవకు ఒక రేఖామాత్ర పరిచయం మాత్రమే. ఆయన రచనలు మరోసారి చదవడానికి ప్రేరణ ఇస్తుందని ఆశిస్తున్నాం. అలాగే ఈ సంచిక తెలుగు సాహిత్య చరిత్రలో ఆర్వియార్ స్థానాన్ని పదిలపరుస్తుందని భావిస్తున్నాం.

వ్యాసకర్తలకు, ప్రచురణకు సహకరించిన మిత్రులకు అందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

- డీవీవీఎస్ వర్మ

సంపాదకులు, 85006 78977

# ఆర్వియార్ - సాహిత్య తత్వానికి దారిదీపం

## పార్ట్ 1 - ఆర్వియార్ స్వీయ రచనలు


1. ఆర్వియార్ జీవన రేఖలు 5
2. కొడవటిగంటి కుటుంబరావు శైలి 7
3. శ్రీ శ్రీ ఆలంకారికత 14
4. రా.రా. స్థాపించిన ఉత్తమ సాహిత్య విమర్శ ప్రమాణాలు 20
5. తిలక్.. తదనంతర సాహిత్య స్రవంతులు 24
6. కన్యాశుల్కంలోని విశేషాంశాలు 27
7. అనువాదం.. భిన్నభాషల మధ్య వారధి 35
8. తొలగిన స్వర్గం.. 40
9. ఆలోచనామృతం చందు సుబ్బారావు : చందన చర్చ 43
10. కవిత్వానికి మళ్లీ మంచిరోజులు:అగ్నికి ముందుమాట 44
11. ఆర్వియార్ మరికొన్ని పుస్తకాలు 45


## పార్ట్ 2 - పుస్తక పరిచయాలు


1. ఆర్వియార్ 'సాహిత్య తత్వం' - డా॥ పి.సంజీవమ్మ 46
2. సారాంశాన్ని తేల్చి చెప్పిన 'సాహిత్య వ్యాసాలు' - పెనుగొండ లక్ష్మీనారాయణ 54
3. యుగకర్త గా శ్రీశ్రీ - అదృష్టదీపక్ 57
4. ఆర్వీయార్ : ప్రజాస్వామిక లౌకిక స్వాతంత్ర్య సమర చరిత్ర - కొప్పర్తి వెంకటరమణమూర్తి 59
5. 'మన కాలం విమర్శకుడు' - మందలపర్తి కిషోర్ 62
6. అనువాద సమస్యలపై ఆర్వీయార్ - కె.పి.అశోక్‌కుమార్ 65
7. అందరికీ 'పనికొచ్చే ముక్క' ! - డి.సోమసుందర్ 67
8. మాస్టారుతో నా - జ్ఞాపకాలు - డి.రాధాకృష్ణమూర్తి 69
9. ఆర్వియార్ అనువాద పుస్తకాలు : లెఫ్టిస్టు స్టడీ సర్కిల్ 71


## పార్ట్ 3 - సాహిత్య పరామర్శ


1.సంవేదనలో ఆర్వియార్- కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి 72
2.తూర్పు-పడమర తెలిసిన విమర్శకుడు ఆర్వియార్! - మందలపర్తి కిషోర్ 75
3. సాహిత్య తత్వమెరిగిన ఆర్వియార్ - రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి 79
4. 'సాహితీ సింధువు' ఆర్వియార్ - గుళ్లపల్లి రాజా 81
5. అనువాద ఉద్దండుడు ఆర్వియార్ - భండారు శ్రీనివాసరావు 85
6. అరసం మణిపూస ఆర్వియార్ - గుజ్జుల ఓబులేసు 87
7. వయోజన విద్యకు ఆర్వియార్ సేవలు - డాక్టర్ కృష్ణమోహన్‌రావు 89
8. పిల్లల పుస్తకాలు 90


## పార్ట్ 4 : ఆప్తవాక్యం


1. మరుపురాని మనిషి - ఆచార్య వకుళాభరణం రామకృష్ణ 91
2. మా ఆర్వియార్ మాస్టారు - డా॥ సురేష్ బాబు 92
3. ఆర్వియార్ గారితో మాస్కో విద్యార్థులు - అజయ్ కంభంపాటి 94
4. సునిశిత హాస్యం ఆయన సొంతం - డా॥ బి.రమేష్‌చంద్రబాబు 95
5. ఆయనతో మాట్లాడడమే ఓ ఎడ్యుకేషన్ - డి.సోమసుందర్ 96
6. అక్షరాల లక్షాధికారి - మాటల కోటీశ్వరుడు - సంకు మనోరమ 97
7. హాస్య చతురుడు - ఎస్.మల్లేశ్వరశాస్త్రి 99
8. **Our memorable school days** - Nallamilli Prakash 100
9. మా అన్నయ్యతో మేము - ఆర్.సీతారామం ఆర్.ఎస్.గంగాధరం, ఆర్.ఎస్.వేణుగోపాల్. 101
11.సామాన్యులలో అసామాన్యుడు - వారణాసి సుధాకర్ 104


## పార్ట్ 5 : ఆర్వియార్ స్వీయ రచనలు - అనువాదాలు 105

ఆర్వియార్ (రాళ్లభండి వెంకటేశ్వరరావు)

85వ జయంతి విశేష సంచిక

# సాహిత్య తత్వానికి దారి దీపం

వెల రూ.100

సంచిక కోసం : డా॥ బి.రమేష్ చంద్రబాబు : ఫోన్ 93971 14495

ఉచిత **Pdf** కాపీ కోసం : **DVVSVARMA.COM**

విశాలాంధ్ర, నవచేతన, ప్రజాశక్తి, నవ తెలంగాణ పుస్తకాల షాపులలో కూడా లభించును.

ఈ సంచిక సంపాదక వర్గం

**డీవీవీఎస్ వర్మ**

- సంపాదకులు

కొప్పర్తి వెంకటరమణమూర్తి

మందలపర్తి కిషోర్

డి.సోమసుందర్

డా॥ బి.రమేష్ చంద్రబాబు


ప్రతులు : 1000, ముద్రణ : విశాలాంధ్ర ప్రెస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ 4 - పబ్లిషర్ : బి.రమేష్ చంద్రబాబు, తణుకు

# ఆర్వియార్ జీవన రేఖలు



సుందరి, ఆర్వియార్

- ఆర్వియార్ : రాళ్ళభండి వెంకటేశ్వరరావు
- పుట్టింది : పశ్చిమగోదావరి జిల్లా పెద్దేవం గ్రామం.
- హైస్కూల్ విద్య : మార్టేరులో.
- ఇంటర్మీడియట్ : 1955-57 కాకినాడ పి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో.
- బి.ఎ.(ఆనర్స్) : (1957-60) ఆంధ్ర విశ్వ కళాపరిషత్, విశాఖపట్నంలో.
- అధ్యాపకునిగా : 1960 నుంచి కొత్తగూడెం, కడప, తాడేపల్లిగూడెం, తణుకు, రాజోలు ప్రభుత్వ కళాశాలల్లో ఆంగ్లోపన్యాసకునిగా పనిచేశారు.
- పదవీ విరమణ : ప్రిన్సిపాల్‌గా రామన్నపేటలో పదవి విరమణ చేశారు. తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.
- అనువాదకులుగా : 1981 నుండి 1991 వరకు మాస్కో లోని "రాదుగ" సంస్థ లో తెలుగు అనువాదకులు వున్నారు.
- ఇతర పదవులు : ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శిగా, అధ్యక్షవర్గ సభ్యులుగా పదవులను నిర్వహించారు.
- పత్రికల్లో పాత్ర : కడప నుండి రా.రా. ఆధ్వర్యంలో వెలువడ్డ 'సంవేదన' సాహిత్య త్రైమాసిక. నిర్వహణలో పాత్రధారిగా వున్నారు. 'పనికొచ్చేముక్క' శీర్షికను విశాలాంధ్ర దినపత్రికలో మూడేళ్ళు, ఆంధ్రభూమి దినపత్రికలో మరో మూడేళ్ళు నిర్వహించారు.
- రచనలు : వీరివి అనేక పుస్తక సమీక్షలు, కథలు, విమర్శనాత్మక వ్యాసాలు ఎన్నో పత్రికలలోనూ, పుస్తకాలలోనూ, ప్రచురితమయ్యాయి. వీరు ఇప్పటికి ఆంగ్లం నుండి తెలుగుకి 132 గ్రంథాలు, తెలుగు నుండి ఆంగ్లానికి 8 గ్రంథాలు అనువాదం చేసి, స్వంత రచనలు 20 రాసి శతాధిక గ్రంథకర్త అయ్యారు.
- సాహిత్య అకాడమీ అవార్డు : 2012 డిసెంబరు 15న ఆయన మరణించారు. ఆ తర్వాత ఐదు రోజులకు డిసెంబరు 20న ఆర్వియార్ 'అనువాదాలు-అవిష్కరణలు, అవస్థలు' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్‌ను ప్రకటించింది.
- పురస్కారాలు, అవార్డులు : శ్రీ పులుపుల వెంకటశివయ్య స్మారక పురస్కారాన్ని, శ్రీ ఏటుకూరు బలరామమూర్తి స్మారక అవార్డును, 2003లో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం 'తెలుగు భాషా పురస్కారాన్ని' అందుకున్నారు.
- కుటుంబం : ఆర్వియార్ జీవన సహచరి సుందరి గారు. ఆయన మిత్ర బృందానికి అన్నపూర్ణ. ఆర్వియార్ ప్రస్తావన వస్తే వెను వెంటనే సుందరిగారి ప్రస్తావన వచ్చి తీరుతుంది. వారి కుమారుడు రాహుల్.



తల్లిదండ్రులు రాళ్లభండి సత్యనారాయణ, సూర్యకాంతం



సోదరులతో ఆర్వీయార్ : రాళ్లభండి శ్యామలరావు, ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, సీతారామం, గంగాధరం, వేణుగోపాల్
(వీరికి సోదరి ఈమని కళ్యాణి కూడా ఉన్నారు)





కుటుంబ వేడుకల్లో ఆర్వీయార్ దంపతులు



మిత్రులతో ఆర్వీయార్



మాస్కోలో ఆర్వీయార్ ఇంట మంగళంపల్లి బాలమురళీకృష్ణ

# కొడవటిగంటి కుటుంబరావు శైలి



- ఆర్వీయార్

**శైలిని గురించి చెప్పడమంటే తేనె తుట్టను కదిలించినట్టే. ఒడుపుగా ఈగల్ని తప్పించుకుని తేనె చిక్కించుకోవాలి. ఇంత పెద్ద పనిని ఇంత చిన్న ప్రయత్నంలో సాధించాలని చూడడం సాహసమే. శైలి అన్న వెంటనే 'ఏ అర్థంలో వాడుతున్నావు?' అన్న ప్రశ్న వస్తుంది. దీనికి కారణం అనేక అర్థాలలో ఆ పదానికి ప్రాచుర్యముండటమే. పాశ్చాత్య సంస్కృతితో సంబంధం వచ్చేదాకా మనకు శైలి అనే అవగాహనే లేదు. శయ్య-రీతి-పాకము ఇలాంటి పండితభాష ఏదో వుండేది తప్ప, మామూలు మాటలతో మామూలు మనుషులకు రాసే వాళ్ళకు ఇంతటి ఉత్కృష్టమైనదేదీ వుండదని మనవాళ్ళ విశ్వాసం.**

ఈ ఇరవయ్యవ శతాబ్దంలో మామూలు మనిషే మహనీయుడయ్యాడు. ఆధునిక యుగంలో గతకాలపు విశ్వాసాలూ సిద్ధాంతాలూ అవగాహనలూ అన్నీ తల్లకిందులైపోయాయి. సమాజం అంటే ఒక కొత్త చారిత్రక ఆర్థిక అవగాహన, ఒక నూతన నైతిక బౌద్ధిక పునాదీ ఏర్పడ్డాయి. ఈ నూతన దృక్పథ ప్రతిఫలనమే ఈ నాటి మన కళలూ, మన సాహిత్యమూను. ఈ మార్పులకనుగుణంగానే అనేక విషయాలను గురించిన సైద్ధాంతిక అవగాహన కూడా మారింది. శైలిని గురించిన అవగాహనలో మార్పు కూడా ఈ పాశ్చాత్య సంస్కృతీ ప్రభావమే. మనకి గురజాడ అప్పా రావు పుట్టేదాకా నిజమైన వచనమే లేదు. అందుకని ఆధునికతకూ, ఆధునిక అవగాహనలకూ ఇప్పుడున్న అర్థం రాలేదు. మనకున్న జబ్బు యేమిటంటే అర్థం కాకపోయినా అపోహలు పెంచుకోవడం. తెలియని విషయాన్నైనా తెలిసిన దానికంటే ఎక్కువ చెప్పడం. ఈనాడు వచన గేయానికి జరుగుతున్న సైద్ధాంతికశుద్ధి ఈ దారిలోనే వుంది. అలాగే శైలిని గురించీ అనేక విపరీత అభిప్రాయాలు ఉన్నాయి. పాండిత్య ప్రదర్శనే శైలి అనే ఊహ చాలా మందికి బలంగా వుంది. అలంకార భూయిష్టమైన రచనే శైలి అని కొందరనుకుంటారు. కొంచెం కవిత్వ ప్రకోపం లేకపోతే, ఆ రచనకు 'శైలి' లోపించిందనుకోవడమూ ఈ కోవలోదే. కొంత విచిత్రంగా వుండాలని కోరుకోవడమూ అదే శైలి అనుకోవడమూ కొందరికి సరదా. ఇలాంటివెన్నో అభిప్రాయాలు శైలిని గురించి ప్రచారంలో వున్నాయి.




చాలా మందికి ఇప్పుడో సందేహం రావచ్చు. యిలా సామాన్యంగా వున్న అభిప్రాయలన్నిటినీ తోసిరాజంటే 'శైలి అనేది యేమిటి?' అని. ఇలాంటి ప్రశ్న రావడం సబబే. ఓ విధంగా చూస్తే నిర్వచనాలు చాలా సంకుచితమైనవి. ఎంత జాగ్రత్త వహించి సూత్రీకరించినా ఎక్కడో ఒకచోట సందు వుండక పోదు. అలా అని అసలు నిర్వచనమే లేకపోతే అవగాహనే పక్కదారి పడుతుంది. ఒక స్థూలమైన రేఖైనా ఈ సరియైన అవగాహనకు అవసరం. నిజంగా చూస్తే అనేక పదాల్ని నిర్వచించకుండా అర్థం చేసుకోవడమే సులభం. ఉదాహరణకు 'కవిత్వం' లాంటివి. 'జీవితం' అంటే శాస్త్ర పద్ధతిలో ఖచ్చితమైన నిర్వచనం లేకపోయినా అందరమూ జీవిస్తూనే వున్నాము. శైలి అనే పదాన్ని కూడా నిర్వచించుకోవడం కంటే అర్థం చేసుకోవ డమే సులభం.

శైలి అంటే వ్యక్తిత్వం. (చరచ్తెర్ అనే ఇంగ్లీషు మాటకు శీలం అనే

తెలుగు మాట చాలా చిన్నది). అలాంటప్పుడు వ్యక్తిత్వమే అనకుండా శైలి అని వాడటం ఎందుకు? అని అడగవచ్చు. శైలి అనేది ఆ మనిషి చేస్తున్న పనికిగల లక్షణం కాబట్టి, ఆ పనిచేసే తీరుకుగల వ్యక్తిత్వం అవుతుంది. ఒక్తి వ్యక్తిత్వం అనేది ఆ మనిషికి గల వైయక్తిక జీవితానికి సంబంధం చింది. అదంతా అతను చేస్తున్న కృషిలో ప్రతిఫలించడం జరక్కపోవచ్చు. కాబట్టి చేసే పనికి గల తీరును శైలి అంటాం. అంటే ఒక మనిషికిగల సాహిత్య వ్యక్తిత్వానికీ ఆ మనిషికి వాస్తవ జీవితంలోగల వ్యక్తిత్వానికి కొంచెం తేడా వుండచ్చునన్నమాట.

సాహిత్యంలో మాదిరే మరే ఇతర కృషిలోనైనా గాని శైలి వుంటుంది. చిత్ర రచనలో ప్రాచీనుల నుంచి ఆధునికుల వరకు ఎన్నో శైలులు మారాయి. ఈ నాటికీ డాలీ శైలి, పికాసో శైలి మన రామారావు శైలీ (ఆ మాటకొస్తే వడ్డాది పాపయ్య శైలి కూడా) లాంటి శైలీ వైవిధ్యాలెన్నో వున్నాయి.

సాహిత్యమనేది భాషలో జరిగే వ్యాపారం కాబట్టి మాటల తొడుగులో వున్న వ్యక్తిత్వం ఆ మనిషికిగల శైలి అవుతుంది. ఒక మనిషికి ఒక వ్యక్తిత్వం వుండాలంటే. ఒక శైలి పట్టుబడాలంటే ఆ మనిషికి గల ఆలోచనా విధానమూ, సంస్కారమూ, సాధనా, కృషీ, అభిరుచి వంటివెన్నో పోషకాలౌతాయి. జీవితాంతం బండ్ల కొద్దీ రాసి కూడా ఒక నిర్దిష్టమైన వ్యక్తిత్వం గడించుకోలేని దురదృష్టవంతులూ వుండవచ్చు. మెఋపులాంటి వ్యాసాంగం తోటే ఒక స్పష్టమైన శైలి నిర్మించుకొనే గట్టివాళ్లూ వుండవచ్చు. అలాగే కృత్రిమ శైలి 'కష్టపడి' నిర్మించుకొనే అభాగ్యులూ వుంటారు. శైలి అనేది ఒక స్వంతముద్ర. ఈ ముద్రే ఒక రచయిత వ్యక్తిత్వం, ఆయన శైలి. మన తెలుగు సాహిత్యంలో ఇలాంటి సాహిత్య వ్యక్తిత్వం నిర్మించుకున్న వాళ్లు చాలా తక్కువమంది. అందులో నిస్సందేహంగా శ్రేష్ఠుడు కొడవటిగంటి కుటుంబరావు గారు. కె.కె. రచనా జీవితం నాలుగు దశాబ్దుల వయస్సు గడుపు కొంది. నలభైయేళ్ళ కాలంలో జీవితం ఎంతో మారింది. అలాగే దృక్పథాల్లోనూ మార్పు వచ్చింది. ఈ మార్పులన్నీ కూడా విత్తనంలోనించి చెట్టు పెరగడం లాంటివే. కాబట్టి ఆయన శైలిని గూర్చిన సైద్ధాంతిక అవగాహనలో విప్రతిపత్తి వుండదు. కె.కె. శైలి ప్రధానంగా ఆలోచనా ప్రేరకమైంది. మెదడులో మత్తుగా పడుకుని వున్న జీవకణాలకు మత్తువదిలి రాకెట్ వేగంతో పోయే ఆలోచనా పరత్వాన్ని కలిగిస్తుందాయన శైలి. హృదయ వ్యాపారమైన ఉద్రేకాన్ని కాక, మేధావ్యాపారమైన ఆలోచనను రేకెత్తిస్తుందీ శైలి. ఆయన చేసింది ప్రధానంగా సాహిత్య కృషి. సాహిత్యానికి ప్రధానంగా కావలసింది హృదయ ఉల్లాసం. ఉద్రేకాన్ని సృష్టించడం. అలాంటిది లేకుండా ఆలోచనా ప్రేరకంగా తయారుజేయడం బలహీనతే గదా అనవచ్చు. కళా నియమాలు తెలియకుండా సంయమనం లేని వాడు చేస్తే బలహీనతే అవుతుంది.

కె.కె.లాంటి స్థితప్రజ్ఞుడిలాంటి అసిధారావ్రతాన్ని అవలీలగా నిర్వహించగలడు. ఆయన గ్రహించిన వస్తువే ఓ రకంగా ఉద్రేకాల ఆటుపోట్లు అవసరం లేనిది. ఆయన రాసిన ఇంతటి విస్తృతమైన కథా సాహిత్యంలోనూ తనకు అపరిచితమైన గొప్పవాళ్ళ విషయమేమీ తేలేదు. తెలిసిన మధ్యతరగతి జీవితాల్లో అంత లోతూ వుండదు. అందుకని ఉద్రేకాల వెల్లువలకి ఆనకట్ట పడింది. అవకాశం వచ్చే చోటుల్లో కూడా ఆయన ఉద్రేకం సృష్టించడానికి ప్రయత్నించడు. ఉదాహరణకు ప్రేమ సన్నివేశాల్లో పుష్కలంగా ఉద్రేక సృష్టికి అవకాశం వుంటుంది. కొందరు రచయితలు 'అందం' కోసమా అన్నట్టు అదే పనిగా ఆ సన్నివేశాలు సృష్టిస్తారు. (కథలో ముద్దులకి సెన్సారుండదు!) కాని కె.కె. రచనల్లో ఎంతో సంస్కారవంతులైన వాళ్ళకు గాని ఆ అనుభూతి కలగదు. ఎందుకంటే ఆయన, ఆ సన్నివేశాల్ని పాఠకుడి హృదయం తబ్బిబ్బై అమితమైన ఉద్రేక ప్రవాహంలో కొట్టుకుపోయే పద్ధతిలో మలచడు గనుక. అదీగాక ప్రేమంటే ఆయనకు గల దృక్పథం కూడా కాల్పనికమైంది కాదు. మంద్రంగా, లలిత మధురంగా, మల్లెపూల పందిళ్ళలో పుట్టి-చంద్రలోకం నక్షత్రలోకం చుట్టి-ఒకసారి ఫెళఫెళలాడించే అతిలోకమైన ఉద్దేశాలు ఏమీ ఆయనకు ప్రేమను గురించి లేవు. మానవ హృదయమే కేంద్రస్థానమై జీవిత సార్థక్యంలో ప్రధాన భాగమైన ఒక శక్తి ప్రేమ. ప్రేమించలేని హృదయాలు బీళ్ళు. అలా అని ప్రేమ ఉద్భవించిన తర్వాత అడ్డూ అదుపూ లేకుండా సొమ్మసిల్లిపోవడం, అలా నటించడం కూడా ఆటవికం! ప్రేమ ప్రదర్శన ఎంత అసహ్యమో ప్రేమ లేకుండా సంసారం చెయ్యడమూ అంత అసహ్యమే. కె.కె.కు ప్రేమ భౌతిక జీవితంతో ముడిపడి వున్నదే. రొమాంటిక్ రచయితల మాదిరి, ప్రేమ మరో అతిలోక తత్త్వపు ప్రతిబింబం కాదు. (ప్రాచీనులకు ధర్మం అలాంటిది). 'శరీర ధర్మం మనోధర్మంతో ముడిపడి ఉందని గుర్తించటం అవసరం' అంటారు కె.కె.

### ఆడవలసిన అబద్ధం

ప్రేమ మానసిక ధర్మం. శరీర వాంఛలు తీరినట్లుగానే మానసిక వాంఛలూ తీరాలి. ప్రేమించే గుణం మనిషిలో కావాలి. ప్రేమించే గుణం లేనప్పుడు ఆ జీవితం మానవ ధర్మానికే విరుద్ధమైనది. ఇంతటి సుప్రతిష్ఠితమైన అవగాహన గలది ఆయన దృక్పథం. ఈ పాయింటును వ్యక్తీకరించడమే ఆయన కథా లక్ష్యం. ప్రేమకు సంబంధించిన ఇతివృత్తం గలవి చాలా కథలే వున్నాయి. 'ఆడవలసిన అబద్ధం' ఇందుకు ఉదాహరణగా గ్రహించవచ్చు. ఇందులో సుబ్బారావు, సీత తనను ప్రేమించే వరకు తన భార్య కాలేదని అనుకుంటాడు. ఇద్దరికీ చిన్ననాడే పెళ్ళయిందనీ, సీత బాల వితంతువు కావడం వల్ల సుబ్బారావు పెద్దలు మోసం జరిగిందని బాధపడి తెగతెంపులు

చేసుకు వెళ్లిపోయారనీ, ఆ తర్వాత సీత తండ్రి గతించినాడనీ, అప్పటి నుంచి తానే సీతని పెంచి పెద్ద చేశాననీ, ఆమె యోగ్యురాలనీ, యేలుకొమ్మని, ఓ హితుడైన పెద్దమనిషి సీతను తీసుకువచ్చి సుబ్బారావు దగ్గర విడిచి వెళ్ళిపోతాడు. ఆ అమాయకురాలికి ప్రేమను వ్యక్తీకరించే టక్కులేమీ తెలియవు. చాలా సాదాగా సుబ్బారావును ప్రేమిస్తుంది. ప్రేమ లేని స్త్రీతో కాపురం చేయడానికి మన సమాజంలో మంగళ సూత్రం లైసెన్స్ అయితే సుబ్బారావుకు ప్రేమించిన స్త్రీతో కూడా అది అడ్డమవుతుంది. అందుకని సీతను ఏ అడ్డూ లేకుండా తన దాన్ని చేసుకోవాలనుకుంటాడు. ఆమె తనను ప్రేమించాలి. ఆ విషయం తనకు తెలియాలి. 'మీ భార్యనుగదండీ' అనే ఎంగిలి ముక్క కోతపడాలి. అందుకని సీతను పరీక్షకు పెడతాడు. అబద్ధం ఆడతాడు. తనకు పెళ్లే కాలేదంటాడు. అతణ్ణి సీత విడిచిపెట్టి వెళ్ళిపోయే దశ వస్తుంది. అప్పుడు ఆమె హృదయంలో ప్రేమ అనే అనుభూతికి రూపం వస్తుంది. ప్రయాణానికి ఎందుకు తయారుకాలేదా ? అని తెలుసుకోవడానికి గదిలోకి వచ్చిన సుబ్బారావుని చూడగానే ఆమె భోరున ఏడుస్తూ తన ప్రేమను సూచిస్తుంది. 'నేను మా నాన్న గారింటికి పోలేను. నా ప్రాణం ఇక్కడే వుంటుంది. నాకు మొగుడవసరం లేదు. నేను పోతే మిమ్మల్ని ఎవరు చూస్తారు ? నేను మిమ్మల్ని విడిచిపెట్టి పోలేను. నన్ను పనిమనిషి కిందనైనా ఇక్కడ వుండనివ్వండి' అని ఏడుస్తుంది. సుబ్బారావు దగ్గరకు లాక్కుని ముద్దు పెట్టుకుంటాడు. ప్రేమతో అతని మనసు నిండిపోతుంది. ఉద్రేకం అనేది ఏ కోశానా లేకుండా చెప్పాడు కె.కె. యీ కథను.

### కురూపి..

ప్రేమకు సంబంధించిన ఇతివృత్తమే మిగిలిన చాలా వాటిల్లో వుంది. కాని 'కురూపి' ఆయన ప్రయోగం చేసిన మరో రచన. ఇందులో అందవిహీనుల వివాహసమస్య ఇతివృత్తం. 'సామాజిక జీవితం భౌతికంగా సుప్రతిష్ఠితమయ్యే కొద్దీ మానవుడి ఆధ్యాత్మిక శక్తులు పెరిగితీరుతాయి. మనిషి నుంచి మనిషి పొందే లక్షలాది అనుభూతులలో అందం ఇచ్చేది ఒక్కటి మాత్రమే. అంతకంటే గాఢమైన అనుభూతులు చాలా వుంటాయి. ఇలాంటి ఆధ్యాత్మిక బంధాలు జీవితం నిండా ఉంటాయి. స్త్రీ పురుషుల మధ్య ఇప్పుడుండే గోడలు పడిపోయినాక అటువంటి అనుభూతులకు అవకాశాలు హెచ్చుతాయి. వాటికి విలువ కూడా పెరుగుతుంది. ఆ అనుభూతుల ఫలితంగా ప్రేమా, వివాహమూ సంభవం అవుతాయి' అని కె.కె. 'కురూపి' 'ఉపోద్ఘాతం'లో రాశారు. ఈ మాటలు వ్యక్తం చెయ్యడానికే 'కురూపి' రాశారు.

ఇందులో సరస్వతి అనాకారి. ఆమెకూ కనకానికి 'నిజమైన ఆధ్యాత్మిక' అనుభూతి కలగడం కథలోని పాయింటు. అది పాఠకులకు తోస్తే కథ విజయవంతమైనట్టే తోస్తుంది. ఎవరికి ? ఎంతో సంస్కారవంతులైన పాఠకులకు మాత్రమే. హృదయ సంస్కారం, మేధా సంస్కారం అందరికీ వుండవు. మామూలుగా ఈ చెప్పే పద్ధతిలోనే హృదయాన్ని పట్టుకొనే విధానమూ లేదు. అందుకనే ప్రేమను గురించిన ఇతివృత్తాలైనా సన్నివేశాలైనా పాఠకుణ్ణి కదిలించవు. ఎందుకంటే హృదయ ప్రేరకశక్తికంటే ఆలోచనా ప్రేరకతే ఆయన రచనా విధానంలో ముఖ్యంగా వుంటుంది గనుక. ప్రేమలాంటి వస్తువును గ్రహించినప్పుడు కూడా ఆయన ప్రాధాన్యమిచ్చి పోషించేది ఆ అనుభూతిని రేకెత్తించడం కాదు. దాన్ని గురించి ఆలోచించేటట్లు చెయ్యడం. అందుకనే ఆయన రచనల్లో ప్రకృతి వర్ణనలకు చోటు లేదు. మరీ ముతగ్గా ప్రబంధ ఫక్కీలో వర్ణనలు ఉండాలని కాదు గాని ఆధునికుల పద్ధతిలోనైనా, ఒక అనుభూతి ప్రేరకం కావడానికి సహాయకారిగానైనా, ఆయన ఈ పద్ధతి అవలంబించడు.

### ఆడవలసిన అబద్ధం

'ఆడవలసిన అబద్ధం'లో సుబ్బారావుకీ సీతకీ హృదయాలు అర్థమైనాక కె.కె. చేసిన వర్ణన కొంత వుంది. 'చివరకు ఆమె అతని వైపు మొహం తిప్పినప్పుడు అతడి మొహం మీద చిరునవ్వు వాన కురిసి వెలిసిన మీదట లేత ఆకు గుబురుమీద పడిన సూర్యప్రకాశం మాదిరిగా వుంది.' ప్రేమలో పునీతుడైన వాడికి కె.కె. వాడిన 'ఆలంకారిక' రచన ఆ కథ మొత్తం మీద ఇదే. వాస్తవానికి కథలో ఉద్రేకం సృష్టించడానికి అవకాశం వుంది. కాని, అతి సామాన్యంగా చెప్పేశాడు ఆయన. వ్యక్తులకే చాతనవును ఇంత అసామాన్యంగా ప్రవర్తించటం' అని కథ ముగిస్తాడాయన. ఆయన మాటలు వాడే ఈ పద్ధతిని చెప్పాలంటే అసామాన్యులకే చాతనవును. ఇంత సామాన్యంగా రాయడం. 'ప్రేమించి ప్రేమించబడని వాడికి తెలుస్తుంది ప్రేమించడం ఎంత కష్టంతో కూడుకున్న విషయమో' అన్నప్పుడు కె.కె. అత్యంత సామాన్యంగా ఒక అసామాన్యమైన భావాన్ని వ్యక్తీకరిస్తున్నాడు. 'వారసత్వం', 'ప్రేమించిన మనిషి' లాంటి వాటిల్లో కూడా ఇలాంటి మోతాదులో వుండే ప్రకృతి వర్ణనలే వున్నాయి. ప్రేమకు ఆంగికాలైన ప్రకృతి వర్ణనలకు ఆయన ఎప్పుడూ తాను వర్ణించదలచుకున్న పాత్రల మనఃప్రకృతుల కంటే ఎక్కువ ప్రాధాన్యమివ్వలేదు. అనుభూతులు కలయికవల్లా, సాహచర్యం వల్లా, మాత్రమే ఆయన పాత్రలకు ఉత్పన్నం అవుతాయి.

కె.కె.కు సమాజం పట్లా, జీవితం పట్లా నిశ్చలమైన ఒక దృక్పథం వుంది. ఆయనకుగల ఆ చారిత్రక ఆర్థిక అవగాహన ఆయన రచనలకు పునాది. ఆ భావాలకు రూపు ఇవ్వడమే ఆయన లక్ష్యం. ఆయన సాహిత్యపు సాంఘిక ప్రయోజనం. ఇంతటి నిర్దుష్టమైన, నిర్దిష్టమైన దృక్పథం కలవాడు కాబట్టే ఆయన రచనలు నిర్దేశ లక్ష్యం కలిగి వుంటాయి. ఇదే భావాలూ,

సాంఘిక లక్ష్యమూ శ్రీశ్రీకి వున్నాయి. కాని ఆయనది ఉద్రేకం పునాదిగా గల దృష్టి. అందుకనే 'మరో ప్రపంచం, మరో ప్రపంచం' అని గొంతెత్తి ఉద్రేకపు వెల్లువలో ఉక్కిరిబిక్కిరి చేస్తాడు. కె.కె.ది శాస్త్రకట్టు. అందుకని ఉద్రేకరహితంగా విషయం విపులీకరణ పద్ధతిలో వుంటుంది. శ్రీశ్రీ కవి కావడానికీ, కె.కె. కాకపోవడానికీ గల తేడా అదే.

## నేనే కవినైతే..

'నేనే కవినైతే' అని కె.కె. ఓ వ్యాసం రాశారు. 'నేనసలు కవిని కావలసిన వాణ్ణి, కాస్తలో తప్పిపోయింది' అని మొదలు పెడతారు. అనటం తమాషాగానే వున్నా కె.కె. కవి కావడమనేది అసంభవమన్నది సత్యం. ఎందుకంటే ఆయన రక్తంలోనే ఆ అంశలేదు. కవి కావలసిన వాడు పాఠకుడి హృదయాన్ని జప్తు చేస్తాడు. ఒక క్రమపద్ధతిలో ఒక భావాన్ని ఉద్రేకోన్మీలితం చేస్తాడు. వాడు వచనం రాసినా ఈ జబ్బుపోదు. క్షేత్రం ఎటువంటిదో ముందే తెలిసిపోతుంది. కవి అయిన వాడికి చెప్పే విషయంకంటే హృదయానువర్తతే ఎక్కువ. శ్రీశ్రీ వచనశైలి చూస్తే తెలుస్తుంది. అతను ఎంతటి కవి అయిందీను. ఒట్టి వచనం రాసే వాడికి విషయం మీదా దాన్ని గురించిన ఆలోచన మీదా వుంటుంది దృష్టి. కాబట్టి కె.కె.వంటి 'పచ్చివచనం' రాసే వాడికి ఉద్రేకానుభూతులు పట్టవు. ఆయన కథా సాహిత్యం అంతటిలోనూ ఈ ఆలోచనా ప్రేరక దృష్టి వున్నా కళకు గల విలువలు తగ్గకపోవడం ఆయన గొప్పదనం. (అది వేరే విషయం. దాని విపులీకరణ 'ప్రస్తుతానికి అప్రస్తుతం') ఆయన రాసిన శాస్త్ర విషయాలలో ఇంకా చక్కగా వుంటుంది ఈ ఆలోచనా ప్రేరకత. ఎందుకంటే విషయమే అటువంటిది మరి. శాస్త్ర విషయాల చర్చ వచ్చేటప్పటికి ఆలోచనా ప్రేరకత్వం ఒక్కటే గుణం కాబోదు. క్లుప్తత, స్పష్టత, సూటిదనం ఇత్యాదులన్నీ కావాలి. కథల్లో స్పష్టత వుండాలని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అందుకని కవి అయినవాడికి అవసరం లేదు. ఎందుకంటే స్పష్టత కూడా లేకపోతే అది కథ కాదు గదా ఏదీ కాదు. ఇక క్లుప్తతా సూటిదనమూను. ఈ దృష్ట్యా కె.కె. శిల్పం అనితరసాధ్యమైంది. డొంక తిరుగుళ్ళూ సాగదీసిన వర్ణనలూ, కోతికొమ్మచ్చిలాటలూ ఏవీ లేకుండా బాగా సిమెంటు దిమ్మిస చేసిన రోడ్డు మీద పోయే కారులా సాఫీగా పోతుంది కథ. తమకు అభిమాన పాత్రాలైన విషయాల్ని సందు చేసుకొని దూర్చి పాఠకుడికి విజ్ఞానపు బిళ్ళలు అందజేయడం రచయితలు చాలా మందికిగల వెర్రి.

## కె.కె. శైలిలో రహస్యం

కె.కె. అనవసర ప్రసంగాలేమీ చేయడు. ('గడ్డు రోజుల్లో' మాత్రం ఓ పేజీకి ఎక్కువగానే హోమియోపతీ వైద్య ప్రభావం ప్రస్తావించడం వుంది. ఇలాంటివి చెదురుమదురుగా వున్నా గానీ ఈ పాయింట్‌కు బలహీనత చేకూర్చవు.) పొదుపరితనం ఆయన ఊపిరి. సూటిదనం ఆయన రక్త ప్రసారం. అందుకనే ఆయన కథల్లోనూ, శాస్త్రవిజ్ఞాన వ్యాసాల్లోనూ బలంగా కనిపించేవి ఈ లక్షణాలే. పొదుపరితనమూ, సూటిదనమూ రావాలంటే సామాన్యంగా ఒక అలంకారిక శైలి అవసరం అవుతుందనే భ్రమ చాలా మందికి వుంటుంది. కె.కె. విషయంలో అలాంటివి ఏమీ ఉండకపోవడం విశేషం. నిత్యం వాడుకొనే అత్యంత పరిచితాలైన పదాలే ఆ వాక్య నిర్మాణంలో శక్తివంతంగా సామాన్యంగా రచయితలు పలవరించే స్టైలిస్టిక్ ఎఫెక్ట్స్ యేమీ యిక్కడ దొరకవు. వాక్య నిర్మాణంలో ఒక వూపూ, ఒక గతీ, ఆరోహణ అవరోహణ క్రమమూ, తులనాత్మక వాక్య నిర్మాణమూ, విరుద్ధ భావ సంపుటీకరణా ఇలాంటివి ఏవీ వుండవు. మరి ఇంత సాదాగా అంతటి శైలి ఎలా నిర్మించుకున్నాడు ? ఏమిటి కె.కె. రహస్యం? రహస్యమేమీలేదు! తాను చెప్పే విషయంపై తనకు అమితమైన అధికారం వుండటమే. తాను చెప్పేదాన్ని మనఃపూర్వకంగా విశ్వసించడమే. నిర్భయంగా బెరుకు లేకుండా కుండ బద్దలుగొట్టినట్టు చెప్పగలిగి వుండటమే. అదే ఆ శైలిలోని రహస్యం. చెప్పే విషయం మీద అధికారం లేనివాడే, చెప్పే సంగతి మీద పూర్తి గుండె దిటవులేనివాడే అలాంటి కృత్రిమ నిర్మాణానికి దిగుతాడు. కె.కె.కు గల సాంఘిక దృక్పథమే ఆయనకీ శక్తిని ఇచ్చింది. ఆయనకు గల నిశ్చలమైన అభ్యుదయవాద దృష్టే ఆయనకీ బలాన్ని ఇచ్చింది. తానేదో మహత్కార్యం చేస్తున్నాననే స్పృహే లేనంత బలవత్తరంగా ఆయన అణువణువులోనూ కలిసిపోయి ఆయన వ్యక్తీకరణ పద్ధతిలో భాగమైపోయిందీ అవగాహన. అందుకనే ఎంతటి మహత్తర విషయాన్నైనా అతి తేలికగా చెప్పే ఒడుపు ఆయనకు పట్టుబడింది. హక్సలీ అంతటి మేధావి టెక్నాలజీ అభివృద్ధి మూలకంగా కలిగే దుష్ఫలితాలను గురించి తెలిపిన ఆక్షేపణలను ఇంత సునాయాసంగా ఖండించడం వీలయింది కె.కె.కు. ('సోషలిజంలో సాంకేతికాభివృద్ధి విశిష్టత' అన్న వ్యాసం.) ఎంతటి విశాలమైన పరిధిలోనైనా గాని కె.కె. తన వాడి కలాన్ని సునాయాసంగా తిప్పగలడు.

ఎంతటిలోతు లేకపోతే ఆయన ప్రజల ఆరోగ్యం దగ్గర నుంచి మనుషుల వివాహ సమస్యల వరకు వ్యాసాల్లో, కథల్లో చర్చిస్తాడు, చిత్రిస్తాడు. 'మనిషి-దేవుడు,' 'కురూపి' ఎంత వైవిధ్యపూరితమైన విషయాన్ని స్పృశించినా పొదుపరితనానికీ సూటిదనానికీ తోడు సారళ్యం నిలుపుకోవడం మరో ప్రత్యేకత. సరళత శైలిలో ఒక విజయం. సులభంగా చెప్పడం ఎంతకష్టమో కలం పట్టిన ప్రతి వాడికీ తెలుస్తుంది. ఎంత లోతైన విషయమైనా గానీ సులభంగా, తేలిగ్గా చెప్పగలడు కె.కె. ఆయన పాఠకుడికి ఎప్పుడూ బరువుగా తయారవడు.

'శాస్త్రీయ విజ్ఞానం' అన్న వ్యాస సంకలన గ్రంథం ఆయన ఉపజ్ఞకు అద్దం వంటిది. 'మానవుని మనస్సు', సోషలిస్టు వ్యవస్థను గురించిన వ్యాసాలూ కథ నడిచినట్టు నడుస్తాయి. కె.కె. తప్ప ఎవరూ అలా రాయలేరేమో అనిపిస్తుంది. ఎంత అవసరమో అంతే! ఒక్క పిసరు ఎక్కువ గాని, ఒక్క పిసరు తక్కువ గాని వుండవు వాక్యాలు. నాలుగైదు వాక్యాలు అవసరం అనిపించేపట్టుల్లో కూడా ఒకటి, రెండు వాక్యాల్లోనే ముగించేస్తాడు. విషయం మీదనే ప్రధానంగా కేంద్రీకరణ. బరువైన మాటలు గాని, సైద్ధాంతిక పదజాలం గాని ఎన్నడూ ప్రసక్తం కావు. చాలా మందికి సిద్ధాంత పదకోశం సంకెళ్ళలాగా తగులుకుంటుంది. ఇక ఆంగ్ల పదాల వాడుకా ఇంతే. ఇంట్లో ఆడవాళ్ళు కూడా ఇంగ్లీషు లేకుండా తెలుగు మాట్లాడలేకపోయే ఈ రోజుల్లో పూర్తి తెలుగు పదజాలాన్నే వాడి తెలుగుకున్న బలాన్ని కె.కె. రుజువు చేస్తున్నారు. బలమైన ఆలోచన పునాదిగా, పొదుపరితనంతో రాయడంతోటి కె.కె. వాక్యాలు చాలా మట్టుకు సామెతల మాదిరిగా వుంటాయి. వాక్య నిర్మాణం విషయంలోనూ, భావవ్యక్తీకరణ విషయంలోనూ ఎంతో శ్రద్ధనూ, కృషినీ కనబరిస్తే తప్ప ఈ వాడి రాదు. సామెతల మాదిరి వాక్యమూ వుండదు. క్లుప్తతే మేధకు ఆత్మ. (కె.కె. శైలిలో సామెతల మాదిరి యాంటీ–థెటికల్ నిర్మాణం వుండదు.)

- ఒక్క ముక్కలో చెప్పాలంటే శాస్త్రజ్ఞానం యొక్క పరమార్థం నిజానికీ అబద్ధానికీ తేడా కనిపెట్టడం.
- ఎంత నీచుడు కూడా ఆత్మద్రోహం చేసుకోడు.
- అంతరాత్మలను పంచుకొనే వరకూ పరిచయం స్నేహంగా మారదు.
- మంచి కవిత్వం పరిస్థితికి అనుకూలంగా మలగుతుంది.
- పిల్లలకి ఆహారం ఎంత అవసరమో ఆపేక్షలంత అవసరం.
- మనిషి స్వభావపు లోతుల్లోకిపోతే హేతువాదం పని చెయ్యదు.
- ఆనందం పంచుకోటానికి ఎవరైనా ఫరవాలేదు. కాని కష్టాలు పంచుకోవడానికి సమర్థులు తప్పకకావాలి.
- ప్రాణులకు పెరగటం ఎంత సహజమో ప్రేమించటమూ అంత సహజం.
- మనిషికి ఉన్న ప్రతిశక్తీ ఒక బాధ్యత కూడానూ.
- జీవితంలో మనిషి ప్రయత్నాల ఫలితాలపైన మనిషికి పూర్తి అధికారం లేనంతవరకూ అదృష్టమంటూ ఉంటుంది.
- జీవితంకంటే కూడా ఒక్కోసారి కళ శక్తిమంతదనిపిస్తుంది.
- కబళించబోయే దాన్ని కూడా కళ్ళకద్దుకోవడం మనకు రివాజు. జంతువులూ జంతుప్రాయులూ మాత్రమే స్వార్థాన్ని నగ్నంగా ప్రదర్శిస్తారు... ఇలా ఉదహరిస్తూ పోతే అంతు లేకుండా వుంటుంది. ఉత్తమ అనుభూతి నుంచి వెలువడిన కవిత్వమూ, ఉత్తమ మేధాపరిశ్రమ నుంచి వెలువడిన వచనమూ యిలా సామెతలకిందికి ఒదుగుతాయి.

## క్లుప్తతా.. సూటిదనమూ.. సరళత

కె.కె. వ్యక్తిత్వంలో ఆలోచనా విధానంలో క్లుప్తతా. సూటిదనమూ, సరళతా మిళితమైపోయాయి. మంచి శైలికి ఉపమ రచనలో భాగమైపోవడం మరో లక్షణం. ఇది మాట్లాడుకొనేటంత సాఫీగా కె.కె. రచనా పద్ధతిలో మిళితమైపోతుంది తప్ప తెచ్చి పెట్టుకున్న అలంకారంలా వుండదు. మాటల్లో 'చూడ్రా, కొరివిదెయ్యంలా మొహమూ, వీడూనూ' అంటున్న వాడికి తనో పోలిక తెస్తున్నానన్న స్పృహే వుండదు. అలాంటిది రచనలో సాధ్యం కావాలంటే నిజంగా తపస్సు చెయ్యాలి. ఇలాంటి రచన వల్ల సౌకర్యం ఏమిటంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం గడించడం. కె.కె.కు గల ఈ శక్తి వల్ల ఒక చిన్న వాక్యంలోనే ఒక పాత్రకు రూపు కట్టించే నేర్పు ఆయనకు లభించింది. ఉదాహరణకు 'వారసత్వం'లో బాలా త్రిపురసుందరి 'నిరాకారి' గా శాస్త్రికి కనిపిస్తుంది. 'శరీర శాస్త్ర పుస్తకంలో మనిషి మొగం చూపటానికి రాసిన బొమ్మల్లే వుంది.' పాత్రల బాహ్య రూపాల చిత్రణలోనేగాక అంతఃకరణ చిత్రణలోనూ కె.కె. ఇదే పద్ధతి అవలంబిస్తాడు. చిన్న పోలిక తెస్తాడు. అదీ సామాన్యమైనదే. కాని సన్నివేశం, పాత్ర మనఃపరిస్థితి పాఠకుడికి శ్రమ లేకుండా తెలుస్తాయి. అదే యీ ఉపమ ప్రయోజనం. 'కురూపి'లో తన కథమీద సరస్వతి విమర్శ చేసినాక కనకానికి 'ఒళ్ళంతా కారం రాచినట్ట'వుతుంది. 'అతని బుర్ర సుడిగుండంలా అయిపోయింది. తన అన్నకూతురు చనిపోయినప్పుడు సరస్వతి 'దయ్యంపట్టిన దానల్లే' వుంది. అలాగే ('గడ్డురోజుల్లో') సత్యం తన భవిష్యత్తు గురించి గాని డబ్బు పుట్టించే శక్తి గురించిగాని కొంచెం అనుమానంగా మాట్లాడితే ఆమెకు (జానకి) 'నీటిలోపడి ఉక్కిరిబిక్కిరి అయిపోయినట్టుండేది' నాటకం రాసేవాడికి ప్రజా జీవితంతో సంబంధం వుండాలని చెబుతూ, అది 'లేకపోతే నాటకాలు ఆకాశం నుంచి ఊడిపడినట్టుంటై. పెళ్ళికి పాతిన అరటి స్తంభాలల్లే వాటివేళ్లు నాటకరంగంలోకి చొచ్చుకు పోలేవు' అంటాడు కె.కె. ఎంత తేలిగ్గా చెప్పాడు ఈ భావాన్ని!

'ఆ వచ్చినది సుదర్శనమని తెలిసినాక భాను గుండె చేతి గడియారమల్లే కొట్టుకున్నది'(వారసత్వం). ఒకోసారి మాట తేలు కుట్టినట్టు కుదుతుంది. 'డబ్బు విషంలాగా వాడాలి' ఇలా ఎన్ని ఉదాహరణలైనా చెప్పుకుంటూ పోవచ్చు. ఇలాంటి రచన పట్టుబడాలంటే, వ్యవహారంలో భాష ఎంత పదునుగా వాడబడుతోందో గమనించాలి. మామూలుగా జనం మాట్లాడుకొనేటప్పుడు వాడుకచేసే భాష, రాసే భాషకంటే పరిమాణంలో తక్కువ వుంటుంది. రాసేటప్పుడు కొన్ని అదనపు

అలవాట్లు వుంటాయి. వ్యవహారంలో వున్నప్పుడు ఈ అదనపు అలవాట్లు రాతలో తెచ్చే సౌకర్యాన్ని నుడికారం తెస్తుంది. అది జాతిరక్తంలో కలిసి ప్రవహించేది, ఆ సొంపు రాతలో తెగలిగినప్పుడు భాష సజీవంగా రంగు, రుచి, పుష్టి కలిగి వుంటుంది. నుడికారపు సొంపు పట్టుకోవాలంటే విశేషమైన పరిశీలన కావాలి. చదువుకున్న భాష మరిచిపోవాలి. నుడికారపు సజీవభాష నేర్చుకోవాలి. ఈ నుడికారపు సొంపే సాదాతనంతో వచ్చే విసువు రాకుండా చేస్తుంది కె. కె. రచనల్లో.

- కాంతారావు భార్య సత్యాన్ని 'మొహమంతా కళ్లు చేసుకు మరీ చూసేది.'
- 'స్థానం వంటి నటులు అన్నప్పుడల్లా ఎక్కడ దొరుకుతారు?' (గడ్డురోజులు)
- 'ఇంకా కింద కొంచెం వడ్డింపులు కావలసి వున్నై' అంటుంది మాణిక్యం (నిలవనీరు)
- 'శివుణ్ణి మూర్తిత్రయంలో చేర్చిన పురాణాల్లోనే ఈసొద్దులెన్నో వున్నై.' ('మనిషిదేవుడు' వ్యాసం)
- 'మానవులు పరిసర గ్రహాలకు రాకపోకలు సాగించినాక ఇంకా ఎన్ని విడ్డూరాలు బయటపడతాయో ఎన్ని వింత ఊహలకు 'పిండి' దొరుకుతుందో ఊహించలేం.' (అంతరిక్షయానం వ్యాసం)
- 'అమెరికాలో కేవలం ప్రచారం ద్వారా 'రెడ్' అనేమాట వినబడితే జనానికి మతులు పోయేటట్టు చేశారు' (మానవుడి మనస్సు వ్యాసం).
- 'మంచుపడే సైబీరియా లాంటిచోట్ల మామిడిచెట్లు దక్కవు (జీవ భూరసాయనశాస్త్రం వ్యాసం).

మచ్చుకు తీసుకున్న ఈ వాక్యాల్లోని నుడికారమే వాటికా అందం తెచ్చింది. సైబీరియాలో మామిడి చెట్లు బతకవని చెప్పడానికి ముందు ఏయే శీతోష్ణస్థితులలో ఏయే చెట్లు వుండలేవో చెబుతూ ఆఖరికి పైవాక్యం రాస్తాడు. 'హిమాలయాలపైన దేవదారు చెట్లు విరివిగా వుంటాయి. కులూలాటి చల్లని లోయలలో ద్రాక్ష, ఆపిల్ మొదలైన ఫలాలు పండుతాయి. ఆపిల్ పళ్ళను ఆంధ్రదేశంలో కాయించలేము. మంచుపడే సైబీరియాలాంటిచోట్ల మామిడిచెట్లు దక్కవు.' ఇలా ఒకేభావాన్ని భిన్నపదప్రయోగంలో వివరిస్తూ ఆఖరికి 'మామిడిచెట్లు దక్కవు' అనే నుడికారం వచ్చేసరికి పాఠకుడికి బరువే అనిపించదు. అలాగే 'సొద్దు' లుండటం, 'పిండి' దొరకడం, 'మతులు' పోవడం లాంటి నుడికారమే ఆయన రచనలన్నింటా విస్తరించి వుంది. ఈ నుడికారాన్ని జీర్ణించుకొన్నది కాబట్టే ఆయన శైలి ఉత్కృష్టంగా వుంటుంది.

వ్యావహారిక భాషలో రాసేటప్పుడు కూడా రాసే భాషమీద కొంత దృష్టి అవసరం. మామూలుగా వ్యావహారిక భాషతోటి కొన్ని వెకిలి వేషాలు వస్తాయి. తేలిగ్గా చెబుతున్నామని శైలినే తేలిక చేసుకుంటారు చాలా మంది. వ్యావహారిక భాషలోని నుడికారానికి తన ప్రౌఢత్వాన్ని జతపరచి కె.కె. ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. పాత్రోచితభాష అనీ, ఎవళ్ళు ఎలా మాట్లాడితే అలా రాయాలనీ 'వీర వ్యావహారికం' ఉద్యమంగా పెట్టుకుని, పండితుల భాషకంటే కూడా దురవగాహంగా చేస్తున్న వ్యావహారికులు ఈ భేదం తెలుసుకోవాలి. మాటకీ రాతకీ ఎప్పటికీ విభేదం వుంటుంది. సంభాషణలో వుండే సౌకర్యం అంతటా రాతలో రాదు. ఎందుకంటే స్వర పేటికల హెచ్చు తగ్గుస్థాయిలు, ఉద్రేకాలనీ అనుభూతులనీ వ్యక్తీకరించే పట్టుల్లో గొంతుకలో వచ్చే మార్పులూ ఇవన్నీ రికార్డర్ అవుతాయి గాని రాతలో రావడం దుర్లభం. అందుకని రాసేటప్పుడు, స్పష్టతను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించేటప్పుడు, అంత శుద్ధ వ్యావహారికం అడ్డమే కాదు. అనర్థకం కూడానూ. ఉదాహరణకి స్పష్టతకోసం కె.కె. వ్యవహార విరుద్ధంగా కూడా పోగలడు. 'కురూపి'లో కనకం 'తన అంతరాత్మ యొక్క గౌరవ మర్యాదలు కాపాడడానికి కొన్ని నియమాలు పెట్టుకున్నాడు'. అలాగే 'సమాజం యొక్క నీతి కాంతి జీవితమంతటా ప్రసరించదు'. ఈ రెండు వాక్యాల్లోనూ 'యొక్క' అన్న పదం వుంది. వ్యవహారంలో 'యొక్క' ఎవరూ వాడరు. మాట్లాడేటప్పుడు గాబట్టి సందర్భాన్ని బట్టి వినేవాడికి విషయం తెలుస్తుంది. కాని రాతలో అది అస్తమానూ సాధ్యం కాదు. కాని, కొన్నిచోట్ల రాతలోను 'యొక్క' వదిలిపెట్టి స్పష్టతకు నష్టం లేకుండా రాయవచ్చు. పైన ఇచ్చిన మొదటి వాక్యంలో 'యొక్క' లేకపోయినా ఇబ్బంది వుండదు. రెండవ వాక్యంలో "సమాజపు నీతికాంతి" అని 'యొక్క'ను వదిలిపెట్టవచ్చు. కాని కె.కె. స్పష్టత కోసం ఈ పద్ధతి వదిలి పెట్టే పట్టింపులు పెట్టుకోరు. పట్టింపులకంటే స్పష్టతే ఎక్కువ అవసరం కదా! అలాగే అర్థం లేని ఎఫెక్ట్ కోసం పాత్రోచిత భాష పేరుతో గందరగోళం సృష్టించడమూ ఎక్కడా లేదు. ఆయన దాదాపు ఎక్కడా పాత్రోచితభాష వాడలేదు. 'ప్రేమించిన మనిషి'లో రాఘవులూ, మంగీ కూడా మామూలు భాషే మాట్లాడతారు. 'నీకేం కావాలి'లో కస్తూరి తల్లి కొంచెం యాసగా మాట్లాడుతుంది. ఇలా స్పష్టతనీ, భాషలో ఒక స్థాయినీ కాపాడుకోవడం కె.కె. ప్రత్యేకత. అదే ఆయన శైలిలోని హుందాతనం. ఆయన భాష యెంత తేలికగా, సాఫీగా వున్నా హుందాతనాన్ని పోగొట్టుకోదు.

## సునిశితమైన హాస్యం

మంచిశైలికి అవసరమైన మరోసాధనం హాస్యం. వ్యంగ్యం ఈ పాలు పెంచుతుంది. సన్నివేశంలోని వైపరీత్యం హాస్యాన్ని పెంచుతుంది. సునిశితమైన హాస్యం సంస్కారులకే సాధ్యపడుతుంది. కె.కె. తనకు సానుభూతి లేని విషయాలనీ పాత్రలనీ

సునిశితమైన హాస్యంతో దెబ్బకు పడగొట్టేస్తాడు. పాఠకుడిలో రక్కున ఆ చైతన్యం వచ్చేస్తుంది. 'వారసత్వం'లో దుర్గాంబ తండ్రి కూతురు పెళ్ళి కాకుండానే గర్భవతి అయిందని తెలిసి శివతాండవం చేస్తాడు. 'అరిచాడు. జుట్టు పీక్కున్నాడు. ఆవిధంగా కొంత వేడి తగ్గించుకున్నాక తన కూతుర్ని సుదర్శనానికిచ్చి పెళ్ళిచేసి సంఘ సంస్కర్త అని నలుగురిచేత ప్రశంసలు పొందాడు'. 'ఈ వేడి తగ్గించుకునే' పద్ధతి ఎంత వెటకారంగా వుందో, అలాగే శాస్త్రికి బాలతో ప్రణయం 'ఏదో రాజకీయపు కుట్రలాగా' వుంటుంది. మన భారతీయ మిథ్యా వేదాంతం 'వందల ఏళ్లుగా మన రక్తంలో ఇంకిపోవడం చేత, మన సమాజాన్ని ముట్టుకుంటే మసి రాలుతుంది.' ('వారసత్వం'లోనే.)

"స్నేహితులు" కథలో కూతురికి పెళ్ళి చెయ్యాలనే ఆదుర్దాగల తల్లితో తండ్రి ప్రకాశం అంటాడు 'మరీ బెస్తవాళ్ళ భాష మాట్లాడకు. వాసు చేప అనీ, లక్ష్మి ఎర అనీ నేను గాలం వేసేవాణ్ణనీ అనుకుంటున్నావు లాగుందే'. అదే కథలో వాసు తనను తగిలిన భాగాలన్నీ 'బంగారం' అయిపోయినట్టు ఆ లక్ష్మీ భావిస్తుంది. మన తెలుగు రచయితలు హాస్య సృష్టి కోసమని సగం ఇంగ్లీషు ముక్కా సగం తెలుగు ముక్క కలిపి ఓ చిత్రమైన పదాన్ని తయారు చేయడం, లేదా ఓ విచిత్రమైన పద్ధతిలో పదాన్ని వాడటం లాంటి వెకిలి వేషాలు చాలా వేస్తున్నారు. కొత్తలో ఇది కొంచెం తమాషాగానే వున్నా హాస్యానికుండే ఉదాత్తత చచ్చిపోయి సర్కస్ బఫూన్‌లా తయారవుతుంది. సంస్కారం గలవాడు ఈస్థాయికి దిగడు. కె.కె. హాస్యం ఎప్పుడూ సునిశితంగానే వుంటుంది. ఇంగ్లీషు మాటలు ఎప్పుడోగాని హాస్యం కోసం వాడడు.

- 'స్నేహితులు'లో వధూవరుల మీద అక్షింతలు వేసాక 'సభికులలో టెన్షన్ తగ్గింది'. అంటాడు.
- 'వెంకట్రావు సిగరెట్టు పెట్టె మీద నిప్పు పెట్టె పెట్టి రెంటినీ సర్క్యులేషన్‌లో పెట్టాడు' అంటాడు. చిరునవ్వు తెప్పించే హాస్యం ఇది.
- 'ఏమైనా సినిమా పెళ్ళిళ్ళు చూసి మామూలు పెళ్ళిళ్లు చూస్తే రక్తిగా ఉండటంలా' (స్నేహితులు) అనడంలోనూ సున్నితంగా కె.కె. హాస్యం వాడారు.

మంచి వ్యంగ్యంకంటే పదునైన ఆయుధం లేదు. వంద తిట్లు చెయ్యలేని పనిని ఒక ఎత్తిపొడుపు చేస్తుంది. మూర్ఖ విశ్వాసాలనీ మొండి నమ్మకాలనీ ఆయన అవకాశం వచ్చినప్పుడల్లా యీ కత్తి మీద వేస్తూనే వుంటాడు. 'పీడకథ' లాంటి వ్యంగ్యరచన చేసారు. 'సత్య సంధుడు' కథ సత్యం(ట్రూత్)తో ప్రయోగం చెయ్యదలచుకున్న వాళ్ళకి మంచి చురక. తనకి సరిపడని వాటిని నిర్దాక్షిణ్యంగా వ్యంగ్యంతో తూట్లు పొడుస్తాడాయన. ఆయన ఈ మధ్యకాలంలో చేస్తున్న పుస్తక సమీక్షలు ప్రత్యేకం చెప్పుకోదగ్గవి. గిరీశం చెప్పినట్టు పోలీసోళ్ళ దెబ్బల్లా గాయంపైకి కనబడదు. లోపల లోపల కమిలిపోతుంది. అంత పదునుగా వుంటుందీ వ్యంగ్యం. కుళ్ళబొడుస్తుంది. కాని కేసుకు దెబ్బల దాఖలా వుండదు, 'శ్రీచరణాలు' అనే పేరుతో 'లత' రాసిన జయదేవుడి కథ మీద సమీక్ష ముఖ్యంగా అనుకోవాల్సింది. 'ఈ కథ ఆమూలాగ్రం పాఠకుణ్ణి కురుపు సలిపినట్టు సలుపుతుంది'ట! రచయితల్లోని తేలికతనాన్ని చూస్తే ఈయనకు మంట. ఈ మంటే ఇంత నిశితమైన వ్యంగ్యం. పాండిత్య ప్రదర్శననీ, దుర్గర్వాన్నీ ఆయన సుతరామూ క్షమించలేడు. తెలుగు పాఠకుల మేధకు సార్త్ర్, ప్లేటో, సోక్రటీసు మొదలైన 'పెద్దపెద్ద మొసళ్ళ లాటివాళ్ళ' ప్రవచనాలని పట్టించే రచయితల ప్రయత్నాన్ని చూస్తే అసహ్యం. ఏ లక్ష్యమూ లేకుండా గాలిలో విహరించే నేటి యువకవుల మీద అక్కసు. 'అన్ని ఇజములకూ అతీతమైన జీవిత సత్యాన్ని తెలుసుకోవాలని నేను తహతహలాడి పోతున్నాన'ని వీళ్ళ అజ్ఞానాన్ని ఆక్షేపిస్తాడాయన. మొత్తం మీద 'కురూపి'లో కనకాన్ని గురించి చెబుతూ 'రాయటం అతని జీవితంలో ఒక భాగం' అంటారు కె.కె. ఇవేమాటలు పూర్తిగా ఆయనకూ వర్తిస్తాయి. సునాయాసంగా ఎంతటి విషయాన్నైనా రాసేస్తాడాయన. ఎంత సునాయాసంగా, అలవోకగా రాస్తాడంటే అదే ఒక బలహీనతగా పరిణమిస్తుంది. కె.కె. శైలికి ఒక లోపంకూడా వుంది. అదే శక్తి (విగర్) లోపించడం. ఆయన చెప్పేది ఎంతటి మహత్తర విషయమైనాగానీ పాఠకుడి హృదయాన్ని బలంగా పట్టుకోదు. అద్దంమీది ఆవగింజలా జారిపోతుంది.

అంతమాత్రాన శక్తి లోపించనూ అవసరంలేదు. ఓ రకంగా చూస్తే ఓ మోతాదు ఉద్రేకపుపాలు లేకపోతే వంటబట్టదేమో జనానికి. 'సంవేదన'లో 'చాసో కథలు' సమీక్షిస్తూ ఇలా రాశాడాయన: ఆలోచనా ప్రేరకమైనంత కళలు హృదయ స్పందన ద్వారా బుద్ధిని చైతన్యవంతం చెయ్యాలనే సిద్ధాంతం ఒకటి వున్నది. ఈ (చాసో) కథల్లో హృదయ స్పందనపాలు చాలా తక్కువ. అయినా నేను తప్పు పట్టను. ఇది బుద్ధిజీవుల యుగం. ఈనాటి జీవితం ముందుకు సాగటానికి హృదయ స్పందనలు చాలా కొద్దిగా మాత్రమే సహకరిస్తాయి. హీరోషిమా గురించీ, వియత్నాం గురించీ, పరిపాలనలో అవినీతిని గురించీ, మింగమెతుకు లేని వాళ్లు గంపెడేసి పిల్లల్ని కనటం గురించీ, రైతులను భూస్వాములు తుపాకులతో వేటాడటం గురించీ, రేషన్ బియ్యం గురించీ, రోజు రోజుకూ పెరిగిపోయే ధరలను గురించీ హృదయం ఎలా రియాక్టు కావాలో ఎవరూ చెప్పనవసరంలేదు. ఈ జీవితాన్ని విశ్లేషణ చేసుకునే శక్తి జన సామాన్యానికి అవసరం. 'జీవితం కంటే కూడా కళ శక్తివంతమైనదని' చెప్పిన కె.కె.కు ఎలా వాడుకోవాలో తెలియదనుకోవటం పొరపాటే. చాసో మాదిరి ఆయన కళకు హృదయం ఎలా రియాక్టు కావాలో చెప్పకుండానే జీవితాన్ని విశ్లేషణ చేసి వదిలేస్తాడు. కాని ఉద్రేకం లేకుండా ఆలోచించడం ఇంకా మనం నేర్చుకోలేదేమో. అందుకేనేమో కె.కె. ప్రజ్ఞ పూర్తిగా గ్రహించలేకపోతోందీ యుగం. ❑

# శ్రీ శ్రీ లో ఆలంకారికత

**శ్రీశ్రీలో ఎలాంటి ఆలంకారికత వుంది ? ఇది ఎంత వరకూ శ్రీశ్రీ దృక్పథాన్ని తెలియజేస్తుంది ? శ్రీశ్రీని ఒక నవ్య రీతికి ఆద్యునిగా ఒక యుగానికి కర్తగా అతని కవిత్వం యెలా నిలబెట్టింది? అందులో శ్రీశ్రీ ఆలంకారికత పాత్ర ఎంత ? ఒక కవికి వున్న భావుకత అతని కవిత్వపు గంభీరతను సంతరిస్తుంది. అతని శిల్పం అతన్ని ఉన్నతుణ్ణి చేస్తుంది. అతని తాత్త్విక పునాది అతన్ని యుగకర్తను చేస్తుంది. ప్రస్తుత చర్చ వీనికి సంబంధించింది కాదు. శ్రీశ్రీలోని ఆలంకారికతను గూర్చి. కాబట్టి శ్రీశ్రీలో అతని అలంకారికత ఏమి తెలియ జేస్తుంది? శ్రీశ్రీ దృక్పథం ఏమిటి? శ్రీశ్రీ వ్యక్తిత్వానికి అతని ఆలంకారికతకూ వున్న సంబంధం ఏమిటి? అన్న పరిశీలన మాత్రమే. 'మహాప్రస్థానం'లోని 'గీతాలకు పరిమితమై ఈ చర్చ సాగించడం సౌలభ్యం కోసమేనని గమనించాలి.**

ఆలంకారికత అంటే ఉపమారూపకాది సర్వాలంకార పద్ధతులనూ యిముడ్చుకున్న విధానం. దీన్నే ఇంగ్లీషులో ఇమేజరీ అంటారు. ఇమేజరీ అన్న పదానికి తెలుగులో 'భావచిత్రణ' అని వాడుకలోకి వచ్చింది. ఇమాజినేషన్ భావుకత అయినట్లుగా. ఈ రెండూ తప్పే. భావుకత అంటే సెన్సిబిలిటీ. ఏ మాత్రం ప్రేరణకైనా చలించడం. ఇమేజరీ అంటే అలంకార పూర్వకమైన చిత్రణ. ఉపమా, రూపకాది ఆలంకారికతతో ఒక భావాన్ని, ఒక ఉద్రేకాన్ని చిత్రించడం, అందివ్వడం. ఉపమారూపకాది ఆలంకారిక విధానమే అయితే మనకు కొత్త కాదు కదా, మల్లియ రేచన నాటి నుంచీ జాగ్రత్త చేసిన తాటాకు పుస్తకాల్లో వుంది అనేవాళ్లున్నారు. మనిషి భూమ్మీద పుట్టిననాటి నుంచీ మనదేశంలో అన్నీ వున్నాయి. అంచేత ఈ గొప్పతనాన్ని కాదనే సాహసం వుండకూడదు. తాటాకు పుస్తకాల్లోవున్న లాక్షణిక పాండిత్యానికీ, ఆధునికుల అవగాహనకి వున్న తేడా యిదే: లాక్షణికులది శాస్త్రం, ఆధునికులది కళ. వాళ్ళది పాండిత్యం, ఆధునికులది రసచర్చ. దీనికి తెలుగులో వివరణ ఇస్తే చాలదా. ఇంగ్లీషు పదాన్ని తీసుకొచ్చి కుప్పుస్వామయ్యర్ మేడ్ డిఫికల్ట్ చెయ్యాలా అనవచ్చు. తెలుగులోవున్న ఆధునిక విమర్శలో పాశ్చాత్య ప్రభావమే ఎక్కువ వుంది.




కాబట్టి ఆ పదాలకి అర్థం తెలుగులో వెదకడమే ఈ వివరణ. ఇది లాక్షణిక సంప్రదాయానికి వివరణ కాదు.

### భాషకి సహజం ఇమేజరీ!

ఈ ఆలంకారిక పద్ధతి భాషలో సహజంగా వున్నదే. 'నిప్పులాంటి మనిషి, బెల్లం కొట్టిన రాయిలా పడివుండటం, మూర్తీభవించిన శోకం'లాంటివి. కాని నిత్య వాడకంలో యివి తుప్పు పట్టిపోయా యన్నమాట. అంటే శక్తివిహీనంగా తయారవుతున్నాయన్న మాట. మరి కొత్త అవసరాలకు, కొత్త ప్రేరణ ఇవ్వడానికి పాతపద్ధతి సరిపోదు. అందుకని ఎప్పటికప్పుడు కొత్త కొత్త పోలికలూ రూపకాలూ పుడుతూ వుంటాయి. 'రాకెట్‌లా దూసుకుపోవడం' ఇటీవల వాడుకలోకి వచ్చిందే. మామూలు జీవితంలో భాషకు లోతైన ఆలంకారికత వుండదు. ఎందుకంటే సామాన్యంగా ప్రజాబాహుళ్యం వాడుక చేసే భాష వ్యాపార వస్తువు కాబట్టి. కవిత్వం అలాకాదు. ఉద్రేకభరితమైంది. ఆవేశ ప్రధానమైంది, అనుభూతి గాఢత కలిగింది. ఈ లక్షణాల కనువైన భాష కవిత్వానికి వుంటుంది. అలాగే ఆలంకారికతానూ. కవిత్వంలో మాట

లు కవి అనుభూతికి సంకేతా లు. అలంకారాలు కవి భావనకు లభించేరూపాలు. సంగీతం భాషకతీతమైన అనుభూతిని రేకెత్తిం చగలదు. చిత్రకారుడు కుంచెతో రంగుల్తో తన హృదయంలోని ఆర్తికి రూపం ఇవ్వగలడు. కవి మాటలతోనే తన ఆవేశాన్ని వెల్లడించాలి. తన ఉద్రేకానుభూతులను ఎంత నిశితంగా మాటల్లో నింపగలడో అంత గొప్పకవి అవుతాడు. ఈ పద్ధతికి అలంకారికత దోహదం చేస్తుంది. ఎన్నో పేజీల వివరణ ఇవ్వలేని అనుభూతిని ఒక చిన్న అలంకారం ఇవ్వగలుగుతుంది.

## నేర్పలేనిదీ, నేర్వలేనిదీ!

ఈ పద్ధతి కవి హృదయుడైన ప్రతి ఒకనికీ స్వతహాగానే వస్తుంది. కవి అనేవాడికి నేర్ప లేనిదీ, నేర్వలేనిదీ యీ ఆలంకా రికతే. ఆలంకారికత కవిత్వంలో వాతావరణం సృష్టించడానికి, ఒక మూడ్ నిర్మించడానికీ, ఒక ఉద్రేకాన్ని సూటిగా పాఠకునిలో రేకెత్తించడానికి అవసరం. ఆలం కారికత లేకుండా కవి తన అనుభూతిని వ్యక్తం చెయ్యలేదా అంటే నిర్దిష్టంగా చెయ్యలేడనే చెప్పాలి. నిశితంగా అనుభూతి పాఠకునికి అందదనే చెప్పాలి. ఆలంకారికత లేకపోతే అది కవిత్వం కాకపోవచ్చు. ఉదాహ రణకు శ్రీశ్రీ 'గతమంతా తడిసె రక్తమున కాకుంటే కన్నీళ్లతో' అన్నప్పుడు ఉద్రేకభరితంగా చరిత్రస్థితి పాఠకునికి అందుతుంది. 'గతంలో ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఎంతో మంది చచ్చిపోయారు. పూర్వం అంతా కొట్లాటలే. అవన్నీ కొంత మంది స్వార్థం కోసం జరిగినవే. కాబట్టి గత చరిత్రలో గొప్పదనం అనేది అశాంతిలోనే వుంది' అంటూ పద్దు రాస్తే అది కవిత్వం కాదు. ఇలాంటి వివరణాత్మక రచన మేధా వ్యాపారం అవుతుంది కాని హృదయ సంబంధి కాదు. అందుచేత ఆలంకారికత కవిత్వంలో ఒక ప్రధానమైన ప్రయోజనం నిమిత్తం కవి వాడుక చేస్తాడు. అలా అని కేవలం అలంకారాలు గుప్పించడమూ కవిత్వం కాదు. తీరి కూర్చుని కవి అలంకారాలు నిర్మించవచ్చును. అలా 'నిర్మించే' అలంకారాలు 'క్వారీ' పనిలో రాళ్ళు చప్పుడైనట్టు 'ధ్వని' ఎంతైనా కలిగి వుండచ్చు. ఇంత 'ధ్వని' అయింది కాబట్టి ఎంతో గొప్ప కవిత్వం వుందని భ్రమిసే ప్రమాదమూ వుంది. ఇలా తెలివిగా అలంకా రాలు కూర్చడం పాఠకునికి కవి ఉద్రేకాన్ని ఏమీ అందివ్వదు. పైగా తీరిగ్గా ఈ అలంకారాల చిక్కులు విడదీసుకుని విషయం బోధపరచుకొనే సరికి పాఠకుడి తాడు తెగుతుంది. ఇలాంటి లెర్నెడ్, ఇంజీనియస్ అలంకారాల వాడకాన్నే డాక్టర్ జాన్సన్ 'మెటాఫిజికల్' అన్నాడు. ఉదాహరణకు 'ఆముక్తమాల్యద' వుంది. సమాస కాఠిన్యమూ, వ్యవహారదూరమైన భాషా ఎలావున్నా, గ్రీకు బొమ్మల కందరాల్లా అలంకారాలు చేవ దేరి వుంటాయి. బట్టలకొట్లలో పెట్టే బొమ్మలు-మానెకిన్‌లలా వుంటాయి. ఇలా కవి మేధాపరిశ్రమోద్భూతాలుగా, కవి ఆవేశంలో నుంచి మెరు పులు మెరిసినట్లు రాకుండా వున్నప్పుడే 'అలంకారం' శాస్త్రమై పోయింది. ఆల్జీబ్రాలా తయారైంది. ఈ చాయలకొస్తే కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్ కింద కేసు పెడతారేమోనని చాలా మంది చురుకైన ఆధునిక యువకులు రస చర్చ చెయ్యడం లేదు!

## ఆలోచనాక్రమానికి ప్రతిబింబం!

ఆలంకారికతను పరిశీలించడమంటే శయ్య, రీతీ ధ్వనిలాంటి వాటిని స్పృశించడం కాదు. ఒక అలంకారం అర్థాంతర సంక్ర మిత వాచ్యధ్వనా, కావ్యలింగమా అన్న వ్యర్థ చర్చా కాదు. ఈ ఆలంకారికతకూ కవి ఉద్రేకానికీ వున్న బాంధవ్యం ఏమిటి ? కవిలో ఈ విధానం ఏమి తెలియచేస్తున్నది? కవి ఆలోచనా ధోరణికీ ఆతని ఆలంకారికతకూ వున్న సంబంధం ఏమిటి ? కవి దృక్పథంతోటి ఆతని ఆలంకారికతకు, లేదా ఒక కవి ఆలంకారికతకూ ఆతని దృక్పథానికీ వున్న సంబంధం ఏమిటి? మొత్తం మీద కవి గ్రహించిన ఆలంకారికత, అతని వ్యక్తిత్వానికీ ఏమైనా దగ్గరా? అన్నదే ఆధునికుల ఆలంకారికతను గూర్చిన చర్చ. ఒక కవి గ్రహించే ఆలంకారికత అతని భావననీ, అతని మానసికస్థితినీ, అతని ఆలోచనా క్రమాన్నీ, అతని వ్యక్తిత్వాన్నీ తెలియజేస్తుంది. ఆది కావ్యలింగాలంకారం కానీ అపహ్నుత్యా లం కారం కానీ మరోటి కాని. (చరిత్రలో తారీఖుల్లా, అన్నంలో రాళ్ళల్లా, ఈ అలంకారాల నామెంక్లేచర్ మంట పుట్టిస్తుంది. కాబట్టి సామాన్యంగా 'ఆలంకారికత' అని వాడుకోవడమే మంచి ది.) ఉదాహరణకు తిలక్ 'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అన్నప్పుడు తిలక్ వ్యక్తిత్వం ప్రస్ఫుటం అవుతుంది. తిలక్‌లోని లాలిత్యం వెల్లడి అవుతోంది. (ఇలాంటి పోలికలు తేవచ్చా? తేకూడదా? అన్నది కాదు ఇక్కడి ప్రశ్న. ఇలాంటి ఆలంకారికత యేం తెలియజేస్తుందీ అన్నదే సందర్భం) సకృత్తుగా, ఒకటి రెండుచోట్ల వాడిన ఆలంకారికత మాత్రమే కవి వ్యక్తిత్వాన్ని తెలియ చేయకపోవచ్చు. కాని ఒక కవిలో ప్రాచుర్యమైన ఆలంకారికత తప్పకుండా కవి వ్యక్తిత్వానికి దర్పణం. కవి ఆలోచనాక్రమానికి ప్రతిబింబం. కవి దృక్పథానికి ఛాయ. కవి ఆలోచనా విధానానికీ, అతని ఆలంకారికతకూ వున్న సంబంధం ఒక మనిషి తీసుకునే ఆహారానికీ, అతని ఆరోగ్యానికి వున్న సంబంధంలాంటిదే.

## శ్రీ శ్రీ ఆలంకారికత ఎలాంటిది ?

శ్రీశ్రీలో ఎలాంటి ఆలంకారికత వుంది? ఇది ఎంత వరకూ శ్రీశ్రీ దృక్పథాన్ని తెలియజేస్తుంది ? శ్రీశ్రీని ఒక నవ్యరీతికి ఆద్యునిగా ఒక యుగానికి కర్తగా అతని కవిత్వం యెలా నిలబెట్టింది? అందులో శ్రీశ్రీ ఆలంకారికత పాత్ర ఎంత? ఒక కవికి వున్న భావుకత అతని కవిత్వపు గంభీరతను సంతరిస్తుంది. అతని శిల్పం అతన్ని ఉన్నతుణ్ణి చేస్తుంది. అతని

తాత్త్విక పునాది అతన్ని యుగకర్తను చేస్తుంది. ప్రస్తుత చర్చ వీనికి సంబంధించింది కాదు. శ్రీశ్రీలోని ఆలంకారికతను గూర్చి. కాబట్టి శ్రీశ్రీలో అతని అలంకారికత ఏమి తెలియ జేస్తుంది? శ్రీశ్రీ దృక్పథం ఏమిటి? శ్రీశ్రీ వ్యక్తిత్వానికి అతని ఆలంకారికతకూ వున్న సంబంధం యేమిటి? అన్న పరిశీలన మాత్రమే. 'మహాప్రస్థానం'లోని 'గీతాలకు పరిమితమై ఈ చర్చ సాగించడం సౌలభ్యం కోసమేనని గమనించాలి. 'మహాప్రస్థానం' గేయంలో ఉద్రేకపూరితంగా 'మరో ప్రపంచం' పిలిచిందని ఆనం దాతిరేకంతో, వెర్రి ఆవేశంలో పాడతాడు. ఈ మరో ప్రపంచం ఏమిటి అన్నదానికి ఇక్కడ జవాబులేదు. మరో ప్రపంచపు కంచు నగారా మోతలో, అగ్నికిరీటపు ధగధగలలో ఈ ప్రశ్నలు వినబడనూ లేదు. ప్రశ్నించేవాళ్ళు కనబడనూ లేదు. ఆ తర్వాత తాను ఊహించిన, కలగన్న మరో ప్రపంచానికి ఓ రూపూ ఆకారమూ వచ్చాయి. 'స్వాతంత్ర్యం/సమభావం/సౌభ్రాత్రం/ సౌహార్దం/పునాదులై ఇళ్లు లేచి / జనావళికి శుభం పూచి' కాంతి, శాంతి జయించి 'నిజమైన', 'ఋజువైన', 'స్వప్నమే' ఆ మరో ప్రపంచం. 'కార్మిక లోకపు కల్యాణమూ', 'శ్రామిక లోకపు సౌభాగ్యమూ' ఆ మరో ప్రపంచపు ఆశయాలు. 'వ్యధార్థ జీవిత యథార్థ దృశ్యం 'పునాదిగా' జనించబోయే సమాజమది. 'ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తి/ఒక జాతిని వేరొకజాతీ/పీడించే సాంఘిక ధర్మం' ఇకపై చెల్లని సమాజమది.

'మరో ప్రపంచాన్నే' తన ఊహలలో నిర్మించుకుని, ఆ కలలకు రూపం లభించడం కమ్యూనిజంలోనని తెలుసుకున్నప్పుడు శ్రీశ్రీ కమ్యూనిస్టు అయ్యాడు. తన 'మరో ప్రపంచాని'కీ, కమ్యూనిజా నికీ అభేదమని గ్రహించే శ్రీశ్రీ కమ్యూనిస్టు అయ్యాడు. తన ఉద్రేకంలో కమ్యూనిస్టు భావనను కలిగివున్నాడు కాబట్టి, కమ్యూనిస్టు సమాజాన్ని లేదా కమ్యూనిస్టు సమాజం లాంటిదాన్ని తాను కోరుతున్నాడు కాబట్టి కమ్యూనిస్టు అయ్యాడు. కమ్యూనిజంలో తన మరో ప్రపంచాన్ని చూస్తున్నాడు కాబట్టి కమ్యూనిస్టు అయ్యాడు. 'మహాప్రస్థానం' గేయం నాటికి శ్రీశ్రీకి మార్క్సిజం తెలియదనే విషయం ఇక్కడ గమనించాలి. కమ్యూనిజంలో తన కలలు ఫలిస్తాయని నమ్మిన శ్రీశ్రీ కమ్యూ నిస్టు అయ్యాడు. అదే కవిగా కమ్యూనిజంలోకి దూకడం. (శ్రీ శ్రీ ఇమోషనల్ లెవెల్‌లో ఇంకా చెప్పాలంటే సెంటిమెంటల్ లెవెల్ లో కమ్యూనిస్టు. సైద్ధాంతికంగా కాదు.) తన మరో ప్రపంచాన్ని కమ్యూనిజంలో దర్శించాడు కాబట్టి ఒక శాస్త్ర బద్ధమైన సిద్ధాంత బలంగల పునాదిని తన కవిత్వానికి ఏర్పాటు చేసుకున్నాడు. తన ఉద్రేకాన్ని కమ్యూనిజంలో నింపాడు. ఈ విషయాన్ని అవగాహన చేసుకోలేని వాళ్ళే శ్రీశ్రీ మరో ప్రపంచం అంటే కైలాసమనీ, వల్లకాడనీ వక్రభాష్యం చెప్పడం. ఈ మరో ప్రపంచ భావన శ్రీశ్రీ వూపిరి. మార్క్సిజం తెలియక ముందు నుంచీ శ్రీ శ్రీకి ఈ తపన వుంది. ఆ మాటకొస్తే కవులందరూ ఊహాస్వర్గాన్ని (ఉటో పియా) నిర్మించుకుని, లేదా ప్రజల విశ్వాసాల్లోవున్న స్వర్గాన్ని నమ్ముకుని, ఈ లోకాన్నుంచి పారిపోవాలని ప్రయత్నించిన వాళ్లే. ఈ లోకానికీ, కవులకీ 'తూకం సరికుదరక' పోవడమనేది ఆది నుంచీ వుంది.

భావకవులైతే స్వర్గంలో స్థలాలే కొనుక్కుంటారు – 'దిగిరాను, దిగి రాను, దివి నుండి భువికి' అని కృష్ణశాస్త్రి అక్కడే పీఠం వేస్తాడు. 'నా నివాసమ్ము తొలుత గంధర్వలోక'మని కృష్ణశాస్త్రి భావకవుల ప్రతినిధిగా పాడతాడు. ఈ తరహా వాళ్ళంతా ఈ భూమ్మీంచి ఎగిరి.. 'సకల దిశాంతరాళ మెల్లెడలనెందుకో పర్వులెత్తి' పోతారు. ప్రేయసితో, లేదా ప్రేయసి కోసం అదీ వూహల్లోని ప్రేయసి కోసం – అన్వేషిస్తూ పోవడం ఇంకా తియ్య గా వుంటుంది. అలా ఈ లోకం నుంచి పలాయనం చిత్తగించి, తమ కలల్లో విహరించి, ఈ లోకాన్నే విస్మరించే వాళ్లు కాబట్టి భావకవులకు కవిత్వం తమ ఊహాస్వర్గాలకు నిచ్చెన అయింది. తదనుగుణంగా లలితమైన, మృదువైన భావనా, అలంకారికతా, కవిత్వమూ వాళ్ళకు అబ్బాయి. ఇలా స్వర్గంలోకి వెళ్ళేవాడు 'ఖడ్గమృగోదగ్ర విరావం/ఝంఝానిల షడ్జధ్వానం' వింటే 'మూడ్' అంతా చచ్చి వూరుకుంటుంది.

జీవితం పట్లా కవిత్వం పట్లా ఒకడికివున్న అభిప్రాయాలను బట్టే వాడి కవిత్వస్థితి వుంటుంది. శ్రీశ్రీకి భావకవులకంటె భిన్నమైన దృక్పథం వుంది. తను కాంక్షించేది మరో ప్రపంచమే. తాను యిలోకంతో పొత్తు కుదుర్చుకోలేకపోయిన మాటా నిజమే. అంతమాత్రంచేత తాను పలాయనాలు చిత్తగించడు. యీ 'నిరాశామయ లోకం' నుంచి పారిపోడు. కృష్ణశాస్త్రిలా ఏడుపులో తనని తాను మర్చిపోడు. 'మనసారగా నేడ్వనీరునన్న' ని లోకాన్ని తిట్టిపొయ్యడు. శ్రీశ్రీ కర్తవ్య ఉన్ముఖుడై 'కదనశంఖం' పూరిస్తాడు. 'నిన్న వదలిన పోరాటం నేడు అందుకొనక తప్పదు' అని కృత నిశ్చయంతో రంగంలోకి వస్తాడు. శ్రీశ్రీకి ఈ లోకం లోనే స్వర్గం రుజువౌతుంది. స్వర్గం యెక్కడో లేదు. 'అన్నీ ఒక్కడికి బదులు/అంత మందికి అన్నీ / అదే స్వర్గమంటాను/ ఆ స్వర్గం వేరే కదు/దూరం లేదు లేదు / ఈడే నేడే వున్నది / నీలో నాలో వున్నది' అని స్వర్గం ఈ భూమి మీదిదేనంటాడు. ఇలాంటి 'భౌతిక' స్వర్గాన్ని కృష్ణశాస్త్రి ప్రాణంపోతే వొప్పుకుంటాడా?

### శ్రీశ్రీ భావనలో కాలం

శ్రీశ్రీకి కాలం కూడా ప్రపంచ భావన అంత విస్తారమైనదీ, జీవితమంత లోతైనదీనూ. కవిగా తన 'గుండెల కొండలలో/ మ్రోగును మార్మోగును/హుటాహుటిన పరుగెత్తే/యుగాల రథనా ధం' పేదల జీవితం చిత్రిస్తూ 'నీడలు' ఖండికలో– 'యుగ యుగాల దోపిడిలో/నరనరాల రాపిడిలో' పొగచూరిన బ్రతుకులు అంటాడు. పేదలది 'తరతరాల రోదన'. పిల్లల కోసం 'శైశవగీతి' లో 'ఇవాళలాగే ఎప్పుడు కూడా/ఇనబింబం పయనించు నింగిపై/

ఎప్పుడు కూడా ఇవాళలాగే/గాలులు వీచును, పూవులు పూచును' అంటాడు 'వచ్చేనాళ్ళ విభాప్రభాతములు' పిల్లల హాసంలో మెరుగులు తీరుతాయి. ఈ 'వచ్చేనాళ్లు' అనంతమైనవి! ఋతువులు వస్తూ పోతూనే వుంటాయి కాలగతిలో. 'అద్వైతం' లో 'కాలానికి కళ్ళెం వేస్తా'మని అంటాడు. ("మహాప్రస్థానం" సంకలనంలో కంటే ఆ తర్వాత వెలువడిన రచనల్లో 'కాలా'నికి సంబంధించి చర్చించవలసింది ఎక్కువ వుంది).

## ప్రపంచదృష్టి-తాత్విక విచికిత్స

భౌతిక పునాదితో కూడిన ప్రపంచదృష్టి, జీవిత సమస్యల విచికిత్సా శ్రీశ్రీ వ్యక్తిత్వంలో జీర్ణించివున్నవి. మార్క్సిస్టు సిద్ధాంతం తన సందేహాలను తీర్చగలదిగా కనుపించింది. తన మరో ప్రపంచ దృక్పథానికి రూపు రాగలదు అనిపించింది. తనలో మండే కవితాగ్నిని ఒక లక్ష్య సిద్ధికి అంకితం చేశాడు. ప్రపంచానికి అభ్యుదయం కాంక్షించాడు. ('అభ్యుదయ పరం పరాభివృద్ధిగా' మన ప్రాచీనులందరూ కవిత్వం చెప్పారు. ఆ అభ్యుదయం ప్రపంచానికి ప్రజలకీ కోరికల్లోనే ఇక్కడ ఓ విషయం గుర్తు చెయ్యడం అప్రస్తుతం కాదేమో. శ్రీశ్రీ పి.ఇ.ఎన్. క్లబ్బులో తన సభ్యత్వానికి రాజీనామా ఇస్తూ 'మానవ మాత్రుడి నైన నాకు మహోన్నతాలైన మీ ఆదర్శాలను అందుకోవడం కష్టంగా వుం'దని రాశాట్ట. దీనికి వివరణ అవసరమా?)

## అభ్యుదయ యుగకర్త శ్రీశ్రీ

ఇంత అభ్యుదయ కాముకుడు కాబట్టే శ్రీశ్రీ ఒక యుగకర్త కాగలిగాడు. మార్క్సిస్టు అయినంత మాత్రాన అభ్యుదయాన్ని కవిత్వంలో చొప్పించినంత మాత్రాన మహాకవీ, యుగకర్తా అయ్యాడా ? అలా అయితే చాలా మంది కవులు మార్క్సిస్టులుగా వున్నారే, కవిత్వంలో అభ్యుదయం నింపేశారే. వాళ్ళంతా మహా కవులేనా? కమ్యూనిస్టులే కవులైన కేసులూ వున్నాయి. వీళ్లది ఓ మెట్టుపైనే అవ్వాలి కదా! ఇలాంటి ప్రశ్నలు ఉత్పన్నమయ్యే మాట నిజమే. ఒక సిద్ధాంతాన్ని అనుసరించినంత మాత్రాన కవికి మహత్వం రాదు. పది మందీ అంగీకరించిన సిద్ధాంతమైనంత మాత్రాన యుగకర్త కాడు. మరి శ్రీశ్రీ ఎలా అయ్యాడు?

శ్రీశ్రీకి గల భౌతికవాద దృష్టి, పురోగమనశీలతా ఒక పునాది మాత్రమే. ఈ పునాదిపై లేచిన శ్రీశ్రీ కవిత్వమే అతణ్ణి ఆకాశమంత ఎత్తు తీసుకుపోయింది. ఒకడు తన విశ్వాసాలనూ, నమ్మకాలనూ ఎంతశక్తివంతంగా ఇమోషనలైజ్ చెయ్యగలడో అంతటి గొప్పకవి అవుతాడు. ఒక అనుభూతిని రక్తకేశ నాళాల్లోకి కూడా ప్రసరింపచేయగలశక్తి శ్రీశ్రీకి వుంది. మనస్సులోని సన్నని చీకటి మూలలకు వ్యాపించగల పరిశీలన శ్రీశ్రీకి వుంది. పాఠకుడు మళ్ళీ ప్రశ్నించకుండా తనతో ఈడ్చుకపోగల బలం వుంది. మెరుపులా దూసుకుపోయే కత్తుల్లా వుండే ఆలంకారికత వుంది.

## శ్రీశ్రీ భావతీవ్రత

'ఐ' అన్న ఖండికలో తాను స్మరిస్తే పద్యం అరిస్తే వాద్యం అనిచెప్పి 'అనలవేదిక ముందు అస్ర్త నైవేద్యం' అంటాడు. ఈ 'అస్ర్త నైవేద్యం - అదీ' అనల వేదిక ముందు- శ్రీ శ్రీలోని విప్లవ తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. 'ఎగిరి.. సలసల కాగే చమురా? కాదిది / ఉష్ణరక్త కాసారం" అంటూ విలయతాండవ వాతావరణాన్ని సృష్టిస్తాడు. 'ఉష్ణరక్త కాసారం' శ్రీశ్రీయే చూడగలడు. చూపించగలడు. 'ఇంకిన, తెగిపోయిన, మరణించిన/క్రొన్నెత్తురు: విపంచికలు, యువయోధులు' అని పోరాట స్వరూపాన్ని కళ్ళ ముందు కట్టిస్తాడు. చావుపుట్టుకల పొలిమేరలలో 'ఆవులించెనొక చితాగ్నికుండం' అంటాడు. చావు పుట్టుకల పొలిమేరలలో తన విప్లవభావనే. చితాగ్నికుండం ఆవులించడం ఎంత గుండెలు గజగజలాడించే కల్పనో, ద్రోహాలనూ, దోషాలనూ తుడిచి పెట్టడానికి 'యినుపడేగ' యెగురుతుంది. 'మంట పంట' పండుతుంది.

'ఆకాశదీపం' అన్న ఖండికలో ఒక దురదృష్ట జీవి ఆరిపోయిన సన్నివేశ చిత్రణ వుంది. ఆ దురదృష్ట జీవికీ అతని గదిలో వెలిగే ప్రమిదలోని దీపానికీ సమానాత్మకత  రూపం చేశాడు కవి. గది నిండా 'చినుకులవలె చీకట్లు' అని చీకటిని వర్ణిస్తాడు. చీకట్లు చినుకుల్లా ఎలా వుంటాయో వూహించుకోవలసిందే. ఈ అనుభూతి సంకేతమే ఈ ఆలంకారికత. దీపాన్నివర్ణిస్తూ చీటిబోనులో సింహములా నిలుచున్నది/కత్తిగంటుమీద నెత్తుటి  బొట్టులాగున్నది' అంటాడు. ఎవడేనా కత్తిగంటు మీది నెత్తుటిబొట్టు ప్రమిదలోని దీపంలా వున్నదంటాడు. కానీ శ్రీశ్రీ దాన్ని తిరగేస్తాడు. ఇది శ్రీశ్రీ భావతీవ్రతకు సాక్షి. ఈ మానసిక స్థితి (మూడ్) కవిదీ, పాఠకునిలో కలిగేదీకూడా. అనిర్వచనీయం. కవితాదేవత ప్రసన్నత కోసం నిశ్చల సమాధిలో తపస్సమీక్షణలో శ్రమించి, ఆ కవిత సాక్షాత్కరించినప్పుడు కూడా అసామాన్యమైన అనుభూతే శ్రీశ్రీకి కలిగింది. 'అగ్ని సరస్సున వికసించిన వజ్రం/ఎగిరే లోహశ్యేనం / ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగనాదం' : ఇవీ శ్రీ శ్రీకి కనిపించిన దృశ్యాలూ, వినిపించిన భాష్యాలునూ. వజ్రం కనిపిస్తే కవితాసతీ సాక్షాత్కారానికి మంచి ఫలితమే లభించిందని అనుకోవచ్చు. కాని ఇది మామూలుగా కనిపించడం కాదు. 'వికసించిన వజ్రం' వజ్రం వికసించడమేమిటి-ఇదేమైనా పువ్వా? అదీ "ఆగ్నిసరస్సున!"  ఈ వూహ శ్రీ శ్రీకి తప్ప మరొకడికి వస్తుందా? 'లోహశ్యేనం' ఎగురుతూండగా శ్రీశ్రీకాక మరెవరు చూడగలరు? ఫిరంగి పేలితే భయం వేస్తుంది. కొంచెం సరసుడైన యుద్ధప్రియుడైతే ఫిరంగిమోత భేరీనాదంలా వుందనవచ్చును. కాని 'ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగ నాదం'- ఇంతటి భయదమైనదాన్ని శ్రీశ్రీయే రూపొందించగలడు.

## చిత్ర విచిత్రం , అనన్య సామాన్యం!

'కవితా! ఓ కవితా!' గేయంలో శ్రీశ్రీ విన్నవీ, కన్నవీ చిత్ర

చిత్రమైనవి, అనన్యసామాన్యమైనవి వున్నాయి. 'శిశువు చిత్ర నిద్రలో ప్రాచీన స్మృతులూదే చప్పుడు' శ్రీశ్రీ మాత్రమే గ్రహించగలడు. ఇందులో శ్రీశ్రీకి పునర్జన్మ సిద్ధాంతం మీద గురి కుదిరిందని భుజాలెగరేసే జడ బుద్ధులు, నిశితమైన శ్రీశ్రీ భావుకతా ప్రతిధ్వనిని ఇందులో ఎలా వినగలరు? ఉన్మాది మనస్సినీవాలిలో/ఘూకంకేకా, భేకంబాకా/ఉరి తీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం'. ఎవడికైతే గుండెలోని సిరలూ, ధమనులూ రక్తాన్ని కాక కవిత్వాన్ని సరఫరా చేస్తున్నాయో వాడే వినగలడు, వినిపించగలడు ఇవి. ఋతువర్ణన చాలామంది కవులు కాళి దాసు నుంచీ ఆనవాయితీగా చేస్తున్నారు ప్రబంధాల్లో, పగ్గాలు పేనినట్లు, ఋతువర్ణనలు పేనడమే ఓ క్వాలిఫికేషన్. తీంతటి 'చరిత్ర' కలిగిన ఋతువులను శ్రీశ్రీ కూడా వర్ణించాడు. 'శైశవ గీతి'లో పది పాదాల్లో ఆరు ఋతువులనూ వర్ణించాడు. 'ఋతువుల రాణీ వసంతకాలం/ మంత్ర కవాటం తెరుచుకునీ/ కంచు వృషభముల అగ్నిశ్వాసం / కక్కే గ్రీష్మం కదలాడీ' అంటూ ఋతువర్ణన సాగుతుంది. ఇలాంటి చోట్లే కవి గొప్పదనం బయలుపడేది. గతంలో ఎవరూ ముట్టుకోని విషయమైతే సరి పోల్చి గొప్పదనం నిర్ణయించే పేచీయే రాదు. పోటీ వున్నప్పుడే గొప్పతనం తెలిసేది. గ్రీష్మంలో 'పలికిన నోరెల్లపొక్కు'నంతటి యెండగా వుందని అన్నాడు నన్నెచోడుడు. 'ఎసగు కట్టావి క్రియ నావిరెగసి'నట్లుగా గ్రీష్మతాపం వుందన్నాడు రాయలు, 'ఆకాశమును భూమి, యగ్నిపత్రము వ్రాసి/కొన్నట్లు సుడిగాలి మన్ను రేగె' నన్నాడు శిల్పకవి సమ్రాట్టు విశ్వనాథ. కాని శ్రీశ్రీ అంతటి తీవ్రంగా గ్రీష్మాన్ని ఎవరూ వర్ణించలేదు. "కంచు వృషభముల అగ్ని శ్వాసం క్రక్కేగ్రీష్మ"మది. పొగరెక్కిన వృషభాలు పందెంలో కక్కేశ్వాస అందరికీ పరిచయమే. ఆ పరిచయమాత్ర విషయంతోటే ఈ చిత్రాన్ని రూపు కట్టించు కోగలడు పాఠకుడు. వృషభం - అదీ కంచుది- అది కక్కే శ్వాసం, మామూలు శ్వాసం కాదు, అగ్నిశ్వాసం. కంచువృషభం అగ్నిశ్వాసం కక్కినట్లుంది గ్రీష్మం. ఇక్కడ కూడా విచిత్రమే వున్నది. సామాన్యంగా అందరూ చూసేది అనుభవించేదీ గ్రీష్మాన్ని. కంచు వృషభాన్నీ, అది అగ్నిశ్వాసం కక్కుతూ వుండడాన్ని ఎవ్వరూ చూడ్డం సాధ్యపడదు. ఒక వేళ ఎవడైనా చూడడం తటస్థిస్తే 'మండు వేసవిలోని ఎండలా వుందిది. అనుకోవచ్చు. అంతేగాని మండు వేసవిలోని ఎండ కంచు వృషభాల అగ్నిశ్వాసంలా వుందని, పోలిక తీసుకువచ్చే వస్తువునే పాఠకునిచే వూహింపచేసి, తర్వాత దానితో పోలికతేవడం శ్రీశ్రీకే సాధ్యమవును. శ్రీశ్రీ లోని భావతీవ్రత తెలియచేస్తుందీ విధానం. సూటిగా దూసుకుపోయే ఆలంకారికతతో పాఠకుడికి బొమ్మలరూపు కట్టిస్తాడు.

'యంత్ర భూతముల కోరలు' తోమి నలిగిపోతున్నారు కార్మిక ధీరులు, 'లోహ రాక్షసుల పదఘట్టనచే' కనలుతున్నారు అభాగ్యు లు. ఈ రెంటిలోనూ పెట్టుబడిదారీ నాగరికతలోని విషపు చిహ్నాలు కనిపిస్తాయి. 'భిక్షువర్షీయసి'లోని ముసిల్ది 'ఆరిన కుంపటి విధాన'ముంది. 'పక్కనున్న బండరాతి/పగిదిగనేపడి వున్నది'. ఇంత దీనమైనదీ ముసిలిదాని అవస్థ. 'బాటసారి'కి 'రాత్రి నల్లనిరాతి పోలిక / గుండె మీదనె కూరుచుం'టుంది. రాత్రి నల్లగాకాక వెన్నెల రాత్రయితే తప్ప-ఎట్లాగా వుంటుందా?. తెల్లగావుంటుందా? రాత్రి నల్లని రాతి పోలిక వుండటం పెద్ద గొప్పగా ఏమీలేదు. గొప్పతనం ఎక్కడుందంటే నల్లనిరాయి గుండె మీద కూర్చున్నట్టుందనడంలో, రాత్రి నల్లని రాయిలా వుందీ అంటే కాదు. నల్లనిరాయి గుండె మీద కూర్చున్నట్టుంది. భయ వాతావరణ సృష్టికి మెరుపులా వచ్చిన అలంకారికత ఇది. 'జగన్నాథుని రథచక్రాల'లో దీనులూ, పతితులూ 'శనిదేవత రథచక్రపు/టిరుసులలో పడి నలిగిన'వాళ్ళు. శనిదేవత చేత పీడించబడిన వాళ్లు కాదు. శనిదేవతకు ఓ రథం వుంది. ఆ రథానికి చక్రాలున్నాయి. ఆ చక్రాల యిరుసులలోపడి నలిగిన వాళ్ళు! ఇంతకన్న దుస్థితి ఏముంటుంది? దుస్థితి కల్పనకు శ్రీశ్రీ ఇచ్చిన 'ఆలంకారికత శ్రీశ్రీలోని లోతైన బాధని వ్యక్తం చేస్తోంది. 'వ్యర్థార్థ జీవిత యథార్థ దృశ్యం/పునాదిగా ఇక జనించబోయే / భావివేదముల జీవనాదములు' తాను జగత్తుకంతా చవులిస్తాడు. 'వేదము' అనడంలోని సొంపును వివరించనక్కర్లేదు. అలాగే 'పుష్కిన్ గోగోల్.. కార్మిక స్వర్గాన్ని కలగన్న రష్యా!' అని రష్యాని కీర్తించేటప్పుడు 'కార్మిక స్వర్గం' అంటాడు. 'మార్క్స్, ఏంగెల్స్ మహాప్రవక్తలై/లెనిన్ తపస్సు/స్టాలిన్ సేద్యం' ఫలించి రష్యాను నిర్మించాయి. మార్క్స్, ఏంగెల్సు ప్రవక్తలు. సర్వమతాల్నీ మత్తు మందు చేసేవని కొట్టిపారేసిన వీళ్ళు ప్రవక్తలు : ఎన్నడూ చర్చి మొహమేనా చూడని లెనిన్‌ది తపస్సు! కవిత్వపరంగా ఆ మహనీ యుల్ని ఇంతకంటె గొప్పగా స్మరించడం ఎలా వీలవుతుంది? కవిత్వపు నాడి కొట్టుకొనేవాడికి వీటిని వివరించాల్సిన పనిలేదు.

తానూ 'చిర దీక్షా శిక్షా తపస్సమీక్షణలో' కవితా దేవత కోసం ఆరాటపడ్డాడు. పిల్లలు 'పరమాత్ములు'అంటాడు. 'బాటసారి' కన్నుమూసినప్పుడు తల్లికి 'పీడకలలో పేగు కదులు'తుంది. ఒక జాతి వాడుకలోని భాషా సంప్రదాయాలు అర్థంచేసుకుని జీర్ణిం చుకున్నవాడు ఇంతకంటె సున్నితంగా తన హృదయాన్ని విప్ప లేడు. కవిత్వంలో శ్రీశ్రీ పాతని పట్టుకువదల్లేదనీ, పరమాత్ము లనడంవల్లా, ధనంజయులనడం వల్లా నవ్యకవిత్వానికి రౌరవాది నరకాన పడే పాపం చుట్టుకొందనీ అనుకొనేవాళ్ళ కవిత్వ అనుభూతికి జోహార్లివ్వడం మేలు.

## శ్రీశ్రీ కవితా సామగ్రి

శ్రీశ్రీకి తరచూ రక్తం. నెత్తురు, అగ్ని, నిప్పులు, చీతులు, బాకులు, ఘూకాలు, భేకాల బాకాలు, యినుప డేగలు, విలయాన్వితమైన సముద్రం, కొమ్ములు, కొమ్ములకున్న కన్నులులాంటి అలంకారికతే వస్తూవుంటుంది. "ఆః" అనే చిన్న

ఉండికలో 'నిప్పులు చిమ్ముకుంటూ' తాను నింగికెగిరిపోతేనూ, 'నెత్తురు క్రక్కుకుంటూ' నేలకు రాలిపోతేనూ వచ్చే రియాక్షన్ చిత్రిస్తాడు. 'నిప్పులు'. 'నెత్తురు' ఉన్నతికీ, పతనానికీ వుద్దేశించినవి నిప్పుతో తప్ప ఉన్నతిని సూచించలేదా? ఇది శ్రీశ్రీ తత్వం. తన గదిలో ఒక్కడూ భయంతో కూర్చున్నప్పుడు "ఇరవై కొమ్ముల.. కర్కాటక కర్కోటకులో?' అని భయోత్పాతంగా వర్ణిస్తాడు. 'గర్జించు రష్యా'లో 'సుప్తకంకాళాలు మేలుకొంటున్నాయి /ప్రపంచం పడగెత్తి బుసకొట్టిలేచింది' అంటాడు. సుప్తకంకాళాలు 'మేలుకొనే స్థితిని వూహించుకోవాల్సిందే.

'ఆశాదూతలు'లో 'ఒకడు తూరుపు దిక్కునకు' 'స్వర్గాలు కరిగించి/రగిలించి రక్తాలు' పోతాడు. రక్తం రగిలించడం శ్రీశ్రీకి చాలా అభిమానపాత్రమైంది. వీర రసస్ఫోరక సందర్భాలు కాబట్టి ఈ రక్తాలూ, బాకులూ వంటి ఆలంకారికత వస్తుందనుకున్నా – 'కేక', 'అద్వైతం', 'ఒకరాత్రి' లాంటి తావుల్లో కుదరదు. 'నిద్రకువెలియై నేనొక్కడినై.. గుండెలకప్పిన కుంపటితో", గదిలో వున్నానంటాడు. 'నా కనుగోనల/ నా యెద గోడల/ నాలుగు దిక్కుల బాకులతో../బాకుల తోటల బాటలతో' చిక్కుకున్నానంటాడు. ఒంటరిగా వున్నాడు. ఏదో భయ వాతావణంలో వున్నాడు కాబట్టి ఆ తీవ్రతకు తగ్గ బాకులూ, బాకుల తోటలూ ఇక్కడ వచ్చాయనుకోవచ్చును. కాని 'అద్వైతం'లో 'నీతలపున రేకులు పూస్తే/నావలపున బాకులు దూస్తే' అత్యద్భుతాలు సాధిస్తామంటాడు. వలపున బాకులు దుయ్యడం ఏమిటి 'ఆకాశపు టెడారిలో కాళ్ళుతెగిన ఒంటరి ఒంటెలాగుంది జాబిల్లి'. ఓ రాత్రి, అని శ్రీశ్రీ అనుకున్నప్పుడు బహుచక్కగా చెప్పాడని భుజంతట్టేవాళ్లు ఏమి చక్కదనాన్నిందులో చూస్తున్నారు? ఇది వరకెవరూ ఇలా చెప్పలేదు. ఇలా వూహించలేదనే మట్టుకే వాళ్ళపొగడ్త. 'కాళ్ళుతెగిన ఒంటరి ఒంటెలాగుంది జాబిల్లి' అనడంలో శ్రీశ్రీ వ్యక్తిత్వం, శ్రీశ్రీ విలక్షణత్వం ప్రస్ఫుటమౌతోంది.విలక్షణంగా వుండాలనే శ్రీశ్రీ ఈ ఆలంకారికత గ్రహించాడా? కాకపోతే ఎందుకు ?

నారాయణబాబు నక్షత్రాలు మశూచికం కుండలాల్లాగా వున్నాయన్నాడు. ఇది విలక్షణంగా వుండటం కదా. మరి శ్రీశ్రీది నారాయణబాబుది ఒకే రకమైన విలక్షణత కదా. అనే సందేహాలు సహజంగా వస్తాయి. ఒక కవి కొత్తకల్పనలు ఎన్నైనా చెయ్యవచ్చును. అంతమాత్రం చేత ఒరిగేది ఏమీవుండదు. కానీ రచయిత హృదయ పరిపాకాన్ని బట్టి అతని రచన రూపు తీసుకుంటుంది. ఉదాహరణకు తిలక్ నారాయణబాబులా నక్షత్రాల్ని వర్ణించగలడా? అది గొప్పదనీకాదు. ఆ గొప్పదనం తిలక్‌కు రాదనీకాదు. తిలక్ వ్యక్తిత్వానికే అది వ్యతిరేకం. నారాయణ బాబులోని వైయక్తికతత్వాన్ని అతని విలక్షణమైన అలంకారికత తెలియచేస్తుంది. శ్రీశ్రీలోని విప్లవ తత్వాన్ని శ్రీశ్రీ ఆలంకారికత తెలియచేస్తుంది.



**శ్రీశ్రీలో ఆలంకారికత**

ఉద్రేకాల ఉప్పెనలు కదిలించి తర్వాత 'వ్యత్యాసం' అన్న ఖండికలో కూల్‌గా చెబుతాడు, 'మాకు గోడలు లేవు. / గోడలను పడగొట్టడమే మాపని. / అలజడి మా జీవితం / ఆందోళన మా వూపిరి / తిరుగుబాటు మా వేదాంతం' అని. ఈ తిరుగుబాటు తత్వమే 'మహాప్రస్థానం'లోనూ వుంది, 'కవితా! ఓ కవితా'లోనూ వుంది – ఈ గేయ సంకలనమంతా వుంది. అంటే మార్క్సిజం తెలిసాక శ్రీశ్రీ తెచ్చి పెట్టుకున్నది కాదిది. ముందరి నుంచీ వున్నదానికి మార్క్సిజం తెలిసాక ఓ లక్ష్యశుద్ధి, ఓ రీతీ వచ్చాయి అంతే. మార్క్సిజం తెలియకుండా వుండివుంటే ఈ మహా ఉద్రేకి, ఈ 'నడిచే అగ్నిపర్వతం', ఈ పిడుగు– యేమై, ఎలా ప్రవర్తించి వుండేదీ ఇప్పుడు వూహించుకోవాల్సిందే. శ్రీశ్రీ ఆలంకారికతలో ప్రస్ఫుటమయ్యేది శ్రీశ్రీ విప్లవ వ్యక్తిత్వమే. సరదాకో, విలక్షణంగా వుండాలనో వచ్చిన ఆలంకారికత కాదిది. మరో ప్రపంచపు భావనలో, విప్లవ తత్వంతో దీప్తమైంది. శ్రీశ్రీ వ్యక్తిత్వం, ఆ దీప్తి నుంచి పెంపొందిందీ ఆలంకారికత. కవిత్వంలో అలంకారాలు మేధా పరిశ్రమకు నిగ్గుగా, కవిత్వం ఒక మేధా వ్యాపారంగా మారినప్పుడు శ్రీశ్రీ హృదయస్థానాన్ని కవిత్వంలో గుర్తింప చేశాడు. ఒక ప్లాను ప్రకారం శ్రీశ్రీ తెచ్చిపెట్టుకున్నది కాదీ ఆలంకారికత. తన గుండెల్లో మండే అగ్నిపర్వతాల పేలుళ్లు శ్రీశ్రీ గేయాలు. తన ఆవేశపు ఉష్ణత ఈ గేయాలు. వస్తుతహా అలాంటి తత్వం కలవాడు కాబట్టే 'మాటల ఈటెలు' దొర్లాయి. తాను అలాంటి 'వైప్లవ్య గీతం' కాబట్టే చెలం చెప్పినట్టు, 'నెత్తురూ, కన్నీళ్ళూ కలిపి కొత్త టానిక్ తయారుచేశాడు శ్రీశ్రీ ఈ వృద్ధ ప్రపంచానికి'. ❑

# రా.రా. స్థాపించిన ఉత్తమ సాహిత్య విమర్శ ప్రమాణాలు

**అభ్యుదయ సాహిత్యంలో కవిత్వానికి శ్రీశ్రీ, వచనానికి కొడవటిగంటి కుటుంబరావు ప్రతీకలుగా నిలిచినట్లు గానే విమర్శకు రా.రా. ప్రతీకగా నిలిచేడు. ('అభ్యుదయం' అన్న పదాన్ని ఒక సంస్థకు మాత్రమే పరిమితం చేయకుండా విశాల అర్థంలో, మార్క్సిస్టు సాహిత్య చింతనగా గ్రహించాలని మనవి.) 'కదలేదీ కదలించేదీ, పెనునిద్దుర వదలించేదీ' అభ్యుదయ కవిత్వ లక్షణం. బుర్రకు పదును పెట్టి ఆలోచింపచేయడం ఈ నాటి వచనానికి జీవగర్ర, అదే రకంగా సాహిత్య కళా ప్రమాణాలకు వీసమెత్తు వన్నె తగ్గకుండా, అభ్యుదయకర సాహిత్యాన్ని యెత్తి చూపించడం విమర్శ లక్ష్యం. రా.రా. అలాంటి ఉత్తమ విమర్శకుడు.**

ఆయనకు సాహిత్యం యే లక్ష్యంతో వుండాలో తెలుసు. కళలు యే ఆశయాల్ని సాధించాలో తెలుసు. అవి యే శిల్ప ప్రమాణాలతో వుండాలో తెలుసు. అందుచేత కేవలం వస్తువుని బట్టే కాక, సాహిత్య నియమాలతో ఆ వస్తువును అందించే తీరుని బట్టే ఆయన అంచనా కడతాడు. యేది అభ్యుదయక రమైంది, యేది కాదు, యేది లక్ష్యాలని, ఆశయాలని అందుకో గలదు, యేది అందుకోలేదు అని పరిశీలన చేశాడు. వస్తు, రూప పరస్పర సంబంధాన్ని శోధించి ఉత్తమ సాహిత్యం అంటే యేమిటో వివరించారు. ఉత్తమ సాహిత్యం లక్ష్యం యేమిటో వివరించారు. అందుకనే 'తూచ గలరాళ్లు' వున్న విమర్శకుడిగా శ్రీశ్రీయే ఆయనను వర్ణించాడు. 'ఏ సాహిత్య ప్రక్రియ అయినా అది పాఠకుని సంస్కార వికాసానికి ఇవ్వగల మార్గదర్శక సూత్రాన్ని బట్టే దాని విలువను నిర్ణయించాలి' అని అన్నాడాయన. ఆయన సాహిత్య రంగంలోని అన్ని ప్రక్రియల గురించి పరిశీలించా డు. కవిత్వం, కథ, నవల, నాటకం, విమర్శ-యీా ప్రముఖ ప్రక్రి యలన్నీ ఆయన పరిశీలన కిందకు వచ్చినవే. అన్నీ ఆయన సిద్ధాంత భూమిక నేపథ్యంలో సాగినవే.

## రా.రా. సిద్ధాంత భూమిక

'ఈ సమాజంలోని సమస్యలను కూడా బూర్జువా డెమొక్రటిక్ దృష్టితో కాక, మార్క్సిస్టు దృష్టితో చూడగలవాడే ఈనాడు అభ్యుదయ రచయిత కాగలడనే నేను అంటున్నది. మార్క్సిజంను చదువుకోకుండానే ఆ దృష్టి అలవడితే నాకేమీ అభ్యంతరం లేదు. కానీ ఆ దృష్టి వుండడం మాత్రం అభ్యుదయ రచయితకు అత్యవసరమని నా విశ్వాసం. ఫ్యూడల్ అవ శేషాలతో పోరాటం కూడా మనం బూర్జువా డెమోక్రాట్లలాగ కాక, మార్క్సిస్టులలాగా చేయాలి'

(రా.రా. లేఖలు. పేజీ 50).




అభ్యుదయ రచయితకు మార్క్సిస్టు దృక్పథం వుండవలసిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పాడు. సిద్ధాంతరీత్యా ఆయన పునాది అదే. ఈ పునాది ఆధారం గానే ఆయన సాహిత్యంలోని విలువలను అంచనా కట్టేడు. 'మిస్టిసిజం అనేది హ్యూమన్ కాన్షియస్నెస్‌లో ఒక గౌరవనీ య భాగమనే గుర్తింపు నాకుం ది. హ్యూమన్ సెన్సిటివిటీని పెంచి పోషించడంలో దానికి గొప్ప పాత్ర వుందని నాకు తెలుసు. కానీ, నా భౌతికవాద దృక్పథం నుండి నేను దానిని చూడకా తప్పదు, విమర్శిం చకా తప్పదు" (రా.రా. లేఖలు. పేజీ 85) అని ఖలీల్ జిబ్రాన్ (కాళోజీ అనువాదం సందర్భం లో) గురించి అన్నాడు.

సాహిత్య ప్రక్రియను సాహిత్య

గుణాన్ని బట్టి గుర్తిస్తూనే, సిద్ధాంత భూమిక యేమిటై వుండాలో ఆయన నిర్దేశిస్తున్నాడు. మార్క్సిస్టు అవగాహన అభ్యుదయ రచయితలకు వుండి తీరాలి. భౌతికవాద దృక్పథం దీని మూలకందం. యీ భూమిక ఆధారంగానే పరిశీలన జరగాలి. యీ సిద్ధాంతం గురించీ, యీ దృక్పథం గురించీ యిక్కడ వివరించుకోవడానికి అవకాశం లేదు. సాహిత్య ప్రక్రియల పరిశీలనలో యివి యెలా ఆధారంగా వుంటాయో, రా.రా. ఆ పరిశీలనను యీ నేపథ్యంలో యెలా చేశాడో వాటినే చూడాలి.

## సాహిత్య ప్రయోజనం

సాహిత్యం యే ప్రయోజనాన్ని ఆశిస్తుంది ? అది యెలా సాధ్యమవుతుంది? 'ఉన్నత మానవ సంస్కృతీ ప్రమాణాలు నిరూపించడం, మానవ మనఃప్రపంచపు సంకుచిత స్వార్థ మార్గాలు బ్రద్దలు కొట్టడం, నూతన సౌందర్య లోకాలను దర్శనం చేయించడం, నూతన ఆనందమయ జీవిత వ్యవస్థకు మానవ హృదయాలను పరిపక్వం చేయడం- యివీ ఉత్తమ సాహిత్య లక్ష్యాలు.' కళాత్మక విలువలు వున్న సాహిత్య ప్రక్రియల ద్వారా యీ లక్ష్యాన్ని సాధించాలి. 'కళాత్మక విలువలు వున్న' అంటే యేమిటి? సాహిత్య పరిధి యేమిటో గుర్తించడం. 'జీవితాన్ని అర్థం చేసుకోవడంలో ఒక భాగమే సాహిత్యం. (మరో భాగం సైన్సు)', 'సాహిత్యం జీవితంతో పెనవేసుకుని వున్నా, అది ఒక ప్రత్యేక రంగం. దానికొక స్వతంత్ర ప్రతిపత్తి వుంది. దాని హద్దులు నిర్ణయించడం కష్టమే అయినా, హద్దులు వున్న మాట నిజం. రాజకీయాల నుండి గానీ తత్వజ్ఞానం నుండి గానీ, సాహిత్యం ప్రేరణ ప్రోత్సాహమూ పొందవచ్చు. కానీ రాజకీయాలే సాహిత్యం కాదు. తాత్విక చింతనే సాహిత్యం కాదు". సాహిత్యానికీ యితర రంగాలకీ వున్న తేడాని స్పష్టం చేసి చూపించాడు ఆయన.

అభ్యుదయ కవిత్వం ప్రాచుర్యం పొందుతూ వున్న రోజుల్లో 'ఆకలి' కవిత్వమని నిరసించడం ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి. అలాగే సాహిత్య స్పర్శ లేకుండా నినాదప్రాయమై పోతోందన్న విమర్శలోని సహేతుకతనీ గుర్తించాలి. శుష్క రాజకీయాలే కవిత్వం, సాహిత్యం కాలేవు అని రా.రా. తెగేసి మరీ చెప్పేడు. వస్తువు రీత్యా సామాజిక అభ్యుదయాన్ని కాంక్షించే సరుకు రచనలో వుండచ్చు. కానీ దాన్ని సాహిత్య నియమాల ద్వారా అందించాలి అన్నదే ఆయన నొక్కి మరీ మరీ చెప్పింది. 'అనుభూతి లేకుండా సాహిత్యమనేదే లేదు. సమస్త సాహిత్యమూ హృదయ వ్యాపారమే' అని ఆయన చాటేడు. అంటే సాహిత్యం దేని ఆధారంగా నిలబడాల్సిందీ ఆయన ప్రకటిస్తున్నాడన్న మాట. ఇది సాహిత్య నియమం. సాహిత్యానికి అవసరమైంది ఏదో చాటేక సాహిత్యం గురించిన అవగాహన చారిత్రకంగా ఎలా వుండేదీ వివరించేడు.

## సాహిత్యంలో కాలం

'ఒక్కొక్క యుగంలో జీవితం గురించి ఆనాటి జనులకు ఒక్కొక్క అవగాహన వుంటుంది'. ఈ అవగాహనను బట్టే సాహిత్యం గురించిన అవగాహన ఏర్పడుతుంది. ఫ్యూడల్ యుగంలో ప్రబంధ కవిత్వం, బూర్జువా వ్యవస్థలో భావ కవిత్వం- వచ్చాయి. అంటే అలాంటి సాహిత్యం రావడానికి ఆ సామాజిక నేపథ్యాలే కారణం. అభ్యుదయ సాహిత్యం రావడానికీ సామాజిక నేపథ్యమే కారణం. 'అభ్యుదయ కవిత్వపు ఉత్తేజం వ్యక్తికి సమాజానికీ గల నిసర్గ సంబంధాన్ని పటిష్టం చేస్తుంది. వ్యక్తిని కర్తవ్యనిష్ఠుణ్ణి చేస్తుంది. జీవిత సమరోన్ముఖుణ్ణి చేస్తుంది. నిరంతర క్రియాశీలతే సజీవత్వానికి చిహ్నం అని అవగాహన చేసుకున్న ప్రాతిపదిక నుండే కవిత్వం గురించి అభ్యుదయ కవుల అవగాహన ఉద్భవించింది'. అభ్యుదయ సాహిత్యం అంటే ఏమిటో వివరించి ఆ చారిత్రక నేపథ్యంలో దాని కర్తవ్యం యేమిటైందీ విపులీకరించేడు.

## వస్తు రూపాల గతి తార్కిక సంబంధం

కవిత్వం గురించీ, నవల గురించీ, కథానిక గురించీ, విమర్శ గురించీ విస్తృతంగా పరిశీలన చేసి మార్క్సిస్టు దార్శనిక దృష్టితో సాహిత్య విమర్శ చేసి యీ ధోరణికి ప్రమాణాలు స్థాపించేడు. వస్తు రూపాల గతి తార్కిక సంబంధం యెలాంటిదో చూపించడమే మార్క్సిస్టు విమర్శనా సూత్రాల్లో ప్రధానమైంది. అభ్యుదయ కవిత్వంలో యీ సంబంధం యెలా వుంటుందో వివరించాడు రా.రా. అభ్యుదయ సాహిత్య యుగకర్త అయిన శ్రీశ్రీ గురించి ఆయన చేసిన పరిశీలన ఇందుకు ఉదాహరణ ప్రాయంగా వుంటుంది.

శ్రీశ్రీ కవిత్వ జీవధాతువును అవగాహన చేసుకోకుండా కేవలం కవితా శిల్పానికి మాత్రమే పరిమితమై శ్రీశ్రీని శ్లాఘించే ధోరణిలోని భావజాల నేపథ్యాన్ని ఆయన తూర్పారబట్టేడు. శ్రీశ్రీ కవిత్వం 'నూతన సమాజ చైతన్యంలో భాగం, ఒక సామాజిక విప్లవోద్యమానికి ప్రతినిధి' అని నూతన సమాజ ఇతివృత్తం తెలియచేశాడు. దానికి సరితూగే కవితా శిల్పంతో దాన్ని యెలా శ్రీశ్రీ ప్రతిఫలింపచేసిందీ వివరించాడు. 'శ్రీశ్రీ మన కవిత్వంలో ఒక గొప్ప భావ విప్లవం తెచ్చినాడు', 'ఆ విప్లవం శ్రీశ్రీ కవితా శిల్పంలో కూడా ప్రతిఫలించింది" అంచేత సాంప్రదాయిక ఆలంకారిక మత దృష్ట్యా శ్రీశ్రీని ఆకాశానికి యెత్తే ప్రయత్నాల వెనక, శ్రీశ్రీ సామాజిక సిద్ధాంత అవగాహన భూమికను తప్పించే ఉద్దేశాల గుట్టును రట్టు చేశాడు. శ్రీశ్రీ కవిత్వాన్ని యెలా బోధపరచుకోవాలో వివరించే విమర్శ రా.రా. చేశాడు. యీ సందర్భంలోనే కవిత్వానికి జీవధాతువు రసమనీ, రసం లేని రచన కవిత్వం కాజాలదనీ ధ్వని బొత్తిగా లేకున్నా రచన

కవిత్వమవుతుందనీ కవిత్వాన్ని విశ్లేషించాడు. "అనుభూతికి ఉపకరణంగా వున్నంత వరకే ధ్వనికి విలువ లేకపోతే దానికి దమ్మిడీ విలువలేదు' అని రస, ధ్వని సిద్ధాంతాల భేదాన్ని చూపించేడు. కాని ఈ నాటికీ కొంత మంది యీ వివేచనలోని అంతరార్థాన్ని గ్రహించలేక ఒకదానిని మరొకదానికి – అంటే రసాన్నీ, ధ్వనినీ – పోటీపెట్టి రా.రా. సాహిత్య సూత్రీకరణను తప్పుపడుతున్నారు. ప్రధానమైంది యేది, అనుషంగికమైంది యేది అని తెలుసుకోలేకపోతే అసలు విషయం గురించి సరి అయిన అవగాహన రాదు. సాహిత్యానికి హృదయం ప్రధానం అన్నప్పుడు రసానుభూతి పునాదిని సూచిస్తున్నట్టే గాని ఇతరమైన వాటికి స్థానం లేదు అని కాదు. యిలా, అది వుంటే ఇది వుండదు అన్న మినహాయింపు నియమం అనేదే మార్క్సిస్టు సిద్ధాంతంతో పొసగని విషయం. 'ధ్వనికి స్వతంత్రమైన విలువ వుందని అనుకునే వాళ్లు ఉండవచ్చు. వున్నారు కూడా. వాళ్లే తాటాకుల మనుషులు' అని తెగేసి మరీ చెప్పాడు.

రా.రా. తన ప్రతిపాదనలోని మూలభూత అంశాన్ని – హృదయమే సాహిత్య కేంద్రం అనే దాన్ని– కొసకంటా లాగి, అనుభూతి గాఢత్వం వున్నప్పుడు ప్రగాఢమైన వస్తువు లేని రచనలని రా.రా. ప్రశంసించేడనీ ఒక వాదన వచ్చింది. అభ్యుదయకరమైన వస్తువు లేని యే సందర్భాన్నీ రా.రా. ఆమోదించలేదు. వస్తువు దిక్సూచి ముల్లు అభ్యుదయం వేపే స్థిరంగా చూపిస్తూ వున్నా అనుభూతి సంపద లేకపోతే దాన్ని రా.రా. ఆమోదించనూ లేదు. 'శుష్క రాజకీయాలే కవిత్వమైతే– మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ల మాట యెందుకు గానీ– మా యేటుకూరి బలరామమూర్తి కూడా మహా కవే అవుతాడు' అని తీవ్రంగా చెప్పడంలోని అంతరార్థం యిదే. వస్తువు, శిల్పమూ యెలాంటి గతి తార్కిక సంబంధంలో వుంటాయో సమూలంగా గ్రహించిన వాదవడం చేతే రా.రా. సరైన తూకం రాళ్ళతో అంచనా కట్టగలిగాడు. తిలక్ కవిత్వం గురించి ఆయన చేసిన సుదీర్ఘ సమీక్ష ఇందుకు నిదర్శనం. తిలక్ కవిత్వంలోని ఉత్తమ లక్షణాలని కీర్తిస్తూనే, తిలక్ సైద్ధాంతిక అవగాహన లోపాన్ని ఎత్తి చూపించేడు. తిలక్‌ని ఎలా వర్గీకరించాలో తేల్చి చెప్పేడు.

## రా.రా. హద్దు మీరేడా ?

ఈ ప్రాతిపదిక మీదనే రా.రా. దిగంబర కవిత్వాన్ని తూర్పార బట్టాడు. దిగంబర కవిత్వం గురించి విమర్శించడంలో ఆయన విమర్శ ప్రమాణాలను తిరస్కరించేడనీ, హద్దు మీరేడనీ, మితవాద రాజకీయ దృక్పథం ఆయనకు వుండడం వల్ల ఆయన సమకాలీన సమాజాన్నీ, సాంస్కృతిక పరిణామాలనీ అర్థం చేసుకోలేకపోయేడనీ ఆయన మీద అభాండం వేశారు కొందరు. మితవాద రాజకీయాలు అంటే యేమిటో? దానికి సిద్ధాంత ప్రాతిపదిక యేమిటో? తెలియదు. ఇక విమర్శ. విమర్శ ప్రమాణాలను తిరస్కరించడం ఎలా జరిగిందో తెలీదు. 'కవి ఒక అనుభూతిని మాటల ద్వారా వ్యక్తం చేస్తాడు. మాటల ద్వారా పాఠకులకు అందిస్తాడు. అప్పుడు ఆ మాటలను కవిత్వ మంటాం. కవి సాధారణంగా తను పొందే అనుభూతినే తన కవిత్వంలో వ్యక్తం చేస్తాడు. కాని అది కాదు మనకు ముఖ్యం. ఆ అనుభూతిని పాఠకులకు (లేక శ్రోతలకు) అందిస్తున్నాడా అనేదే నిర్ణాయకమైన ప్రశ్న. తాను ఎంత గాఢమైన అనుభూతిని పొందినా అందులో కొంతైనా మనకు అందకపోతే అతని మాటలు కవిత్వం కాలేవు. అతన్ని కవి అనవలసిన అవసరం లేదు.' కవిత్వం అంటే యేమిటో స్పష్టం చేస్తూ, ఆ కోణం నుంచే దిగంబర కవిత్వాన్ని అంచనా కట్టి విమర్శించాడు రా.రా. సమాజం పతనమైంది నిజమేనని అంగీకరిస్తూనే ఆయన దిగంబర కవిత్వంలోని తాత్విక భూమికను, కవిత్వ గుణాన్ని విమర్శించేడు. 'యువతరం నిరసన తెలియజేస్తోంది. కోపోద్రిక్తంగా వుంది. రక్తం సలసల మరిగిపోతోంది' – ఇవన్నీ నిజమే. ఈ ఆవేశాలని రాజకీయ ఉపన్యాసాల ద్వారా బయట పెట్టడమూ జరుగుతూనే వుంది. వ్యాసాల రూపంలో విమర్శించడమూ జరుగుతోంది. కవిత్వంలోనూ వెల్లడైన సందర్భాలు లేకపోలేదు. అని దిగంబర కవిత్వం పేరుతో సంచలన కారకం అయిన ఆ ఉద్యమం కవిత్వ గుణంతో యెంత శోభించిందీ అని తర్కించడం సాహిత్య విమర్శ అవుతుంది. ఆ ప్రమాణం రీత్యా దిగంబర ఉద్యమంలో సంచలనం వున్నంతగా కవిత్వం లేదు అని ఆయన తేల్చిచెప్పాడు. దిగంబర కవిత్వోద్యమంలో నిరసన యే హద్దులూ లేకుండా వెల్లువగా వచ్చిన మాట నిజమే, కానీ కవిత్వగుణం రీత్యా యేమాత్రం సాహిత్య స్థాయిలో లేదనే రా.రా. విమర్శ. సంచలనం సృష్టించడం విప్లవకారుల లక్ష్యం కాదు. అది పెట్టుబడిదారీ ప్రచార ప్రణాళికలో భాగంగా వుంటుంది. దిగంబర కవిత్వ ఉద్యమంలో జరిగిందీ యిదే. ప్రచారానికి పెట్టుకున్న పేర్లు పదికాలాల పాటు వాళ్లని జనం నోట్లో నానుస్తూ వున్నాయే కాని వాళ్ళకవిత్వం మాత్రం నిలవలేదు. కనీస నిజాయితీ కూడా లేని విధ్వంసకర, పెట్టుబడిదారీ వైకల్యం అది. ఇక ఆ ఉద్యమం నిర్వహించిన చారిత్రక కర్తవ్యం గాని, సామాజిక కర్తవ్యం గాని ప్రశ్నార్థకాలే. విరసం ఆవిర్భవించడానికి యీ ఉద్యమం కారణం కాదు. యిందులో వాళ్లు ఒకళ్ళిద్దరు విరసంలో చేరడం ఘనమైన అంశమూ కాదు, అందువల్లనే విరసం వికసించిందనీ చెప్పలేం. రా.రా. దిగంబర ఉద్యమం గురించి సాహిత్యపరంగా చేసిన సూత్రీకరణని జీర్ణించుకోలేని వాళ్లకి యే రాజకీయ కారణాలు వున్నాయో తెలీదు కాని 'మితవాద, అతివాద రాజకీయాల ప్రభావం వల్ల సాహిత్య విమర్శ కలుషితం కాకూడ'దన్న రా.రా. కొలమానం బోధపరచుకోలేని వాళ్లే సకల విమర్శా ప్రమాణాలను తిరస్కరిస్తున్నారని చెప్పాలి. కవిత్వం గురించి రా.రా.

విమర్శ ప్రమాణాలకి యివన్నీ సాక్షీభూత ఆధారాలు.

### రా.రా. ఉత్తమ విశ్లేషణ

యిదే రకంగా నవల, కథ, సాహిత్య విమర్శ తీరు అనే వాటి గురించీ ఆయన ఉత్తమ విశ్లేషణ చేశాడు. మహీధర రామమోహనరావు గారి 'కొల్లాయి గట్టితేనేమి?' నవలను ఒక ఉత్తమ చారిత్రక నవలగా విశ్లేషణ చేసి చూపించాడు. ఆయన రాసిన 'స్వయంవరణం' నవలనూ యీనాటి సాంఘిక నవలగా పరిశీలన చేశారు. సాహిత్యం యెలా వుండాలీ దాని లక్షణమేమిటీ అన్న అంశాన్ని చలం మీద చేసిన సమీక్షలో రా.రా. వివరించేరు. యీ వివరణ మొత్తంగా సాహిత్యానికీ, నవలలకీ వుండవలసిన ప్రాతిపదికను సూచిస్తుంది. 'నిజమైన సాహిత్యం మనకొక భ్రాంతిమయ ప్రపంచాన్ని సృష్టిస్తుంది. పాఠకులమైన మనం తాత్కాలికంగా మన పరిసర వాస్తవ ప్రపంచాన్ని మరచిపోయి ఆ సాహిత్యం సృష్టించే కవిత్వ ప్రపంచాన్నే నిజమైనదిగా భ్రాంతి చెందుతాం. నిజానికి కళలన్నీ భ్రాంతిమయ ప్రపంచమే. ఆల్ ఆర్ట్ ఈజ్ ఇల్యూషన్. ఆ భ్రాంతిని చివరిదాకా పోషించుకుంటూ పోవడం సాహిత్యకారుని కనీస కర్తవ్యం. ఆ భ్రాంతి ఉన్నంతసేపే ఆ కేవల కల్పిత పాత్రల అవస్థలకు మన హృదయాలు ద్రవిస్తూ వుంటాయి. మనమా పాత్రలతో తాదాత్మ్యం చెందుతూ ఉంటాం. అనవసరమైన ప్రతి మాటా సాహిత్య శత్రువే. ఇక కవిత్వ ప్రపంచంలో నుండి వాస్తవ ప్రపంచంలోకి దిగిరావడం అనవసరాలలోకెల్ల ఘోరమైన అనవసరం'. అందుచేత నవలలో యిమడని సమాజ విమర్శలు, ఉపన్యాసాలు సాహిత్య ధర్మాన్ని అతిక్రమించేవే. యెంత పదునైన రచయిత అయినా యీ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. చలాన్ని యీ ప్రమాణాలరీత్యా వెలకట్టి అంచనా వేశాడు రా.రా. చలాన్ని అంచనా కట్టి ఆయన మొత్తం జీవితాన్ని వ్యాఖ్యానించగల సూత్రం యేమిటైందీ రా.రా. చర్చించేడు. చలాన్ని హెడోనిస్ట్ (సుఖవాది లేదా స్వసుఖవాది)గా సూత్రీకరించేడు. ఒక సాహిత్యకారుని మొత్తం జీవితాన్ని, కృషినీ అంచనా కట్టడానికి ఆయన చలం గురించి చేసిన పరిశీలన, సూత్రీకరణ మార్గం చూపిస్తున్నాయనవచ్చు.

### రా.రా - కథా ప్రక్రియ

సాహిత్యంలో ప్రముఖమైన ప్రక్రియ కథ. యీ ప్రక్రియ స్వరూప స్వభావాలు యేమిటి ? దీని లక్ష్యం యేమిటి? దీని భూమిక యేమిటీ అన్న విషయాలను ఆయన సమగ్రంగా వివరించేడు. సొదుం జయరాం కథల మీద సమీక్ష యీ చర్చనంతటినీ ప్రతిబింబిస్తుంది. 'కథానికకు ఒక పాయింటు ఉండాలి. అదే కథానికలోని ఆత్మ' యిది శిల్ప సంబంధమైంది. ఇతివృత్తానికి సంబంధించి కథానిక జీవితాన్ని అర్థం



రాచమల్లు
రామచంద్రారెడ్డి

చేసుకోగలిగేటట్టు వెలుతురు ప్రసరింపచెయ్యాలి. అయితే శిల్ప సంబంధమైన పాయింటే కథ కాకూడదు. 'ఆ పాయింటు చుట్టూ పాత్రలూ, సన్నివేశాలూ, ఆ సన్నివేశాలలో పాత్రల రాగద్వేషాలూ మొదలైన అంగాలన్నీ సరిగా వుండి సమన్వయింపబడినపుడే ఆ పాయింటుకొక సాహిత్య స్వరూపం యేర్పడి కథ ఔతుంది'. కథలో రసావకాశాలను రచయిత వినియోగించుకోవాలి. 'కళ అంటే నేరుగా హృదయాన్ని తాకేది. కళ అంటే అనుభూతి'. అది లేనప్పుడు శిల్పం రీత్యా గొప్పదే అయినా అనుభూతి గాఢత్వం వున్న కళ కాలేదు. ఈ అంశాన్ని రా.రా. స్పష్టంగా వివరించేడు.

ఇక సాహిత్య విమర్శ యెలా వుండాలీ అన్న అంశాన్నీ ఆయన నిశితంగా పరిశీలించేడు. ఆ వివరణలోనే విమర్శ యెలా వుండాలీ అన్న అంశాన్ని విపులీకరించేడు. 'విమర్శ మేధా వ్యాపారమే అయినా హృదయాస్వాదన ప్రాథమికంగా వుండాలి. అపుడే విమర్శ సమగ్రంగా వుంటుంది.. వాదాలు యెన్ని వున్నా అవి సాహిత్య విమర్శకు సమగ్రతను సమకూర్చలేవు. మానవతావాదమొక్కటే నిజమయిన సాహిత్యవాదం. యీ సత్యాన్ని నరనరాన జీర్ణించుకున్న వాడే ఉత్తమ సాహిత్యకారుడు ఉత్తమ సాహిత్య విమర్శకుడూ కాగలడు' అని విమర్శస్థాయి యెలా వుండాలో స్థాపించేడు. విమర్శ యెవరి మెరమెచ్చుల కోసమో వుండకూడదు. 'మధ్య తరగతి జీవితపు కృత్రిమ మర్యాదలు సాహిత్య విమర్శకు శృంఖలాలు కాకూడదు' అని నిక్కచ్చిగా చెప్పేడు. ఈ రకంగా సాహిత్యంలో ప్రక్రియలు విమర్శలు యెలా వుండాలో ఆయన సమగ్రంగా వివరించేడు. ఆయన ఉత్తమ సాహిత్య విమర్శకు ఉండవలసిన లక్షణాలన్నిటిని సమగ్రంగా వివరించి చూపించేడు. అంతేకాదు తను ఆ ప్రమాణాలకు కట్టుబడి ఉత్తమ విమర్శలు చేసి విమర్శకు ఒరవడి పెట్టేడు. ❑

# తిలక్.. తదనంతర సాహిత్య స్రవంతులు

'నాకు మీ సాహిత్య వివాదాలు తెలియవు. నా కవిత్వం కాదొక తత్వం, కాదు ధనికవాదం, సామ్యవాదం' అని తిలక్ తన సమకాలీన కవిత్వ సీమ స్థితిని అద్దంపట్టి చూపించేడు. అభ్యుదయ కవిత్వ ఉద్యమం 1955 ఎన్నికల తర్వాత నీరసించింది. అభ్యుదయ కవిత్వం ముందుకు రావడానికి, సాగడానికి దోహదపడిన సాంఘిక నేపథ్యంలో వచ్చిన మార్పు ఫలితం అది. అభ్యుదయ కవిత్వం వెనకబడడానికి దాని లక్ష్యాలు నెరవేరి, అది నిర్వహించాల్సిన కర్తవ్యం పూర్తయిందని కాదు. దాని అవసరం తీరిపోయిందనీ కాదు. ఉద్యమ రూపం కొంచెం తగ్గినా కవిత్వంలో అది ప్రవేశపెట్టిన వస్తువు, వ్యక్తీకరణ తీరు అంతకు పూర్వం వున్న స్థితిని సమూలం మార్చేశాయి. అంచేత 1960ల తర్వాత వస్తువు విషయంలో విప్రతిపత్తి లేకపోయింది. పేదల పట్ల, దీనుల పట్ల సానుభూతి ప్రకటించడం, వాళ్ల దుర్భర స్థితికి చలించి విషాదంగా 'ఆర్తగీతం' రాయడం తప్పించుకోలేని అవసరమయ్యాయి. నిజంగా కవి వాళ్ల జీవన పరిస్థితిని మార్చగలిగే తోవ చూపించగలుగుతున్నాడా ? లేదా ? అన్నది ఆ కవి జీవిత దృక్పథాన్ని ఆసరా చేసుకుని వుంటుంది. కవి హృదయం వాళ్ల దుస్థితికి చలించింది కాని, కవికి ఆ పరిస్థితిని మార్చే సిద్ధాంత అవగాహన కొరవడింది. స్వతాహాగా కవిత్వ భావుకత్వం వుంది. సున్నిత హృదయం వుంది. అయితే వాదాలంటే బెరుకు, ఇజాలంటే భయం. దీంతో 'అభ్యుదయ కవిత్వం కొన్నిపాళ్లు, భావ కవిత్వం కొన్నిపాళ్లు' అని ఆ మిశ్రమాన్ని విశ్లేషించుకోవాల్సి వచ్చింది. తిలక్‌ను కుందుర్తి ఆ విధంగానే అంచనా వేశారు. అయితే తిలక్ స్వభావరీత్యా భావకవిత్వ పరిధి గురుత్వాకర్షణలో వున్నవాడు. సమకాలీన సాహిత్యోద్యమాల ఫలితంగా ప్రజా సమస్యలు ప్రతిఫలించక తప్పలేదు. ఇది అభ్యుదయ లక్షణం అనిపింపచేస్తూంది. వెరసి తిలక్‌ను అలా సూత్రీకరించే నేపథ్యం ఏర్పడింది. అయితే, సానుభూతి వున్నంతగా 'ప్రజాశక్తులతో తాదాత్మ్యం చెందే' అభ్యుదయ కవి హృదయం కాదది - రా.రా. చెప్పినట్టు. అయినా, తిలక్ యువతరం మీద ఎంతో ప్రభావం కలిగించేడు. ఇందుకు ప్రధాన కారణం తిలక్ ఉత్తమ భావుకత్వం వున్న కవి కావడం. రా.రా. చెప్పినట్టు 'ఈ భావ కవిత్వానికి తోడు తన హృదయంలోని అనుభూతిని వ్యక్తం చెయ్యగల శబ్దశక్తీ అలంకార పుష్టీ కలసి రావడం'. ఇది రెండవ కారణం. ఈ రకంగా తిలక్ ఉత్తమశ్రేణి కవి కాగలిగేడు. ఆ ఉత్తమ శ్రేణి లక్షణం వల్ల చాలా ప్రభావం కలిగించగలిగేడు.




దేవరకొండ బాలగంగాధర తిలక్ పశ్చిమ గోదావరి జిల్లా తణుకు దగ్గర మండపాకలో 1921లో జన్మించేడు. 1941 తర్వాత చాలా ఏళ్లు రచనా వ్యాసంగానికి దూరంగా వున్నాడు. ఓ రకంగా చెప్పాలంటే 1960లలోనే కవిగా మళ్లీ జన్మించాడు. కాని భౌతికంగా 1966లో తనువు చాలించేడు. తిలక్ తన కవిత్వంలో అంతరాంతర జ్యోతీసీమల్నీ బహిర్గతం చేశాడు, చైతన్య పరిధినీ విస్తరింపచేశాడు. శ్రీశ్రీ కీర్తించినట్టు 'కవితా సతి నొసట నిత్య రసగంగాధర తిలకం'గా భాసించేడు.

తిలక్ అంత సూటిగా హృదయాన్ని తాకకపోయినా కవిత్వ జీవ ధాతువులో ప్రకాశమానం అయినవాడు అజంతా. కవిత్వం పూర్తిగా అజ్ఞాతం, అజ్ఞాతం స్వప్నమయం, మంత్రమయం అన్న భావనతో ఉద్యుక్తుడయ్యేడు. తిలక్ చెప్పిన ట్రాన్స్‌ఫరెంట్ చీకటిలా కాకుండా టార్చ్‌లైట్ వేసి వెతకాల్సిన చీకటిగా కవిత్వం వున్నప్పుడు విమర్శకులు రకరకాల వ్యాఖ్యలు చెయ్యడానికి అవకాశం ఇస్తున్నట్టు అవుతుంది. అజంతా ఆలంకారికత ఆయన 'కవిత్వ మర్మక్రీడ'కు తగ్గట్టే కుదిరింది. అజంతా కవిత్వంలో నిరాశ, నిస్పృహ వెల్లడవుతూ వుంటాయి. కవి నేరుగా పాఠకునికి తన హృదయస్థితి అనుభూతిని అందివ్వ

లేకపోతే, గూఢంగా శబ్దంలో పొదివి వుంచితే, అది ఆధ్యాత్మిక పరమైన అర్థాలనీ స్ఫురింపచెయ్యచ్చు. పెడార్థాలకీ ఆస్కారం కలిగించవచ్చు. 'ఆశ లేదు, ఆస్కారం లేదు' అని చింతించడం సమకాలీన నిరాశా వాతావరణానికి ప్రతిఫలనం కావచ్చు కాని కవి బాధ్యత అంతటితోనే తీరిపోదు. అజంతా 'స్వప్నలిపి' "గాలి నిండా కాలిన వాక్యాల వాసన' మోసుకొస్తుంది. వచన కవిత్వ రూపానికి పటిష్టమైన పలుకు అందించిన కవి అజంతా. సమాజం నైరాశ్యాన్ని కలిగించే స్థితిలో వున్నమాట నిజమే. ముందుతరం కొంత ఉద్యమస్ఫూర్తితో ఏదో ఒక ఆశావహమైన భవిష్యత్‌ను చూపెట్టగలిగింది. అభ్యుదయ భావవ్యాప్తి అందుకు ఆలంబన అయింది. పరిస్థితులు మారడంతో రాజకీయ వాతావ రణమూ కలుషితమైంది. ఉద్యమాల ఊపు తగ్గింది. అవినీతి, అనైతికత బాహాటంగానే విహారం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కవి నిరాశను మాత్రమే వ్యక్తం చేస్తూ, తన మనసులో తోచిన దాన్ని తోచినట్టు కలం నుంచి కాగితం మీదకు చేరవేస్తున్నాడు. అజంతా తరువాత నూతనదారులు వెతుక్కోవడం కవులలో కనిపించే దృశ్యం. వేగుంట మోహనప్రసాద్, ఇస్మాయిల్, కేశవ రావ్ మొదలైన కవులంత భావుకత్వం ఉన్నవారే. కాని ఉద్దిష్ట ప్రయోజనం ఏమిటైందీ సూక్ష్మ దృష్టికి గాని ఆనదు. అయితే, కవిత్వంలో కొత్త కాంతులు మెరుస్తూ కనిపిస్తాయి. టెలెస్కోపిక్ ఇమేజరీ వల్ల, అంటే దూర ఆలంకారికత వల్ల, పాఠకులు తమ స్థాయిని పెంచుకుంటే తప్ప అందాన్ని అందుకోలేని వాతావ ణం ఏర్పాటైన కవిత్వరీతి ఇది. అయితే, ఈ కవులందరూ వచన కవిత్వరూపాన్నే ఆశ్రయించడం వల్ల కవిత్వం రాబోయే కాలంలో ఎలాంటి వ్యక్తీకరణతో ఉండేదీ తెలుస్తుంది. అద్దేపల్లి రామ మోహనరావు కవిత్వంలో, కంఠంలో, 'సమస్తాభ్యుదయ కవుల సమష్టి స్పందన' కనబడుతుంది. అద్దేపల్లి కవిత్వంలో అస్పష్టత అణుమాత్రం వుండదు. కవిత్వావేశం తరంగిస్తూ వుంటుంది. కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ 'వెలుతురు పిట్టలు' హృద్యమైన ఆలంకారికతలో వెలుతురును దర్శింపచేస్తుంది. శీలా వీర్రాజు, మాదిరాజు లాంటి వాళ్లంతా వచన కవిత్వరూపాన్ని పరిపుష్టం చేసినవాళ్లే.

కవిత్వ వాహికగా వచన కవిత్వరూపం స్థిరంగా నిలదొక్కు కుంటూ వున్నా, కవుల జీవితావగాహనలో సామాజిక చైతన్య స్ఫూరి తగ్గడంతో ఇజాలకి అతీతమైన నిజాన్ని వెతికే వెంపర్లాట యెక్కువైంది. రాజకీయాల ప్రచారం కవిత్వంలోకి రాకూడదు. సమాజం కుళ్లిపోయింది. ఎన్నికలు బూటకం అయ్యాయి. జీవితంలో విలువలు అడుగంటుతున్నాయి. మనిషి ఉనికి యేమిటన్నది ప్రశ్నార్థకమైంది. అటు చూస్తే సామ్రాజ్య కాంక్ష లేని సర్వ సమానత్వమే ధ్యేయంగా వున్న చైనా భారత్ మీద దాడి జరిపింది. సిద్ధాంతాలని బట్టి రాజకీయ రంగం స్థితిని అర్థం చేసుకోవడం కష్టమైంది. ఆ సమాజాభ్యుదయం కాంక్షించే కళాకారుల్లో, రచయితల్లో, కవుల్లో ఎటు ప్రయాణించాలి అన్న విచికిత్స ఎదురైంది. అభ్యుదయ రచయితల సంఘం నీరసంగా వుండడంతో అయోమయ పరిస్థితి మరీ ఎక్కువైంది. ఆ నేపథ్యంలో తిరుగుబాట్లు దూసుకుంటూ వచ్చేయి. తిరుగుబాట్లు యువతరంలో తలెత్తడం సహజం. అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ వంటి దేశాల్లో ఫాషన్ల దగ్గర నుంచీ తిరుగుబాట్లే. బీటిల్స్ అనీ, బీట్నిక్స్ అనీ, యాంగ్రీ తిరుగుబాట్లు అనేకం తలెత్తేయి. సమాజంలో నచ్చనివి తిరుగుబాట్లే. మనదేశంలో యంగ్‌మెన్ అంశాలన్నింటి మీద ఇలాంటి తిరుగుబాటు బెంగాల్లో తలెత్తింది. 1964-65 ప్రాంతాల్లో ఆనాటి సాంఘిక వాతావరణం తిరుగుబాట్లకు అదునుగా వుంది. ఆంధ్రప్రదేశంలో 'దిగంబర కవిత్వ ఉద్యమం' అలా తిరుగుబాటుగా వచ్చిందే. ఒక మూడు సంవత్సరాలపాటు సాహిత్యంలో కల్లోలం సృష్టించిన ఈ ఉద్యమంలో ఆరుగురు కవులు వున్నారు. పూర్వాశ్రమంలో వుండే పేర్లని వదిలేసి, సామాజికంగా వున్న మత, కులపర చిహ్నాల జాడలు కూడా పడకుండా కొత్త పేర్లు పెట్టుకున్నారు. ఈ ఆరుగురిలోనూ దిగంబర తత్వం సోకక ముందే కవులుగా ప్రసిద్ధులైన వాళ్లూ వున్నారు. కాని ఈ తిరుగుబాటులో కొత్త తీరులో కవిత్వరంగం మీదకు దూసుకువచ్చేరు. స్తబ్ధతని చెదరగొట్టేరు. అన్నింటా కొత్తదనం, అన్నింటా నూతన ధోరణి కావాలన్న తపనతో, ఈ కుష్ఠు వ్యవస్థను సమూలంగా క్షాళనం చెయ్యాలన్న అస్పష్ట ఆవేశంతో అందరి దృష్టినీ ఆకర్షించేటట్టు కవిత్వరంగం మీదకు దూసుకువచ్చారు. తమది వచన కవిత్వం కాదన్నారు. 'దిక్'లు అన్నారు. ఇక వస్తువు విషయంలో ఏది ఎందుకోనన్న దృష్టే లేకుండా దేన్ని పడితే దాన్ని అందిపుచ్చు కున్నారు.

తాడితులు, పీడితులు, పీడకులు అన్న అంతరం లేకుండా అన్నింటినీ తమ తమ కొలమానాల్లో కొలిచి పారేశారు. ఇక వ్యక్తీకరణ విధానంలో, శైలిలో తోచిన దానిని తోచినట్టు చెప్పేరు. ఇది బూతు అన్నారు కొందరు. కాదు, ఇది ఆవేశం అన్నారు కొందరు. ఏమీ కాదు, ప్రచార పటాటోపం అన్నారు కొందరు. ఏమైనప్పటికీ కవిత్వంలో స్తబ్ధత పటాపంచలై ఒక కుదుపు వచ్చింది. దిగంబర కవిత్వోద్యమం కవిత్వానికి కొత్తగా వస్తువునీ, ఉక్తి తీరునీ, శైలినీ ఇచ్చినా ఇవ్వకపోయినా చెప్పే పద్ధతిలో ఏ మర్యాదలూ అడ్డు రాకూడదన్న అవగాహనని అందించింది. సిద్ధాంతపరంగా ఏ స్పష్టమైన అవగాహన లేకపోవడం వల్ల అరాచకత్వం, నిహిలిస్టు ధోరణి చోటు చేసుకున్నాయి. ఈ బలహీనతవల్ల ఈ ఉద్యమం సంచలనకారక మైనంతగా సమాజ పురోగతికి ప్రేరణ ఇవ్వలేకపోయింది. కవిత్వంలో దిగంబర ఉద్యమం బాటలో తిరుగబడు కవులు, పైగంబరులు పేర్లతో కవులు వచ్చేరు. ఈ లోపున రాజకీయ రంగంలో మార్పులు జరిగాయి. వామపక్ష ఉద్యమం రెండోసారి

చీలిపోయింది. మొదటిసారి 1964లో, రెండోసారి ఇంకో నాలుగేళ్ళ తర్వాత. బెంగాల్లో నక్సల్బరీలో సాయుధ పోరాటానికి శంఖం ఊదేరు. ఆ శంఖం ప్రతిధ్వని ఆంధ్రదేశంలోనూ వినిపించింది. శ్రీకాకుళం పోరాటం సాయుధ పోరాటంగా రూపొందింది. అయితే, ఆ సాయుధ పోరాట గర్జన ధ్వనులే రచయితలలో ప్రకంపనాలు కలిగించేయి. విప్లవ రచయితల సంఘం ఆవిర్భవించింది. దిగంబర కవిత్వోద్యమ ప్రముఖులు తమ 'దిక్'ల నగ్న ఉద్యమం నుంచి అంతకు ముందే బయటపడ్డారు. కొందరు విప్లవ రచయితల సంఘంలో చేరారు. తర్వాత అక్కడి నుంచీ నిష్క్రమించేరు. విరసం మాత్రం ఒక నిర్దిష్ట లక్ష్యంతో, సామాజిక అవగాహనతో రూపు తీసుకుంది. శ్రీశ్రీ, కొడవటిగంటి వంటి ఉద్దండులందరూ వుండడంతో చాలా ప్రముఖస్థానం సంపాదించుకుంది. వీ నేపథ్యంలో అరసం మళ్లీ దుమ్ము దులుపుకుని లేచి నిలబడింది. కాని, యువతను ఆకర్షించింది విరసం ఉద్యమం.

సుబ్బారావు పాణిగ్రాహి ఆత్మార్పణ చేసినట్టు రచయితలు ఆదర్శవంతంగా తయారవ్వాలన్నారు. ఈ సమయంలో నిబద్ధత, నిమగ్నత అనే చర్చలు ఉవ్వెత్తున లేచేయి. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అంతర్జాతీయంగా, జాతీయంగా ఎవరికి తోచినట్టు వాళ్లు వివరించుకున్నారు. సాయుధ పోరాటం వారిది ఒక తరహా అవగాహన. విరసం వారు నిమగ్నత, నిబద్ధత చర్చల్లో దేన్ని ఎలా చెయాలో తోచక తికమకపడ్డారు. రాజకీయంగా సిద్ధాంతానుసరణ ఎన్ని చీలికలు చవి చూసిందో విరసం కూడా ఆ గాడిలో పడి నలిగిపోయింది. రాజకీయ సంస్థ, రచయితల సంస్థ తెలియని స్థితిలో అనేక ధోరణులుగా చీలిపోయింది.

అయితే, ఈ ఉద్యమాల వల్ల నూతన కవిత్వ చైతన్యం వచ్చింది. కొత్త కవులు అనేక మంది వచ్చేరు. పాత కవుల్లో విప్లవ చైతన్య దీప్తితో రాసిన వాళ్లల్లో శ్రీశ్రీయే ఆద్యుడు. సత్యమూర్తి శివుడు, శివసాగర్ పేర్లతో రాశాడు. చెరబండ రాజు, నగ్నముని, వరవరరావు లాంటి విప్లవ కవులు పదునుగా రాశారు. వాళ్లు విరసం ఆవిర్భావానికి ముందే కవులు. విరసం వల్ల ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించే విప్లవ గేయకారులు గద్దర్, వంగపండు లాంటి కవి కళాకారులు ముందుకొచ్చేరు. అయితే, ఈ కొత్తకవులు, గాయకులు వచన కవిత్వ రూపాన్ని గాక గేయ రూపాన్ని ఆశ్రయించారు. ఇది ఏ మాత్రం యాదృచ్ఛికం కాదు. ఏమంటే – గేయానికీ, పాటకీ వున్న సామాజిక చైతన్య ప్రేరక అవసరం తీరలేదని దీన్ని బట్టి తెలుస్తుంది. అయితే కవిత్వరూపంగా వచన గేయానికి పరిణత రూపం కూడా ఈ యుగానిదే. రాజకీయ ఎత్తుగడల ఉరవడిలో రచయితలు సాయుధ పోరాట దిశగా ఆకర్షితులయేరు గాని జీవిత పోరాటం పుస్తకం చదివినట్టు వుండదు కదా! దాంతో నీరసించినా రచయితల బాధ్యత యేమిటన్నది చర్చనీయంగానే విరసం మిగిలిపోయింది.

ఏ సిద్ధాంతాలూ, ఇజాలూ లేకుండా అనుభూతి ప్రేరకంగానే కవిత్వం వుండాలన్న వైఖరి మళ్లీ ముందుకు వచ్చింది. తిలక్‌లోను, ఆ తరవాత కొందరిలోనూ తొంగిచూసిన యీ ధోరణికి విప్లవ ఉద్యమంతో పట్టుపోయింది. అరసం తర్వాత వచ్చిన 'యిజాతీత' ధోరణి లాంటిదే ఇదీనూ. ఈ ధోరణి విరసం కృశించిపోవడంతో మళ్లీ పుంజుకుంది. ఈ ధోరణికి అనుభూతివాదం అన్న పేరు కూడా దక్కింది. మొత్తంమీద ఈ నిష్కళంకంగా హృదయానుభూతిని అందించేదిగా నిసర్గ కవిత్వం వుండాలని ప్రతిపాదించేరు. ఈ కోవలో ఇస్మాయిల్ వంటివారూ, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ వంటి వారూ వున్నారు. అనుభూతివాద కవులు విప్లవ కవిత్వ ఉద్యమం అనేక కారణాల వల్ల చీలిపోయింది. సర్వమానవాళి విముక్తికి అంకితమైన సిద్ధాంతం మార్క్సిజం ఆచరణలో అనేక వ్యాఖ్యానాల సుడిగుండంలో సుళ్లు తిరుగుతూ పడిపోయింది. సమాజంలో అణగారిన ఆర్తులు విముక్తి కోసం ఆరాటపడుతున్నారు. సిద్ధాంత చట్రాలకు అందని రీతిలో పోరాటపథం చూసుకున్నారు. ప్రతి రాజకీయ పార్టీకి అనేక ప్రజా సంఘాలు అనుబంధంగా వుంటూ వుంటాయి. విద్యార్థులకు, మహిళలకు, రైతులకు, కార్మికులకు, యువకులకు ఆయా రాజకీయ పార్టీలకు అనుగుణంగా వుంటాయి ఇవి. ఈ ప్రజా సంఘాల పనితీరు ఆ రాజకీయ సిద్ధాంత ఆచరణలని అనుసరించి వుంటుంది. ప్రజా సంఘాలు ఆయా పార్టీల కార్యాచరణకు సోపానాలు. అంటే, ఆ ప్రజా సంఘాలలో ఆ రాజకీయ పార్టీల సిద్ధాంత పాక్షికత్వం వుంటుంది.

ఏ రాజకీయ పార్టీకి అనుబంధం గాని రెండు ఉద్యమాలు విప్లవ కవిత్వోద్యమం పొంగు తర్వాత సాహిత్యంలో ఉదయించేయి. ఒకటి – దళిత సాహిత్య ఉద్యమం. రెండు – స్త్రీవాద కవిత్వం. భారతదేశంలో హిందూ జీవిత దృక్పథంలో కుల వ్యవస్థ, అంటరానితనం అంటుకట్టుకుపోయేయి. అట్టడుగున వున్నవాళ్లని హీనంగా చూడ్డం, వాళ్ల చాకిరీని మాత్రం వాడుకోవడం ఏనాటి నుంచో వున్నాయి. వాళ్లని ఉద్దేశించి మన్ననగా చెప్పగల పదం కూడా లేకుండా పోయింది. గాంధీజీ 'హరిజనులు' అని వాళ్లని ఉద్దేశించి అని, వాళ్ల ఉద్ధరణకు నడుం కట్టేడు. ఎంతోమంది సంస్కర్తలు ఆ కార్యరంగంలో కృషి చేశారు. జాషువాలాంటి గొప్ప కవులు ఎలా బాధలు పడిందీ అందరికీ తెలిసిందే. వాళ్లని నిమ్నజాతులు అన్నారు. అంబేద్కర్ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని, షెడ్యూల్డ్ తరగతులు అని

**(మిగతా 56వ పేజీలో)**

# కన్యాశుల్కంలోని విశేషాంశాలు

**గురజాడ అప్పారావుగారు 'కన్యాశుల్కం' నాటకాన్ని రెండుసార్లు రాశారు. తొలి కూర్పు ముద్రణ 1897లో జరిగింది. రెండవ కూర్పు 1909 నాటిది. ప్రస్తుతం ప్రాచుర్యంలో వున్నది ఈ రెండవ కూర్పు. కథ విషయంలోనూ, పాత్రల సారూప్యతలోనూ మొదటిదానికీ, రెండవ దానికి పెద్దగా తేడా లేదు. అయినా ప్రస్తుతం ప్రముఖంగా వున్న 1909 నాటి 'కన్యాశుల్కమే' గురజాడని ప్రజా హృదయ సింహాసనం మీద కూర్చోపెట్టింది. తను ఒకసారి రాసిందాన్ని రచయితే తిరిగి రాసుకున్నాడంటే మొదటి దానితో సంతృప్తి చెందలేదనే కదా దాని అర్థం. గురజాడ తనే ఒక లేఖలో మొదటి రచనకీ రెండవ రచనకీ తేడా చెప్పుకున్నారు.**

'మొదటి ముద్రణము కంటే ఇది నా భావాలను సమగ్రంగా వ్యక్తం చేస్తున్నది. మొదటిది దీనిలాగా కాదు. అంతర్గత మనో భావాలను కాక, స్థూలంగా పైపై పూతలనే అది ప్రతిబింబించింది. పైకి కనబడే దానికన్నా బలమైన నైతిక భావాన్ని పొందింది నా పుస్తకం. జీవితాన్ని నేను చులకనగా భావించనని తెలుస్తుంది. హాస్యంలో పొంగిపొయ్యే పుస్తకంలో జీవితంలోని గాంభీర్యాన్ని గంభీరాన్ని చూపడం చాలా కష్టమైనపని. దానికోసమే ప్రయత్నించాను నేను'. అంచేత మొదటి కన్యాశుల్కంకంటే రెండో కన్యాశుల్కమే గొప్పదని మనం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

1897 మొదటి కన్యాశుల్క ప్రతిని సేకరించి విపులమైన వ్యాఖ్యాన వివరాలతో బంగోరె ప్రచురించారు. వ్యాప్తిలో వున్న ప్రస్తుత కన్యాశుల్కానికి కూడా అలాంటిది జరిగి వుండాల్సింది. ఆ పనికి ఆయనే సమర్థుడు. కాని యెందుకనో యింకా అది మిగిలి పోయింది. మొదటి కన్యాశుల్కంలోని విశేషాంశాలు రెండవ దాంట్లోనూ వున్నచోట్ల బంగోరె వివరణలు సరిపోతాయి. కొత్త అంశాలు వున్నచోట్ల వాటిని ప్రస్తావించి వివరిస్తే సరిపోతుంది. అప్పుడు గురజాడ పాండిత్యమూ వ్యక్తిత్వమూ పాఠకులకి అవగతమౌతాయి. అసలు వివరణలూ, వ్యాఖ్యలూ దేనికి? అనిపించవచ్చు. రచయిత హృదయాన్ని అర్థం చేసుకోడానికేనని సమాధానం. ఆధునిక మహాకావ్యాల్లో అద్వితీయమైనదనే పేరు వచ్చిన దానికి ఆ కీర్తి ఎంత వరకు తగును అని వివరించగలిగేవి యీ వివరణలూ వ్యాఖ్యలూనూ. గురజాడని నవయుగ వైతాళికుడంటున్నాం. ఆ బిరుదు సార్థకతని యివి నిరూపిస్తాయి.




గురజాడ 'మెరిట్స్ ఆఫ్ స్పోకెన్ తెలుగు అండ్ ఇట్స్ రేంజ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్' రుజువు చెయ్యడానికి వ్యావహారిక భాషలో యీ నాటకాన్ని రాశారు. 'వ్యావహారిక భాషలో వున్న ప్రయోగానికి అర్థం యేం చెబుతాం? యెవడి మాట వాడిది!' అనే పండితమ్మన్యులు యింకా వున్నారు. ప్రాచీన కవిప్రయోగం వుంటేనే వాళ్ళకి ఆ ప్రయోగంలోని సాధు, అసాధు భేదం తెలిసేది. మాట్లాడే భాషలోని 'రేంజ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్' వాళ్ళకి యేమందుతుంది? 'కొయ్య బొమ్మలె మెచ్చు కళ్ళకు కోమలుల సౌరెక్కునా?' ఈ మాటలు ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే కన్యాశుల్కంలోని కొన్ని పదాలకి అర్థం యేమిటని కొందరు పండితుల్ని అడిగితే వారు మూతి విరిచి వ్యావహారిక భాషలో దానికేం అర్థం చెబుతాం అని తేలిక చేశారు. అయినా 'పండితుల్ని' అడిగినందుకు నాలిక కరచుకున్నాను. 'కన్యాశుల్కం' నాటకంలోని పాత్రల స్వభావ రీతుల్ని ఆ పాత్రల సంభాషణలే

తెలియజేస్తూ వుంటాయి. మహాకవి గురజాడ పాండిత్యానికి, లోకవృత్త పరిశీలనకి అవి దర్పణ మెత్తుతూ వుంటాయి. ఆ పాత్రలు వాడుకచేసే భాష గురజాడ రచనా శిల్పానికి నిదర్శనం. కన్యాశుల్కంలోని సంభాషణల్లో దొర్లే విశేషాంశాలన్నీ గురజాడ విజ్ఞానానికి, ఆధునిక దృష్టికి చిహ్నాలే. ఇంగ్లీషు భాష, సంస్కృత సంప్రదాయం, తెలుగు పలుకు బడులు గురజాడకి యెంత కరతలామలకమైందీ యివి తెలియచేస్తాయి. మొదటి కన్యాశుల్కం 'నాంది'లో ప్రస్తావించినట్లు 'ఆంధ్రాంగ్లవేత్త అయిన అప్పారావు' మాత్రమే కాదు ఆయన సంస్కృత పాండిత్యం కూడా అపారం. ముఖ్యపాత్ర అయిన గిరీశం యెక్కువ ఇంగ్లీషు పదాలు వాడతాడు. రిఫరెన్సులు యిస్తాడు. అగ్నిహోత్రావధాన్లు దగ్గిరా, సౌజన్యారావు పంతులు దగ్గిరా సంస్కృత కారికలు కూడా ప్రయోగిస్తాడు. కరటకశాస్త్రులు సంస్కృత విశేషాలే యెక్కువ వాడతాడు. అచ్చపు తెలుగు పలుకుబళ్ళు–ప్రతి పాత్రనీ జీవం వున్నట్లు నిలబెడతాయి.

గిరీశం వాడిన ఇంగ్లీషు పదాలకి మొదటి కన్యాశుల్కంలోనూ, రెండో దాంట్లోనూ వున్నవాటికి బంగోరె గారి వివరణలు విపులంగానే వున్నాయి. అలాగే వైదిక పరిభాషకీ, వైవాహిక పదాలకి కూడా బంగోరె వివరంగా నోట్సు యిచ్చారు. మొదటి కన్యాశుల్కంలో వాటికంటే అదనంగా ప్రసక్తమైన రెండో కన్యాశుల్కంలోని వాటికి వివరణలు యివ్వ ప్రయత్నిస్తాను. సంస్కృత విశేషాలు, ఇంగ్లీషు ప్రయోగాలు తెలుగు పలుకుబళ్ళు అని వర్గీకరించుకుంటే వివరణలకి సౌలభ్యం వుంటుందనిపించింది. సంస్కృత సూక్తులు కూడా గిరీశంతోనే మొదలౌతాయి. 'శీఘ్రబుద్ధే పలాయనం' అని ఫోటోగ్రాఫ్ డబ్బులియ్యాలని నిలదీసిన బంట్రోతును వదిలించుకున్నాక, గిరీశం అంటాడు. 'చురుకైనవాడు, సూక్ష్మబుద్ధికలవాడు, ఏ ఆపదైనా ముంచుకొచ్చే సమయంలో పారిపోయి గండం గట్టెక్కుతా'డని ఆ మాటలకి అర్థం. "పంచతంత్రం" కథల్లోని పాత్రని యిక్కడ వాడుకున్నాడు. తర్వాత అంకంలో శిష్యుడు కాళిదాసు 'కుమార సంభవం'లోని శ్లోకాలు ప్రస్తావిస్తాడు. మొదటి కన్యాశుల్కంలో రఘు వంశంలోని శ్లోకాలు ప్రస్తావించిన శిష్యుడు యిందులో 'కుమార సంభవం'లోని శ్లోకాలు చదువుతాడు. 'కుమార సంభవం' శృంగార రసాత్మకంగా ఎక్కువ గణనపొందిన కావ్యం చాలా రసవంతంగా వ్యాఖ్యానిస్తూ కథకి తోడ్పడే విధంగా ఈ శ్లోకాన్ని వాడుకున్నాడు గురజాడ. ఆ నాటికి ప్రబలమవుతూ వున్న ఆధునిక దృష్టికి శిష్యుడి వ్యాఖ్య అద్దం పట్టినట్లుగా ఉంది. మనవాళ్ళకి జాగ్రఫీ తెలీదు. హిమాలయాలు మన వాళ్ళ నమ్మకాల్లో వున్నా జ్ఞానంలో లేవు. మన పుస్తకాలు చదివితే ప్రపంచ వ్యాపారంలో పనికొచ్చేది ఏదీ కనిపించదు. నిత్య వ్యవహారంలో ఉపయోగపడే వడ్డీవాసి కట్టడం లాంటివన్నీ ఇంగ్లీషు చదువులో వున్నాయి. ఆఖరికి ప్రమాణం చెయ్యడానికి కూడా శిష్యుడికి ఈ కావ్యాలు పనికిరావు. గిరీశాన్నడిగి ఇంగ్లీషు పుస్తకం ఒకటి పట్టుకొస్తానంటాడు : మన వ్యవస్థ మీద నమ్మకం తగ్గిపోవడం, ఇంగ్లీషు వాడి శక్తి మీద గురి పెరగడం ఈశ్లోకాల నడ్డం పెట్టుకుని చర్చించడంలో కనిపిస్తుంది. (శిష్యుడు చదివిన కుమార సంభవ శ్లోకాలన్నీ ప్రాచుర్యమైనవీ, సామాన్యంగా ఆ పుస్తకంలో అర్థంలో వివరణ యివ్వబడేవీ కాబట్టి యిక్కడ వాటిని వివరంగా యివ్వడం లేదు.) తరువాత కరటక శాస్త్రులు శిష్యుడికి కన్య వేషం వేసి మధురవాణి దగ్గరకి తీసుకెళ్ళినప్పుడు చేసిన సంస్కృత ప్రస్తావనలు వున్నాయి. అలా వేషం వెయ్యడానికి కారణం చెబుతూ 'ఉదర నిమిత్తం బహుకృత వేషం' అంటాడు.

**'జటలో ముండే లుంఛిత కేశః**
**కాషా యాంబర బహుకృత వేషః**
**పశ్యన్నపి చ న పశ్యతి మూఢః**
**ఉదర నిమిత్తం బహుకృత వేషః"**

అనేది ఆదిశంకరుల సుప్రసిద్ధ భజగోవింద శ్లోకం. 'ఒకడు జడలు ధరిస్తాడు. మరోడు నున్నగా గీయించుకుంటాడు. యింకొహడు కాషాయ వస్త్రాలు వేస్తాడు. వీళ్ళంతా కనిపించిన దాన్ని చూడలేని మూర్ఖులు. పొట్ట కోసం వేసే వేషాలు యివన్నీ' అని అర్థం. 'ఏ వేషమేసినా కూటికొరకే'నని శబ్దరత్నాకరంలోనే అర్థం వుంది. తరువాత మధురవాణి సౌందర్యాన్ని మెచ్చుకుంటూ 'ఏకా నారీ సుందరీ వా దరీవా' దీనికి మూలం యేమిటంటే.

**'ఏకోదేవః కేశవోవా శివోవా!**
**ఏకోవాసః పత్తనేవా వనంవా,**
**ఏకోమిత్రం భూపతిర్వా యతిర్వా,**
**ఏకానారీ సుందరీవా దరీవా'**

(శివుడో కేశవుడో ఒకడే దేవుడు – పట్టణమో వనమో ఒకటే నివసించదగిన చోటు – రాజో సన్యాసియో ఒకరే ఆశ్రయించ దగిన వారు – సుందరియగు భార్యతో కాపురము చేయుటో, గుహలో ముని వృత్తి నుండుటో ఒకటే శరణ్యము. మధ్యేమార్గం మంచిది కాదని భావము.)

రామప్పంతులు దగ్గర కరటక శాస్త్రి శృంగార రస చర్చ చేస్తూ 'ఘటయ భుజ బంధనం జనయ రదఖండనం యేనవా భవతి సుఖజాలం' అని 'పుస్తకాల్లో చదివింది' చెబుతాడు. ఆ పుస్తకం జయదేవుని గీత గోవిందం – ఆ అష్టపది గీతం 'ప్రియే చారు శీలే' దీని అర్థం కూడా కరటకశాస్త్రి కొంచెం యించుమించుగా వివరిస్తాడు. 'చేతుల్తోటి ఉక్కిరిబిక్కిరి అయ్యేటట్టు కౌగిలించుకో, మరిన్నీ పెదవులు రక్తాలొచ్చేటట్టు కొరికెయ్యి అంటున్నాడు కవి'.

తన శిష్యుడికి పాఠం చెబుతూ గిరీశం 'కపిత్థాకార భూగోళా' అని మనుధర్మ శాస్త్రం చెప్పినట్టు ఉపపత్తి చూపించి, తరుణీకుచాల మీద పద్యానికి అమర నిఘంటువులోని దాఖలా

అనాయాసంగా యిచ్చేస్తాడు. యిదంతా గిరీశం పైత్యమే. కపిత్థమంటే వెలగపండు. గిరీశం 'యస్' అన్నట్టు నారింజ కాదు. బుచ్చమ్మ దగ్గర తను లోకం బాగుపడేందుకు చేసే పనుల గురించి చాంతాడంత వ్యాఖ్యానం చేస్తూ 'సంసారం సాగరం దుఃఖ'మని ఓ కారిక చెబుతాడు గిరీశం. అసలా శ్లోకం యేమిటంటే:

**'జన్మ దుఃఖం జరా దుఃఖం**
**జాయా దుఃఖం పునః పునః**
**సంసారం సాగరం దుఃఖం**
**తస్మాత్ జాగృత జాగృత'**

(పుట్టడం, గిట్టడం, వార్ధక్యం అన్నీ దుఃఖాలే. యివి తిరిగి తిరిగి సంప్రాప్తిస్తూ వుంటాయి. సంసారం అనే సముద్రం దుఃఖ భాజనమైంది. అంచేత, మెలకువగా వుండి మోక్షమార్గం చూసుకోవాలి.) తన సాంఘిక సేవా పరాయణత్వానికి పెళ్ళి ఆటంకం పాపం గిరీశానికి! బుచ్చమ్మలాంటి బంగారం బొమ్మ లభిస్తే లోకం గీకం అవతల పెట్టి పెళ్ళాడక తీరదు. అదీ రస్సా వేసి రంజింప చెయ్యడమంట! దీనికి ముందే తను శాస్త్రాల్లో వుడ్జోలుణ్ణి అంటూ శాస్త్రకారుడు చెప్పిన 'బాలా దపి సుభాషితం' అన్న సూక్తిని ముచ్చటిస్తాడు. ప్రచురమైన ఈ సూక్తికి మూలం మనుస్మృతి 2-288లో ఉంది.

**విషాదప్యమృతం గ్రాహ్యం, బాలాదపి సుభాషితం,**
**అమిత్రాదపి సద్వృత్తం, అమేధ్యాదపి కాంచనమ్.**

(విషంలో నుంచైనా అమృతం గ్రహించవచ్చును. అలాగే పిల్లల నుంచైనా మంచి మాటనీ, శత్రువుల నుంచైనా సద్వృత్తాన్నీ, అసహ్యకరమైన దాన్నుంచైనా బంగారాన్నీ పొందవచ్చు.) లుబావధాన్లు ఉత్తరం పట్టుకొచ్చి 'నాకు పెళ్ళీ వొద్దు, పెడాకులూ వద్దు' అన్న సందర్భంలో, రామప్పంతులు 'స్త్రీ బుద్ధి: ప్రళయాంతకం' అని మధురవాణి మాటని నమ్మవద్దని సబబు చెపుతాడు.

**'ఆత్మబుద్ధి స్సుఖంచైవ గురు బుద్ధి ర్విశేషతం పరబుద్ధి ర్వినాశాయ, స్త్రీ బుద్ధిః ప్రళయాంతకం?'** అని నీతి శాస్త్రం. 'తన ఆలోచన వల్ల సుఖం కలుగుతుంది. పెద్దల ఆలోచన మరింతగా క్షేమకరము. పరుల ఆలోచన తరచు నష్టదాయకంగానే వుంటుంది. ఇక స్త్రీ బుద్ధి సర్వనాశకరమే అవుతుంది!" అని ఈ శ్లోకానికి అర్థం.

లుబ్ధావధాన్లు, కరటకశాస్త్రి శిష్యుణ్ణి పెళ్ళి చేసుకునే సందర్భంలో సిద్ధాంతి ముహూర్తానికి తొందర చేస్తూ 'శతాంధా కూపం ప్రవిశంతి' అంటాడు. దీనికి మూలం యేమిటో కచ్చితంగా లభ్యం అవలేదు. కాని నూరు మంది గుడ్డివాళ్ళు నూతిలో పడతారని అర్థం. అంటే అలాటి మెజారిటీ వల్ల ఆ తప్పు ఒప్పు అవదు అని. పెళ్ళి అయిపోయిన తర్వాత రామప్పంతులు పెద్దిపాలెం నుంచి వగర్చుకుంటూ వస్తాడు. పూజారి ఏకరాత్రి వివాహం జరిగిందనీ ప్రధాన హోమం, శేషహోమాలతో పరిసమాప్తి అయిందని అంటాడు. ఈ వివాహ ప్రక్రియకి సంబంధించిన పదాలు మొదటి కన్యాశుల్కంలోనూ వున్నాయి. వాటికి నోట్సు బంగోరె పుస్తకంలో వుంది కాబట్టి యిక్కడ మళ్ళీ చెప్పడంలేదు.

మత సంబంధమైన సంగతుల్లో వెంకటేశానికి తర్ఫీదు యిస్తానని చెప్పి గిరీశం అన్నాన్ని ధ్యానించడంలో తప్పు లేదని ఉపనిషత్ వ్యాఖ్యానాన్ని ఉదహరిస్తాడు. ఏముంది ఉపనిషత్: 'అన్నం బ్రహ్మేతి వ్యజానాత్' అన్నమే బ్రహ్మ అని తెలుసుకో వోయి వెధవాయా అంది!' యీ వెధవాయ్ అన్నమాట గిరీశం కలుపుడుగా తీసేస్తే, మిగిలింది రైటే. యీ వాక్యం తైత్తిరీయోపనిషత్ తృతీయవల్లిలోనిది. వరుణ పుత్రుడు భృగు బహ్మని తెలుసుకో ప్రయత్నిస్తాడు. ఆ క్రమంలో ఏది బ్రహ్మమవుతుందో తెలుసుకుంటూ అన్నమే బ్రహ్మమని తెలుసుకొంటాడు. ఎందుకంటే అన్నం ఆధారంగానే అన్ని జీవరాసులూ ఉద్భవిస్తాయి. అంచేత అన్నాన్ని నిరాదరణ చెయ్యకూడదని తెలుసుకుంటాడు. అన్నం గురించి ప్రార్థన చేయడం తప్పనే భావం తర్వాతి కాలంలో వచ్చింది. వెంకటేశం అదే సందేహం వ్యక్తం చేస్తాడు. గిరీశం ఆ సందేహాన్ని నివృత్తి చేసేందుకే యీ దాఖలా చూపిస్తాడు. ఇలా అన్నాన్ని గురించి ప్రార్థన చెయ్యడం తప్పు కాదని ఉపనిషత్ వాక్యాన్ని చెప్పడమే కాకుండా చమకంలోని మాటని కూడా గిరీశం ఉదహరిస్తాడు.

'చమకంలో యేమన్నాడూ? 'శ్యామాకాశ్చమే' చామలు అన్నం మా మజాగా వుంటుంది. నాక్కావాలి ఓదేవుడా! అన్నాడు' అని గిరీశం వ్యాఖ్యతో సహా వివరిస్తాడు. కొంచెం యించు మించుగా యీ వ్యాఖ్యానమూ రైటే. యింతకీ యేమిటీ యీ చమకం? చమకంలోని మాటే ఒకటి సిద్ధాంతి పేకాట సీనులో కూడా వాడతాడు. అద్వైతులకి రుద్రాధ్యాయమంటే నమకము చమకము కలిసివున్న విధానం. శివారాధనకి రుద్రాధ్యాయం అంటారు. కృష్ణ యజుర్వేదంలో చతుర్థ కాండ సప్తమ ప్రసారకం నమకము, చమకమూను. 'నమః' అనే పదం ప్రతి మంత్రంలోనూ వస్తుంది కాబట్టి అది నమకం అయింది. 'చమ' అనే పదం ప్రతి మంత్రంలోనూ వస్తుంది కాబట్టి అది చమకం అయింది. చమకంలో పదకొండు అనువాకాల్లోనూ మూడు వందలు మించి కోరికలు కోరబడుతూ వున్నాయి. పదవ అనువాకంలోని 'యజ్ఞేన కల్పతామ్' అన్నదాన్ని మొదటి తొమ్మిది, అనువాకాలకి అన్వయించుకుంటే 'యజ్ఞఫలం చేత నాకు యివి కలుగుగాక!' అని కోరుకోవడం కనిపిస్తుంది.

ప్రస్తుతం గిరీశం చెప్పిన 'శ్యామాకాశ్చమే' అన్న మాట చతుర్థానువాకంలో ఆఖరన వస్తుంది. శ్యామాకలు అను ఒక

తృణ ధాన్యమును (వరిగలు-చామలు), నివ్వరిధాన్యమును, నాకు కల్గించుగాక అని ఆ మంత్రానికి అర్థం. గిరీశం తన ధోరణిలో చెప్పినా అసలు అర్థం చెడకుండానే చెప్తాడు కదా. అలాగే సిద్ధాంతి పేకాట సీనులో ముక్కలు యెత్తుతూ 'మృత్తికా చమే' అంటాడు. చమకంలో పంచమానువాకం మొదట్లో వుంది యిది. యజ్ఞఫలం చేత నాకు రాళ్ళు 'మట్టి' వగైరాలు కూడా లభ్యం కావాలన్న కోరికే యిది. ముక్క యెత్తుతూ అలా అంటున్నాడంటే యిది మృత్తిక మట్టి యేమోనని ముందు కామెంట్ చేస్తున్నాడన్నమాట. పేకాట ఆడేవాళ్లు యేదో ఓ కామెంట్ చేస్తూ ముక్క యెత్తడం మామూలే కదా.

కేసులో నిజమేదో సౌజన్యారావు పంతులు గారితో చెప్పి తనకి కూడా లోకోపకారం చెయ్యమని కరటకశాస్త్రిని మధురవాణి అడిగినప్పుడు 'స్వయం తీర్థః పరంస్తారయతి' అని కరటకుడు తత్వం చెబుతాడు. అంటే 'తరించినవాడు యితరులను తరింప చేస్తాడు' అని. తను ఒడ్డున వున్నాడు కాబట్టి మిగిలిన వాళ్ళని కూడా ఒడ్డున పడెయ్యాలని చూస్తాడు. శిష్యుడి చేత ఆడవేషం మేయించినందుకు 'ప్రమాదో ధీమతామపి' అంటాడు కరటక శాస్త్రులు. పొరపాట్లు ధీమంతులకే వస్తాయి అని. (దీనికి పాఠాంతరం కూడా చెబుతారు. 'ప్రమాదోధీమాతామేవా' అని. అంటే ధీమంతులే పొరపాటు పనులు చేస్తారు, వాళ్ళకే ప్రమాదాలు సంభవిస్తాయి. ఏ పనీ చెయ్యని సామాన్యులకి తప్పులే రావు కదా! అని అర్థం.) సౌజన్యారావు పంతులు దగ్గర యథాప్రకారం దచ్చాలు కొడుతూ 'పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం' అన్న న్యాయం ప్రకారం ఉత్కృష్టమైన పనికి నడుం కట్టినట్లు చెబుతాడు గిరీశం.

**'అష్టాదశ పురాణానాం సారం సారం సముద్ధృతమ్,**
**పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం'** అని శ్లోకం. పద్దెనిమిది పురాణాల సారం పిండగా చివరికి తేలింది ఏమిటంటే పరోపకారంచేస్తే పుణ్యమనిన్నీ పరపీడనం చేస్తే పాపం చుట్టుకొంటుందనిన్నీ భావం. 'బలవానింద్రియ గ్రామో విద్వాంస మపకర్షతి' అని గీత చెబుతోందని అంటాడు సౌజన్యా రావు పంతులు. కాని యిది గీతలోదిగా కనబట్టం లేదు. మనుస్మృతి 2.215 లో వున్న శ్లోకం యిది:

**'మాత్రా స్వస్రా దుహితావా నా వివిక్తాసనో భవేత్**
**బలవానింద్రియ గ్రామో విద్వాంస మపకర్షతి'**

('తల్లి సోదరి కుమార్తె వీరలతో నైనను ఏకాంత ప్రదేశమున, ఏకాసనమున ఉండరాదు. ఇంద్రియములు బలవత్తరమైన ప్రవృత్తులు గలవి. అవి విద్వాంసులని గూడ లొంగదీయును' అని తాత్పర్యం.)

ఒక్క ఈ శ్లోకం రిఫరెన్సుకి సంబంధించి తప్పితే మిగతా అంతటా గురజాడ సంస్కృత పరిచయం అద్భుతమైంది. నిత్య వ్యవహారంలో భాగమైన వాటినే సందర్భానికి అనువుగా వాడటం ఆయన ప్రతిభ. శ్లోకంలో వాక్యం కాకపోయినా సంస్కృత పరిభాషలో వుండే ప్రయోగంగా 'తొమ్మిదో అష్టం-ఘనం పారాయణ చేస్తాడు నీ తండ్ర'ని వెంకటేశంతో గిరీశం అంటాడు. వైదిక పరిభాషలో బూతులు తిడతాడని అర్థం. ఇక ఇంగ్లీషు పదాల ప్రయోగం కొటేషన్లు యివ్వడం గిరీశం ఎక్కువగా చేస్తాడు.

మొదటి అంకంలో గిరీశం ప్రవేశిస్తూనే స్వగతంగా పెద్ద ఉపన్యాసం చేస్తాడు. 'పూర్రిచర్డు చెప్పినట్లు పేషెన్స్ వుంటేనేగాని లోకంలో నెగ్గలేం' అంటాడు. యీ పూర్రిచర్డు యెవరైందీ చూస్తే గురజాడ యెంత విస్తారంగా యింగ్లీషు సంప్రదాయాన్ని పరిశీలించింది. తెలుస్తుంది. యుటిలిటేరియన్ ఫిలాసఫీ చెప్పిన బెంజమిన్ ఫ్రాంక్లిన్ 'పూర్ రిచర్డ్' అనే కల్పిత పాత్ర ద్వారా తను నమ్మిన సూత్రాలు చెప్పిస్తూ రాశాడు. ('సేయింగ్స్ ఆఫ్ పూర్ రిచర్డ్, యాన్ ఇమాజినరీ ఫిగర్, ఇంటూ హూజ్ మౌత్ బెంజమిన్ ఫ్రాంక్లిన్ ద వెర్సటైల్ అమెరికన్ పుట్ హిస్ యుటిలిటేరియన్ మేక్సిమ్స్'). 'పేషెన్స్ వుంటేనే గాని లోకంలో నెగ్గుకురాలేం' లాంటి యింకోసూక్తి చూడండి:

**'వియ్ ఆర్ ట్యాక్స్డ్ ట్వైస్ యాజ్ మచ్ బై అవర్ ఐడిల్నెస్/థ్రీ టైంస్ యాజ్ మచ్ బై అవర్ ప్రైడ్/అండ్, ఫోర్ టైంస్ యాజ్ మచ్ బై అవర్ ఫాలీ యాజ్ బై ద స్టేట్.'** పూర్ రిచర్డ్‌కి ఇంతకథ వుందన్న మాట!

ఇక గిరీశం కోట్ చేసిన ఆంగ్ల పద్యపాదాలు జాన్ గే రాసిన 'ద బెగర్స్ ఓపెరా' లోనివి. ఈ విషయం తొలి ప్రతి వివరణలో బంగోరె చెప్పారు. అలాగే 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్' అనే నర్సరీ రెయిమ్‌ను జేన్ టేలర్ రాసింది. జేన్ టేలర్, ఆన్ టేలర్ అనే సోదరీమణులు రాసిన ఈ నర్సరీ రెయిమ్ ఇప్పటికీ ప్రాచుర్యంలోనే వున్నాయి.

ఇక గిరీశం వెంకటేశం మాట్లాడిన తలా తోకాలేని ఇంగ్లీషు సంభాషణ 'కాసబియాంకా' గేయంలోది. అది నెమ్మదిగా యూక్లిడ్ జామెట్రీలోకి, రెన్ అండ్ మార్టిన్స్ హై స్కూల్ గ్రామర్ లోకీ దొర్లిపోతుంది. ఇక ఇంగ్లీషు సామెతల్లో గిరీశమే. 'మేక్ హే వైల్ ద సన్ షైన్స్', 'థ్రోయింగ్ పెర్ల్స్ బిఫోర్ స్వైన్' లాంటివి వున్నాయి. మొదటి దానికి 'దీపం వుండగానే యిల్లు చక్క బెట్టుకోవడం' అనే తెలుగు సామెత వర్తిస్తుంది. రెండో దానికి 'కొండముచ్చుకు మల్లిపువ్వు యివ్వడం' అనేది వర్తిస్తుంది. గిరీశమే పొయెట్స్ కంట్రీ లైఫ్ అని పలవరిస్తారని అంటాడు. ఇంగ్లీషు సాహిత్యం రొమాంటిక్ రివైవల్ ఉద్యమం వచ్చాక వర్డ్స్ వర్త్ వంటి కవులు కుహనా పట్టణ నాగరికతకి వ్యతిరేకంగా గ్రామ సీమల సహజ సౌందర్యాన్ని కీర్తిస్తూ రచనచేశారు. ఆ ఉద్యమం నాటి వాళ్ళే - కంట్రీ లైఫ్ - పల్లెటూళ్ళ జీవనం మీద

మమకారం గుప్పించేశారు. అందులోనే 'ఐడిలిక్ బ్యూటీ'ని దర్శించారు. కీర్తించారు. మనకి భావకవిత్వ ఆవిర్భావంతో ఈ బాపతు ధోరణులు విస్తరించాయి. గిరీశం న్యాయశాస్త్ర సంబంధమైన పరిభాషని కూడా వాడతాడు! 'ఈజ్మెంట్ హక్కు యస్టాబ్లిష్ అవుతుం'దంటాడు అగ్నిహోత్రావధాన్లుతో. దీనికి యీ నాటికి కూడా న్యాయసూత్రం వుంది. ఒక స్థలాన్ని గాని, నివాసాన్ని గాని పద్నాలుగేళ్ళు పైబడి ఒకరి వాడకంలో వుంచితే, వాటి యజమానికి తరువాత వాటిని స్వయంభుక్తం చేసుకునే అధికారం పోతుంది. ఆ వాడుకున్న వాళ్ళకి వాడుకునే హక్కు దక్కుతుంది. అదే ఈజ్మెంట్ హక్కు!

బుచ్చమ్మని పెళ్ళి చేసుకోవడం లాభనష్టాల బేరీజు వేసుకుంటూ గిరీశం 'టూ బర్డ్స్ యట్ వన్ షాట్' అనే ఇంగ్లీషు ప్రయోగం వాడతాడు. ఒకే దెబ్బకి రెండు పిట్టలని తెలుగులో వాడుతున్నారు. గిరీశం స్వంతంగా ఇంగ్లీషు వాక్యాలను మలచుకొంటాడు కూడానూ. 'షేక్స్పియర్ పడ్డ అవస్థ'లో 'టు మారీ ఎ విడో ఆర్–నాట్ మారీ' అని హామ్లెట్ స్వగతాన్ని తిప్పేసుకొంటాడు. హామ్లెట్ స్వగతం – 'టు బి ఆర్ నాట్ టు బి– దట్ ఈజ్ ది క్వశ్చన్' అని మొదలవుతుంది. చాలా ప్రముఖమైంది. క్రెడిట్ పద్దు, డెబిట్ పద్దు అని ఆధునిక అకౌంటింగ్ పరిభాషని గిరీశం వాడుతూ బుచ్చమ్మని పెళ్ళి చేసుకోవటంలో లాభ నష్టాలని తర్కిస్తాడు. అప్పటికే గురజాడ ఆధునిక వ్యాపార పదజాలాన్ని పట్టేశాడు. ఈ 'ప్రోజెండ్ కాన్సన్సీ' (అనుకూలంగా వున్నవీ, ప్రతికూలంగా వున్నవీ) విచారించి విడో మారేజి చేసుకోడానికే నిర్ణయించుకుంటాడు. కాని సాధనం ఎలాగ, అని తర్కించి యేదేనా 'యాసెస్ బ్రిడ్జి కట్టి' వొద్దు చేరాలనుకుంటాడు (యీ యా సెస్ బ్రిడ్జికి వివరణ బంగోరె యిచ్చారు.) అదేమిటి? 'ద యాసెస్ బ్రిడ్జ్ ఈజ్ ఎ నేం ప్లేఫులీ గివెన్ టు ద ఫిఫ్త్ ప్రపోజిషన్ ఇన్ బుక్–1 ఆఫ్ 'యూక్లిడ్స్ ఎలిమెంట్స్ ఆఫ్ జియోమెట్రీ'. ఇట్ ఈజ్ ద ఫస్ట్ డిఫికల్ట్ ప్రపోజిషన్ ఇన్ ద బుక్, అండ్ స్కూల్ బాయ్స్ రేర్లీ గెట్ ఓవర్ ఇట్ ఫర్ ద ఫస్ట్ టైం విదౌట్ స్టంబ్లింగ్'. అనగా, కష్టమైంది అని అర్థం. అదీ సంగతి! ఎక్కడి యూక్లిడ్: ఎక్కడి ఫ్రేజ్ ? మన వ్యాసఘట్టం అనే ప్రయోగం దీనికి తూగుతుంది.

క్రియేషన్ గురించి పాఠం చెబుతూ వెంకటేశానికి 'వన్ థింగ్ ఎట్ ఎ టైమ్' అని హెచ్చరిక చేస్తాడు. దీనికి పద్యం ఒకటి వుండాలి. 'వర్క్ వైల్ యూ వర్క్, ప్లే వైల్ యూ ప్లే వన్ థింగ్ ఎట్ ఎ టైం, వాటెవర్ యూ డూ'. గిరీశం ఇంగ్లీషు ధారాళంగా వాడటంలో వింత యేమీలేదు. ఎందుకంటే ఆధునిక నాగరికతకి ప్రతీకగా తయారయే పాత్ర కాబట్టి. కాని అప్పటికే నిత్య వ్యవహారంలో కూడా చాలా ఇంగ్లీషు మాటలు చోటు చేసుకున్నట్టుంది 'పోలిశెట్టిని సప్లయికి పెట్టకండి' 'డామేజి దిట్టంగా వస్తుంది' లాంటి మాటల్ని రామప్పంతులు లాంటి వాళ్ళు (ఇంగ్లీషు వస్తే దొరసానులు తన వెనకాలే తిరుగుతారని వూహించుకునే వాళ్ళు) కూడా వాడతారు.

ఇంగ్లీషు పదప్రయోగం మాట సరేసరి, భావనలో కూడా ఆ నాగరికతని చూపెట్టడం వుంది. సృష్టిలో లోపాలు విశదీకరిస్తూ సప్తసముద్రాల గురించి ఏకేస్తూ గిరీశం లెక్చరు కొడతాడు. సముద్రాలు యేడింటిలోనూ 'ప్లియోనిజమ్' యెంతో వుందం టాడు. ప్లియోనిజమ్ అంటే పునరుక్తి అని తానే చెబుతాడు. ప్రాచీన మత విశ్వాసాల్లోని సప్త సముద్రాల భావననీ తప్పు పట్టడం ఇంగ్లీషు ఆలోచనా సరళి నుంచి వచ్చింది. మెకాలే తన 'మినిట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్'లో ఇంగ్లీషు అధ్యయనాన్ని ప్రవేశ పెట్టాలని, యీ బెల్లం సముద్రం, పాల సముద్రం లాంటి వూహాలని ముందు యింకించెయ్యాలని సలహాయిస్తాడు. తూర్పు దేశాల్లో వుండే మూఢనమ్మకాలని సేకరించడానికి ఇంగ్లీషు విద్య అనవసరమని వాదిస్తాడు.

అలాగే గిరీశం తత్వశాస్త్రంలోని ప్రధానమైన ప్రశ్న 'ఫ్రీ విల్ అనే సమస్యని అతి సునాయాసంగా చర్చిస్తాడు 'డిపెండెంట్ గా సృష్టించావా లేక యిండిపెండెంట్ గా సృష్టించావా' అని దేవుణ్ణి కడిగేస్తాడుః జటిలమైన సమస్య! అలాగే అబద్ధం చెప్పడానికి తడబడుతూ, అది అసలు మోసం కాదని సమర్థించుకోడానికి 'ఎబ్ స్ట్రాక్ట్ ట్రూత్ అనగా శుద్ధ సత్యమనేది సాక్షాత్తూ భగవంతుడితో సమానమైన వస్తువ'ని, వ్యవహారంలో పాక్షికంగా అసత్యం అనేది శుద్ధ సత్యానికి ఆటంకం కాదనుకుంటాడు. యాబ్ స్ట్రాక్ట్ ట్రూత్, రెలెటివ్ ట్రూత్ అనేది కూడా ఫిలాసఫిలో ప్రముఖమైన చర్చనీయాంశమే. గిరీశం వాడిన యింకో మాట "గ్రాండచ్చీ ఆఫ్ బెడెన్" దీనికి యిదమిత్థంగా అర్థం దొరకలేదు. పిశాచాలూ, గిశాచాలూ డామ్ హంబగ్ అని యీ మాట వాడతాడు. బెడెన్ అనేది జర్మనీలో వుంది. అక్కడ వేడినీటి ఊటలేవో వున్నాయట, వాటికేదో మహత్తు వుందని అనుకుం టారట. ప్రస్తుతంలో గిరీశం అర్థం యీ మంత్ర మహిమ నాన్సెన్స్ అని. తనని గురించి సౌజన్యారావు పంతులుతో చెప్పుకుంటూ తనని 'నెపోలియన్ ఆఫ్ యంటీనాచ్' అని పిలుస్తారంటాడు. నెపోలియన్ ఫ్రెంచి చరిత్రలో ప్రసిద్ధ వీరుడు. ప్రపంచాన్ని తన ప్రతాపంతో గడగడలాడించి, ఫ్రాన్స్‌లో ఒక సామ్రాజ్యాన్ని స్థాపించినవాడు. మహావీరునికి చిహ్నంగా నెపోలియన్ పేరు వాడతారు. 'వేశ్యా వ్యతిరేక మహావీరుడ'నని గిరీశం ఇక్కడ చెప్పుకుంటున్నాడన్నమట! మొదట అంకంలోనే వెంకటేశాన్ని పలకరిస్తూ 'యేమివాయ్, మైడియర్ షేక్స్పియర్ ముఖం వేలవేసినావ్?' అంటాడు. షేక్స్పియర్ ముఖం పెట్టడం అనేది ఇంగ్లీషు వాడకంలో వుంది. అసలు షేక్స్పియర్ ముఖం యెలా వుండేది దాఖలాగా వుండే బొమ్మలు లేవు కాని లోకవృత్తాన్ని పరిశీలించి అమోఘమైన విషాదాంత నాటకాలు రాసిన ఆ మహాకవి గంభీరవదనంతో వుండే వుంటాడనీ, ఆ

విచారరేఖలు ప్రస్ఫుటంగా కనిపిస్తూ వుండే ముఖమే అయివుంటుందనీ అనుకోవడంతోటి ఈ మాట పుట్టి వుంటుంది. బుచ్చిబాబు గారు యీ విషయం ప్రస్తావిస్తూ రాసింది చదవవచ్చు. ఇవికాక ఇంగ్లీషు పడికట్లు గిరీశంలోనే ఎక్కువ కనిపిస్తాయి. గురజాడ రాసిన 'నీదు సైటు డిలైటు'లాంటి గేయపాదాలు, 'ద విడో' పద్యం ఆయన ఆంగ్ల వైదుష్యానికి చిహ్నాలు.

ఇక 'తెలుగు పలుకుబళ్ళు ప్రస్తావించాలంటే భయమే అవుతుంది. ఎందుకంటే, ఎంతని, ఎన్నని ? పద్యపాదాలు మాటలు నుడికారపు సొంపులు ఒకటేమిటి మొత్తం నాటకమంతా ప్రతిపాత్ర ద్వారానూ ప్రసక్తమైనవే! జావళీలు, చాటు పద్య మణిమంజరిలో, గ్రంథస్థమైన పద్యాలు, పద ప్రయోగాలు విస్తారంగా వున్నాయి. జావళీలకి, పద్యపాదాలకి బంగోరె వివరణ యిచ్చిన వాటిని విడిచి మిగిలినవి చూద్దాం. అందులోనూ అవసరమైనవే ప్రస్తావించుకొనడం సులభంగా వుంటుంది. 'కోన్ కిస్కా హెగాడి ఆడాలో వున్నానని పాతివ్రత్యం నటిస్తావేమి'టని మధురవాణిని నిష్టూరంగా అంటాడు రామప్పంతులు. మొదటి పదం హిందీ ముక్క అతికేటట్టే కలిపేశాడు. ఆడా అంటే అజమాయిషీ, కంట్రోల్ అని అర్థం. భర్తని కంట్రోలులో వుంచేటప్పుడు భార్యని గురించి మొగుడ్ని 'ఆడాలో వుంచిందోయి' అనడం వినవస్తూ వుంటుంది. దప్పిక్కి చేరి అరవచాకిరీ చెయ్యడం గంజినీళ్ళకి ఒడబడి చాకిరీ చెయ్యడం అరవ చాకిరి అనేది తెలుగు నుడికారంలో బ్రహ్మాండంగా అతుక్కుపోయింది? వెయ్యి సిక్కా రూపాయలంటాడు గిరీశం. సిక్కా అంటే హిందీలో నాణెం అని. హైద్రాబాద్ సంస్థానంలో 'సిక్కా'లోనే జీతం వుండేది. సంస్థానం యివతల 'హాలీ' అనేవారు. నోట్లు కాకుండా నాణెమే విలువగావుండేది. వాడి 'పొంకం' అణుతురు గాని అంటుంది మధురవాణి, రామప్పంతులుతో. 'పొంకం' అంటే పొంగు, గర్వం అని. కరటక శాస్త్రిని 'చప్పన్న భాషలు' వచ్చిన వాడని కలక్టరుగారు సెలవిచ్చినట్లు గిరీశం పొగుడుతాడు. 'చప్పన్న భాషలూ' అంటే కచ్చితంగా తేలలేదు. హిందీలో ఛప్పన్ - యాభై యారు- అని అర్థం. 56 భాషలు యెక్కడ ప్రస్తావించబడ్డాయో తెలీదు. 'మహా సంకల్పం'లో 'అంగ, వంగ, కళింగ కాశ్మీర" అని 'దేశాల' పేర్లు ఉన్నాయి. అవి అన్నీ లెక్క పెట్టినా 56 అవలేదు. మొత్తం మీద ప్రయోగబద్ధంగా వుంది చప్పన్ అన్న మాట- మూలం తేలకపోయినా! ఇక, కరటక శాస్త్రి "యిదొహర్తె టొంపలా" అంటాడు. టొంప అంటే గుదిబండ అని అర్థం. లుబ్ధావధాన్లతో రామప్పంతులు తనని 'అనాడీ' చేస్తున్నారంటాడు. 'అనాడి' అంటే చులకన చెయ్యడం. మధురవాణితో 'నన్ను సప్తవెధవని చేశావు' అంటాడు రామప్పంతులు. దీనికి రెండు మూడు అర్థాలు దొరికాయి. 'శవానికి కట్లు ఏడు కాబట్టి అంతటి చచ్చు పీనుగును చేశావు' అని ఒక వివరణ. యిది కొంచెం తెలివిగా లాగిన అర్థమేమో ననిపిస్తుంది. "ఆ డిక్షిఒనర్యీ ఒఫ్ టెలుగు ఇదిఒంశ్ (ఏదిటెద్ బ్య్ నాళం కృష్ణారావు)లో వున్న వివరణ యిది. సప్తమీ విభక్తి అంటేనే 'అందున్, నన్ అని. "వానినే శబ్దములుగా గైకొని అర్థము చేసిన అందున్ అందును, ఇదున్ – ఇందును యగును కదా. అందు యిందు లేక ఉభయ భ్రష్టుడై రెంటికిం చెడిన రేవడగుట' అని అర్థం చెప్పారు. ఇది కూడా తెలివిగా సాధించబడ్డ అర్థంలాగే కనిపిస్తోంది.

పెళ్ళికి గాడిదలు, ఒంటెలు తేవడం గొడవలో మధురవాణి లుబ్ధావధాన్లతో వాటివల్ల రామప్పంతులుకేం లాభం? అని అడిగి 'రాతబుబేరం జరుగుతుంది కనక పోలిశెట్టికి లాభం' అంటుంది. రాతబు అంటే మాండలికమేమో తెలియలేదు. సరుకు అరువుగా యిచ్చి, అంటే కాతా రాసుకుని, ఎక్కువ లాభం పొందటం అని అర్థం అన్నమాట. కొండి భట్టుకి 'రెండు పనసకాయలు బరాత విస్తా' నంటాడు రామప్పంతులు. అంటే 'పెళ్ళిలో గమ్మత్తులు చెప్పేందుకు లంచంగా రెండు పనస కాయలు లిఖిత పూర్వకమైన ఆజ్ఞ' యిస్తానని, నోటిమాటకాదు. ప్రామిసరీ నోటులాగా ఆర్డర్ వెయ్యడం అన్నమాట. చిత్రమైన పల్లెటూరి ప్రయోగం యిది! తంబళ అనుమానం గుండు గొమ్ముల అనుమానం అని మీనాక్షి, లుబ్ధావధాన్లూ అంటారు. రెండింటికి చరిత్ర ఒకటే. దీనికి కథ వుంది. తంబళ అంటే శివార్చన చేసి బతికే పూజారి. అలాంటి పూజారి ఒకడు రోజూ గుడికివెళ్ళేవాడు. దారిలో ఒక ఆంబోతు మా గన్నుగా పడుకుని వుండేది. దాని కొమ్ములు వక్రు తిరిగి వృత్తంగా యేర్పడివుండేవి. ఆ కొమ్ములో తన తలపడుతుందా అని ఆ పూజారికి అనుమానంగా వుండేది. ఒక రోజున సాహసం చేసి తల దూర్చాడు. ఆంబోతుకి నిద్ర వదిలింది. కోపంతో ఆ తంబళని ఎగరేస్తూ గ్రామం అంతా కలియదిరిగింది. పదిమంది కలగచేసుకోవడం వల్లనైతేనేం, యెలాగైతేనేం అకణ్ణి విడిపించి రక్షించారు. ఆ దెబ్బతో తంబళకి గుండు గొమ్ముల అనుమానం తీరింది! 'పాసం పెట్టి సంపేస్తారా యేటీ' అంటాడు పోలిశెట్టి పేకాట సీనులో. కవిత్వంలో ఆయా స్థానాల్లో నిషిద్ధమైన అక్షరాన్ని పెట్టి శత్రువులకి కీడు చెయ్యవచ్చనే మూఢనమ్మకం చాలా కాలంగా ఉంది. లక్షణ గ్రంథాల్లో యీ వివరాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకి అ, క, చ, ట,త, ప, య, స అనే అక్షరాలు పద్య పాదంలో 2, 3, 6, 9, 10, 4 స్థానాల్లో పడకూడదట. వేములవాడ భీమకవి 'హయమది సీత' అని ఆరో స్థానంలో 'త' కారం పెట్టి శపించాడట. రాజ కళింగ గంగు రాజ్య భ్రష్టుడై పోయాట్ట. ఇందులో వాస్తవమేమైనా అప్పట్లో వున్న ఆ నమ్మకాన్ని పోలిశెట్టి యిలా వ్యక్తం చేశారు పోలిశెట్టి 'పాసం పెట్టి' (పోసపెట్టి) అని అన్నా ప్రాసస్థానంలోనే కాకుండా ఆ పద్య పాదంలో ఎక్కడనిషిద్ధ అక్షరం పెట్టినా ముప్పనే భయం వుండేది.

కరటక శాస్త్రి శిష్యుణ్ణి నీకీ 'చిల్లంగికళ్ళు' ఏ దేవుడిచ్చాడని మధురవాణి మురిసిపోతుంది. 'చిల్లంగి కళ్ళు' అంటే యిక్కడ మంచి అర్థంలోనే వాడినట్టు. కాని, చిల్లంగికి ఉచ్చాటన క్రియ అని నిఘంటువులో అర్థం. చేతబడులాంటివి చేసేవాళ్లు ఆ మంత్రాలు పఠిస్తూ కంటి రెప్పలు ఆడించే పద్ధతి ఏదో వుందట. ఏమైనా ఇక్కడ అవతలి వారిని వశీకరణ చేసుకోవడం కళ్ళల్లో వుందన్న మాట. తెగించిన దానికి సగుడు మోకాలుబంటి' అని మీనాక్షి అంటుంది. 'సగుడు' అంటే శబ్ద రత్నాకరంలో 'సరాసరి' అని అర్థమిచ్చి 'వానికి సగుటు మోకాలి బంటి' అని ప్రయోగం చూపించారు. ఆ అర్థం ఎలా సరిపోతుందో సరాసరి వారికే తెలియాలి! 'సగుడు' అంటే సముద్రమనే అర్థం వుందేమో తెలియలేదు. యెవళ్ళనీ తగినంత మర్యాదతో చూడకపోవడం అనేది అసలు అర్థం. 'చిట్ట పులి పిల్లని తండ్రొచ్చి వండకి తీసుకు పోయినాడట' అని దాసరి వేషంలో వున్న శిష్యుడు రామప్పంతులుతో అన్యాపదేశంగా మీనాక్షి యింటికి వెళ్ళిన వైనం తెలియ చేస్తాడు. 'వండ' అంటే కొండ గుహ అని అర్థం.బాగుంది కదా!

బుచ్చమ్మ కేసు గురించి వివరిస్తూ నాయుడు 'సహస్ర మాసజీవి' అనీ, 'రెండు పిల్లికూనలు' అనీ వాడతాడు. సహస్ర మాసజీవి కావడం గొప్ప. వెయ్యి మాసాలు జీవించడం అంటే 86 సంవత్సరాలకి పైబడి బతకడం. అంత వయస్సులో వున్న వాడికి తన పిల్లనియిచ్చి 'రెండు పిల్లికూనలు' స్వీకరించేటప్పటికి వాడు గతుక్కుమని కూతురు ముండమోసిందని అగ్నిహోత్రావధాన్ల మీద నేర్పుగా అభియోగం పెడతాడు. 'రెండు పిల్లికూనలు' వ్యవహారంలో వున్న అప్పటి నుడికారం. వంద రూపాయల నోటు మీద వున్న బొమ్మ ఆధారంగా ఆ నోటుని అలా పిలిచే వారు' యిప్పటికీ 'పచ్చ కాగితం' అని వాడకం వుంది. యిప్పట్లో యిది ప్రచారంలో వున్నది. రూపాయ నోట్ల మీద పడవ బొమ్మలున్నప్పుడు ఒక పడవ వదిలిందని, రెండు పడవలు వదిలాయనీ వ్యవహరించే వారు. అలాగే పిల్లి బొమ్మలుండి వుండవచ్చు. అంచేత రెండు పిల్లి కూనలని రెండు వందలకి ముద్దుగా నుడికారయుతంగా వ్యవహరించాడు. కేసులో 'సాకీదు' అంటే ఊరు చిరునామా అని. 'ఎవిడెన్సు అక్టులో అంజనాలు పిశాచాలు సాక్ష్యానికి పనికొస్తయ్యా' అంటాడు గిరీశం. ఈనాటికీ అంజనాలూ–సిద్దులూ పవిత్రంగా ఎంచేవాళ్ళు యేమంటారో మరి! 'ఎవరి పేరు వారు ఉచ్చరించితే శాస్త్రాల్లో పాపమన్నారని' గిరీశం అంటాడు. ఈ మేరకు శాస్త్రం వున్నమాట నిజమే. కొన్ని పేర్లు చెప్పకూడదట. అందుకనే పూర్వం వాళ్ళు ఫలానా 'అంటారండి' అంటూ పేరుకు ఆఖర్న చేరుస్తూ వుంటారు. 'మిషనరీ ఒరిజనల్ సిన్ అంటాడండి' అని గిరీశం సౌజన్యారావు పంతులుకు లెక్చరిస్తాడు. 'ఒరిజినల్ సిన్' అనేది క్రైస్తవ మతంలో వుంది. అడమ్, ఈవ్‌లు ఆది దంపతులు. భగవంతుడి మాట జవ దాటడం వల్ల పాపం చేసిన వాళ్ళవుతారు. అప్పటి నుంచి స్వర్గధామంగా వుండే యీటోట్లో పాపం తిమిరంలా చుట్టుకుని ఏడిపిస్తూ వుంది. వాళ్ళ పాపం తర్వాతి తరాల వాళ్ళందరికీ పుట్టుకతోటే సంక్రమిస్తుందని క్రైస్తవ మత విశ్వాసం, అదే ఒరిజినల్ సిన్: మొదటి పాపం. 'తుని తగువు మనవి చేస్తాను' అంటుంది మధురవాణి. మన నిఘంటువులు చూస్తే యెంత అమాయకత్వం అబ్బుతుందో యీ మాటకి ఒకచోట యిచ్చిన అర్థం దాఖలా. తుని తగవు: నిరుపయోగమైన వాక్కలహము అని యిచ్చారు. నిజానికి యీ అర్థం నిరుపయోగం. అసలు యేమిటంటే అనవసరంగా వాదం పెంచకుండా తగువు తుంచెయ్యడం, సర్దిపెట్టెయ్యడం. తాండవ నదికి అటూ ఇటూ వున్న పాయకరావుపేట జమీందారు జమీ విభజన గొడవలో అటు ది అటూ, యివతలిది యిటూ నిర్ణయం చేసి గొడవలేకుండా తీర్పు చెప్పార్ట. తుని అంటే ముక్క అని కూడా అర్థం వుందట. 'తెల్ల బియ్యం పాటిమానికా' అంటుంది మధురవాణి కేసులోని చిక్కుని విడగొట్టేస్తున్నట్లు, మానిక అనేది కొలమానం. వ్యవసాయంలో సరైన తూకాలు పిచ్చికొలతలు అనేవి అమలులోవున్న పద్ధతులు. పిచ్చికొలతలు మోసం చేసేవి. యిక్కడ చక్కని వాటికి (బియ్యం) చక్కని కొలత అనే అర్థం చెప్పారు. స్పష్టమైన విషయమనీ, 'మోసం లేదనీ భావం కావచ్చు. ఇక విడిగా కొన్ని పదాలకి అర్థాలు చూద్దాం. పదిరోజులు నువ్వు ఆడపిల్లవై పోవాలి' అని కరటకశాస్త్రులు అన్నప్పుడు 'గణియం' పట్నంలో వుండిపోయిందంటాడు శిష్యుడు. 'గణియం' అంటే వేషధారులు నాటకాల్లో ధరించే లక్కసొమ్ము.

'రొట్టెమీద నెయ్యి, నేతిమీద రొట్టెలాగ యేకోత్ర వృద్ధిగా' అంటాడు. గిరీశం ఒపినియన్ చేంజిచేసి యిన్నేంటు మారియేజి కూడునని వాదిస్తూ, 'యేకోత్రవృద్ధిగా' అంటే వొకదాని మీద ఒకటి చేర్చుకుని, వొహటి వొకటి పెరిగి అని అర్థం. 'దానిమీద యెలా కొంజా యెత్తాడో' అని అగ్నిహోత్రావుధాన్లు అని నిలదీస్తాడు. 'కొంజా' అంటే వాకిటి కావలియిల్లు, అలాగే యీ విషయం 'ఏమరిచి' వూరుకున్నాట్ట, అంటే అజాగ్రత్తగా పట్టించుకోకుండా వుండడం. 'పెళ్ళికూతుర్ని యిలాకా చేసుకుని' మూటా ముల్లె లాగెయ్యడం యెత్తు అని మధురవాణి రామప్పంతుల్ని నెపం ఆడుతుంది. యిలాకా అంటే స్వాధీనం చేసుకుని, మంచిచేసుకుని అని. 'నాయింట్లో నకార ప్రయోగం చెయ్యకని' రామప్పంతులు హెచ్చో అంటాడు. నువ్వు అని యేకవచనంతో సంబోధించవద్దు అని. 'యీ కత్తెరమీసం, కత్తెరగడ్డం కడిగేసుకుని' నాతోవన పోతానంటాడు, కరటకశాస్త్రి. కత్తెరగడ్డం అంటే చివళ్లు కత్తిరించిన గడ్డం. క్రాఫ్ట్ బియర్డ్ అని. 'కుండలాలు వేసుకున్న వారికి ఓ రూపాయి జాఫా' అంటాడు రామప్పంతులు. 'జాఫా' అంటే ముద్ర–స్టాంపు–కొట్టు అని,

స్టాంపు పేపరు అని. 'బరాతం' లాగానే యిదీని. లిఖిత ఆజ్ఞ అన్నమాట గిరీశం చదివిన పద్యం 'చుక్కలవలె కర్పూరపు ముక్కలవలె... అనేది అడిదం సూరకవి (1720 బి1785) పొణుగుపాటి వేంకటమంత్రి మీద చెప్పింది. దీని అర్థం సుగ్రాహ్యమే కదా. అలాగే వెంకటేశం ఉత్తరోత్తరా ఉద్యోగంలో చేరి దొరలాగ 'యేజన్సీ కమాన్' చేస్తూవుండగా పెద్దపులి వస్తే తప్పించుకోవడానికే చెట్లెక్కడానికి తరిఫీదు ఇస్తున్నట్టు చెప్తాడు గిరీశం. 'కమాన్' అనేది దొరలు చిర్చుఇత్కి వెళ్లడం. సర్కిట్ జడ్జి అంటే దేశం మీద తిరిగే న్యాయాధిపతి.

ఇక గిరీశం చదివిన పద్యం 'నదమా పొక్కిలి.' అనే పద్యం కూచిమంచి తిమ్మకవి 'రసికజన మనోభిరామం' మూడో ఆశ్వాసంలోది. 'నేను శాక్తేయుణ్ణి'.. అంటాడు రామప్పంతులు. 'పిత్రార్జితం 'కరారావుడు' చుట్టేశాను అనీ అంటాడు రామప్ప. 'కరారావుడు' అనే దానికి అర్థం యే నిఘంటువులోనూ వుండదు. అచ్చమైన వాడుకపదం. హరింపచేసెయ్యడం, గుండుసున్న చుట్టెయ్యడం అని అర్థం. 'శాక్తేయుణ్ణి' అంటే శక్తి ఉపాసకుడిని దుర్గ ఉపాసకుడిని అని. మనదేశంలో వున్న లక్షా తొంభై ఆర్య అనార్య దేవతా ఆరాధనల్లో అది వొకటి. తలా వొకపద్ధతిలో మోక్షం చూసుకునే మార్గాల్లో వొకటి.

వివాహం జరక్కపోతే 'మార్కం' వుందని గుర్తుచేస్తాడు రామప్పంతులు. 'మార్కం' అంటే 'మృతి.' జాతకంలో కొన్ని మహా యోగాలు పుట్టినప్పుడు. అవి జరక్కపోతే జరిగే విపరీతమైన కీడు యిది. 'ఘంటాపథంగా చెపుతూ' వుంటే అంటాడు రామప్పంతులు. 'ఘంటాపథం' అనేది రాజవీధి ఏనుగుల ఘంటికా నాదంతో మారుమ్రోగే పథం, దారి అని అంటే అంతస్పష్టంగా, నలుగురికి తెలిసేటట్టు అని. 'యేం ఖోదా కొట్టుకొచ్చిందోయి' అంటాడు రామప్పంతులు. 'ఖొదా' అనేది పర్షియన్. 'ఖుదా' అంటే దేముడు. ఖొదా అంటే యిక్కడ అదృష్టం అని అర్థం. 'శాపర మంత్రాలు ఉపదేశం' అవుదామంటే బెడిసికొడతాయని భయం అంటాడు లుబావధాన్లు, శాపర అనేది 'శాబర' అనేదాని రూపాంతరం. 'శాబర' అంటే శబర సంబంధమైనది. అంటే భూతప్రేత పిశాచాది క్షుద్రవిద్యలకి సంబంధించింది. తంత్ర విద్యలో యీ మంత్రాలు వుంటాయి. వీటిని సరిగా అనుసరించి ప్రయోగించకపోతే ప్రయోగం చేసినవాడికి కీడు కలుగుతుందని భయం వుండేది. ఇప్పటికీ చేతబడీ వగైరాలు చేసేవాళ్ళకి వంశం నిలవదన్న భయం జనంలో కనిపిస్తుంది. (అసలు కన్యాశుల్కంలో ప్రసక్తమైన ఇలాంటివాటి గురించి వొక్కొక్కదానికీ వొక్కొక్క వ్యాసమంత వివరణ యివ్వాలి).

'తప్పు పంచితే బేస్తుమీద కుదేలెట్టిస్తాను' అంటాడు పోలిశెట్టి. బేస్తు, కుదేలు అనేవి ఆనాటి చీట్లాటలో పదాలు. ఇవాళ రమ్మీలూ దొమ్మీలు వచ్చి మరుగున పడిపోయేయి అవన్నీ. కుదేలు అంటే చీట్లపేకలో అయిదుపట్లు పడతానని చేసే ప్రతిజ్ఞ అది. అలా పట్టలేకపోతే ఓడిపోయినట్టు- అదే కుదేలై పోవడం! ఆ మాట చితికిపోవు, ఓడిపోవు అనే అర్థంలో వాడడం వుంది.

'ఒక దరావుకి పద్దరావులు' రామదాసు చేరుస్తాడని మునసబు అంటాడు. 'దరాం' అనేది ఆంగ్లపద రూపం. వొక కొలత. 'డ్రామ్' అని మద్యపానంలో ప్రయోగం అవుతూ వుండే పదం. అంటే రామదాసు వొక 'దరావు' సారాకి'పదిదరావులు' గంగ కలిపేస్తాడు అని. ఆరక్ మోసాలు అప్పటికే వున్నాయి! 'ఏపి కూన్ని' ఉసిగొల్పింది మధురవాణి అంటాడు అసిరి. 'ఏపి' అంటే కుక్క. 'తే ధగిడీకే అని కంటె కోసం మధురవాణి పీకీ పిండెట్టింది" అంటాడు కరటక శాస్త్రులు. 'ధగిడి' అంటే "నీచ స్త్రీ, కులట, నీచ స్త్రీ కి పుట్టిన" అని అర్థం. అలా తిట్టిందని కరటక శాస్త్రి నాటకీయంగా అంటున్నాడన్న మాట. 'లాచారీ' పడవచ్చు అంటుంది మధురవాణి. అంటే నిస్సహాయుడై ప్రాధేయపడడం, నిరాధారంగా వుండడం. నువ్వే కాపాడాలి అని అర్థించడం. 'లో సబురున' ధర్మరాజు వారు ప్రతిష్ఠ చేసిన ఆలయం అంటాడు బైరాగి. "సబురు" అంటే ఓడ ప్రయాణం అని అర్థం వుంది. 'దరి సబురు' అంటే తీరం వారనే వెళ్ళడం. 'లో సబురు' అంటే తీరానికి దూరంగా ప్రయాణించడం. ఇక్కడ 'లో సబురు' అంటే తీరానికి దూరంలో అనిఅర్థం. రెండు మైళ్ళు తీరానికి దూరంలో అని బైరాగి ఉద్దేశం.

'సదావృత్తి' దొరుకుతుందా అని అడుగుతాడు బైరాగి. 'సదావృత్తి' అంటే బై రాగులకీ, బాటసార్లకి నిత్యం బియ్యం పప్పు వగైరాలు యివ్వడం- స్వయంపాకంలాగా. బైరాగులకి డబ్బు మీద తనువుంటుందా అంటాడు బైరాగి. తనివి అంటేకోరిక, దానివల్ల కలిగే తృప్తి. 'తిరస్కరణీ విద్య ఆవలంబించారా గురూ' అని గవరయ్య కాళీ జాగా వైపు చూస్తూ, బైరాగిని సంబోధించి అంటాడు. 'తిరస్కరణి' అంటే తెర. తెర వెనక మాయమైపోవడం యెవళ్ళకీ (అంటే మూఢ భక్తులకీ పాపంపుణ్యం యెరగని పిల్లలకీ తప్ప) కనిపించకుండా అదృశ్యం అవడం, యోగులకీ సిద్ధులకీ యిలాంటి విద్యలుండేవని నమ్మకం వుండేది. యిక 'వీడు ఆవ్యక్తుడైతే' పాపంబుచ్చమ్మ బతుకు చెడుతుందని సౌజన్యారావు పంతులు బాధపడతాడు. 'అవ్యక్తుడు' అవు అనేదానికి నిఘంటువులో యిచ్చిన అర్థంచూస్తే మన నిఘంటువులు మనకి యెలా ఉపకరిస్తాయో తెలుస్తుంది. అవ్యక్తుడు అంటే శివుడు, విష్ణువు అనే అర్థాలున్నాయి. కాని అది వ్యుత్పత్తి బట్టివచ్చిన అర్థం. కాని సందర్భరీత్యా 'పనికిమాలినవాడు, మూర్ఖుడు' అని యిక్కడ అర్థం. వొకటీ అరా నిఘంటువుల్లో మూర్ఖుడు అనే అర్థమూ వుంది. కాని లోక వ్యవహారంలో వున్నవాటికి అర్థం యిచ్చే స్థాయికి మన నిఘంటువులు యెదగలేదు. యివి కన్యాశుల్కంలోని కొన్ని విశేషాలు మాత్రమే. ❑

# అనువాదం.. భిన్నభాషల మధ్య వారధి

**అనువాదాల ఆవశ్యకత గురించి చెప్పుకోవడం పునరుక్తి దోషం అవుతుంది. అనువాదాలు భిన్న భాషల మధ్య వారధులుగా పనిచెయ్యడమే కాదు ఒకో భాషలో ప్రబలంగా వున్న ప్రక్రియల్ని, ధోరణుల్ని ఇతర భాషలకి అందిస్తూ వుంటాయి. సాహిత్యాన్ని దేశ కాలావధి లేని పరిధిలో సుసంపన్నం చెయ్యడం అనువాదాలు చలవే. ప్రక్రియాపరంగా చెప్పుకున్నప్పుడు 'సానెట్' అనే రూపం ఇటలీ నుంచి పాకింది. ఇంగ్లండ్‌లో షేక్స్పియర్ చేతిలో అది రూపం మారి ఆయన పేరు మీదనే వ్యవహారంలోకి వచ్చింది. ఇటలీ వెట్రార్కక్ 'సానెట్' ఇంగ్లీషులో షేక్స్పియర్ సానెట్‌గా ప్రాచుర్యం పొందింది. అలాగే అనేక ఇతర ప్రక్రియలు, ధోరణులు అనువాదాల ద్వారానే విశ్వవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. సుశాన్ బాస్నెట్ చెప్పినట్లు ట్రాన్స్‌లేషన్ అంటే ట్రాన్స్ ప్లాంటేషన్ - అనువాదం అంటే తిరిగి నాటడం కొత్త నేలలో కొత్త శీతోష్ణస్థితిలో వర్ధిల్లడం అని.**

## అనువాద ప్రక్రియ - ఆరంభ వికాసాలు

భారతదేశంలో అనేక భాషలున్నాయి. ఒక భాష నుంచి మరో భాషలోకి అనువాదాలు చాలా అవసరం. సాంస్కృతిక వారసత్వం ఆసేతు శీతనగం ఒకటే వుండడం వల్ల భాషాభేదం అంతలా అడ్డం పడదు. ఇలాంటి సందర్భంలో ట్రాన్స్ ప్లాంటేషన్ అలవోకగా సాగిపోతుంది. భారతదేశంలో అన్ని భాషలలోకి సంస్కృతం కుదురు నుంచి దిగుమతి అయి ఊడలు దించుకున్న శాఖలే ఎక్కువ. ఆ రకంగా భావాత్మకంగా వున్న భారత ఏకత కార్యరూపం ధరించ డానికి వీలు ఎక్కువ. ఉమాశంకర్ జోషి ఈ మాటనే తన ఉపన్యాసాలలో ప్రస్తావించారు. 'భారత దేశ సాహిత్యం అనే భావనను సాకారం చెయ్యడానికి రెండు అంశాలు దోహద పడతాయి. ఒకటి-అనువాదాలు, రెండు - తులనాత్మక సాహిత్య పరిశీలన విశ్వవిద్యాలయాలలో జరగడం.' కేంద్ర సాహిత్య అకాడమి, నేషనల్ బుక్ ట్రస్ట్ లాంటి సంస్థలు ఈ కృషి సాగిస్తున్నాయి. ఇవికాక అనేక ప్రైవేట్ ప్రచురణ సంస్థలూ అనువాద ప్రక్రియను అందుకుంటున్నాయి. ఆ రకంగా తెలుగు సాహిత్యాన్ని ఇతర భాషల్లోకి వెళ్ళే సానుకూలం కలిగింది. ఇక విదేశీ భాషల దగ్గరికి వస్తే ముఖ్యంగా ఇంగ్లీషు భారతదేశంలో ముందు పీఠిన ఉంది. ఇంగ్లీషు నుంచి తెలుగులోకి, తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనువాదాలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. ఇక ముందూ జరుగుతాయి. ఇంగ్లీషు భాష భారతదేశంలో ఇవాళ అనేక కార్యకలాపాలకి మాధ్య మంగా ఉంది. పాలనా వ్యవస్థలో, విద్యా విధానంలో ఇంగ్లీషు బాణీయే భారతదేశంలో అనుసరిస్తూ వున్నారు. భారతదేశంలో పరిఢవిల్లుతూ వున్న ప్రజాస్వామిక పాలనా విధానం బ్రిటీష్ నమూనా లోనే వుంది. దీనంతటికీ కారణం, బ్రిటిష్ వాళ్ళు భారతగడ్డ మీద అడుగు పెట్టినప్పటి నుంచి పాలన హస్తగతం చేసుకునే దాకా సాగించిన ప్రస్థానం-ఆ తరువాత పరిపాలనలో తమ విధానాన్నే అమలు చేసి భారతదేశాన్ని ఆధునిక యుగంలోకి తీసుకురావడం-ఇదంతా సుదీర్ఘ చరిత్ర. ఇంగ్లీషు వాళ్ళకి కొంచెం ముందు పోర్చుగీస్ వాళ్ళు, డచ్ వాళ్ళు, ఫ్రెంచ్ వాళ్ళు వచ్చారు. ఆ రకంగా పాశ్చాత్య ప్రభావం భారత దేశం మీద పడింది. పోర్చుగీసు



నుంచి తెలుగులోకి అనేక పదాలు వచ్చిచేరాయి. 'పొగాకు' లాంటి దినుసు, బాతులాంటి పక్షి వాళ్ళ వల్లనే ఇక్కడ ప్రవేశించాయి. 'పొగాకు' మన నాగరికత మీద యెంత ప్రభావం చూపించిందో, ఇంకా చూపిస్తోందో తెలుస్తూనే వుంది. చారిత్రక పరిస్థితుల దృష్ట్యా ఇంగ్లీషువాళ్ళు భారతదేశంలో నిలదొక్కుకుని మిగిలిన యూరప్ దేశాల వాళ్ళ కంటే పైచేయి సాధించారు. క్రమేణా ఒక్కో ప్రాంతాన్నే తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. మొత్తం అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. 19వ శతాబ్దం ప్రారంభం నాటికి ఆంధ్రదేశమంతా బ్రిటీష్ వాళ్ళ చేతుల్లోకి పోయింది. కంపెనీ పాలన విస్తరించింది. ఇంగ్లీష్ పాలన ఆచార వ్యవహారాలు ఆ ప్రాంతం వాళ్ళందరికీ అందివచ్చాయి.

## ఇంగ్లీషు వాళ్ళ ప్రస్తావన

మొదట్లో ఇంగ్లీషు వాళ్ళ ప్రస్తావన వెంకటావధాని 'విశ్వ మాధుర్యం'లో లాగా(1640) పాలవేకరి కదిరీపతి 'శుకసప్తతి' (1660)లో లాగా వున్నా ఇంగ్లీషు మాటలు తెలుగులోకి ప్రవేశించలేదు. చత్రాతి లక్ష్మీసరసకవి (1794) ఇంగ్లీషు పదాలు వాడాడు. బ్రౌన్ దొర వచ్చే నాటికి ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అనువాదాలు వచ్చేయి. ప్రింటింగ్ ప్రెస్ తీసుకు రావడం వల్ల అచ్చులో పుస్తకాలు వెలువడ్డమూ వచ్చింది. బ్రౌన్ దొర తెలుగు భాషకి, సాహిత్యానికి చేసిన సేవ గురించి ప్రత్యేకించి చెప్పుకోనక్కరలేదు. ఆ మహనీయుని చలవ వల్లనే అనేక ప్రాచీన తెలుగు తాళపత్ర గ్రంథాలు పరిష్కారానికి నోచు కున్నాయి. అచ్చులోనూ దర్శనమిచ్చాయి.

అప్పటికి తెలుగులోకి ఇంగ్లీషు నుంచి అనువాదం అయిన గ్రంథాలు ప్రధానంగా క్రైస్తవ మతానికి సంబంధించినవే. 1720 ప్రాంతంలో రోమన్ కాథలిక్కు మిషనరీలు క్రిస్టియన్ వేదగ్రంథములు అనే పేరుతో అనువాదం చేశారు. బెంజమిన్ ఫిల్ట్ అనువాదం మొదటగా తెలుగులో అచ్చయినదని అంటారు. డెస్ గ్రాంజెస్ అనే ఆయన తాను 'క్రైస్తవ బ్రాహ్మణుడి'నని చెప్పుకున్నాడు. బ్రౌన్ దొర బైబిల్‌ను తెలుగులోకి అనువాదం చెయ్యడంలో ఎదురయ్యే కష్టనష్టాలని వివరించాడు. అనువా దాలు అలా ఇంగ్లీషు ప్రముఖుల నుంచి వెలువడడం మొదలైంది. అదే సమయంలో ఇంగ్లీషులో సొంతంగా తెలుగు వాళ్ళే రాయడమూ వచ్చింది. కావలి వేంకట రామస్వామి ఇంగ్లీషులో 'బయోలాజికల్ స్కెచెస్ ఆఫ్ దెక్కన్ పోట్స్' అని రాశాడు. అందులో 108మంది కవుల చరిత్రలు వున్నాయి. అది 1829లో కలకత్తాలోను, 1888లో మద్రాసులోను అచ్చయింది. అప్పటికి విద్యా విధానంలోనూ మార్పులు వచ్చాయి.

## కొత్త భావాలు - కొత్త భాష

'పాశ్చాత్యులను చూచి మనవారు ముఖ్యంగా నేర్చుకున్నది నూతన విద్యావిధానము' అని కొత్తపల్లి వీరభద్రరావు రాశాడు. పాశ్చాత్య విద్యా విధానం వల్ల ఒక శిష్ట శ్రేణికే పరిమితమైన జ్ఞానసంపద ప్రజాబాహుళ్యం అంతటికీ అందుబాటులోకి వచ్చింది. గురజాడ రాసినట్లు సాహిత్యం అనేది ఒక వర్గానికే పరిమితమైపోకుండా జనసామాన్యానికి చేరువైంది. బ్రిటిష్ వాళ్ళ పుణ్యమా అని 'మాస్ ఎడ్యుకేషన్' వచ్చిందనీ, దానివల్ల వ్యావ హారిక భాష, ఆధునిక తెలుగు వచన రచన విధాయకం అయ్యేదనీ ఆయన రాశారు. ఆధునిక తెలుగు వికసించాలంటే ఆధునిక భావాలు విస్తరించాలి. అప్పట్లోనే ఇంగ్లీషు నుంచి దేశభాషలలోకి గ్రంథాలని అనువాదం చేయించాలన్న ప్రయత్నం జరిగింది. కాని 'ఆంధ్రాంగ్ల భాషలలో సమాన పాండిత్యం కలవాళ్ళు' లేకపోయారు. దాంతో ఆ ప్రయత్నం సాఫీగా సాగలేదు. క్రైస్తవ మతగ్రంథాలు అనువాదం అయ్యాయి కాని తెలుగు మాతృభాష కాని పాశ్చాత్యులు అనువాదం చెయ్య డం వల్ల ఆ రచనల్లోని కారకము (కర్త, కర్మ, క్రియల మధ్య సంబంధం) తెలుగు నుడికారానికి విలక్షణంగా వుండి 'కొత్త బైబిల్ బాష' అనే మొహరు తగిలించుకున్న భాష అవతరిం చింది. ఇవాల్టికీ బైబిల్ భాష ఆ మూసలోనే వుంది.

తెలుగు వాళ్ళే అనువాదం చేసిన గ్రంథాలైనా ఆనాటి గ్రాంథిక భాషలో వుండేవి. మొదట్లో ఇంగ్లీషు మాటలకి తెలుగులో అనువాదాలు వచ్చేవి. బ్రౌన్ దొర యీ విషయం గురించి కొంతరాశాడు. అసలు 'హిందువులు ఏ అనువాదమూ అవసరం లేకుండా ఇంగ్లీషు మాటలనే వాడడానికి ఇష్టపడతా'రని ఆయన రాశారు. గవర్నర్, హాస్పిటల్, కాలేజీ, కోర్టు, పోలీస్, లాయర్, డాక్టర్లాంటి వాటిని అలానే వాడడం అప్పటికే ప్రాచుర్యమైందని ఆయన రాసిన దాన్ని బట్టి తెలుస్తుంది. కాని తెలుగులో అను వాదం అయిన మాటలు కొన్ని యివాళ చిత్రంగా కనిపిస్తాయి. రైల్వేకి 'ఇనుప కమ్మీల బాట' ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్‌కి 'మెరుపు టపా' సేఫ్టీ వాల్వ్‌కి 'రక్షకమైన మూత' అంటూ వ్యవహార దూరమైన మాటలు వుండేవి.

పదాల మాట అటు వుంచినా గ్రంథాల అనువాదంలోనూ విధేయంగా లేని వర్ణనలు, పోరులు మొదలైనవి 'దేశీయముల యినట్లు' మార్చడం వుండేది. గురజాడ శ్రీరామమూర్తి 1879లో ఇంగ్లీషు నుంచి తెలుగులోకి చిత్రరత్నాకరం అనే పేరుతో ఒక అనువాదం తీసుకువచ్చారు. అరేబియన్ నైట్స్ లోని 'ద స్లీప్ అవేకెండ్' అనే కథకి అది స్వేచ్ఛానువాదం. అందులోని భాష గ్రాంథికం. ఈ విధంగా ఆంగ్లమూలము, భారతీయ-ఆంధ్ర- సంప్రదాయానుసాకాల ప్రకారం ఆంధ్రీకరింప బడినది. ఇది దీని యొక్క వైశిష్ట్యం అని కొత్తపల్లి వీరభద్రరావు అభిప్రాయ పడ్డారు. ఇలా భారతీయ సంప్రదాయాన్ని అనుసరిస్తూనే నాటకా లని అనువాదం చెయ్యడం వచ్చింది. 1879లో వావిలాల వాసు దేవశాస్త్రి 'జూలియస్ సీజర్' నాటకాన్ని ఇలా అనువదించారు.

అప్పట్లో షేక్స్పియర్ నామాన్ని కూడా 'శూలపాణి' అంటూ అనువాదం చేయడం మరో 'వైశిష్ట్యం'. కందుకూరి వీరేశలింగం పంతులు తెలుగు సాహిత్య ప్రక్రియలలో ఎన్నిటికో శ్రీకారం చుట్టినవాడు. ఆయన అనువాదాలూ ఇంగ్లీషు నుంచి చేశారు. విలియం కేసర్ రాసిన జాన్ గిల్పిన్ కావ్యాన్ని ఆయన పద్యాల్లో అనువాదం చేశారు. అందులోని సాహిత్యాన్ని కొత్తపల్లి వారు వివరంగా చూపించారు. చెన్నాప్రగడ భానుమూర్తిగారు రచించిన ప్రఖ్యాత ఎలిజీ (ఎలిజీ ఇన్ ఎ కంట్రీచర్చియార్డ్) శైవశ్మశాన విలాపములని అనువాదం చేశారు. ఎలిజీ అనే విలాప కావ్యధోరణి ఆ రకంగా ఇంగ్లీషు నుంచి తెలుగులోకి వచ్చిందని చెప్పవచ్చు. ఆ తరువాత కాలంలో చాలా మంది కవులు తెలుగులో ఎలిజీలు రాశారు. ఆ తరువాత కాలంలో సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్ రచన 'లైట్ ఆఫ్ ఏషియా'ని 'బుద్ధ చరిత్రము' అని అనువాదం చేశారు. కవిత్వ అనువాదాలే కాక వచన రచనలూ అనువాదంలో కనిపించాయి. కిడాంబి రామానుజా చార్యులు ఇంగ్లీషు నుంచి బేకన్ వ్యాసాల్ని 'బేకనుపన్యాస ములు' అని అనువాదం చేశారు. ఇలా ఇంగ్లీషు నుంచి అనువాదాలు చేసుకోవడమే కాక ఇంగ్లీషు తరహాలో వ్యాసాలనీ, వ్యాకరణాలనీ రాయడం కూడా వచ్చింది. సామినేని ముద్దు నరసింహ నాయుడు 'హితసూచని' (1862లోనే) ఈ ధోరణిలో వ్యావహారిక భాషలో రాశారు.

ఆయన ఇంగ్లీషు ఎస్సేకి తెలుగులో 'ప్రమేయము' అన్నారు. ఆ మాటకు తెలుగులో 'వ్యాసము' అని వ్యవహరించిన వాడు బ్రౌన్ దొర. అప్పటిదాకా యీ ప్రక్రియకు ప్రమేయం, సంగ్రహం, ఉపన్యాసం లాంటి మాటలు వ్యవహారంలో వున్నాయి. బ్రౌన్ దొర 'వ్యాసం' అని పేరు పెట్టినప్పట్నుంచి అదే స్థిరపడి ప్రాచుర్యం పొందింది. 'పాశ్చాత్యుల సంపర్కము లేక సర్వము తెలుగులో గల రచనలలో నూటికి తొంబది తొమ్మిది పాళ్ళు – శాస్త్ర గ్రంథములయినను, విజ్ఞానాత్మక రచనలయినను– ఛందో బద్ధములైనవే' అని కొత్తపల్లి వీరభద్రరావు తమ పరిశోధనా గ్రంథంలో రాశారు. పాశ్చాత్య విద్యవల్ల వచన రచనకి జవం జీవం కలిగాయి. లింగం లక్ష్మీజీ పంతులు ఇంగ్లీషు వ్యాకరణ పద్ధతిలో తెలుగు వ్యాకరణం (1863) రాశారు.

ఇలా ప్రక్రియాపరంగా భాషాపరంగా మార్పులు చాలా వచ్చేయి. అంతేకాక అచ్చుకు తూగేలా సంస్కరణలూ వచ్చాయి. దీనికీ నాంది పలికినవాడు బ్రౌన్ దొరగారే. అచ్చులో బ్రౌన్ 'ర'కారం (ప్ర) ని పేరు పడిన దానిని ఆయన ప్రవేశపెట్టారు. అలాగే అర్ధానుస్వార, శకటరేఫలు అవసరం లేదని వాటిని తొలగించాడు. ఈ సంస్కరణతోబాటు ప్రజలని విజ్ఞానమార్గంలో నడిపించడానికి పుస్తక ప్రచురణలని చేపట్టడమూ జరిగింది. అలా రూపు తీసుకున్నదే విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి. కొమర్రాజు లక్ష్మణరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్య దేవర కాళేశ్వరరావు నిర్మాణాత్మక కార్యక్రమం యేదైనా చెయ్యాలని సంకల్పించారు. 'ఆ ఊహల్లోంచే విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి భావం వచ్చింది. 1905లో బీజరూపంలో వున్న యీ భావం కార్యరూపం ధరించింది. 1911 నాటికి 15 గ్రంథాలను ప్రచురించారు. తొలి ప్రచురణ హరి సర్వోత్తమరావు అబ్రహం లింకన్ జీవిత చరిత్ర ఈ గ్రంథమండలి తన ఆశయాలని ప్రకటించింది. 'ప్రకృతి శాస్త్రాది వివిధ విద్యలు జనులకు బోధించుటకు ఆ భాషలో అన్ని విషయాలను గురించిన గ్రంథములను నిర్మించ వలసియున్నది. మాయల్పశక్తి కొలది యాంధ్ర మాతృభాషాసేవ చేయ ప్రయత్నింప వలయుననెడి ఇచ్ఛగలవారమై విజ్ఞాన చంద్రిక మండలియను పేరును భాషాభివృద్ధి సంఘము నేర్పరచినాము. 'దేశచరిత్ర, మహా పురుషులు జీవితములు, ప్రకృతి లేక భౌతికశాస్త్రములు, రాజకీయ ఆర్థిక శాస్త్రములు ఇంగ్లీషులోని సర్వోపయోగ కరమైన గ్రంథమాల యొక్క భాషాంతరీ కరణములను మాత్రమే ప్రచురించదలిచినాము' అని చెప్పారు. భాషాంతరీకరణ గ్రంథాల ప్రచురణ సంస్థను నెలకొల్పడం ఇక్కడి విశేషం. అలాగే ఆంధ్ర ప్రచురణ గ్రంథమాల కొన్ని నవలల్ని ప్రచురించింది. 'దుర్గేశనందిని' లాంటి నవలల్ని ప్రచురించారు. అయితే దేశీయ భాషలైన బెంగాలీ, కన్నడం లాంటి వాటి నుంచి అనువాదాలు చేయించినవి, ఫ్రెంచి 'లేమిజరబుల్స్', 'ఫాస్ట్' లాంటి అనువాదాలనీ ప్రచురించారు.

ఇంగ్లీషు నుంచి అన్ని శాఖలలోనూ అనువాదాలు చాలా ఎక్కువ వచ్చాయి. ఇంగ్లీషు, దేశంలో అనధికార పాలక భాషగా వుండడం వల్ల ఆ భాష నుంచి అధికంగా తెలుగులోకి అనువాదాలు వచ్చాయని చెప్పవచ్చు. అదీకాకుండా ప్రపంచ భాషలన్నిటి నుంచీ మొదటగా అనువాదాలు వెలుగు చూసేది ఇంగ్లీషులోనే. ఆ రకంగా అన్ని భాషల నుంచి ఇంగ్లీషులోకి వచ్చిన గ్రంథాలన్ని యితర భాషలలోకి అనువాదం అవడానికి వీలు కలిగింది. ఇంగ్లీషు భాషకి వ్యాప్తి ఎంత వుందో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. అందుచేత ఏ భాష నుంచి అయినా ఇంగ్లీషులోకి అనువాదం అయితే దానికి ప్రపంచవ్యాప్తంగా ఎందరికో చేరే సానుకూలం కలుగుతుంది.

## అమలిన తారకా సముదాయం

ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అంది వచ్చిన సాహిత్యం, ప్రక్రియలు ఎన్నో ప్రత్యేకంగా పట్టిక ఇవ్వాలంటేనే 'అమలిన తారకా సముదాయంబులనెన్నడం' లాంటిది. అంత మహత్తర భారాన్ని ఇక్కడ తలకెత్తుకోవడం కుదరదు. కాబట్టి ప్రముఖంగా వున్న వాటిని గురించి ప్రస్తావించుకుందాం. ఆంధ్ర గ్రంథమాల ఎన్నో ఇంగ్లీషు నవలల అనువాదాలని ప్రచురించింది. ఒక తరం పాఠకులు ఆ నవలలు చదివి సాహిత్య అభిలాష

పెంచుకున్నారు. శివలెంక శంభుప్రసాదు మహోదయులు ఆ రకంగా చరిత్రలో నిలిచిపోయే కృషి చేశారు. డికెన్స్ టేల్ ఆఫ్ టు సిటీస్ – రెండు మహానగరాలు – పేరుతో తెన్నేటి సూరి చేసిన అనువాదం ముందు సీరియల్ గానూ తరువాత పుస్తకంగానూ వచ్చింది. మార్క్‌ట్వైన్ రచనలు, ఆర్‌ఎల్ స్టీవెన్సన్ రచనలు ప్రచురితమయ్యాయి. హారీబీబెటర్ 'అంకుల్ టామ్స్ కేబిన్' అమెరికా నీగ్రోల దుర్భర జీవితం గురించి కళ్ళకు కట్టినట్లు చిత్రిస్తుంది. మార్గరెట్ మిచెల్ 'గాన్ విత్ ది విండ్' నవల ఒక ఇతిహాస స్థాయి నవల. అది అమెరికన్ అంతర్యుద్ధం నాటి స్థితిగతుల్ని కళ్ళముందు సాక్షాత్కరింపచేస్తుంది. అలాంటి నవల ఇంగ్లీషులోనే ఎన్నో లక్షల ప్రతుల్లో అమ్ముడుపోయింది. ఇటీవలే ఎమ్.వి.రమణారెడ్డి దాన్ని చివరికి మిగిలేది అని అనువదించారు. దక్షిణ భాషా పుస్తక సహకార సంఘం ఫోర్డ్ ఫౌండేషన్ వారి సహకారంతో దక్షిణాది భాషలలో పుస్తకాల అనువాదాలు ప్రచురించేది. ప్రధానంగా అమెరికన్ సాహిత్యం శాస్త్ర రచనలు వుండేవి. దక్షిణ భాషా పుస్తక సంస్థ దక్షిణాది భాషలలో గ్రంథాలను చౌకగా ప్రచురించాలన్న సంకల్పంతో ముందుకొచ్చింది. ఫోర్డ్ ధర్మసంస్థ నిధి వారు ఈ సంస్థ నిర్మాణాన్ని తలపెట్టారు. 'ఉన్నత సారస్వత శ్రేణికి చెందిన స్వతంత్ర రచనలనే కాకుండా వైజ్ఞానిక సాంస్కృతిక గ్రంథాలనూ ప్రపంచ సారస్వతంలోని ఉత్తమ గ్రంథాలనూ కూడా ప్రచురించడం' వీరి ప్రధాన లక్ష్యం. 'ఒక్క మాటలో చెప్పాలంటే ఉత్తమ గ్రంథాలను చౌకగా అందించడం దక్షిణ భాషా పుస్తక సంస్థ వారి పరమాశయం' అని సుప్రసిద్ధ రచయిత న్యాయ మూర్తి పాకాల రాజమన్నారు తొలి మానవులు (అనువాదం: వేమరాజు భానుమూర్తి) అనువాదానికి 'పరిచయం'లో రాశారు. ఈ గ్రంథం ఇర్వింగ్, హాన్నాగోల్డ్మన్ రాసిన 'ఫస్ట్ మాన్'కి అనువాదం. ఇలా ఆ సంస్థ విశేషమైన కృషిచేసింది.

## రష్యన్ వరద!

ఇంగ్లీషు తర్వాత అనువాదాల ద్వారా తెలుగులోకి అత్యధికం గా గ్రంథాలు వచ్చింది రష్యన్ భాష నుంచి. రష్యన్ విప్లవం తరువాత భారతదేశంలో రష్యన్ సాహిత్యం పట్ల ఆసక్తి పెరిగింది. 1921 లోనే 'ఆంధ్ర పత్రిక' సంవత్సరాది సంచికలో 'సోవియట్టులు' అనే శీర్షిక కింద 8 పేజీల వ్యాసం ప్రచురిం చింది. అప్పట్లో వార్తలకీ, వ్యాఖ్యలకీ పాఠకులు ఆధారపడిన పత్రిక అది ఒక్కటే. రాజకీయ వార్తలతోపాటు సాహిత్య విశేషాలనీ అదే అందించేది. రష్యన్ సాహిత్యం మొదట్లో కొందరు ప్రచురణకర్తల కృషితో అందుబాటులోకి వచ్చింది. ఆదర్శ గ్రంథమండలి గోర్కీ రాసిన అమ్మ నవలను తెలుగులో ప్రచురించింది. దాన్ని క్రొవ్విడి లింగరాజు అనువాదం చేశారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో అది ప్రజలలో ఉత్తేజాన్ని కలిగించింది. రష్యాలో విప్లవం రాక పూర్వమే గోర్కీ దాన్ని రాశాడు. దానికి ఒక చరిత్ర యూరప్ లో అప్పటికే వుంది. విశ్వసాహిత్యమాల వారు గోర్కీ 'నా బాల్యం' 'గోర్కీ కథలు', 'టాల్‌స్టాయ్ కథలు', 'చెహోఫ్ కథలు', షొలహోవ్ నవల 'బీళ్ళు దున్నేరు', అనేక కథల సంపుటాలని ప్రచురించారు. కథలతో బాటు విశ్వసాహిత్యమాల వారు మనోరంజకమైన రష్యన్ నాటకాలను కూడా ప్రచురించారు. 'భయం', 'బలిదాన్', 'విజ్ఞాని పొలోవ్', 'ప్రతీకార జ్వాలలు', 'దక్షిణ పవనం', 'సోవియట్ స్త్రీ' లాంటివన్నీ అలా వచ్చినవే. టాల్‌స్టాయ్ రాసిన 'జీసస్ సందేశం' కూడా ఆ కాలంలోనే వచ్చింది. దేశీయ తత్త్వశాస్త్ర గ్రంథాల తోబాటు రష్యన్ సాహిత్యాన్ని తెలుగులో విస్తృతంగా అనువాదం చేసుకున్నారు. 'ఇంద్రధనుస్సు', 'ఆదర్శప్రేమ' దేశభక్తి ప్రబోధించే ఉత్తమ నవలలుగా గుర్తింపు పొందాయి. టాల్ స్టాయ్ రాసిన ప్రపంచ ప్రఖ్యాత నవలలన్నీ ఈ రోజున ఆంధ్ర పాఠకులకు అందుబాటులో వున్నాయి. దాస్తొయెవస్కీ, కుప్రిన్, చెహోరీవ్, గొగోల్, గోర్కీ, షొలహోవ్ లాంటి ఉద్దండుల రచనలన్నీ తెలుగు పాఠకులని అందుబాటులోకి వచ్చాయి.

## ఇలా మొదలైంది!

రష్యన్ సాహిత్యం పట్ల ఆసక్తి అలా కలిగింది. ఆ ఆసక్తిని అలానే నిలబెట్టటానికా అన్నట్టు అక్కడి విదేశీ ప్రచురణాలయం తెలుగులో కూడా అనువాదాలు చేయించి ప్రచురింపచెయ్యాలని సంకల్పించింది. ఆ సంస్థే తర్వాత ప్రగతి ప్రచురణాలయంగా మారింది. తెలుగు అనువాదకుల్ని అక్కడకు తీసుకువెళ్ళి రాజ కీయ, తత్త్వశాస్త్ర గ్రంథాల అనువాదాలు చేయించి ప్రచురిం చింది. దీంతో సాహిత్య అనువాదాలనీ, చిన్న పుస్తకాలనీ, విజ్ఞాన శాస్త్ర గ్రంథాలనీ ప్రచురించేది. స్వెత్లానా తెలుగు శాఖ అధిపతిగా చేసిన కృషికి తెలుగువారు ఆమెకి రుణపడి వున్నారు. ఆవిడ తెలుగు శాఖకు అధిపతిగా బాధ్యతలు చేపట్టే నాటికి ఆవిడకు తెలుగు భాష అనేది ఒకటున్నదని కూడా తెలియదు. ఆ ప్రచురణాలయం ఆవిడని తెలుగు నేర్చుకొమ్మని పురమాయించింది. 'ఆ భాష తెలిసిన వాళ్ళు ఎవరన్నా ఇక్కడ ఉన్నారా' అని ఆవిడ ఆరా తీసింది. ఆ రకంగా అప్పటికే సోవి యట్ యూనియన్లో స్థిరపడిన కొలచల సీతారామయ్య పరిచ యం అయ్యారు. ఆయన ఉయ్యూరు వాసి. మొదట అమెరికా వెళ్ళారు. అక్కడ నుంచి సోవియట్ యూనియన్ వెళ్ళారు. ఇంధన తైలాల పరిశోధన చేసి ప్రఖ్యాత శాస్త్రజ్ఞునిగా ఖ్యాతి గడించారు. రష్యన్ పేరు పెట్టుకుని అక్కడి యువతినే వివాహం చేసుకున్నారు. తన కూతుళ్ళకి నీల, లీల అని పేర్లు పెట్టుకున్నారు. ఆయన ఆవిడకు తెలుగు నేర్పారు.

అలా మాస్కో ప్రగతి ప్రచురణాలయంలో తెలుగు శాఖకు బీజావాపన జరిగింది. అప్పటి నుంచి తెలుగు అనువాదకులు

అక్కడ పనిచేస్తూ వచ్చారు. ఉప్పల లక్ష్మణరావు, కొండేపూడి లక్ష్మీనారాయణ, రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.) నిడమర్తి ఉమారాజేశ్వరరావు, ఆర్వియార్ అక్కడ పనిచేసి ఎన్నో గ్రంథాలని తెలుగులోకి అనువాదం చేశారు. గోర్కీ 'అమ్మ' అక్కడ మళ్ళీ ముద్రితం అయింది. టాల్ స్టాయ్ నవల 'అన్న కరేనిన' అనువాదం వచ్చింది. అంతకుముందే ఎప్పుడో తాపీ ధర్మారావు ఈ నవల సంక్షిప్త భాగాన్ని అనువాదం చేశారు. కాని మాస్కో అనువాదం పూర్తి నవలగా వెలువడింది. 1970లో శ్రీశ్రీ మయకోవస్కీ లెనిన్ కావ్యాలను అనువాదం చేశారు. మాస్కోలో తెలుగు అనువాదాల ప్రచురణే కాక తెలుగును బోధించడం జరిగింది. చాలా మంది రష్యన్లు తెలుగు నేర్చుకుని రష్యన్‌కి తెలుగు నుంచి అనువాదాలు చేశారు. మాస్కో రేడియోలో కూడా తెలుగు ఛానల్ పెట్టారు. లెనిన్ గ్రాడ్ యూనివర్సిటీలో తెలుగు శాఖ వుండేది. ప్రొఫెసర్ గురోవ్ ఎంతమందికో శిక్షణనిచ్చారు. దానివల్ల మరెంత మందో ప్రచురణాలయంలో పని చెయ్యడానికి వీలు కలిగింది. ప్రగతి ప్రచురణాలయం ఆ తరువాత రెండుగా విభజితమైంది. రాదుగ ప్రచురణాలయం ఆవిర్భవించింది. ఈ సంస్థలతో మీర్ ప్రచురణాలయం శాస్త్ర సాంకేతిక గ్రంథాల తెలుగు అనువాదాల్ని ప్రచురించేది. అనేక సోవియట్ డాక్యుమెంటరీలు తెలుగు డబ్బింగ్‌లో ఆంధ్ర దేశమంతటా ప్రదర్శనకు నోచుకున్నాయి. ఇలా రష్యన్ – ఇంగ్లీషు గ్రంథాలు అనువాదమై తెలుగు నేల మీద ప్రాచుర్యం పొందాయి.

### మరెందరో మహానుభావులు!

వీటితోబాటు ఫ్రెంచి, జర్మన్ భాషలలో ప్రసిద్ధి పొందిన రచయితల గ్రంథాలు తెలుగులో వెలువడ్డాయి. విక్టర్ హ్యూగో, బాల్జాక్, మపాసా లాంటి మహనీయుల రచనలు తెలుగులో వచ్చాయి. మోలియర్ నాటకాలు తెలుగులోకి అనువాదమయ్యాయి. ఫ్రెంచి కవిత్వం కూడా తెలుగులోని అనువాదం అయింది. డాడాయిజం, క్యూబిజం, సర్రియలిజం లాంటి అనేక 'ఇజాల'కి తెలుగులో చోటు దొరికింది. శ్రీశ్రీ 'అధివాస్తవికుల ప్రవేశం' అంటూ పద్యాలే రాశారు. కొన్ని ఫ్రెంచి కవితలనీ అనువాదం చేశాడు. జర్మన్ భాష నుంచీ అనువాదాలు వచ్చాయి. ముఖ్యంగా చెప్పుకోవలసినవి బెర్టోల్ట్ బ్రెక్ట్ నాటకాలు. ఇలా పాశ్చాత్య భాషల నుంచి ఎన్ని శాఖల నుంచో తెలుగులోకి అనువాదాలు వచ్చాయి. అయితే ఈ అనువాదాలన్నీ ఆ మూలభాషల నుంచే నూటికి నూరుపాళ్ళు వచ్చాయని చెప్పడానికి లేదు. ఇంగ్లీషు భాష నుంచి నేరుగా తెలుగులోకి అనువాదం చేసుకునే సౌలభ్యం వుంది. కాని రష్యన్, ఫ్రెంచి, జర్మన్ భాషల నుంచి అనువాదాలు ఎక్కువగా ఇంగ్లీషు మాధ్యమం ద్వారా వచ్చాయి. ఫ్రెంచి, జర్మన్ భాషలు అనువాదకులకు రావని కాదు. ఆ భాషలు తెలిసిన వాళ్ళు వున్నా మూలం నుంచి అనువాదం చేసేటంత పటిమ వుండకపోవచ్చు. ఆ కారణంగా ఇంగ్లీషు భాషలో ఆ భాషల గ్రంథాలు వెలువడితే వాటి ఆధారంగా తెలుగులో అనువాదం చేసుకోవడం జరిగింది. దీనివల్ల కొన్ని సందర్భాల్లో ఇబ్బంది ఎదురవకపోలేదు. సంజ్ఞావాచకాలకి సంబంధించి ఈ చిక్కు ఎదురైంది. ఉదాహరణకు ప్రఖ్యాత రచయిత టాల్ స్టాయ్ నే తీసుకుందాం. రష్యన్లో 'ట' ధ్వని లేదు. ఆయన వంశం పేరు 'తోల్ స్తయ్', 'లేవ్' ఆయన పేరు. కౌంట్ లియో టాల్‌స్టాయ్‌గానే మన దేశభాషలలో వ్యవహరిస్తూ వుంటారు. ఇంగ్లీషు నుంచి సంక్రమించిన ఉచ్చారణ వల్ల టాల్ స్టాయ్ అని తెలుగులో మారుస్తున్నారు. రూఢిలో ప్రసిద్ధమైన ఈ పేరుకు బదులుగా 'తోల్ స్తయ్' అని అసలు రష్యన్ ఉచ్చారణ రాస్తే తెలుగు పాఠకులకి వింతగా అనిపించవచ్చు. అలాగే 'స్టాలిన్'. 'స్తాలిన్' అనాలి. కాని స్థిరపడిపోయిన సందర్భంలో మార్పు చేయడం కష్టం. ఇలాంటి చిక్కులు నేరుగా మూలం నుంచే అనువాదం చేసుకుంటే బాధించవు.

### ఇటు నుంచి అటు

పాశ్చాత్య భాషల నుంచి తెలుగులోకి వచ్చిన అనువాదాల గురించే ముచ్చటించుకున్నాం కాని తెలుగు నుంచి ఆ భాషల్లోకి జరిగిన అనువాదాల సంగతి మిగిలే వుంది. తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనువాదాలు జరిగాయి. ప్రపంచవ్యాప్త గుర్తింపు దక్కాలంటే ఇంగ్లీషులోకి అనువాదం కావలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకుగాను విశ్వ విద్యాలయాలు, ప్రముఖ సాహిత్య సంస్థలు, ప్రచురణ సంస్థలూ ఎంతో కృషి చెయ్యాలి. అలాంటి కృషి జరిగితే తెలుగు సాహిత్య ఔన్నత్యం అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడుతుంది.

తెలుగు నుంచి ఇంగ్లీషులోకి ప్రాచీన కావ్యాల దగ్గర్నుంచి ఆధునిక రచనల దాకా అనువాదం అవుతూ వున్నాయి. ఇటీవలి కాలంలో వీటి సంఖ్య పెరుగుతూ వచ్చింది. తెలుగు కావ్యాల అనువాదమూ జరిగింది. వెల్చేరు నారాయణరావు, డేవిడ్ షుల్మన్ "క్లాసికల్ తెలుగు పొయిట్రీ" అని కొన్ని అనువాదాలు చేశారు. శ్రీనివాస్ శిష్టా శ్రీకృష్ణ దేవరాయల వారి 'ఆముక్త మాల్యద'ని, అల్లసాని పెద్దనామాత్యుని 'మనుచరిత్ర'ను పూర్తిగా అనువాదం చేశారు. ఇంతటి బృహత్తరమైన కృషి ఎలా జరిగిందీ ఆయనే 'పర్సనల్ నోట్'లో వివరించారు. (దృశ్య కళాదీపిక ప్రచురణ). శ్రీశ్రీ తన కవిత్వాన్ని ఇంగ్లీషులోకి 'థ్రీ ఛియర్స్ ఫర్ మాన్'గా అనువాదం చేసుకున్నాడు. కాని అది ఆ భాషలో అంతగా అలరించలేదని విమర్శకులు అంటారు. అనువాదాలకి సంబంధించి ఇలాంటి సొద్దులు అందరికీ అన్నివేళలా వుంటూనే వుంటాయి. ఇవాల్టికీ మకుటాయమానంగా వున్న గురజాడ 'కన్యాశుల్కం' నాటకం ఇంగ్లీషులోకి అనువాదం అయింది. ఎస్.ఎస్.జయంతి (మిగతా 39వ పేజీలో)

# తొలగిన స్వర్గం

## వింతగా అనిపించని సోవియట్ పరిణామాలు

రాకేందు బింబమై రవి బింబమై యొప్పు
నీరజాతేక్షణ నెమ్మొగంబు
కందర్పకేతువై ఘనధూమకేతువై
యలరు పూబోడి చేలాంచలంబు
భావజు పరిధియై ప్రళయార్కు పరిధియై
మెరయు నాకృష్టమై మెలత చాప మమృత
ప్రవాహమై యనల సందోహమై
తనరారు నింతి సందర్శనంబు
హర్షదాయియై మహారోషదాయియై
పరగు ముద్దరాలి బాణవృష్టి
హరికి అరికి జూడ నందంద శృంగార
వీరరసములోలి విస్తరిల్ల

అని 'భాగవతం' దశమ స్కంధంలో నరకాసుర సంహార ఘట్టంలో సత్యభామ శ్రీ కృష్ణునికి, నరకాసురునికి కనిపించిన తీరుని పోతనగారు వర్ణించేరు. 'హరికి అరికి' అంటే శ్రీ కృష్ణునికీ, శత్రువైన నరకాసురునికీ పరస్పర విరుద్ధంగా కనిపించింది సత్యభామ. ఒకళ్ళకి అమృత ప్రవాహమైతే, యింకొకళ్ళకి అనల సందోహమై ఆమె దర్శనం గోచరించింది. ఒకే వ్యక్తి యింత పరస్పర విరుద్ధంగా దర్శనమిచ్చినట్లే సోవియట్ యూనియన్ కూడా అభిమానులకి – ప్రత్యర్థులకీ కనిపించింది. అభిమానులు సోవియట్ యూనియన్ 'సోషలిస్టు' పాలనలో దోషం లేశమాత్రంగా నేనా చూడలేకపోతే ప్రత్యర్థులు దోషం తప్ప వేరే యేమీ చూడలేదు. సోవియట్ రష్యా, సోషలిస్టు రష్యా కలిసి సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కుల సమాఖ్య ఏర్పడింది.




1917 అక్టోబరు విప్లవంతో చరిత్ర మలుపు తిరిగింది. సిద్ధాంత రూపంలో వున్న సోషలిజం ఆచరణలో రూపు తీసుకోవడానికి నాందీ ప్రస్తావన జరిగింది. సోషలిజం సిద్ధాంత దశలో వున్నప్పుడు అనేక ప్రతిఘటనలని ఎదుర్కొంది. ఆచరణలో అమలు జరగడానికి ఉద్యుక్తమైనప్పుడు అనేక ప్రతిఘటనలని ఎదుర్కోవాల్సివచ్చింది. సిద్ధాంత రూపంలో ఉన్నపుడు ప్రతిఘటన బౌద్ధిక తార్కికస్థాయికి పరిమితమై వుండేది. ఆచరణకు దిగేటప్పటికి భౌతిక ప్రతిఘటన భరించాల్సి వచ్చింది. అంటే హింస, రణం, మరణం లాంటివాటిని, 'వాగ్యుద్ధం' పోయి అసలు 'యుద్ధం'లో తనని తను రక్షించుకోవాల్సి వచ్చింది. సిద్ధాంత ఘర్షణలు, అభిప్రాయ స్పర్థలు, మతవైరుధ్యాలు, చరిత్రలో అంతకుముందు లేవని కాదు, ఉన్నాయి. అవి భౌతిక ప్రతిఘటనలని ఎదుర్కోలేదనీ కాదు. ఎదుర్కొన్నాయి.

కాని 'సోషలిజం' ఎదుర్కొన్నంత కర్కశ, క్రూర, దుర్భర పరిస్థితుల్ని చరిత్రలో ఏ సిద్ధాంతమూ ఎదుర్కోలేదు. దీనికి కారణం యేమిటి? శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతం సమాజంలోని వర్గ యెలా ఏర్పడ్డాయో వివ రించింది. వాటిని ఎలా తొలగించాలో దారి చూపించింది. ప్రపంచాన్ని గురించిన నిర్వచనాలతో, వ్యాఖ్యలతో, విమర్శలతో సరిపెట్టుకోక 'ప్రపంచాన్ని మార్చడం' తన ధ్యేయంగా చాటుకొంది.

### అసమానతలు

'ప్రపంచాన్ని మార్చే సిద్ధాంతం వొట్టి సిద్ధాంతంగా కూర్చోక గద్దె యెక్కి కూర్చుంటే యింకేమన్నా వుందా? 'పుట్టకీట్లు కదిల్చే విద్య జనం బుర్రలకెక్కితే యింకే మన్నా వుందా? 'వడ్డించిన విస్తరి'లా జీవితం సాగే 'అదృష్టవంతుల' బతుకు అధ్వాన్నమైపోదూ? అనాధలూ, అభాగ్యులూ తీవ్ర శ్రుతిలో, తీవ్ర ధ్వనితో విప్లవ శంఖం

వినిపిస్తే అల్లకల్లోలమైపోదూ? అంచేత సోవియట్ సోషలిస్టు రాజ్యాన్ని అంతమొందించాలి. అందుకుగాను పెట్టుబడి కూటాలు కట్టుకట్టేయి. కుట్రలూ కుహకం చెలరేగేయి. చతుర్విధోపాయాలూ చాలలేదు. సోవియట్ వ్యతిరేక పక్షం అలా మోహరించింది. యిటుపక్క, విప్లవ శిశువు పురిట్లోనే అరిష్టం కొట్టి హరీ అంటుందేమోనని ఆందోళన చెందేరు అభాగ్యులూ, అనాథలూ, విప్లవం వల్ల బాగయేది వాళ్ళ జీవితాలే కదా! సోవియట్ రాజ్యాన్ని రక్షించుకోవాలని నడుం కట్టేరు. సోవియట్ యూనియన్ వ్యవస్థ మీద ఈగ వాలనియ్య లేదు. 'అసత్య ప్రచారాల రేడియో బాకాల' నోరు మూయించాలని ఇంకా తీవ్ర శ్రుతిలో విప్లవ శంఖాలు వూదేరు. దాంతో సోవియట్ సోషలిస్టు రాజ్యం పరస్పర విరుద్ధమైన అంచనాలకి తావు అయింది. 'తిట్లు శాప నార్థాలూ ఎంత మితిమీరి కురిశాయో వంది మాగధ స్తోత్రాలూ, భజనలూ కూడా అంత మితి మీరి హోరెత్తాయి. ఈ రెండూ శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతం ఆచరణలో వున్న ఫోకస్ మీదనే. ఆచరణలో సోషలిజం విజయాలు సాధిస్తే, 'ప్రపంచాన్ని మార్చాలను'కుంటున్న సిద్ధాంతం పాతుకుంటుందని, తమకి ముప్పు వస్తుందని సాఫీగా జీవితం సాగిపోయే 'అదృష్టవంతులు' అయిన వాటినీ, కాని వాటినీ ఎత్తి ఎద్దేవా సాగించేరు. నవ సమాజ నిర్మాణ స్వప్నం ఎక్కడ చెదిరిపోతుందోనని చరణలో లోపాల్ని ఉపేక్షించేరు సోవియట్ అభిమానులు. సోవియట్ 'సోషలిస్టు' ఆచరణలో తప్పిదాలు, లోటుపాట్లు, సిద్ధాంతంతో పొసగని అసంగతాలు వున్నా అవన్నీ, అంతర్జాతీయ ఐక్య లక్ష్య సిద్ధికి తప్పనిసరి నైవేద్యాలు అని నమ్మేరు. అసలు లోటుపాట్లే వున్నాయని అనడమే సోవియట్ వ్యతిరేక వైఖరి అనీ, అదే సోషలిస్టు వ్యతిరేక వైఖరి అని కూడా అభిమానులు చిత్రించేరు. దాంతో సోవియట్ భక్తి స్థాయి మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అనుసరించే వాళ్ళ నిజాయితీకి కొలమానం అయింది.

ఈ విధంగా సోవియట్ యూనియన్ ప్రపంచ దేశాల్లో ఉత్సుకతని రేపిన దేశం అయింది. అగ్రరాజ్యంగా గణన పొందింది. ఈ దేశాన్ని చూసి అసలు విశేషం ఏమిటో తెలుసుకోవాలని అన్ని రకాల వాళ్ళూ ఆత్రపడ్డారు. సోవియట్ సోషలిస్టు రాజ్యం ఆవిర్భవించిన నాటి నుండీ పాశ్చాత్య దేశాల మేధావులైతేనేం, శ్రామికులైతేనేం, విముక్తి పోరాటం సాగించే దేశ నేతలైతేనేం, విముక్తి పొందిన దేశాల నాయకులైతేనేం అసంఖ్యాకంగా సోవియట్ యూనియన్‌ను దర్శించేరు. తమ అనుభవాలు గ్రంథస్థం చేశారు. సోవియట్ సోషలిస్టు దేశం పెద్ద కుతూహల కారకమైంది.

అట్టడుగు అగాధాల నుంచి కష్ట జీవుల కమ్యూనిజంలోని కొస్తారు. గనుల గర్భాల నుండి కొడవళ్ళలోంచి కార్ఖానాల నుంచి నేను సమున్నత కవితా శిఖరాల నుంచి కమ్యూనిజంలోకి దూకుతాను. ('గృహోన్ముఖంగా' మూలం – మయకోవ్స్కి, అనువాదం శ్రీశ్రీ.) అని వ్లదిమీర్ మయకోవ్స్కీ కమ్యూనిజం పట్ల తమ ప్రేమని చాటుకున్నాడు. కష్టజీవులని జీవితమే కమ్యూనిజం పట్ల ఆకర్షితులయేటట్టు నడిపిస్తుంది. 'శ్రమ జీవుల కళ్ళల్లో ఏమిటి ఆ ఆవేదన? కమ్యూనిస్టు పార్టీలో ఏమిటి ఆ ఆకర్షణ?, అని 'సవ్యసాచి'లో మాన్యులు వై.ఈశ్వరరెడ్డి గారు రాసిన జ్ఞాపకాలకి సంపాదకులు రా.రా. గారు శీర్షిక పెట్టారు. ఎంత కదిలించేట్టు శీర్షిక పెట్టారండీ అని నేను అంటే 'అన్న అంతవాడు తను ఎలా కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితుడైందీ రాస్తూ వుంటే శీర్షిక కదిలించేట్టు వుండదా?' అన్నారాయన.

తమ జీవిత సమస్యలకు పరిష్కారం చూపించే కాంతి కమ్యూనిజంలో కష్టజీవులకి కనిపించి వాళ్ళు ఆకర్షితులవుతారు. 'జీవితపు చిక్కుముడుల్ని' విడగొట్టి, మనిషి జీవితాన్ని నడిపించే శక్తులేవో తెలియజేసే సిద్ధాంతం మార్క్సిజం అని సిద్ధాంత అధ్యయనం చేసిన వాళ్ళు కమ్యూనిజం వైపు ఆకర్షితులవుతారు. మయకోవ్స్కి లాగా 'సమున్నత కవితా శిఖరాల నుంచి' కాకపోయినా సిద్ధాంతాన్ని నమ్మి కమ్యూనిజంలోకి వస్తారు. రాజకీయంగా పార్టీ సభ్యత్వం తీసుకున్నా, తీసుకోకపోయినా జీవితానికి అర్థం వివరించే సిద్ధాంత దర్పణంగా మార్క్సిజాన్ని యెన్నిక చేస్తారు. ఇరవయ్యో శతాబ్దంలో మార్క్సిస్టు సిద్ధాంతం నెహ్రూగారి లాంటి మహనీయులతో సహా యెందర్నో ప్రభావితం చేసింది. అలాంటి సిద్ధాంతాల్ని ఆచరణలో 'లోకానికి చేరువ'గా తీసుకురాదలిచిన సోవియట్ యూనియన్ పట్ల అభిమానం కలిగిందంటే ఆశ్చర్యం లేదు.

**మేం విద్యార్థులుగా వున్నప్పుడు సోవియట్ యూనియన్ గురించి చదివేవాళ్ళం. ప్రపంచ నియంతలలో హిట్లరు, ముసోలినీల గురించి రాస్తూ పక్కనే స్టాలిన్ సోవియట్ రాజ్య నియంతలు అని రాసేవాళ్ళు. అప్పుడు టీచర్లతో వాదించేవాళ్ళం. సోవియట్ రాజ్యం నియంతృత్వం కాదనీ, స్టాలిన్ నియంత కాదనీ పట్టుగా అంటూ వుండేవాళ్ళం. శ్రామిక వర్గ నియంతృత్వం అనీ, కేంద్రీకృత ప్రజాస్వామ్యం అనీ, సిద్ధాంతం చదువుకున్న వాళ్ళం కదా! కాని మా వాదాలు ఉద్రేకంగానే ఉండిపోయేవి తప్ప అవతలి వాళ్ళను ఒప్పించగలిగేటట్టు వుండేవికావు.**

అలాగే సోవియట్ యూనియన్లో మనిషికి చొరవ వుండదనీ, యంత్రవతుగా పని చేస్తారనీ విమర్శలు వినవస్తే అది సరికాదనీ, క్రమశిక్షణతో సొంత లాభం కాక సమాజహితం కోసం పని చేస్తారనీ వాదిస్తూ వుండేవాళ్ళం. అదో పోలీసురాజ్యం అనీ, అందరి మీదా నిఘా వుంటుందనీ విమర్శించేవాళ్ళకి, ప్రజాద్రోహులకీ, శత్రువులకీ అలాగే కనిపిస్తూ ఉంటుందని యెదురు చెప్పేవాళ్ళం. పెట్టుబడిదారీ

దేశాల్లో వ్యక్తి తన బాగోగులే చూసుకుంటాడు. ఎవడెల్లా పోతేనేం నాకు మాత్రం శ్రీరామరక్ష అనుకుంటూ వుంటాడు. తనకి లాభం వస్తుందని లీలగా కనిపించినా స్నేహం, బంధుత్వం తోడు నీడ చూడకుండా తడిగుడ్డతో గొంతు నులిమేస్తారు. సొంత ఆస్తి, వర్గ సంబంధాలు, వర్గ సంఘర్షణ వుంటాయి కాబట్టి పెట్టుబడిదారీ దేశాల్లో అలా వుంటుందని చదువుకున్న వాళ్ళవడం చేత అలా అని నమ్మేవాళ్ళం. సోషలిజంలో మనిషి పనులకు అలాంటి స్వలాభం ప్రేరకంగా వుండదు కాబట్టి ఆత్మీయత, ఆప్యాయత తొణికిసలాడుతూ వుంటాయని అనుకునేవాళ్ళం. అప్పటి సోవియట్ నేత కృష్చేవ్ ఐక్యరాజ్యసమితి సమావేశాలకి న్యూయార్క్ వెళ్ళేడు. సోవియట్ నౌక నుంచి వో సోవియట్ నావికుడు డిఫెక్ట్ అయేడట. పత్రికల వాళ్ళందరూ కృశ్చేవ్ని ప్రశ్నలతో ముంచెత్తారు. అప్పటి దాకా ఆ నావికుడు ఫిరాయించిన విషయం కృశ్చేవ్‌కి తెలీదు. తెలిసిన వెంటనే ఆయన 'అయ్యో! యెంత పనిచేశాడు? నా దగ్గరికి వచ్చి వుంటే పది రూబుళ్ళు ఇచ్చి పంపి వుండేవాణ్ణి. మీ దేశంలో డబ్బులేక మలమలమాడి చచ్చిపోతాడు పాపం!' అన్నాడట. నిజమే మరి! పెట్టుబడిదారీ దేశాల్లో కాసులేనివాడు వీసం పనికిరాడు. డబ్బు పెత్తనం చెలాయించే పెట్టుబడిదారీ విధానం గురించి చదువుకున్న వాళ్ళం కాబట్టి ఈ పాయింట్‌ను వెంటనే అర్థం చేసుకున్నాం. సోషలిజంలో వుండే మానవత్వం మనిషిని అవసరాల నుంచి విముక్తి చేసే మానవత్వం, యిక్కడ డబ్బు పెత్తనం వుండరాదు మరి.

సోవియట్ యూనియన్లో నిరుద్యోగం లేదని. తిండికి బట్టకి దేబరించే స్థితి లేదని సోవియట్ వ్యతిరేకులు కూడా ఒప్పుకున్న విషయం. సోషలిస్టు సిద్ధాంతం ఆచరణలో అమలు జరుగుతున్నట్టే కదా మరి! అలాంటి దేశం యెలా వుంటుందో చూడాలన్న కోరిక సహజంగా వుంటుంది. సోవియట్ యూనియన్ని దర్శించే అవకాశమే కాక, అక్కడే వుండి పనిచేసే అవకాశమూ నాకు కలిగింది. పదేళ్ళు అక్కడ కుటుంబంతో వున్నాను. అక్కడి జీవితం పరిశీలించడం మాత్రమేకాదు. అక్కడ వుండి అనుభవించాం. అంచేత 'సోషలిస్టు దేశంలో జీవితం, సోషలిస్టు సిద్ధాంతం యెంత మేరకి సమసించేయో చూడగలిగాం. వొట్టి సిద్ధాంతం మేరకే చదువుకుని దాని ఆచరణ గమనించలేని వారికి యే వొడిదుడుకులు యదార్థంలో తలెత్తినా ఆశ్చర్యం కలుగుతుంది. ఆచరణలో ఆ జీవితాన్ని అనుభవించినవాళ్ళకి అలా ఆశ్చర్యం కలగదు. అంచేతనే యీనాటి సోవియట్ పరిణామాలు మాకు వింతగా అనిపించలేదు.

**(తొలగిన స్వర్గం పుస్తకంలోని మొదటి పేజీలు)**

# అనువాదం.. భిన్నభాషల మధ్య వారధి

**(36వ పేజీ తరువాయి)**

అనువాదం చేశారు. ఆ తర్వాత ఇంకా రెండు, మూడు అనువాదాలు ఇంగ్లీషులోకి వచ్చాయి. కథలూ, కవిత్వమూ ఫరవాలేదు అనే స్థాయిలోనే ఇంగ్లీషులోకి అనువాదం అయ్యాయి. 'మోడర్న్ తెలుగు షార్ట్ స్టోరీస్' అన్న పేరుతో ఒక సంకలనాన్ని వి.పతం జలి, ఎ.మురళీధర్ కూర్చారు. దాన్ని జైన్ పబ్లిషర్స్ ప్రచురిం చింది. 'ఎనదర్ బంచ్ ఆఫ్ తెలుగు స్టోరీస్' అని ఎమ్.వి. శాస్త్రి తెలుగు కథలు ఇంగ్లీషు అనువాదాలని ప్రచురించారు. 'దట్ మేన్ ఆన్ ది రోడ్' అని వి.పి.రంగారావు అనువాదం చేసిన తెలుగు కథల సంకలనాన్ని 'పెంగ్విన్ బుక్స్' ప్రచురించింది. ఆయన అంతకుముందు 1995లో 'క్లాసిక్ తెలుగు షార్ట్ స్టోరీస్' అన్న సంకలనాన్ని కూర్చారు. దగ్గర దగ్గర 36 మంది రచయితల కథలు యీ రెండింటిలోనూ వచ్చాయి. ఇటీవలే వేల్చేరు నారాయణరావు డేవిడ్ షుల్మన్‌చాసో (చాగంటి సోమ యాజులు) కథల్ని ఇంగ్లీషులోకి అనువాదం చేసి ప్రకటించారు. ఆ సంకలనానికి 'డాల్స్ వెడ్డింగ్' అని పేరు పెట్టారు. అందులో 20 కథలు వున్నాయి. వెల్చేరు నారాయణ రావు కవిత్వ అనువాదాన్ని ప్రచురించారు. గురజాడ కన్యాశుల్కం ఇంగ్లీషు అనువాదాన్ని తీసుకు వచ్చారు. మాక్మిలన్ సంస్థ కూడా తెలుగు అనువాదాలని ప్రచురించింది. కవిత్వం అనువాదాలలో శ్రీశ్రీ తనే అనువాదం చేసుకున్న విషయం ప్రస్తావించుకున్నాం. శ్రీశ్రీ, దాశరథి, తిలక్ లాంటి వారి కవితల్ని ఎస్.ఎస్. ప్రభాకరరావు అనువాదం చేశారు. కలకత్తా రైటర్స్ వర్క్ షాప్ వారు ప్రచురించారు. తెలుగు నుంచి రష్యన్ లోకి కథలు, కవిత్వం అనువాదం అయ్యాయి. జోర్సెబ్తున్నిచేవ్ గురజాడ కవితల్ని, కన్యాశుల్కంను, కొడవటిగంటి కుటుంబ రావు కథల్ని రష్యన్లోకి అనువాదం చేశారు. ఓ సంకలనానికి కాళీపట్నం రామారావు 'జీవధార' కథని శీర్షికగా పెట్టారు. ఇలా చెప్పుకోవాలంటే యీ వ్యాసం సరిపోదు. ఇక్కడ గమనించ వలసిన ముఖ్యమైన అంశం యేమిటంటే అనువాదాలు భిన్న భాషల మధ్య, సంస్కృతుల మధ్య ఎలా వారధులుగా పనిచేస్తున్నాయన్నదే. ప్రచురణ సంస్థలూ ఈ మహాయజ్ఞంలో తమ వంతు కృషి చేస్తున్నందుకు అభినందించాలి. ఈ కృషి యిలానే సాగుతూ మరింతగా ఫలవంతం కావాలని కోరదాం. ❑

**(మిసిమి-2013 డిసెంబరు సంచిక)**

# ఆలోచనామృతం

**ముందు మాటలు**

## చందు సుబ్బారావు : చందన చర్చ

**మిత్రులు చందు సుబ్బారావు భూభౌతికశాస్త్రవేత్త. ఆ శాస్త్రం కేవలం Mundane అంటే లౌకిక సంబంధమైంది. ఆ శాస్త్రంలో ఆచార్యుడైన చందుకి Spiritual Gifts అని పరిగణించే సాహిత్య కళారంగాల్లో యింతటి ప్రవేశం వుండటం సాటి శాస్త్రవేత్తలకు బోధపడని విషయం. సాహిత్య ప్రయోజనం ఏమిటో తెలిసినవాళ్ళు ఈ 'చందన చర్చ'ను చందన చర్చితంగా ఆస్వాదిస్తారు. 'చందన చర్చిత నీలకళేబర పీత వసన వనమాలీ అన్న జయదేవుని గీతికాపాదాన్ని మననం చేసుకుంటారు. నిజానికి యీ వ్యాసాలన్నీ చందనం అద్దుకున్నంత హాయి కలిగించవు. ముఖ్యంగా ఆయా రచయితలకి, విమర్శని బట్టి మిరపకాయ కొరికినట్లు కళ్ళమ్మట నీళ్ళు తెప్పిస్తాయి.**

మొదటి వ్యాసంలోనే 'విమర్శిస్తే ఆగ్రహిస్తారు జాగ్రత్త' అని ఇందులో చందనం ఏమీలేదని హెచ్చరిక చేశాడు చందు. పెడితే తింటారు కాని, కొడితే పడతారా అని సామెత.మేము 'సంవేదన' పత్రిక నడిపినప్పుడు ఈ బాధలన్నీ అనుభవించేం. 'రారా క్రూరుడైన విమర్శకుడు' అని ఎదురు తిరిగి ముద్రవేసారు. కాని, తద్రచయితల రాతలెంత ఘోరంగా వున్నాయో పట్టించుకోలేదు. 'బేషరతుగా ప్రశంసించు పావో పరకో కీర్తినాశించు ఇస్తారు. ఆనందించు. నిజాన్ని పలుకవద్దు. నిప్పులాంటిది కాలుతుంది' అని చందు విమర్శకుల స్థితిని తనదైన బాణీలో ఎత్తిచూపాడు. న్యాయమూర్తుల కమిటీలో గురితప్పి ఉరి పడుతుందన్న బెంగలేకుండా 'ట్రూత్' పలికి చందు సాహిత్య ధర్మాన్ని నిలబెట్టేడని చెప్పాలి. విమర్శ సాహిత్య కళ విస్తృత ప్రయోజనానికి మాత్రమే వేన్నార్డు అని చందుకు తెలుసు. 'దాయాది వైరం దశాబ్దాలపాటు దహించి వేస్తున్నా ఏ మాత్రం పునరాలోచన చెయ్యని వామపక్ష విమర్శ నాగ్రేసరుల నిష్క్రియ పరత్వాన్ని' చూసి ఆక్రోశిస్తున్నాడు. 'ఎవరీ సాహిత్య మేధావులు' అనే వ్యాసంలో సి.పి. స్నో గ్రంథాన్ని (Two Cultures) ఉటంకిస్తూ చందు చక్కని చర్చ చేశాడు. 'ఆంధ్రభూమి' దినపత్రిక లో 'చందనచర్చ' పేరుతో సంవత్సరంపాటు వెలువడిన వ్యాసాల ఏకయష్టి ఈ గ్రంథం. చందూ యీ వ్యాసాల్లో అనేక విషయాలు పరిశీలించాడు. అభ్యుదయ సాహిత్య లక్ష్యాన్ని పలు రీతుల్లో పరిశీలించాడు. ముఖ్యంగా సాహిత్యేతర పదార్థం 'వామపక్ష ప్రచారం'లో ఎలా తల విరబోసుకుంటుందో ఎత్తి చూపాడు. అయితే అలనాడు అభ్యుదయ కవిత్వాన్నీ ఎద్దేవా చేసిన వాళ్ళూ ఉన్నారు. నినాద ప్రాయమైతే దిగజారి పోయే మాట వాస్తవమే. అలాగని ఆనాటి ప్రేమ కవిత్వం ఆకలి కన్నీళ్ళూ గురించి పట్టించుకోలేదు. ప్రేమ, శృంగారం పనికిమాలినవని కాదు. వాటికి సాహిత్యంలో స్థానం లేదనీకాదు. సామాజికస్థితి నేపథ్యంలో దేని స్థానం ఎంత వుందో చూడాలి. చర్చించాలి. ఒకనాడు ప్రేమకీ – సామాజిక చేతనకూ నీవా నేనా అన్న పోటీ జరిగింది. చర్చలు విశృంఖలంగా సాగాయి. నిజానికి రెండింటికీ అవసరం వుందనీ, వాటి మధ్య స్పర్థించే పోటీ లేదనే గతితార్కిక అవగాహన అనంతరం కలిగింది. చందూ ఈ విషయం గమనించాలి.




'పద్యాన్ని చదవవలసిన అవసరం లేదా' అన్న వ్యాసంలో శ్రీశ్రీ చేసిన 'గణబద్ధ ఫ్యూడలిజం' అనే వ్యాఖ్య ముక్కలు విశ్లేషణకు ఉపయోగించేవే కాని

# కవిత్వానికి మళ్లీ మంచి రోజులు

## ముందు మాటలు

**అదృష్టదీపక్ 'అగ్ని'**



కవిత్వానికి మళ్లీ మంచిరోజులు వచ్చినట్టుంది. జీవితసమస్యల చిత్రణా, పోరాటాలను ప్రేరేపించే శక్తీ యువకవుల వస్తువు అయింది. అలాంటి యువకవుల ప్రతినిధిగా అదృష్టదీపక్ 'అగ్ని' రగిలిస్తున్నాడు. "శ్రమజీవన సౌందర్యానికి/సరైన విలువలు సంతరింప జేసేందుకు" సమర సంగీతం ప్రసారం చేస్తున్నాడు. "ఎదురుదెబ్బలకు బెదరని ఆశయాలను ఆభరణాలుగా అలంకరించుకుని అడుగు ముందుకు వెయ్యమని" అగ్నిగీతం ఆలపిస్తున్నాడు. తన కవిత్వాన్ని "రాజీ లేని పోరాటసిద్ధాంతంగా ఎన్నెన్నో యుగాల దోపిడికి అంతంగా" రూపొందిస్తున్నాడు! అదృష్టదీపక్ కవితా హృదయమున్నవాడు. అతనిలో కవికి అవసరమైన భావుకత (SENSITIVITY) వుంది. కవి పడే తపన వుంది. కవి అనుభవించే వేదన వుంది. కవికి ఉండే అనుభూతి తీవ్రత వుంది. ఇవి వున్నవాడుతప్ప వెలుగునీడల మధ్యగల విషాదాన్ని అందివ్వలేడు. 'అగ్ని' సంపుటంలో అడుగడుగునా ఎదురయ్యే యీవిషాదం INFECT చేసి తీరుతుంది! ఇందులోనివన్నీ వచన గేయాలే-రెండు మూడు తప్ప, వచన గేయంలో సమర్థుడైన వాడు గాని నెగ్గుకు రాలేడు. ఆ పాదాల అంతర్లయాన్వితమైన సంగీతం వినే చెవి వున్న వాడు గాని నిభాయించుకు రాలేడు. వచనగేయం ప్రసాదించిన సౌలభ్యాలు చాలా మంది వాడుకోలేక పోతున్నారు. మధ్యలో ఛందోబద్ధపాదాల తూగుతేవడం, వ్యవహారంలో లేని పదబంధాలు నిర్మించడంలాంటి దోషాలు కనిపిస్తున్నాయంటే, కవిత్వ అవగాహనలోని లోపమే అనుకోవాలి. 'అగ్ని'లో అలాంటి దోషాలేమీ లేవన్నది మంచి విజయమే! అయితే "మబ్బుతెరల పరిష్వంగం నుంచి బయటికి వచ్చి" (అభ్యుదయం), "రోగగ్రస్తమైన దేశాన్ని బాగు చెయ్యడానికి' (చీడ పురుగులు) లాంటి పాదాలలో కవిత్వం పాలు తక్కువై, నినాదప్రాయంగా మిగిలిపోతున్నాయి. అదృష్టదీపక్ యింతటి చిన్నవయసులోనే కవిత్వానికి అవసరమైన యింధనాన్ని సమకూర్చుకున్నాడంటే అదేమీ చిన్నవిషయం కాదు. "రేపటి కోరికల ముత్యాల చాందినీ కింద. మహదాశయ సౌందర్యాన్ని శిల్పీకరిస్తున్న" యీ కవితాత్మను చూసే అనిపించింది కవిత్వానికి మళ్లీ మంచిరోజులు వచ్చినట్టుందని!

**('అగ్ని' ఫిబ్రవరి 1974, ముందుమాట)**

అవగాహనకు వుపకరించవు. తొలినాటి మార్క్సిస్టు సిద్ధాంత ఆవరణశీలురు భారతదేశంలోనూ (ఆంధ్ర రాష్ట్రంలోనూ) పాత దాన్నంతటినీ తగలబెట్టమనే భావం ఉద్యమకారులకు తలకెక్కించటం వలన అవగాహన జడవాదం పాలయింది. పరిస్థితి వికటించింది. ఏ శక్తుల్ని ఎదిరించి పోరాడాలని మనం భావించామో ఆశక్తులు మరింత ఉధృతంగా తిరోగమన కీర్తనలు ఆలపిస్తున్నాయి.

సంస్కృత భాషా సౌందర్యమూ పద్యంలోని అందచందాలు చూడమంటే.. 'ఆ భావజాలం, జీవితమూ చూడు అంత సుందరంగా ఉన్నాయని ఇంటి కప్పెక్కి కూస్తున్నాయి అవి. చందు ఆయా శక్తుల ఘర్షణల్ని కొన్నింటినైనా పట్టుకోవటం కనిపిస్తుంది. 'స్త్రీ వాదానికి అసలు శత్రువులు' అన్న చర్చ కొత్త విషయాల్ని పట్టుకుంది. 'సమాజంలో కనీసం కనిపించని గొప్ప అవాస్తవాల్ని అంతటి ప్రతిభావంతమైన ప్రచారసాధనాల్లో (టీవీ, సినిమా చూపిస్తే ఎన్ని స్త్రీవాదాలు ఏం చేయగలవు. స్త్రీ వాదానికి శత్రువు రాక్షస రూపంలో దృశ్యమాధ్యమంలో వీర విహారం చేస్తుంది' అనటం కొత్తగా చేసిన తాత్విక పరిశీలన. ఈ కోణం నుంచి ఇందాకా ఎవరూ చూసినట్లు కనిపించదు. చందు లోతైన సిద్ధాంత పరిశీలన చేసిన చర్చలు గ్రంథంలో చాలా వున్నాయి. 1.గతిక్రమాన్ని పసికట్టేది కళ 2.పరిశోధనలపై పరిశోధన (వెల్దండ నిత్యానందరావు గ్రంథంపై సమీక్ష) వంటి వ్యాసాల్లో విషయ ప్రతిపాదన, ప్రాతిపదిక, పరిశీలన, చర్చ వంటి భాగాల స్థాయిపై ఎవరికి విప్రతిపత్తి ఉండనవసరం లేదు.

విడి సందర్భాల్లో ఆయన అభిప్రాయాల్ని ఆమోదించకపోయి నా సరే, విమర్శస్థాయి, లక్షణాలు ఎలా వుండాలో తెలుసును. 'ప్రపంచ సాహిత్య ద్వారం అనువాదం' అనే చర్చ అందుకు పూర్తి ఉదాహరణ. నిర్మోహమాటంగా, నిజాయితీగా అతను చేసిన చర్చలన్నీ ఆధునిక సాహిత్యరంగాన్ని ప్రతిబింబిస్తున్నవే. 'సాహిత్య పాఠకులకి శిక్షణ ఏదీ' అని ఒక వ్యాసం రాశాడు ఇందులోనే. మనదేశంలో రచయితలకే శిక్షణ లేదు. పాఠకుల కెలా వస్తుంది ? ఇదిగో ఇలా వస్తుంది అని 'చందనచర్చ'ను ఆలోచనామృతంగా అందించవచ్చును. ❑













## ఆర్వియార్
## మరికొన్ని
## పుస్తకాలు












# ఆర్వియార్ 'సాహిత్య తత్వం'



- డా॥ పి.సంజీవమ్మ

**'సాహిత్య తత్వం అనే సంపుటిలో ఆర్వియార్ రాసిన 16 వ్యాసాలున్నాయి. ఆయన 1970 ప్రాంతం నుంచి పది, పన్నెండేళ్లుగా సాహిత్యం మీద విమర్శనాత్మక వ్యాసాలు, పుస్తక సమీక్షలు రాశారని, వాటిని 'యుగసాహితి' గ్రంథ రూపంలో ప్రచురిస్తున్నదని రారా ఈ పుస్తకానికి పరిచయం రాస్తూ చెప్పారు. 1980 జూన్ 20న ప్రచురించి వుంటే ఆ ప్రతి దొరకలేదు. విశాలాంధ్ర ప్రచురణాలయం వారు ప్రథమ ముద్రణ అని అక్టోబర్ 1988లో ప్రచురించారు. 'తెలుగు సాహిత్య జీవులకు ఆర్వియార్ కొత్త కాదు. ఆయన ఆర్వియార్ పేరుతో రాస్తూంటారు. గనుక రాళ్ళబండి వెంకటేశ్వరరావు అంటే తెలియని వాళ్ళకు కూడా 'ఆర్వియార్' బాగా తెలుసు' అని రారా పుస్తక పరిచయంలో రాశారు. 'ఆర్వియార్'కు తెలుగు, ఇంగ్లీసు సాహిత్యాలతో గాఢమైన పరిచయం ఉంది. పరిపుష్టమైన మార్క్సిస్టు అవగాహన ఉంది. అందువల్ల ఆయన ఆధునిక సాహిత్య విమర్శకుల్లో ప్రముఖులుగా పేరు పొందారు' అని కూడా రా.రా. అన్నారు.**

1969లో నేను కడప ఆర్ట్స్ కళాశాలలో పనిచేస్తున్నప్పుడు ఆర్వియార్ గారు అక్కడే ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. 'యుగసాహితి' సాహిత్య సంస్థ కడపలో 1967లో స్థాపించారు. వై.సి.వి, రా.రా., కేతు, రామప్పనాయుడుతోపాటు మన ఆర్వియార్ కూడా యుగసాహితి నిర్మాతలు. యుగసాహితి తరపున 'సంవేదన' సాహిత్య త్రైమాసిక పత్రిక వచ్చింది. 1968లో మార్చిలో మొదటి సంచిక వచ్చింది. ప్రచురణకర్త వై.సి.వి, సంపాదకుడు రా.రా. మిగిలిన లెక్చరర్లు అందరూ పత్రికను రూపొందించి నడిపిన వారు. మొదటి సంచిక ఆవిష్కరణ సందర్భంగా అతిథులు శ్రీశ్రీ కొడవటిగంటి కుటుంబరావు, ఆచార్య జి.యన్ రెడ్డి గారు.

ఇక ఆర్వియార్ గురించి చెప్పాలంటే.. ఆయన అధ్యాపకుడు. అభ్యుదయ రచయిత. విమర్శకుడు. మార్క్సిస్టు సిద్ధాంతవేత్త. సాహిత్య తత్వవేత్త. అరసం పునరుజ్జీవం పొందినప్పుడు అరసం ప్రణాళిక రూపొందించడంలో ఆయనది ప్రముఖ పాత్ర. ఆయన రాష్ట్ర అరసంకు చాలాకాలం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1981లో మాస్కోలో 'రాదుగ' (ఇంద్ర ధనుస్సు) ప్రచురణ సంస్థకు అనువాదకుడిగా వెళ్ళే వరకు ఆయన అరసం కార్యక్రమాలు నెరవేరుస్తుండేవారు. 1991 వరకు దాదాపు పదేళ్లపాటు మాస్కోలో ఉండి ఎన్నో గ్రంథాలు అనువాదం చేశారు. శ్రీశ్రీ శత జయంతి సందర్భంగా(1910-2010) విశాలాంధ్ర ప్రచురణ సంస్థ వారి కోరిక మేరకు 'యుగకర్త శ్రీశ్రీ' పుస్తకాన్ని రాశారు. శ్రీశ్రీ సాహిత్యం మీద పరిశోధన సాగించి, ఆయనను యుగకర్తగా నిరూపించారు. ఈ పుస్తకాన్ని తక్కోలు మాచిరెడ్డి గారు హిందీ లోకి అనువాదం చేశారు. కాన్పూర్‌లోని పరాగ్ ప్రకాశన్ వారు దాన్ని 2016లో ప్రచురించారు.




**సాహిత్యతత్వం గురించి..**

ఇందులో 'సాహిత్య సిద్ధాంతం' 'సాహిత్య విమర్శ' 'ఆధునిక సాహిత్యం - ధోరణులు - అభ్యుదయ సాహిత్యం' అనే మూడు వ్యాసాలూ సిద్ధాంతపరమైనవి. కొన్ని వ్యాసాలు కొందరి కవుల కవిత్వం గురించినవి. 'శ్రీశ్రీ ఆలంకారికత' అభ్యుదయ కవితా పథంలో కుందుర్తి, చలం గురించి, కొ.కు. రచనా శైలి గురించీ, కన్యాశుల్కం నాటకంలో విశేషాంశాలు మొదలైన వ్యాసాలున్నాయి. ఆయన ఈ వ్యాసాలన్ని దాదాపు 40 ఏళ్ళ క్రితం రాసినవి. అప్పటికి అవి అవసరమైనవి. తత్కాలీనమైనవి కొన్ని. ఈనాడు అవన్ని చర్చోపచర్చల తర్వాత స్థిరపడినవి.

చలం గురించిన విషయాలు, సాహిత్యంలో ఇజాలు మన సాహిత్య మిమర్శలలో నలిగినవే.

## సాహిత్య సిద్ధాంతం

ఈ ఆధునిక యుగంలో సాహిత్యం ఏ సిద్ధాంతాన్ని ఆలంబన చేసుకోవాలి ? ఈనాడు సాహిత్యం ప్రయోజనం ఏమిటి ? జీవితం సుఖమయం కావటానికి శాస్త్రం కృషి చేస్తుంది. ఆధ్యాత్మిక అవసరాలకు (ఇక్కడ ఆధ్యాత్మికం అంటే మానసికమైనదనే భావం) కళ కృషి చేస్తుంది. మానవ సమాజ జీవిత వికాసానికి తోడ్పడటం సాహిత్యానికి కళలకు బాధ్యత. అందువల్ల ఈనాటి రచయితలూ, కళాకారులూ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి. సామాజిక చైతన్యం సంతరించుకోవాలి. ఈనాటి పెట్టుబడిదారీ సమాజంలో పలాయన సాహిత్యం, వ్యాపార క్షుద్ర సాహిత్యం ఎంతో వస్తుంది. దీనివల్ల ఎంతో కీడు జరుగుతుందని, దానిపట్ల పాఠకుల్ని జాగరూకుల్ని చేయడం కూడా రచయితలు, విమర్శకుల బాధ్యతగా ఉంది. సమాజాన్ని, వ్యక్తిని కదిలించడం, అభ్యుదయకరమైన మార్పులపట్ల పాఠకులను చైతన్యవంతులను చేయడం నేటి సాహిత్య లక్ష్యంగా ఉండాలి. ఎంత ఎక్కువ మంది లో ఈ చైతన్యం సంతరించుకుంటే అంత తొందరగా మార్పు వస్తుంది. ఈ మార్పు తీసుకురావటమే ఈనాటి సాహిత్య సిద్ధాంతం అంటారు ఆర్వియార్.

## సాహిత్య విమర్శ

ఈ వ్యాసంలో ఈనాడు సాహిత్య విమర్శ ఎలా వుండాలో వివరిస్తారు ఆర్వియార్. సమాజం మారింది. సాహిత్యం మారింది. దానికి అనుగుణంగా విమర్శ, విమర్శనా పద్ధతులు మారాయి. జీవిత దృక్పథం మారినప్పుడు జీవితంలో నుంచి పుట్టిన సాహిత్యం–దాని మీద విమర్శా మారాయి. ఒకప్పుడు సాహిత్యంలో శిల్పానికి ప్రాధాన్యం ఉండేది. దాని మీద విమర్శ కూడా శిల్పాపరంగా ఉండేది. నేటి విమర్శ కవి వ్యక్తిత్వం, జీవిత దృక్పథం, కవి రచన సాంఘిక ప్రయోజనం కలిగిందా ? కాదా? అనే అంశాల మీద ఆధారపడివుంది. అలాంటి విమర్శ లేకపోతే సరైన సాహిత్యం రాదు. సమాజంలో ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు వున్న వైరుధ్యం రూపు మాపగలిగే చైతన్యం ఇవ్వగలిగిన సాహిత్యం రావాలి. అది అభ్యుదయ సాహిత్యం, మార్క్సిస్టు అవగాహన గల విమర్శకులు మరో విషయం కూడా గుర్తించాలి. సాహిత్యంలో వస్తువు నుంచి రూపాన్ని విడదీసి శిల్ప ప్రాముఖ్యం ఇచ్చే విమర్శ పట్ల జాగ్రత్త వహించటం. అలాగే సాహిత్యంలో శిల్పగుణం లేనప్పుడు అది సిద్ధాంత రీత్యా అభ్యుదయకరమైంది అయినా సాహిత్యపరంగా విమర్శిం చాల్సిందే. అంటే మార్క్సిస్టు అవగాహన, సాహిత్యాన్ని ఆస్వాదించగల హృదయమూ రెండూ కలిసినప్పుడే ప్రయోజనకరమైన విమర్శా, ప్రయోజనకరమైన సాహిత్యమూ వెలువడుతాయని అంటారు ఆర్వియార్. ఇదే విషయాన్ని రా.రా. నుంచి మరెందరో విమర్శకులు చెబుతూ వచ్చారు.

## అధునిక సాహిత్యం - ధోరణులు - అభ్యుదయ సాహిత్యం

ఈ వ్యాసంలో ఆర్వియార్ రచించిన విషయాలు ఈ పుస్తకం లోని ఇతర వ్యాసాల్లో కూడా చర్చించారు. ఏది ఆధునిక సాహిత్యం ? ఈనాటి సాహిత్య ధోరణులు ఏవి ? మరి అందులో అభ్యుదయ సాహిత్య ధోరణులు అంటే ఏమిటి ? అనే అంశాలు విపులంగా చర్చించారు. 'సాహిత్యంలో ఇజాలు' 'చలం స్వేచ్ఛా భావన' 'శ్రీశ్రీలో ఆలంకారికత' ఇంకా ఎన్నో ఇతర వ్యాసాల్లో పై అంశాల చర్చ ఉంది. అందువల్ల ఆర్వియార్ ఆ వ్యాసంలో చెప్పిన అభ్యుదయ సాహిత్య లక్షణం గురించి చెప్పిన తర్వాత వ్యాసాల్లోకి వెళతాను. సామాజిక పరిణామంతో సాహిత్య పరిణామక్రమం ముడిపడి వుంది. 'ప్రస్తుతం సమాజం లో బూర్జువా వర్గం తన వైరుధ్యాల రొచ్చంతా ప్రపంచం మీద చల్లే చర్యలో భాగంగానే ప్రపంచం మీద ద్వేషం, కసీ, కావేష మూ జీవితంలో భాగమని సృష్టించడం. దాన్ని ప్రతిఘటించి ఈ వైరుధ్యాలకున్న సాంఘిక పునాదిని విపులీకరించి మార్పు చేసే దృష్టిని ప్రసాదించటమే అభ్యుదయ సాహిత్య లక్షణం' అని విశ్లేషించారు.

## మాత్రాబద్ధ శంఖారావం

ఈ శీర్షికలో గజ్జెల మల్లారెడ్డి గారి రెండు కవితా సంపుటిలను బేరీజు వేసి విమర్శించారు. ఆర్వియార్ ఆయన మొదటి సంపుటి 'మల్లారెడ్డి గేయాలు' అనేవి మొదటి సంపుటికి ఛాయ మాత్రమే అని విమర్శించారు. ఈ రెండో సంపుటిలోని దాదాపు ప్రతి కవి తను తీసుకొని ఆయనలోని మాత్రాబద్ధ ఛందస్సునూ వస్తువును లక్ష్య శుద్ధిని వ్యక్తీకరణ విధానాన్ని వివరిస్తూ విమర్శించారు.

శంఖారావంలోని గేయాలన్నీ మాత్రాబద్ధ చంధస్సులో ఉన్నవే. వస్తువు మొదట సంపుటిలోనిదే ఎక్కువ పునరావృతమైంది. మొదటి సంపుటిలోని సంయమనం, లక్ష్యశుద్ధి ఈ శంఖారావం లో కొరవడింది. ఈ రెంటిలోనూ వున్న కవిత్వ సామాన్య లక్షణం కూడా ఛందస్సు ఒక్కటే అన్నారు ఆర్వియార్.

అయితే అభ్యుదయ సాహిత్యోద్యమం అణగారివున్న కాలంలో 'మల్లారెడ్డి గేయాలు' వచ్చి ఆశలను రేకెత్తించాయి. మళ్లీ కవిత్వం ప్రయో జనాన్ని పరిపుష్టినీ సంతరించుకుంటున్నదనే ఆశలు నిం పాయి. ఈ మొదటి సంపుటికి పరిచయం రాస్తూ రా.రా. 'ఇది గొప్ప కవిత్వం కాకపోవచ్చు. కాని, కొత్త కవిత్వం. కొత్తదనమే ఈ కవిత్వం యొక్క తత్వం' అని అన్నారు. మల్లారెడ్డి గేయాల్లో వస్తువు కొత్తది. స్వాతంత్ర్యం మేడిపండులా ఎలా తయారైందో విమర్శిస్తూ దేశంలో వ్యాపించిన అవినీతిని తూర్పారపడుతూ ఈ నవభారతంలో సైతం శ్రామికులు తమ పోరాటం ఎలా

కొనసాగించాలో స్పష్టం చేశారు కవి. మార్క్సిస్టుగా తనకున్న సైద్ధాంతిక శక్తిని బట్టి, రాజకీయంగా తనకున్న నిర్దిష్ట లక్ష్యాన్ని బట్టి అతని కవిత్వానికి గల ప్రయోజనం నిర్దేశితమయ్యేలా వుంది అన్నారు ఆర్వియార్. అంతేకాదు మల్లారెడ్డి రక్తంలో ఉడుకుతున్న శక్తే మల్లారెడ్డిని కవిని చేసింది. అందుకే 'అగ్ని కవి' కాగలిగారు. తన మొదటి కవితా సంపుటి 'మల్లారెడ్డి గేయాలు' వెలువడినప్పుడు కవిత్వపు భవిష్యత్ మళ్లీ వెలుగుతో నిండుతుందనే ఆశలు నింపారు. దురదృష్టవశాత్తు మల్లారెడ్డి ఈ ఆశలు నిలబెట్టలేకపోయారు. రెండో కవితా సంపుటి మొదటి దానికి ఛాయామాత్రంగా మాత్రమే నిలిచింది. రెండు సంపుటాల్లో వున్న కవిత్వ సామాన్య లక్షణం మాత్రాబద్ధ చంధస్సు ఒక్కటే అన్నారు ఆర్వియార్. కొ.కు. అన్నట్లు 'కసి కోసం' 'మల్లారెడ్డి గేయాలు' చూస్తే, అది లోపిస్తే ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే 'శంఖారావం' చూడాలి.

## అభ్యుదయ కవితా పథంలో కుందుర్తి

కుందుర్తికి సాహిత్య అకాడమీ బహుమతి వచ్చిన సందర్భంలో ఆయన్ని అభినందిస్తూ రాసిన వ్యాసమిది. 1943లో తెనాలిలో జరిగిన మొదటి అభ్యుదయ రచయితల సమావేశాలకు హాజరయ్యారు కుందుర్తి. ఆయన కవితా వస్తువు సామాన్యుల గోడు తెలంగాణ విప్లవోద్యమాన్ని వస్తువుగా ఒక పూర్ణ కావ్యం – వచన కావ్యం రచించాడు. 'నిజమైన జన ధర్మం పలికే నోరు లోకంలో కవిది ఒక్కటే' అని నమ్మినవారు. 'ఈయన కవిత్వం ప్రజోద్యమాల స్పందన మీద, చరిత్ర పురోగమనశీలత మీదా భవిష్యత్తు బంగారం వంటిదన్న ఆశ మీద నిలబడ్డ అభ్యుదయ దృష్టి' అంటారు ఆర్వియార్. కుందుర్తి సమకాలిన అభ్యుదయ యుగంలో కవులు సామాజిక పరిస్థితులను మార్క్సిస్టు దృష్టితో అవగాహన చేసుకోవడం వల్ల తమ కవిత్వంలో అభ్యుదయ ధృక్పథాన్ని పదిలం చేశారు. 'మార్క్సిస్టు దృక్పథం లేకుండా మార్క్సిస్టు అవగాహన లేకుండా ఈ బూర్జువా సమాజం ఎవరికైనా అర్థమవుతుందని నేను అనుకోవడం లేదు. కనుక అభ్యుదయ రచయితకు మార్క్సిస్టు పరిజ్ఞానమూ అత్యవసరమని నేను అనుకుంటున్నాను' అని అన్నారు రా.రా. కుందుర్తి కవితా వస్తువు తాత్వికంగా ఈ పునాది మీద ఆధారపడిందే. అభ్యుదయ చైతన్య పూరితమైంది, మార్క్సిస్టు అవగాహన పరిధికి లోబడి వున్నది. కాని, కుందుర్తి గ్రహించిన కవితా రీతి వల్ల ఆయన ఎక్కువగా గుర్తింపబడుతున్నారు. కథా వస్తువు మారినప్పుడు కవితా రీతి మారుతుంది. అభ్యుదయ కవితలు పాత ఛందస్సులను బహిష్కరించి, సామాన్య జనులకు అందుబాటులోకి రాగల గేయ రీతిని తమ కవిత్వానికి రూపంగా ఇచ్చారు. అది మరీ వచన గేయ రూపం సంతరించుకున్నది. ఆధునిక కవిత్వపు శైలి సామాన్య ప్రజల సంభాషణస్థాయికి రావాలని కుందుర్తి అన్నారు ఒక సందర్భంలో. భాష కూడా ప్రజల భాష, అభ్యుదయ దృష్టి, దానికి తగిన రీతివున్న వచన కవిత్వ రూపం స్థిరపడింది. కాని, కుందుర్తి మాత్రం కథా కావ్యాల వల్ల వచన కవిత్వం స్థిరపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆ ప్రయత్నంలో ఆయన వీర తెలంగాణ ఉద్యమాన్ని సంపూర్ణ వచన కావ్యంగా రాశారు. 'దండియాత్ర' కావ్యం రాశారు. అంతేకాదు 'ఆశ' అనే కవితా నాటకం 'ఆచార్లుగారమ్మాయి' అనే కవితా నాటకం రాశారు. వచన గేయంలో సమగ్రమైన కావ్యం రచించిన కీర్తి కుందుర్తికే దక్కింది. అయితే ఈ మార్క్సిస్టు అభ్యుదయ కవి విశ్వనాధవారికి జోహార్లు అర్పించడం మనకు మింగుడుపడదన్నారు ఆర్వియార్. విశ్వనాధ ప్రతిభతో సమ్మోహితుడైనట్లు ఉంది కాని, ఆయన ఆలోచన విధానంతో మాత్రం కాదు. సామాన్యుడి సాహచర్యం విశ్వనాధ భావనకు లభించి వుంటే వారి కీర్తి ఇంకా ఘనంగా వుండేదని విచారిస్తారు కుందుర్తి. పాపం ! విశ్వనాధ అభ్యుదయ సాహిత్యం పాలిట రావణాసురుడు కదా ! అంటారు ఆర్వియార్. ఏమైనా కుందుర్తి దృఢమైన అభ్యుదయ దృక్పథం, వచన కవిత్వ రీతిలో ఆయన అధిరోహించిన ఎత్తూ ఈ రెండూ మనం ఆయనలో గమనించాల్సిన అంశాలు. ఆయనకు సాహిత్య అకాడమీ బహుమతి వచ్చిందంటే ఈ రెండు అంశాలూ మన సాహిత్యంలో బలంగా పాదుకొన్నాయని అర్థం అన్నారు ఆర్వియార్.

## కొడవటిగంటి కుటుంబరావు గారి శైలి

ఆయన శైలి గురించి ఆర్వియార్ ప్రత్యేకంగా విశ్లేషిస్తున్నారంటే అందులో ఏదో ప్రత్యేకత వున్నట్లే. గొప్ప కవులకు గాని, గొప్ప రచయితలకు గాని, వారి వారి ప్రత్యేక శైలి వుంటుంది. ఆ శైలి ఆ రచయితలను పట్టించేదిగా వుంటుంది పాఠకులకు. కవిత్వంలో శ్రీశ్రీ శైలి.. అది శ్రీశ్రీ కవిత్వమే అని పాఠకునికి వెంటనే స్ఫురిస్తుంది. అలాగే వచనంలో కె.కె. శైలి అందువల్లనే ఆ శైలి ఎలాంటిదో మనకు విశ్లేషించి చెబుతున్నారు ఆర్వియార్. అయితే 'శైలి' అనే మాటకు అర్థం ఏమిటి ? దీన్ని వివరించటం సాహసమే అంటారు ఆర్వియార్. దీనికి అనేక అర్థాలలో ప్రాచుర్యం వుంది. పాశ్చాత్య సాహిత్యం, సంస్కృతితో మనకు సంబంధం ఏర్పడిన తర్వాతనే శైలి గురించిన ఆలోచన ప్రారంభమైంది. మన ప్రాచీన సాహిత్యంలో శయ్య – రీతి – పాకం లాంటి సాంఘిక భాషా పదాలుండేవి. ఆధునిక సాహిత్యంలో అవి పనికిరావు. ఇందులో భాష వ్యావహారికం వస్తువు సామాజికం. ఒక మనిషికి ఎందులోనైనా ఒక శైలి పట్టుబడాలంటే అతని ఆలోచనా విధానమూ సంస్కారమూ సాధనా కృషి అభిరుచి లాంటివి ఎన్నో పోషకాలౌతాయి అంటారు ఆర్వియార్. మన తెలుగు సాహిత్యంలో వచన రచనలో అలాంటి వ్యక్తిత్వం నిర్మించుకున్న వాళ్ళు చాలా తక్కువ మంది వున్నారు. వారిలో నిజంగా శ్రేష్ఠుడు కె.కె. అంటారు ఆర్వియార్. కె.కె. శైలి ప్రధానంగా ఆలోచన

ప్రేరకమైనది. హృదయ వ్యాపారమైన ఉద్రేకాన్ని కాక, మేధో వ్యాపారమైన ఆలోచనను రేకెత్తిస్తుంది ఆయన శైలి. ఆయన విస్తృతమైన కథా సాహిత్యంలో తనకు పరిచయం లేని గొప్ప వాళ్ళ విషయం ఏదీ వుండదు. తెలిసిన మధ్య తరగతి జీవితాలే కథా వస్తువు. ఆ వస్తువులో ఉద్రేకాలు ఉండవు. వాళ్ళ ప్రేమల గురించి చెప్పవలసి వచ్చినా కె.కె. కాల్పనికతలో కొట్టుకుపోడు. ఆయనకు ప్రేమ భౌతిక జీవితంతో ముడిపడి వున్నదే. ప్రేమకు అందాన్ని ముడిపెట్టిన కథకుల రచనలు ఎన్నో వుండవచ్చు. 'కురూపి' కథను కె.కె. ఒక అందవిహీన వివాహ సమస్యను ఇతివృత్తంగా మలిచారు. ఆ కథకు ఉపోద్ఘాతం కూడా రాశారు. కె.కె. కథలోని స్త్రీ పురుష పాత్రలు ఇరువురికి 'నిజమైన ఆధ్యాత్మిక' (మానసిక) అనుభూతి కలగడం ముఖ్యమైన పాయింటు. పాఠకులకు ఈ విషయం అర్థమైతే కథ విజయవంతమైనట్లే అంటారు ఆర్వియార్. ఎంతో సంస్కారవంతులైన పాఠకులకు మాత్రమే ఇది సాధ్యం. ఆయన రచనా శైలిలోని రహస్యం ఏమంటే ఆయన చెప్పే విషయం మీద ఆయనకు అధికారం వుండటమే. ఆయనకున్న సాంఘిక దృక్పథమే ఆయనకు ఈ శక్తిని ఇచ్చింది. ఆయన అభ్యుదయవాద దృష్టి ఆయన శైలికి బలాన్ని ఇచ్చింది. ఎంతటి విషయాన్ని చెప్పినా పొదుపరితనం, సూటిదనం వీటికితోడు సారళ్యం నిలుపుకోవడం కె.కె ప్రత్యేకత. సులభంగా చెప్పడం రచయితకు చాలా కష్టం అంటాడు శ్రీశ్రీ ఒకచోట. కె.కె. రచనలో వాక్యాలు సామెతల్లా ఉంటాయంటారు ఆర్వియార్. ఉదాహరణకు 'అంతరాత్మలను పంచుకునే వరకు పరిచయం స్నేహంగా మారదు'. 'మంచి కవిత్వం పరిస్థితికి అనుకూలంగా మలగుతుంది'. 'ఎంత నీచుడు కూడా ఆత్మద్రోహం చేసుకోడు'. 'పిల్లలకు ఆహారం ఎంత అవసరమో ఆపేక్షలంత అవసరం'. ఇలాంటివి ఆయన వచనంలో ఎన్నో తగులుతూ ఉంటాయి. 'ఉత్తమ అనుభూతి నుంచి వెలువడిన కవిత్వమూ ఉత్తమ మేధో పరిశ్రమ నుంచి వెలువడిన వచనమూ ఇలా సామెతల కింద ఒదుగుతాయి' అంటారు ఆర్వియార్.

నుడికారపు భాష, వ్యంగ్యంతో కూడిన సునిశితమైన హాస్యం కె.కె. శైలిలో ప్రత్యేకం. 'డబ్బు విషంలాగా వాడాలి'. 'ఒకోసారి మాట తేలు కుట్టినట్టు కుడుతుంది' లాంటి నుడికారపు సొంపు పట్టుబడాలంటే విశేషమైన పరిశీలన కావాలి రచయితకు. చదువుకున్న భాషను మరిచిపోవాలి. నుడికారపు సొంపు రచనా భాషలో తేగలిగితే అది సజీవంగా రంగు, రుచి పుష్టి కలిగి వుంటుంది. ఇంతా చేసి ఆర్వియార్ కె.కె. శైలిలో ఒక లోపం ఎత్తి చూపుతున్నారు. అది శక్తి (Vigour) లోపించటం. ఆయన ఎంతటి మహత్తర విషయం చెప్పినా అది పాఠకుని హృదయాన్ని బలంగా పట్టుకోదని, ఆలోచనా ప్రేరకమైనంత మాత్రాన శక్తి లోపించనవసరం లేదని అంటారు ఆర్వియార్. సంవేదన-4లో కె.కె. చాసో కథల్ని సమీక్షిస్తూ 'కళలు హృదయ స్పందన ద్వారా బుద్ధిని చైతన్యవంతం చేయాలనే సిద్ధాంతం ఒకటి వుంది. ఈ కథల్లో హృదయ స్పందన పాలు తక్కువ అయినా, నేను తప్పు పట్టను. ఇది బుద్ధి జీవుల యుగం. ఈనాటి జీవితం ముందుకు సాగించడానికి హృదయ స్పందనలు చాలా కొద్దిగా మాత్రమే సహకరిస్తాయి' అని అన్నారు. 'జీవితంకంటే కూడా కళ శక్తివంతమైనదని చెప్పిన కె.కె.కు కళను ఎలా వాడుకోవాలో తెలియదనుకోవడం పొరపాటే. ఉద్రేకం లేకుండా ఆలోచించడం ఇంకా మనం నేర్చుకోలేదేమో. అందుకనేనేమో కె.కె. ప్రజ్ఞ పూర్తిగా గ్రహించలేకపోతోందీ యుగం' అని ముగిస్తారు ఆర్వియార్.

## వచన కవిత్వం - ఒక పరిశీలన

వచన కవిత్వం ఆధునిక సాహిత్య ప్రక్రియ. వచన గేయం (Free Vers) అని కూడా వాడుతున్నాం. సాంఘిక, ఆర్థిక కారణాల పరిణామం మీద సాహిత్య రూపాల మార్పు కూడా ఆధారపడుతుంది. 'దీని అసలు తత్వం స్వేచ్ఛగా నియమరహితంగా కవి తన అనుభూతిని వ్యక్తీకరించాలనే తపనే. పెట్టుబడిదారీ సంస్కృతీ విలసనంలో ఆవిర్భవించిన ప్రక్రియగా' దీన్ని గుర్తించవచ్చునంటారు ఆర్వియార్. ఛందస్సు నియమాలు లేనంత మాత్రాన ఇందులో లయ, శబ్ద మాధుర్యం పోవు. అసలు వచనం అభివృద్ధి చెందడం కూడా సామాజిక కారణాల మీద ఆధారపడి వున్నదే. భాషకి సాంఘిక పురోభివృద్ధికి వున్న సంబంధం చారిత్రకమైనది. వచన కవిత్వ రూపం ప్రజాస్వామ్య లక్షణం. జన సామాన్యానికి అందుబాటులో వుండాలనే లక్ష్యం కలది. ఈ శిల్ప పరిణామం ఆధునికతను తెలియజేస్తుంది. దీని వస్తువు ఈ ఆధునిక యుగంలో ఆధునికమైందే అవుతుంది. అయితే ఆధునికమైనది అంతా అభ్యుదయకరమైంది కాదు అనే విషయం మనకు తెలుసు. అందువల్ల దీనికి వుండే ప్రయోజనం పూర్తిగా తెలిసేది అభ్యుదయ కవితా మార్గంలోనే. వచన కవిత అభ్యుదయ కవితా వస్తువును ఎన్నుకున్నప్పుడే దాని సార్థకత.

## రచయితలూ - రచనలూ

ఆధునిక యుగంలో రచయితలు ఎలాంటి రచనలు చేయాలి? రచయితలూ రకరకాల వాళ్ళున్నారు. వాళ్ళ రచనలు అనేకం. రచయితలకూ  రచనలకూ ఒక దృక్పథం, ఒక లక్ష్యం వుండాలి కదా. ఈనాడు రచనా ప్రక్రియలు అనేకం. ఇక పత్రికలు, ప్రచార సాధనాలు అనేకం. పెట్టుబడిదారీ వ్యవస్థలో పత్రికాధిపతులు తమకు అనుకూలంగా వుండే రచనలనే ఆహ్వానిస్తారు. ఈ రకం రచయితల్లో నిలయ విద్వాంసుల్లాగా నిలయ రచయితలూ వుంటారు. ఇక జర్నలిస్టులు వుంటారు. కాని ఈనాడు సాహిత్యకారులకు అనుభూతినీ చైతన్యాన్ని విస్తరింపచేయడం లక్ష్యం అంటున్నాము. అలాంటప్పుడు రాసే వారికి ఆ స్పృహ వుండాలి కదా ? రచయితల స్థాయిని బట్టి రచనలుంటాయి. వాటిని ఆస్వాదించడం బట్టి పాఠకులస్థాయి వుంటుంది. సమా

జంలో పరిస్థితులు ఎలా వున్నాయో అవి ఎలా మారితే మేలు జరుగుతుందో, వాటిని మేలు కలిగించే చైతన్యం ఇచ్చే రచనలు కావాలి ఈనాడు. రచయితలు తమ చైతన్య స్థాయితో పాఠకుల చైతన్యస్థాయిని పెంచాలి. తద్వారా జీవితం మారేటట్టు చేయాలి. చుట్టూ వున్న ప్రపంచం ఆ మనుషులూ ఆ సంబంధాలు, వీటి వల్ల ఉత్పన్నమైన స్థితీ, ఇవన్నీ మూలాన్ని ఆలోచన చేయగలిగి ఉండాలి రచయిత. వ్యక్తుల బాగోగులు వ్యక్తుల చేతుల్లో మాత్రమే ఉండవు. బయటి సమాజంలో కారణాలు కూడా వెతికి పరిస్థితుల్ని రచనల్లో చిత్రించి, పాఠకునికి ఆలోచననూ చైతన్యాన్ని ఇవ్వడం రచయిత చేయగలిగిన పని – ఇవీ రచయిత గురించి, రచనల గురించి ఆర్వియార్ గారి ఆలోచనలు. నేను కూడా నా సిద్ధాంత గ్రంథంలో(1977–80 పరిశోధన కాలం) వ్యక్తి చైతన్యం, రచయిత చైతన్యం, సామాజిక చైతన్యం, సాహిత్యంలో సామాజిక చైతన్యంపై విపులంగా చర్చించాను.

## శ్రీశ్రీలో ఆలంకారికత

'ఆలంకారికత అంటే ఉపమారూపకాది సర్వాలంకార పద్ధతులనూ యిముడ్చుకున్న విధానం. దీన్నే ఇంగ్లీషులో Imagery అంటారు. Imagery అన్న పదానికి తెలుగులో భావచిత్రణ అని వాడుకలోకి వచ్చింది. ఇది తప్పు' అంటున్నారు ఆర్వియార్. కానీ ఈనాడు ఇదే స్థిరపడింది. శ్రీశ్రీలోని ఆలంకారికత అంటే ఈనాడు పాఠకులు శ్రీశ్రీ కవిత్వంలో అలంకారాల గురించి చెబుతున్నారేమో అనే పొరపాటు భావనే కలుగుతుంది పాఠకుల్లో. శ్రీశ్రీ కవిత్వంలో భావచిత్రాలు అని చెప్పడమే సబబుగా వుంటుది ఈనాడు. ఆలంకారాల పేర్లు వాడుకోవడం కాకుండా 'ఆలంకారికత' అని వాడుకోవడమే మంచిదని అంటారు ఆర్వియార్. ఒక కవిలోని ప్రాచుర్యమైన ఆలంకారికత తప్పకుండా కవి వ్యక్తిత్వానికి దర్పణం. శ్రీశ్రీ కవిత్వంలో ఎలాంటి ఆలంకారికత వుంది. అది ఎంత వరకు శ్రీశ్రీ దృక్పథాన్ని వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది ? శ్రీశ్రీని నవ్య రీతికి ఆద్యునిగా, ఒక యుగానికి కర్తగా నిలబెట్టడానికి అతని కవిత్వంలోని ఆలంకారికత పాత్ర ఎంత? ఇదీ ఆర్వియార్ చెప్పదలచుకున్నది. ఆయన మహాప్రస్థానంలోని గీతాలను పరిశీలిస్తూ అంటారు – మెరుపుల్లా, దూసుకుపోయే కత్తుల్లా వుండే ఆలంకారికత వుంది. అగ్ని సరస్సున వికసించిన వజ్రం. ఎగిరే లోహ శ్యేనం, ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగ నాదం.. ఇలాంటి ఆలంకారికత శ్రీశ్రీ మాత్రమే రూపొందించగలడు అంటారు ఆర్వియార్. 'కంచు వృషభముల అగ్నిశ్వాసం క్రక్కే గ్రీష్మమని చెప్పటంలో భావ తీవ్రత వ్యక్తమవుతూంది. సూటిగా దూసుకుపోయే ఆలంకారికతతో పాఠకునికి మాటల బొమ్మలు రూపు కట్టిస్తాడు శ్రీశ్రీ.

'యంత్ర భూతముల కోరలు తోమి' నలిగిపోతున్నారు కార్మికధీరులు. 'లోహ రాక్షసుల పదఘట్టనచే' కనలుతున్నారు అభాగ్యులు. ఈ రెంటిలోనూ పెట్టుబడిదారీ నాగరికతలోని విషపు చిహ్నాలు కనిపిస్తాయి. 'గర్జించు రష్యా' కవితలో 'సుప్తకంకళాలు మేలుకొంటున్నాయి' 'ప్రపంచం పరిగెత్తి బుసకొట్టి లేచింది' అంటాడు శ్రీశ్రీ. సుస్త కంకళాలు మేలుకొనే స్థితిని వూహించుకోవల్సిందే పాఠకులు. 'ఆకాశపుటెడారిలో కాళ్ళు తెగిన ఒంటరి ఒంటె లాగుంది జాబిల్లి' ఓ రాత్రి అని శ్రీశ్రీ అనడంలో అతని వ్యక్తిత్వం, విలక్షణత్వం ప్రస్ఫుటమవుతూంది అని విశ్లేషించారు ఆర్వియార్. నారాయణ బాబులోని వైయక్తిక తత్వాన్ని అతని విలక్షణమైన ఆలంకారికత తెలియజేస్తుంది. శ్రీశ్రీలోని విప్లవ తత్వాన్ని శ్రీశ్రీ ఆలంకారికత తెలియజేస్తుంది అంటారు ఆర్వియార్. తన గుండెల్లో మండే అగ్నిపర్వతాల పేలుళ్ళు శ్రీశ్రీ గేయాలు. తన ఆవేశపు ఉష్ణం ఈ గేయాలు. వస్తుత: అలాంటి తత్వం కలవాడు కాబట్టే 'మాటల ఈటెలు' దొర్లాయి. తాను అలాంటి వైప్లవ్య గీతం కాబట్టే చలం చెప్పినట్లు 'నెత్తురూ కన్నీళ్లూ తడిపి కొత్త టానిక్ తయారు చేశాడు శ్రీశ్రీ ఈ వృద్ధ ప్రపంచానికి.

## సమకాలిక సమాజ వైరుధ్యాల ప్రతిబింబం చలం

చలం స్వేచ్ఛా భావన వైయక్తికం, సామాజికం కాదు అని నిరూపించడం ఈ రెండు వ్యాసాల ఉద్దేశం. 'చలాన్ని అర్థం చేసుకోవడమంటే ఒక చారిత్రక దశను అర్థం చేసుకున్నట్టు. చలం జీవితాన్ని, చలం రచనలనూ సమగ్ర దృష్టితో పరిశీలించి సమన్వయ పరుచుకోవడం అంటే ఆ చారిత్రక దశని సిద్ధాంత పరంగా ఆ పర్యాలోకించినట్టు. అప్పుడే వ్యక్తిగా చలం చేసిన సాహిత్యసేవలోని ధన ఋణ పక్షాలు రెండూ ఆకలింపు అవుతాయి. ఆయన కృషినీ వెలగట్టగలం' అని ఆర్వియార్ అభిప్రాయం. చలం భావాల తీవ్రత అతని శైలి. ప్రభంజన వేగంతో వీచిందా శైలి. ఆయన మాట్లాడుకునే భాషే రాశారు. ఆ వాడీ వేడీ వ్యావహారిక భాష పటుత్వాన్ని వెల్లడి చేసి, ఆ ఉద్యమానికి బలాన్నిచ్చాయి. ఆయన వస్తువులో తెచ్చిన మార్పు భాషలో అనుసరించిన మార్గం ఆయన అమూల్యమైన కానుకలుగా మిగులుతాయి. ఫ్యూడల్ చట్రంలో ఆ వివాహ వ్యవస్థలో నలిగిపోయిన స్త్రీని తిరుగుబాటు చేయమన్నాడు. దేవుడూ మతాధిపతులూ ఈ ఆడంబర వ్యవస్థలన్నీ వంచనకు తొడిగిన దుస్తులని నిరూపించాడు. హిపోక్రసీని ప్రదర్శించేది ఏదైనా పరమ ఏవగింపు చలానికి. చలం సాహిత్యంలోని స్త్రీ పాత్రలు తర్వాత వ్యక్తివాద అరాచకత్వం మిగులుతుంది. దిక్కు తోచదు. పాత వ్యవస్థ స్థానంలో నూతనమైన ఆరోగ్యవంతమైన వ్యవస్థను నిర్మించే సిద్ధాంతం లేదు వారికి. అంటే చలంకు లేదు. ఆయనది వైయక్తిక వాదం. ఆయన స్వేచ్ఛా భావన వైయక్తికం. సామాజికం కాదు. దానికి ఒక తాత్విక పునాది లేదన్న మాట. ఆయనకు కమ్యూనిజం అంటే సదాభిప్రాయం లేదు. అది వ్యక్తి స్వేచ్ఛను హరిస్తుందన్న భయం. శ్రీశ్రీని అభినందించడంలో ఆయన తిరుగుబాటు తత్వాన్ని, పాత వ్యవస్థను తోసిరాజనడా

న్ని, ఆయన నిసర్గ కవిత్వాన్ని మెచ్చుకోవడం వుంది. ఆ తర్వాత శ్రీశ్రీ కోరుకున్న వ్యవస్థను చలం ఆదరించలేదు అంటారు ఆర్వియార్. మార్క్సిస్టు విమర్శకులందరూ ఈ అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. రా.రా. చలం గురించి ఆయన సాహిత్యం గురించి విపులంగా చర్చించారు. ఆయన్ని Hedonist గా తీర్పునిచ్చారు. నేను కూడా 1977-80 మధ్య నా పరిశోధన కాలంలో సమకాలిక చైతన్యదృష్టితో చలం సాహిత్యాన్ని కొన్ని నవలల మీద నా అభిప్రాయాలు వ్యక్తం చేశాను. రంగనాయకమ్మ, మరెందరో స్త్రీవాదులూ చలం సాహిత్యం మీద బోలెడు రాశారు.

## సాహిత్యంలో ఇజాలు

సాహిత్యంలో ఎన్నో వాదాలు బయలుదేరి గతించిపోయినాయి కూడా. వీటి గురించి ఇప్పుడు తెలుసుకోవడం అంటే వాటి చరిత్రను తెలుసుకోవటమే ఒకప్పుడు ఓ యాభై ఏళ్ళ క్రితం సాహిత్యంలో ఈ వాదాల గురించిన చర్చ బాగా జరిగింది. యూరోపులో బయలుదేరిన ఈ సిద్ధాంత ధోరణులు భారతీయ సాహిత్యంలోకి దిగుమతయ్యాయి. తెలుగులో భావకవిత్వ ధోరణి క్షీణ దశకు చేరుతున్న సమయంలో దాని మీద తిరుగుబాటు ధోరణిలో ఎన్నో ప్రయోగాలు జరిగాయి.

1. 'కళ కళ కోసమే' అనే ధోరణి కొంతకాలం రాజ్యం చేసింది సాహిత్యంలో. కాని మార్క్స్ సిద్ధాంతం. పునాదిగా బయలుదేరిన అభ్యుదయ సాహిత్యధోరణి ఆ వాదాన్ని ఖండించి మనిషికి సమాజానికి సాహిత్యానికీ వున్న బంధం నిరూపించిన తరువాత అది వెనుకబడింది. 2.సహజవాదం(Naturalism), 3. Realism (వాస్తవిక వాదం) - ఇది వాస్తవికతా వాదం కాదు. 4. భవిష్యద్వాదం(Furturism). 5.ప్రతీకవాదం(Symbolism). 6.భావచిత్రవాదం(Imagism), 7.ఇంప్రెషనిజం, 8.చైతన్య స్రవంతి, 9.అధి వాస్తవికతా వాదం (Surrealism), 10. అస్తిత్వవాదం (Existentialism) ఈ వాదాలు బూర్జువా దృక్పథం నుంచి బయలుదేరినవే. వ్యక్తివాదాలే. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచాన్ని నైరాశ్యం ముంచెత్తింది. ఆర్థిక సంక్షోభం, జీవితం దుర్భరం కావడం లాంటి పరిస్థితులు ఈ పదాల పుట్టుకకు కారణమయ్యాయి. ఈ వాదాలు సమాజ వ్యతిరేకమైనవే అయినప్పటికి వాటివల్ల కొంత మేలు జరిగిందంటారు ఆర్వియార్. తిరుగుబాటు చెయ్యటం, శిల్పంలో కొత్త పద్ధతులు ప్రవేశపెట్టడం లాంటివి అవి.

## కన్యాశుల్కంలోని విశేషాంశాలు

ఏ రచయిత పుస్తకానికైనా వివరణలు, వ్యాఖ్యానాలు ఎందుకు అవసరం ? పాఠకుల సౌలభ్యం కోసం అనేది మొదటి జవాబు. రెండోది రచయిత హృదయాన్ని అర్థం చేసుకోవటానికి అనేది. ఆధునిక తొలి నాటకం అయిన కన్యాశుల్కానికి అద్వితీయమైన రచన పేరు వచ్చింది. గురజాడను నవయుగ వైతాళికుడు అంటున్నాం. ఈ బిరుదును సార్థకం చేసేవి ఈ వివరణలు, వ్యాఖ్యానాలు అంటారు ఆర్వియార్. బంగోరే గారు మొదటి కన్యాశుల్కం ప్రతిని(1897) సేకరించి దానిని విపులమైన వ్యాఖ్యాన వివరాలతో ప్రచురించారు.రెండో కూర్పు (1909)కు కూడా అలాంటిది జరిగి ఉంటే గురజాడ పాండిత్యం, వ్యక్తిత్వమూ పాఠకులకు అర్థమై ఉండేది అని కూడా అన్నారు ఆర్వియారు.

Merits of Spoken Telugu and its Range of Expression ఋజువు చేయడానికి వ్యావహారిక భాషలో రాశారు ఈ నాటకం గురజాడ. వ్యావహారిక భాషల్లో వున్న ప్రయోగాలకు అర్థం చెప్పడం పండితులకు కుదరదు. నాటకంలోని పాత్రల సంభాషణలు గురజాడ పాండిత్యానికి, లోక వృత్త పరిశీలనకూ, ఆయన విజ్ఞానానికి, ఆధునిక దృష్టికి అద్దం పడుతూ వుంటాయి. ఇంగ్లీషు, సంస్కృత భాషా సాహిత్యాలు, తెలుగు పలుకుబళ్ళు గురజాడకు కరతలామలకాలు. గిరీశం పాత్ర సంభాషణల్లో ఎక్కువగా ఇంగ్లీషు పదాలు, రిఫరెన్స్‌లూ వుంటాయి. సంస్కృతం కూడా వుంటుంది. అగ్నిహోత్రావధాన్లు, సౌజన్యారావు పంతులు, కరటక శాస్త్రులు సంస్కృత విశేషాలు వైదిక పరిభాషనూ వెల్లడిస్తూ ఉంటారు తమ సంభాషణాల్లో. అన్ని పాత్రలూ తెలుగు పలుకుబళ్లు ఉపయోగిస్తూ జీవం పోసుకున్నాయి.

సంస్కృత విశేషాలు, ఇంగ్లీషు ప్రయోగాలు, తెలుగు పలుకుబళ్ళు అని వర్గీకరించుకుని ఆర్వియార్ ఆ విశేషాల్ని వివరించారు. ఇందులో ఆయన కృషి చాలా వుంది. ఇవి దాదాపు పరిశోధనాంశమే. ఈ వివరణలు ఇవ్వడానికి ఆయనకు తోడ్పడింది ఆయనకున్న ఇంగ్లీషు, తెలుగు భాషా సాహిత్యాల గాఢ పరిచయం. సంస్కృత భాషా పరిచయం కూడా. ఆయన ఇచ్చిన వివరణలన్ని ఈ వ్యాసంలో చెప్పటం సాధ్యం కాదు. పాఠకులు స్వయంగా చదివితేనే ఆనందం. ముఖ్యమైనవి చెప్పడం, అవసరం అనిపించినవీ పాఠకుల దృష్టికి తెస్తాను.

నాటకంలో సంస్కృత సూక్తులు, ఇంగ్లీషు ప్రయోగాలు గిరీశంతోనే మొదలవుతాయి. 'శీఘ్రబుద్ధే పలాయనం' అని పంచతంత్ర కథల్లోని పాత్ర మాటల్ని వాడుకున్నాడు గిరీశం. కరటకశాస్త్రి శిష్యునికి కన్య వేషం వేసి మధురవాణి దగ్గరకు తీసుకునివెళ్ళినప్పుడు 'ఉదర నిమిత్తం బహుకృతవేషం' అంటాడు. దీనికి సంబంధించి పూర్తి శ్లోకం ఇచ్చి ఇది ఆది శంఖరుల సుప్రసిద్ధ భజగోవింద శ్లోకం అంటారు ఆర్వియార్.

'స్త్రీ బుద్ధి: ప్రళయాంతకం' అని సాధారణంగా మన వాళ్ళు అంటూ వుంటారు. లుబ్ధావధాన్లు ఒక ఉత్తరం పట్టుకొచ్చి రామ

ప్పంతులుతో తనకు పెళ్లొద్దు పెటాకులొద్దు అన్నప్పుడు ఆయన మధురవాణి మాటలు నమ్మవద్దు అని పైమాట అంటాడు. నీతి శాస్త్రంలో వున్న ఈ పూర్తి శ్లోకం. 'ఆత్మబుద్ధి స్సుఖంచైవ గురు బుద్ధిర్విశేషత: పరబుద్ధిర్వినాశాయ స్త్రీ బుద్ధి: ప్రళయాంతకం'. సంధ్యా వందనంలో 'సంకల్పం' అని ఒకటి వుంది. అందులో ప్రవర, గోత్రం, నామం చెప్పుకుంటారు. ఈ ప్రవర గోత్ర వ్యవస్థ చరిత్రకారుల నిరంతర పరిశోధనకు ఈనాటికీ ముడిసరుకు అందిస్తూనే వుంది. వర్ణ కుల వ్యవస్థల్లాగా అంటారు ఆర్వియార్. శ్రీ సూక్తం, పురుష సూక్తం, ఋగ్వేదంలో ఏయే మండలంలో ఉండేది వివరించారు. వేద వాఙ్మయాన్ని గురించి లోతుగా వివరణలు ఇచ్చారు. అన్నం బ్రహ్మేతి వ్యజానాత్ అన్నమే బ్రహ్మ అని తెలుసుకోవాలని గిరీశం శిష్యుడు వెంకటేశానికి బోధిస్తాడు. ఈ వాక్యం తైత్తరీయోపనిషత్ తృతీయవల్లీ లోనిది. ఏది బ్రహ్మమవుతుందో తెలుసుకునే ప్రయత్నంలో వరుణపుత్రుడు ఈ విషయం తెలుసుకుంటాడు. అన్నం ఆధారంగానే అన్ని జీవరాశు లూ ఉద్భవిస్తాయి. 'ప్రమాదో ధీమతామపి' పరోపకారం పుణ్యా య పాపాయ పరపీడనం' వంటి మరిన్ని సంస్కృత సూక్తులు న్నాయి. బలవానింద్రియ గ్రామో విద్వాంసమపకర్షతి అని గీత చెబుతోందని సౌజన్యారావు పంతులు అంటాడు. కాని ఇది గీత లోని కాదు. మనుస్మృతి 2-215 లో వున్న శ్లోకం ఇది పూర్తి శ్లోకం

**మాత్రా స్వస్రా దుహిత్రావా నా వివిక్తాసనో భవేత్**

**బలవానింద్రియ గ్రామో విద్వాంస మపకర్షతి**

ఈ శ్లోకం తప్ప మిగతావి గురజాడ సంస్కృత పరిచయం అద్భుతమైనవి అంటారు ఆర్వియార్. ఇక ఇంగ్లీషు కొటేషన్స్ గిరీశం ఎక్కువగా ఇస్తుంటాడు. మొదటి అంకంలో ప్రవేశిస్తూనే పూర్రిచర్డు చెప్పినట్లు పేషన్స్ ఉంటేనే కాని లోకంలో నెగ్గలేం అంటూ ఉపన్యాసం ఇస్తాడు స్వగతంలో. ఈ పూర్రిచర్డు ఎవరైందీ చూస్తే గురజాడ ఎంత విస్తారంగా ఇంగ్లీషు సంప్రదా యాన్ని పరిశీలించిందీ తెలుస్తుంది అంటారు ఆర్వియార్. ఆ వివరాలన్నీ ఇచ్చారు ఆయనే. అలాగే ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ అనేది నర్సరీ రైమ్. దీన్ని ఎవరు రాసిందీ చాలా మందికి తెలియదు. జనే టేలర్, అన్నె టేలర్ సోదరీమణులు రాశారు. 'టు మారీ ఎ విడో ఆర్ నాట్ టు మారీ' అని షేక్స్పియర్ పాత్ర హామ్లెట్ స్వగతాన్ని అనుకరిస్తూ మాట్లాడుతాడు గిరీశం. అలాగే నిత్య వ్యవహారంలో కూడా ఆనాటికే చాలా ఇంగ్లీషు మాటలు దొర్లుతూ వున్నట్లుంది. 'పొలిశెట్టిని సప్లయికి పెట్టకండి. డామేజీ దిట్టంగా వస్తుంది' లాంటి మాటలు రామప్పంతులు వాడతాడు. గిరీశం తనను గురించి సౌజన్యారావు పంతులు దగ్గర గొప్పలు చెప్పుకుంటూ 'నెపోలియన్ ఆఫ్ యాంటీనాచ్' అని పిలుస్తారు అంటాడు. ఇక తెలుగు పలుకుబళ్ళు ప్రస్తావించాలంటే భయమే అవుతుంది. ఎందుకంటే ఎంతని ? ఎన్నని ? పద్యపాదాలు, మాటలు, నుడికారపు సొంపులు ఒకటేమిటి మొత్తం నాటకంలో ప్రతి పాత్ర ద్వారా ప్రసక్తమైనవే.

'దప్పిక్కి చేరి అరవ చాకిరి చేయడం' 'చప్పన్న భాషలు చప్పన్న దేశాలు' 'ఘంటాపథంగా' 'ఒక దరావుకి పద్దరావులు' రామ దాసు చేరుస్తాడని మునసబు అంటాడు. దరాం అనేది ఆంగ్ల పదం డ్రామ్ అనే కొలత పదం అదీ మద్యపానంలో. అంటే రామదాసు ఒక దరావు సారాకు పది దరావులు గంగ కలిపేస్తాడు అని. ఈ మోసాలు అప్పటికే ఉన్నాయన్నమాట. ఇంకా ఇలా తెలుగు పలుకుబళ్ళు గురించీ, వాటి పూర్వ రూపాల గురించీ, జపాలు, పూజల గురించీ శ్రీవైష్ణవ సాంప్రదాయంలో 'పాశురముల' గురించీ ఎంతో వివరించారు ఆర్వియార్. గురజాడకున్న పాండిత్యం, ఇంగ్లీషు, తెలుగు భాషా సాహిత్యాల గాఢ పరిచయం, సంస్కృత భాషా సాహిత్యాల పరిచయం, ఆధునిక దృష్టీ ఆర్వియార్ గారికి కూడా వున్నందువల్లే మన పాఠకులకు కన్యాశుల్కంలోని విశేషాంశాలు లోతుగా వివరించారు. 'ఫిడేల్ రాగాల డజన్ - పఠాభి' గురించీ 'కుహనా కవిత్వ రంధి' పేరుతో రాసిన రంధి సోమరాజు గారి 'ఎదగండి' కవిత గురించీ, 'భగ్న దిగంబర ముని వీస్తు తూర్పు గాలి' శీర్షికతో రాసిన వ్యాసంలోని విషయాల గురించీ ఈనాడు మనం పెద్దగా తెలుసుకోవాల్సినది ఏమీ లేదు. కానీ ఆ కవుల అభ్యుదయ వ్యతరేక ధోరణి గురించి కొంత తెలుసుకోవాల్సి ఉంది.

### తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి (పఠాభి)

ఒకప్పుడు చాలాకాలం క్రితం మీటిన ఫిడేలు రాగాల డజన్ తెలుగు కవిత్వ వికాసంలో ఒక పెద్ద ధ్వని తరంగాన్ని సృష్టిం చింది. 'తెలుగు కవిత్వం ఫ్యూడల్ సాంప్రదాయ శృంఖాలాలు తెంచుకొని బయటపడే రోజుల్లో అనేక పోకడలు పోయింది. వస్తువులో చంధస్సులో అనుభూతి వ్యక్తీకరణలో కొత్తదనం వైచిత్రి కొట్టవచ్చినట్టు కొత్త మార్పులు వచ్చాయి అన్నారు ఆర్వియార్. ఫ్యూడల్ సమాజ సంబంధాల్ని ఏవగించుకోవడం, పట్టణ పట్టణ నాగరికత పట్ల వైముఖ్యం, పెట్టుబడిదారీ నాగరిక తలోని అసంబద్ధతను విశ్లేషించుకోలేక తిరుగుబాటు చేసిన కవులు. 'నా యిష్టం వచ్చినట్లు చేస్తాను, అనుసరిస్తాను నవీన పంథా' అని చాటుకున్న వాళ్ళు. వీళ్ళ తాత్విక పునాదిని మనం విమర్శించినా వీళ్ళ తిరుగుబాటు ధోరణికి అభ్యుదయవాదులు జోహార్లర్పించాలి' అన్నారు ఆర్వియార్. అభ్యుదయ కవితా పథంలో ఈ రకం దారులన్నీ మూసుకుపోయినాయి.

### రంభి సోమరాజు గారి ఎద గండి (నవ కవిత)

అనే కవితా సంకలనంలో 'పెద్ద పెద్ద కబుర్లు' అనే ఖండికను విమర్శిస్తూ ఆర్వియార్ రాసిన వ్యాసం. శ్రీశ్రీ షష్టి పూర్తి సన్మానం

సందర్భంగా ఆయనను వ్యక్తిగా ఈసడించుకున్న వాళ్లు, శ్రీశ్రీని హిపోక్రిట్‌గా అంచనా కట్టడం జరిగింది. ఆయన సన్మాన సందర్భం సంచలనం రేకెత్తించింది. చాలా మంది పెద్దలను కలవరపెట్టింది. 'పెద్ద పెద్ద కబుర్లు' కవితా ఖండిక సోమరాజు గారిని ఒక్కసారిగా వెలుగులోకి తెచ్చింది. ఎందుకంటే ఈ కవితలో సన్మానం చేయించుకుంటున్న శ్రీశ్రీని ఒక కార్మికుడు అధిక్షేపించడం విషయం. ఈ కవితను మెచ్చుకుంటూ ఆర్.ఎస్. సుదర్శనం గారు పరామర్శించడం, నార్ల వారి ముందుమాట, రోణంకి అప్పలస్వామి గారు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సమీక్షకుడు మొదలైన వారి పొగడ్తలు – ఇవన్నీ సోమరాజు గారిని ఒక్క సారిగా పైకెత్తాయి. శ్రీశ్రీ కవిత్వాన్ని వ్యక్తిత్వాన్ని కాదనలేని స్థితిలో కమ్యూనిజం వ్యతిరేకులు ఇలంటి పెద్ద పెద్ద కబుర్లు కవిత్వ రూపంలో ఆయనను అప్రతిష్ట పాలు చేయాలని ప్రయత్నించారు' అని ఆర్వియార్ ఆగ్రహించారు. శ్రీశ్రీ మీద దుమ్ము చల్లాలనే ప్రయత్నం సూర్యుడి మీద చల్లటం వంటిదే.

**దిగంబర కవులలో ఒకరైన నగ్నముని**

కవిత్వాన్ని ఆర్వియార్ విమర్శకు పెట్టిన సందర్భం ఈ వ్యాసం. దిగంబరుల కవిత్వాన్ని అంచనా వేసి రా.రా. గారు తీర్పునిచ్చిన విషయం అందరికీ తెలుసు. 'సాహిత్యానికి రాజకీయాలకు హద్దు ఎక్కడ వుండేది వీరికి తెలుసునా? నిజమైన వర్గ చైతన్యమూ విప్లవ చైతన్యమూ వీళ్ళకి వంట బట్టాయా? నమ్మకం కలగడం లేదు' అని అంటారు ఆర్వియార్. దిగంబరులుగా వున్నంత కాలం వీరు సాహిత్యంలో ఇష్టారాజ్యం గా అవ్యవస్థను సృష్టించి రాలిపోయారు. తర్వాత విప్లవ రచయితలై ఉద్యమంలో Vanguard లయిపోయారు అని విమర్శించారు. 'తూర్పుగాలి' కవితా సంపుటిలోని ఏ ఒక్క కవితలోనూ మానవ ఆదర్శం గాని, మానవ సామర్థ్యం పట్ల విశ్వాసం గాని కనిపించవు. ఈ కవులలో ప్రజాహిత విప్లవ చైతన్యం కంటే, బూర్జువా శాడిజమ్ వేసిన వెర్రితలలే వీళ్ళ విప్లవ అతివాద రాజకీయ నినాదాలుగా రూపుదాల్చాయి అని విశ్లేషించారు ఆర్వియార్. ఈ విధంగా ఆర్వియార్ ఈ 'సాహిత్యతత్వం' పుస్తకంలో సమీక్షలూ విశ్లేషణలూ విమర్శలూ మార్క్సిస్టు దృక్పథంతో చేశారు. ❑

# ప్రస్తుత నేపథ్యంలో అభ్యుదయ సాహిత్యం

ఈ దేశ సంస్కృతి అనేక సంస్కృతీపాయల సంగమం. అనేకజాతుల నాగరికత, సంస్కృతీ కలిసి ఏర్పడిన సంస్కృతి ఇది. మతం విషయంలో లోగడ పాలించిన రాజులూ లౌకిక దృష్టిని ప్రదర్శించారు. తాము ఏ మతానుయాయులైనా ఇతర మతాలనీ మననిచ్చేరు. స్వాతంత్ర్యం వచ్చేక రాజ్యాంగంలోనే ఈ అంశాన్ని పొందుపరచుకున్నాం. దీన్ని ధ్వంసం చేసే శక్తులు తలెత్తుతున్నాయి. ఈ వారసత్వానికి విఘాతం కలిగించే అసహనం మితిమీరుతోంది.సహనం, సమన్వయం పునాదిగా వున్న ఈ సంస్కృతి వారసత్వాన్ని నిలబెట్టవలసిన సమయం వచ్చింది. చీలికల్ని నిరోధించాల్సిన సమయం వచ్చింది. ఇది ప్రస్తుత సామాజిక నేపథ్యం. మరి ఈ నేపథ్యంలో అభ్యుదయ సాహిత్యం అంటే? ఒక సంస్థ కార్యకలాపాలకే అభ్యుదయాన్ని కుదించకుండా సామాజిక అభివృద్ధికి దోహదపడే విశాల వేదికగా అభ్యుదయాన్ని గ్రహించడం ఈ నాటి కర్తవ్యం. నిన్నటి ప్రజా ఉద్యమాల సాహిత్యం, కళా రీతులు కనుమరుగవుతున్న ఈ దశలో ఆ స్ఫూర్తిని గ్రహించి సమాజాభ్యుదయాన్ని కాంక్షించే సాహితీపరులం దరూ ముందుకు రావాల్సిన అవసరం వుంది. ఇదే ప్రస్తుత సామాజిక నేపథ్యంలో అభ్యుదయ సాహిత్యం అవుతుంది.

**కె.వి.రమణారెడ్డి గారు..**

రచయితగా, విమర్శకునిగా, కవిగా అభ్యుదయ సాహిత్య ఉద్యమ చరిత్రలో ప్రముఖస్థానంలో నిలిచారు. (తర్వాత విరసం ఉద్యమంలో కూడా). ఆయన ఏ రచననీ ఆషామాషీగా చేయలేదు. ఆయన రచనలని చదివిన వాళ్లు ఎంతో కొంత మానసిక చైతన్యం పెంపొదించుకున్నామని తృప్తి పడేవాళ్లేగాని, సమయం వృథా అయిందనే నిరాశకి గురయ్యేవాళ్ళు కాదు. జీవితం పట్లా, సాహిత్యం పట్ల స్థిరమైన సిద్ధాంత దృక్పథం కలిగించాలనుకునే వాళ్ల కృషి అలాంటి ఎత్తుల్లోనే వుంటుంది. కె.వి.ఆర్. కృషి అలాంటిదే. ఓసారి విజయవాడలో, ఆయన సమక్షంలోనే, ఓ మిత్రుడు 'ఈయన కె.వి.ఆర్. తెలుసా" అన్నాడు(caviar కె.వి. ఆర్. అంటే సర్టీజియన్ లాంటి పెద్ద చేప గుడ్లు, బాక్ కేవియర్ ఇంకా విలువైంది. యూరపులో ఎంతో యిష్టంగా తినే పదార్థం) నిజమే. సాహిత్య విందులో ఆయన నిజంగా కేవిఆర్ అనే చెప్పాలి. అయితే హామ్లెట్ నాటకంలో చెప్పినట్లు 'caviarto the general (తెలియని వాళ్లు మెచ్చుకోలేని మంచి వస్తువు), ఆయన ప్రతిభా సంపత్తులకి, మార్కెట్ శక్తుల విజృంభణలో రావలసినంత గుర్తింపు రాకపోవడం ఎలాంటి దౌర్భాగ్యమో విప్లవాలని గ్లామరైజ్ చేస్తున్న రాజకీయ చింతనాపరులు విశ్లేషించాలి.

(ఆర్వియార్ సాహిత్య వ్యాసాల నుండి)

# సారాంశాన్ని తేల్చి చెప్పిన 'సాహిత్య వ్యాసాలు'

పుస్తకాలు - పరిచయాలు



- పెనుగొండ లక్ష్మీనారాయణ

సాహిత్యాన్ని ఆస్వాదించడానికైనా, విమర్శించడానికైనా హృదయ సంస్కారమూ, మేధోపరిపాకమూ రెండూ అవసరమని గుర్తించిన అతి కొద్దిమంది అభ్యుదయ సాహిత్యజీవుల్లో ఆర్వియార్ ఒకరు. నిత్యం ఆ రెండింటినీ పెంపొందించుకుంటున్న నిరంతర అధ్యయన శీలి. నవంబర్ 1980లో ఆర్వియార్ 'సాహిత్య తత్వం' వ్యాస సంపుటి చివరి అట్టపైన యుగసాహితి ప్రచురణకర్తలు రాసిన మాటలివి. నాటి మాటలకు నేటికీ ప్రత్యక్ష ప్రమాణం ఆర్వియార్. అరసం, అభ్యుదయ సాహిత్యోద్యమంలో నిరంతర భాగస్వామ్యం వహిస్తున్న ఆర్వియార్ సాహిత్య తత్వం, యుగకర్త శ్రీశ్రీ విమర్శనా గ్రంథాలతోపాటు ప్రస్తుత సమీక్ష గ్రంథం సాహిత్య వ్యాసాలు సంపుటితో కలిపి మొత్తం 160 పుస్తకాలను వెలువరించారు. ఇందులో స్వీయ రచనలు 20, అనువాద రచనలు 140. రాశిలో ఇంతకన్నా ఎక్కువ రచనలు, అనువాదాలు చేసిన వారు వేళ్లపై లెక్కించే సంఖ్యలో ఉన్నా వారిలో మాత్రం ఆర్వియార్‌దే పైచేయి. ఆర్వియార్ వయసు రీత్యా 'సప్తపదులు' దాటినా యువ్వనోత్సాహంతో నిరంతర కృషి చేస్తూ సాహిత్య ప్రపంచానికి ఒక ఉత్తమాదర్శంగా నిలిచారు. ఆర్వియార్ 2000 నుండి 2009 సంవత్సరం వరకూ దశాబ్ది కాలంలో రాసిన, వివిధ పత్రికలలో ప్రచురితమైన 28 సృజనాత్మక వ్యాసాలతో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఆగస్టు 2010లో 'ఆర్వియార్ సాహిత్య వ్యాసాలు' సంపుటిని ప్రచురించి ఎప్పటిలాగానే మరో మంచి పనిచేసింది. ఈ వ్యాసాలలో ఆయనిచ్చిన ఉటంకింపులు, ఉల్లేఖనాల ద్వారా తెలుగు, సంస్కృతం, ఆంగ్ల భాషలలో, ఆయా సాహిత్యాలలో అలాగే అనేక సామాజిక శాస్త్రాలలో ఆయనకున్న ప్రవేశం పాఠకుల్ని విస్మయానికి గురిచేస్తుంది. ఉపరితలం నుండి కాకుండా తానెన్నుకున్న విషయాలను మూలాల్లోకి వెళ్లి తర్కిస్తారు ఆర్వియార్. ఇది చాలా మంది సాహిత్య విమర్శకులు చేయని పని, చేయలేని పని. 'సాహిత్యానికి సద్విమర్శ కరదీపిక. సరైన విమర్శ లేకపోతే అభిరుచులదే పైచేయి అవుతుంది. అప్పుడు సాహిత్య ప్రయోజనమే దెబ్బతింటుంది. అందుచేత ఉత్తమ సాహిత్యసృష్టికి ఉత్తమ విమర్శ నిర్దేశకంగా ఉంటుంది. విమర్శలో మొహమాటాలు, నీళ్లు నమలడాలూ ఉండకూడదు. పాక్షికత అసలు పనికిరాదు. ఉత్తమ సాహిత్యం, ఉత్తమ విమర్శ ఉన్నపుడే సమాజానికి మేలు జరుగుతుంది. ఉత్తమ సాహిత్యం అంటే ఏమిటో స్పష్టమైన అవగాహన ఉండాలి' (తెలుగు సాహిత్య విమర్శలో 'రా.రా.'యిజం), తాను చెప్పిన ఈ ప్రమాణాలనే పాటించారు. రా.రా. నెలకొల్పిన మార్క్సిస్టు సాహిత్య విమర్శనా సంప్రదాయాలను ఆయన వారసుడిగా కొనసాగిస్తూ స్పష్టమైన అవగాహనతో తెలుగు సాహిత్య విమర్శను ముందుకు నడిపిస్తున్న ఉత్తమ విమర్శకుడు ఆర్వియార్. ఆధునిక సాహిత్య విమర్శనా సూత్రాలను ఆసరా చేసుకుని విశ్లేషణలు, ప్రతిపాదనలు, నిర్ధారణలను నిర్దుష్టంగా చేస్తూ పాఠకుడి ఆలోచనా పరిధిని, అవగాహనను విస్తృతం చేస్తున్న సాహితీవేత్త ఆర్వియార్. రా.రా. సాహిత్య విమర్శలో ప్రవేశపెట్టిన 'నిష్పాక్షిక నిర్భీక నిరంకుశ వివేచనా తత్వం' ఆర్వియార్‌కు మార్గదర్శకం. లక్షణాలు ఈ పుస్తకం నిండా కనిపిస్తాయి. ఈ పుస్తకంలో ప్రత్యేకించి పేర్కొనదగిన వ్యాసం 'సమకాలీన సమాజంలో సాన్నిహిత్య భావనలు'. ఒక మౌలిక భావనకు చెందిన వినూత్న వ్యాసం. సరికొత్త ఆలోచన. సమాజ శాస్త్రం నేపథ్యం నుండి సామాజిక సంబంధాలలో కలిగే మార్పులు, చేర్పులను ఈ చిన్న వ్యాసం అతి చక్కగా వివరించింది,



విశ్లేషించింది. సాన్నిహిత్య భావనకు సంబంధించి నాకు తెలిసినంత వరకూ ఇదే తొలి వ్యాసం. ప్రతిభ కలిగిన విమర్శ కుడైన ఆర్వియార్ కంట్రిబ్యూషన్ ఇది. 'సమాజంలోని విభిన్న బృందాల వాళ్లనూ, సంకుచిత పరిధిని అధిగమించి విస్తృత స్థాయిలో చైతన్యం సంతరించుకోవడమే ఈనాడు అవసరమైన సాన్నిహిత్య భావన. దూరం తరిగిపోయి కాలం కరిగిపోయే రోజుల్లో కుల, మత భావనల రోజులనాటి సాన్నిహిత్య భావనలు యేం కడతేరుస్తాయో పరిశీలించాలి. ఈ విషయం పునాదిగా ఆలోచనసాగాలి'. సాన్నిహిత్య భావన ఒక విశ్వజనీన దృష్టిని ప్రసరించాలని ప్రతిపాదించిన ఈ వ్యాసం ఒక చర్చా వేదికకు ప్రాతిపదిక కాదగింది. ఈ వ్యాసానికి కొనసాగింపు అవసరం. ఈ సంపుటి 'సాహిత్య కళారంగాల మీద మార్క్సిస్టు భావాల ప్రభావం' వ్యాసంతో మొదలైంది. 'కమ్యూనిస్టు పార్టీ దీర్ఘ చరిత్రలో ఆంధ్ర సాంస్కృతిక రంగం ఎంతగానో సుసంపన్నం అయింది. సామ్యవాద భావాలు, అందరూ సమానమేనన్న వాదనలు విప్రతిపత్తి లేకుండా ఆమోదం పొందాయి' అని ప్రజా సాంస్కృతికోద్యమంలో కమ్యూనిస్టులు సాధించిన విజయాలను ప్రశంసించారు. 'ప్రస్తుత సామాజిక నేపథ్యంలో అభ్యుదయ సాహిత్యం', 'అరవై ఏళ్ల అరసం' వ్యాసాలలో అరసం చరిత్రను, అభ్యుదయ సాహిత్యోద్యమ ఆవిర్భావ వికాసాలను, దాని ఆవశ్యకతను వివరించారు. 1970లో ఏర్పడ్డ విరసం కానీ మరే సాహిత్య సాంస్కృతిక సంస్థలకైనా వాటి కుదురు అభ్యుదయ సాహిత్యమేనని అరసం ఉద్యమ కార్యకర్తగా స్పష్టం చేశారు. అభ్యుదయ సాహిత్యం అంతరించినట్లు, ఆ శకం అంతమైనట్లు అర్థం వచ్చే రీతిలో అభ్యుదయానంతర సాహిత్యమని సూత్రీక రణలు చేసే వాళ్లను నిరసించారు. అటువంటి సూత్రీకరణలు చేయటం ఏ మాత్రం సమంజసం కాదని ఆర్వియార్ ఆమోద యోగ్యమైన చర్చ చేశారు. 'తెలుగు సాహిత్య విమర్శలో రా.రా. యిజం', 'సాహిత్య ప్రయోజనం తెలియజెప్పిన కొ.కు.' వ్యాసాలు రెండింటిలో కవిత్వానికి శ్రీశ్రీ, వచనరంగానికి కొడవటిగంటి, విమర్శకు రా.రా. పథనిర్దేశకులని, వీరిని 'అభ్యుదయ సాహిత్య యుగత్రయం' అని ఆర్వియార్ చేసిన స్థాన నిర్ణయంపై ఎవరికీ, ఎటువంటి అభిప్రాయభేదం లేదు. 'అక్షర తూణీరం కె.వి.ఆర్.' వ్యాసంలో 'ఆయన భావాలంత గంభీరంగానూ ఉండేది ఆయన శైలి. ఒక్కోసారి ఆయన శైలి భారం ఇబ్బంది కలిగించేది' అంటూనే 'యాభై ఏళ్ల ఆధునిక సాహిత్య చరిత్రని అవలోకన చెయ్యవలసిన సందర్భంలో ఆయన ప్రస్తావన లేకుండా చెయ్యి డం వీలుపడదు' అని సాహిత్య చరిత్రలో రమణారెడ్డి స్థానాన్ని సహృదయతతో నిర్దేశించారు. అరసానికి, విరసానికి మొత్తంగా ప్రగతిశీల సాహిత్యానికి కార్యకర్తగా, నేతగా, కావ్యకర్తగా అంకిత భావంతో రమణారెడ్డి చేసిన సేవలు అటువంటివి. సాహిత్యంలో స్థాన నిర్ణయాలు చేయటం కష్టమైన పని. అయినా ఆర్వియార్ ఎటువంటి అపోహలకి, ప్రశ్నలకి తావివ్వకుండా తన జ్ఞాన సంపదతో ఆ పనిని ఎంతో ఇష్టంగా చేయగలిగారు. చలం గురించి రాసిన మూడు వ్యాసాలు ఆయనలో కలిగిన మార్పుల ను, చోటు చేసుకున్న పరిణామాలను వివరిస్తాయి. చలం చేసిన సాహిత్య కృషినీ అది సమాజంపై నెలకొల్పిన ప్రభావాన్ని పేర్కొంటూ 'సాహిత్యానికి చేసిన అపురూపమైన సేవ మరొకటి ఉంది. సమాజాన్ని ప్రతిఘటించమని ధైర్యం, ప్రోత్సాహం కలిగిస్తూ విరామం లేకుండా ప్రచారం చేసిన సాహిత్యం అది' అని చలం సాహిత్యంలోని ఒక దశను వివరించారు. 'సాంఘిక తిరుగుబాటు ఈశ్వరుడి విభూతికి వశం అయిందనిపించింది. అరుణాచలేశ్వరు వామభాగాన జరిగే కుంకుమపూజకి అంకితం అయిందనిపించింది' అని చలం తిరువణ్ణామలై చేరిన తరువాత దశను మొత్తంగా ఆయన సాహిత్యాన్ని, జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని రూపుకట్టించారు. 'తిలక్ స్వభావరీత్యా భావ కవితా వారసుడవ డం, ఆ స్వభావం నుంచే తిలక్ కవిత్వంలో విషాద అలంకారిత ప్రవేశించింది. ఈ విషాద అలంకారితను బట్టే తిలక్ భావ కవిత్వ పంజరంలో ఉన్నాడు. ఉత్తమ కవిత్వ లక్షణాలు ఉన్న వాడు కాబట్టి, హృదయానుభూతి పరిధిని విస్తరింప చేశాడు తన విషాద అలంకారితతో' ఈ మాటలు చాలు తిలక్‌ను అర్థం చేసు కోవటానికి. తిలక్ 'పునాది ఆధారంగా భావకవి. అభ్యుద య కవితా వికాసం జరిగిన సాంఘిక నేపథ్యంలో గొంతు విప్పిన భావకవి. అభ్యుదయ కవిత్వ తాత్విక భూమిక తిలక్‌కు వస్తుతః లేదు. కవిత్వం ద్వారా సమాజాన్ని మార్చాలని తపించే వాళ్ల కవిత్వ ప్రకంపనలని కలిగించే ప్రయత్నం తిలక్ చెయ్యలేదు' అని విశ్లేషిస్తూ 'తిలక్ వస్తుతః భావకవి' అని నిర్ధారణ చేశారు.

ఆర్వియార్ 'జీవితం గురించీ, జీవిత సమస్యల గురించీ లోతైన అవగాహనని ఆహ్లాదకరమైన ఆలంకారితతో అందించే కమనీయమైన కథలు 'కవనశర్మ కథలు' అంటారు ఆర్వియార్. విషాద ఆలంకారిత, ఆహ్లాద ఆలంకారిత ఈ తరం సాహితీ వేత్తలకు దూరమైన సాహిత్య లక్షణాలకు సంబంధించిన పదా లు. ఆ సాహిత్య లక్షణాలను తిలక్ కవిత్వానికి, కవనశర్మ కథలకు సమన్వయపరచి అందించిన ఆర్వియార్‌కు ప్రాచీన సాహిత్యంతో మరీ ముఖ్యంగా అలంకార శాస్త్రంతో ఉన్న ప్రగాఢ పరిచయాన్ని తెలుపుతుంది.

ప్రఖ్యాత ఆంగ్ల రచయిత ఛార్లెస్ డికెన్సును స్మరించుకుంటూ 'జీవితాన్ని సాహిత్యంలో ప్రతిబిం బింపచేసి సాంఘిక నవలకి పునాది వేసిన ఛార్లెస్ డికెన్స్ ప్రఖ్యాతి ఎప్పటికీ దేదీప్యమానంగానే వెలుగుతూ ఉంటుంది' అని ఆయన సాహిత్య కృషినీ, జీవన రేఖలనూ 'సమకాలీన సమాజాన్ని నిలువుటద్దంలో చూపిన ఛార్లెస్ డికెన్స్' వ్యాసంలో పొందుపరిచారు. ఇంకా 'అత్యుత్తమ కళాస్రష్ట గురజాడ' అని అభివర్ణించారు. తాపీ వారి

పరిణామక్రమాన్ని ఆసక్తికరంగా విశ్లేషిస్తూ తెలుగు భాషా సాహిత్యాలకు, సమాజానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. 'సుకవి జీవించె ప్రజల నాలుకల యందు' అన్న కవి కోకిల జాషువా మాటలను ఆయనకే అన్వయపరుస్తూ రాసిన వ్యాసంలో 'ఆయన ఆరాటాన్ని వెల్లడించిన వాడేకాని పోరాటాన్ని చేపట్టమన్న వాడు కాదు' అని కవిత్వ తత్వాన్ని విశదీకరించారు. 'ఈ యుగం శ్రీశ్రీదే' అని స్పష్టం చేశారు. 'బుచ్చిబాబు సాహిత్య ప్రమాణాలరీత్యా గొప్ప రచయిత' అని విశ్లేషించారు. 'మునిపల్లె రాజుగారు సామాజిక స్పృహ, జీవన స్పృహ మేళవించుకుని ఉన్న నేటి మానవుడు' అని తన అభిమానాన్ని ప్రకటించారు. తనకున్న 'సీమ బంధాన్ని' ఆత్మీయంగా గుర్తు చేసుకున్నారు. 'తెలంగాణ తొలితరం కథలు' పుస్తకాన్ని ఆహ్వానిస్తూ ఆకాశవాణిలో తన వాణిని వినిపించారు. గరిమెళ్ల, పుట్టపర్తి, చాసోల సాహిత్యాన్ని గురించి రాశారు. ప్రతి వ్యాసానికి మంచి శీర్షికలను పెట్టారు. ప్రతి వ్యాసమూ పేర్కొనదగినదే, విశ్లేషించదగినదే. ఈ వ్యాసాలకు తాత్విక పునాది మార్క్సిజమ్. మొత్తంగా సారాంశాన్ని తేల్చిచెప్పిన సారవంతమైన వ్యాసాలివి. 'సాహిత్యం జీవితాన్ని ప్రతిఫలింప చేసే విమర్శ అయితే ఆ ప్రతిఫలనం ఎలా ఉన్నదీ, విడమర్చి చెప్పేదే సాహిత్య విమర్శ' అని 'సత్తా తేల్చి చెప్పడమే సరైన విమర్శ' వ్యాసంలో స్పష్టం చేసిన ఆర్వియార్ విమర్శకుడిగా తన సత్తాను మరోసారి నిరూపించుకున్నారు ఈ వ్యాస సంపుటి ద్వారా. ఈ పుస్తకాన్ని ముఖ్యంగా పశ్చిమగోదావరి జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి, అభివృద్ధికి కృషి చేసిన, విశాలాంధ్రలో బాధ్యతలు నిర్వహించిన భూపతిరాజు మన్యం గారికీ అలాగే అభ్యుదయ ప్రస్థానంలో 40 ఏళ్లపైబడి తనకు తోడుగా ఉన్న డి.వి.వి.ఎస్.వర్మ, మనోరమ దంపతులకు అంకితం చేయడం హర్షించదగిన విషయం. అందరూ చదవాల్సిన ఇంత మంచి పుస్తకాన్ని ప్రచురించిన విశాలాంధ్రను అభినందిస్తున్నాను. ❑

# తిలక్.. తదనంతర సాహిత్య స్రవంతులు

**(26వ పేజీ తరువాయి)**

వ్యవహారం కలిపించేరు. భారత రాజ్యాంగంలో అస్పృశ్యతని పాటించడం నేరం చేశారు. కాని, శతాబ్దాలుగా మానసిక చక్రానికి పట్టిన మకిలి తొందరగా పోదు. వివక్ష కొనసాగుతూనే వుంది. ఈ లోపున విద్యావకాశాలున్న ఆ వర్గం యువకులు ఒక నూతన చైతన్యంతో ముందుకు వచ్చేరు. మహారాష్ట్రలో దళిత పాంథర్ ఉద్యమం వచ్చింది. అంబేద్కర్ స్ఫూర్తితో తమ హక్కుల సాధనకు తామే నడుం బిగించాలన్న చైతన్యం వచ్చింది. ఆంధ్రప్రదేశ్లో యిలా వచ్చిందే దళిత కవిత్వ ఉద్యమం. సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా తమ ఆత్మగౌరవం కాపాడుకోవడం కోసం తామే కృషి చెయ్యాలి. దళిత వర్గాల అభ్యున్నతికోసం దళిత సాహిత్యం నడుం బిగించాలి. అగ్రవర్ణ ఆధిపత్యాన్ని, బ్రాహ్మణ వాదాన్ని దళిత సాహిత్యం ఖండిస్తుంది. మార్క్సిజం భారతదేశంలో అగ్రవర్ణాల ప్రాపకంలో వుందనీ, అలాకాకుండా మార్క్సిజం అంబేద్కరిజం కలిసి నూతన జవసత్వాల్ని పుంజుకోవాలని కొందరి వాదన. దళిత సాహిత్యోద్యమం విరసంతో సంబంధం లేకుండానే రూపు తీసుకుని పెరిగింది. యీ దళిత కవిత్వ ఉద్యమంలో దళితుల గొంతులు ఖంగు మంటూ వినిపించి, కవిత్వసీమలో తమ ప్రత్యేక సామర్థ్యాన్ని ప్రకటించిన కవులు చాలామంది వున్నారు. సతీష్చందర్, ఎండ్లూరి సుధాకర్, బి.సి.రాములు, శిఖామణి, ఖాదర్ మొహియుద్దీన్లాంటి ప్రతిభావంతులున్నారు. "దళితులు సంఘంలో కోరేది అస్తిత్వానికి అర్థం, వ్యక్తికి ఆత్మకు గౌరవం" అన్నారు ఇనాక్. యిది సాధించడం యీ సాహిత్య లక్ష్యాలు. అట్టడుగు వర్గాలు అణచివేతకు "దళిత" అనే పేరుతో సమాజం గురవుతూవుంటే, అట్టడుగునా, మధ్యనా, పైనా యెక్కడ వున్నామన్న దానితో సంబంధం లేకుండా అణచివేతకు గురవుతున్న వాళ్లు స్త్రీలు. స్త్రీల ఉద్ధరణ జరక్కపోతే సాంఘిక పురోగతే లేదన్న చైతన్యం యీ 20వ శతాబ్దంలోనే వచ్చింది. తెలుగు కవిత్వంలో యీ స్వేచ్ఛాగానం 80ల తొలిదశలో బాగా విస్తరించింది. అమెరికాలో ఫెమినిజం యీ శతాబ్ది తొలిదశలోనే గళం విప్పింది. 60లలో ఆంధ్రదేశంలో రచయిత్రులు నవలలు, కథలు రాసి ప్రాచుర్యం పొందేరు. పురుషులు స్త్రీల విమోచన కోసం కృషి చెయ్యలేదని కాదు, స్త్రీలే తమ సమస్యల్ని తామే ప్రకటిస్తూ రాసేది స్త్రీవాద కవిత్వ మవుతుందన్నారు. చాలా సంస్థలు వెలిశాయి. 1993లో "అస్మిత" వారు "నీలి మేఘాలు" అని స్త్రీవాద కవిత్వసంకలనం తెచ్చేరు. స్త్రీలు ఫ్యూడల్ దాస్య సంకెళ్లనీ, నైతిక ధర్మాల ప్రబోధాన్ని తెంచు కోవాలి. సావిత్రి రాసిన "బందిపోట్లు" కవిత్వ స్ఫూర్తితో స్త్రీ పరిస్థితిని చూపించింది. ఓల్గా, జయప్రభ, కొండేపూడి నిర్మల, పాటిబండ్ల రజని మొదలైనవాళ్లు స్త్రీవాద కవిత్వానికి ఉదాహరణ ప్రాయమైన కవిత్వం ప్రచురించేరు. కొంతమంది పురుషులు యీ ధోరణిలో కవిత్వం రాశారు. స్త్రీవాద ఉద్యమం ఒక నూతన దృక్కోణాన్ని అందించింది. మొత్తంమీద వచన కవిత్వ రూపంలో యీ ఉద్యమాలన్నీ తమ అనుభూతులు వెల్లడించేయి. యీ శతాబ్దం నాల్గవపాదంలో ప్రభావం కలిగించిన ఉద్యమాలు దళిత, స్త్రీవాద కవిత్వ ఉద్యమాలు. ❑

# యుగకర్త గా శ్రీశ్రీ

## పుస్తకాలు - పరిచయాలు



- అదృష్టదీపక్

రష్యన్ మహాకవి మయకోవ్‌స్కీ “నేను సమున్నత కవితా శిఖరాల నుంచి కమ్యూనిజంలోకి దూకుతాను. కమ్యూనిజం నా హృదయం. అది వినా నాకు ఏమీ లేదు” అంటాడు. ఈ మాటలు అక్షరాలా మహాకవి శ్రీశ్రీకి వర్తిస్తాయి. ఆధునిక తెలుగు సాహిత్యంలో కమ్యూనిజాన్ని, శ్రీశ్రీని వేరుచేసి చూడలేం. అందుకే కమ్యూనిజాన్ని, విమర్శించాలంటే శ్రీశ్రీని విమర్శించడం మతవాదులకూ, మితవాదులకూ ఈ నాటికీ ఒక అలవాటుగా మారిపోయింది. 'కష్టజీవికి ఇరువైపులా నిలిచిన వాడే కవి' అని ఉద్ఘాటించిన శ్రీశ్రీ గురించి 'పునర్ మూల్యాంకనం' పేరుతో వక్రభాష్యాలు చెబుతున్న ఆధునిక మేధావులు కూడా ఎక్కువ అవుతున్నారు. శ్రీశ్రీని విమర్శించడమే లక్ష్యంగా మతవాదులూ, మితవాదులూ విచిత్రంగా వియ్యమందుతున్నారు. ఇలాంటి విపరీత ధోరణులకు సమాధానంగా శ్రీశ్రీ శత జయంతి సందర్భంలో ప్రఖ్యాత సాహితీ విమర్శకులు ఆర్వీయార్ రచించిన 'యుగకర్త' శ్రీశ్రీ పుస్తకాన్ని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించింది.

శ్రీశ్రీ కవిత్వం మీద ఇప్పటికే తలగడల్లాంటి సిద్ధాంత గ్రంథాలూ, సంప్రదాయపు సంకెళ్లలో బంధించబోయిన సమీక్ష గ్రంథాలూ ఎన్నో వెలువడ్డాయి. అసంబద్ధమైన పొగడ్తల ముసుగులో శ్రీశ్రీ వక్తిత్వ హననం చేసే ప్రయత్నాలు కూడా జరిగాయి. ఇలాంటి పెడ ధోరణులకు భిన్నంగా ఆర్వియార్ - శ్రీశ్రీ కవిత్వంతోపాటు, శ్రీశ్రీని ప్రభావితం చేసిన సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను కూడా సమగ్రంగా విశ్లేషించారు.

ఒకసారి మాటల సందర్భంలో ఆర్వీయార్ ఈ సమీక్షకుడితో 'శ్రీశ్రీ ఎన్ని తప్పులు చేసినా మనం క్షమించేయాలి. ఎందుకంటే శ్రీశ్రీ లేకుండా అభ్యుదయ సాహిత్యాన్ని ఊహించలేం' అన్నారు. అలాగని ఈ పుస్తకాన్ని శ్రీశ్రీ భజనతోనూ, అసందర్భ స్తోత్ర పాఠాలతోనూ నింపలేదు. శ్రీశ్రీ బతుకుబాటలో ఎదురైన ఎత్తు పల్లాలనూ, అనేక సందర్భాల్లో ఆయనలోని నిలకడలేనితనాన్ని స్పష్టంగా వివరించారు.

శ్రీశ్రీ మహాప్రస్థాన గీతాలు రాసే నాటికి తనకు మార్క్సిజం అనే దార్శనికత ఒకటి ఉన్నట్లు తెలియదు అని చెప్పాడు. దీని గురించి ఆర్వియార్ ఇలా అంటారు 'శ్రీశ్రీ తన రచనల్లో ఆ దృక్పథం లేదని చెప్పలేదు. ఆ సిద్ధాంతం గురించి తెలుసుకుని, దానిని అధ్యయనం చేశాక ఒక స్థిరమైన గమ్యం, పటువైన పంథా ఏర్పడ్డాయి. తన కవిత్వ లక్ష్యం ఏమిటన్నది స్పష్టమైంది. అప్పటి నుంచి యావజ్జీవితమూ ఈ పంథా నుంచి పిసరు కూడా మళ్లలేదు. అందుకనే శ్రీశ్రీ అభ్యుదయ సాహిత్య యుగకర్త కాగలిగాడు. శ్రీశ్రీ ఆది నుంచి అభ్యుదయ రచయితల సంఘంలో లేడు. అయినా అభ్యుదయ సాహిత్యోద్యమానికి శ్రీశ్రీ కవిత్వమే ప్రణాళిక అయింది. శ్రీశ్రీ కవిత్వమే సిద్ధాంతపరమైన సాహిత్య భూమిక అయింది. తరువాత శ్రీశ్రీ ఉద్యమ నాయకుడయ్యాడు'.




శ్రీశ్రీకి సమాంతరంగా సాగిన ఆంధ్రదేశ రాజకీయ, సాంస్కృతిక చరిత్ర అంతా ఆర్వియార్ ఈ పుస్తకంలో ప్రస్తావించారు. తొలి రోజులలో 18 ఏళ్ల వయసులో సంప్రదాయ ఛందోబద్ధమైన 'ప్రభవ' కావ్యం రాసిన శ్రీశ్రీకి 1930లో మానసికంగానూ, శారీరకంగానూ ఎదురైన తీవ్ర సంక్షోభ నేపథ్యం నుంచి 'అలజడి మా జీవితం. ఆందోళన మా ఊపిరి. తిరుగుబాటు మా వేదాంతం' అనే కొత్తచూపు ఏర్పడింది. తన దగ్గర వున్న ఆయుధ సంపత్తి అంతా కవిత్వమే. దానిని ప్రజా చైతన్యానికి ధారపోయాలి అని కంకణం కట్టుకున్నాడు. 'నేను

సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అని జయ భేరి మోగించాడు. మహా ప్రస్థానానికి శ్రీకారం చుట్టాడు. ఒక సభలో 'దేశ చరిత్రలు' గేయం రేకెత్తించిన ఉత్సాహోద్రేకాలు గమనించిన ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు చండ్ర రాజేశ్వరరావు 'మరో ప్రపంచానికి బాటను చూపిన మహాకవి శ్రీశ్రీ' అని శ్లాఘించారు.

1955లో జరిగిన మధ్యంతర ఎన్నికలలో శ్రీశ్రీ కమ్యూనిస్టు పార్టీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. ఆ సమయంలో అభ్యుదయ వ్యతిరేక శక్తులన్నీ ఏకతాటి మీదకు వచ్చి 'పెట్టుబడికి, కట్టుకథలకు విషపుత్రిక అయిన పత్రికల ద్వారా కమ్యూనిస్టు పార్టీ మీదా, శ్రీశ్రీ మీద దొంగదాడి చేశాయి. ఆ దాడిలో మానసికంగా గాయపడిన శ్రీశ్రీ 'గాయాలను కానుకలుగా స్వీకరించి, కాయమున్నంత కాలమూ గర్విస్తాను' అని అన్నాడు. 'కొత్తది కనిపిస్తే దాని సిద్ధాంత పునాది ఏమిటి ? ఏ దిశలో అది పయనిస్తోంది ? అన్న పట్టింపులు లేకుండా కళ్ల కద్దుకుని ఆహ్వానించే సహజతత్వం శ్రీశ్రీది' అన్నారు. ఆర్వీయార్ ఉదాహరణలుగా అస్తిత్వవాదం, దాడాయిజం, దిగంబర కవిత్వాల మీద శ్రీశ్రీ తక్షణ స్పందన గమనించవచ్చు. '1970లో విశాఖలో జరిగిన శ్రీశ్రీ షష్టి పూర్తి సన్మాన సభలో 'రచయిత లారా మీరెటు వైపు ?' అనే ప్రశ్న ప్రతిధ్వనించింది. సభలో పాల్గొన్న రచయితల్లో విభిన్న స్వరాలూ, చీలిక ధోరణులూ వెల్లువెత్తాయి. శ్రీశ్రీ మనస్సు సాయుధ రైతాంగ పోరాటానికి రచయితలు నిబద్ధులు కావాలనే భావం వైపు మొగ్గింది. అరసం నుంచి విడిపోయిన విరసానికి అధ్యక్షుడయ్యాడు. అయితే కాలక్రమంలో శ్రీశ్రీ ఎన్నోసార్లు విరసం తీర్మానాలకు, ఆదేశాలకూ అనుగుణంగా ప్రవర్తించలేదు. శ్రీశ్రీ కవిత్వంలో ఆయా సందర్భాలనూ, సన్నివేశాలనూ బట్టి - మార్క్సిస్టు సిద్ధాంతంలోని సమాజ చలన సూత్రాలను అడుగడుగునా అన్వయిస్తూ ఆర్వీయార్ విశ్లేషణ కొనసాగింది. 'దేశచరిత్రలు' గేయంలో కనిపించే చారిత్రక భౌతికవాద పోకడలను వివరించిన తీరు ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. శ్రీశ్రీ 'శరచ్చంద్రిక' రాసే నాటికి (23-10-1954 కృష్ణా పత్రిక) చంద్రమండలం మీద మనిషి కాలు మోపలేదు. కాని శ్రీశ్రీ భవిష్యద్దర్శనానికి గుర్తుగా ఆర్వీయార్ ఈ సంఘటనను గుర్తు చేశారు.

శ్రీశ్రీ జీవనాధారం కోసం రాసిన సినిమా పాటల్లోనూ 'సమసమాజ నిర్మాణమే మన ధ్యేయం' 'అందరి కోసం ఒక్కడు నిలిచి, ఒక్కని కోసం అందరు కలిసి' మొదలైన వాక్యాలలో కనిపించే మార్క్సిస్టు దార్శనికతను ఆర్వీయార్ ఎత్తి చూపించారు. ఇలా అయితే పుస్తకంలోని ప్రతి అంశమూ ఉటంకించవలసిందే! ఆ ప్రయత్నం మానుకుని, ఆర్వీయార్ మాటల్లోనే ఈ సమీక్షను ముగిస్తాను. 'శ్రీశ్రీ ప్రజా హృదయంలో స్థాపించుకున్న స్థానం మరెవరికీ దక్కలేదు. ఎన్ని దొంగదాడులు జరిగినా, ఎంతగా సంప్రదాయ పీఠాధిపతులు దుమ్మెత్తి పోసినా శ్రీశ్రీకి గల ఆదరణ తగ్గలేదు. ఆయన వ్యక్తిగత దౌర్బల్యాలూ, బలహీనతలూ బహిరంగంగానే కనిపిస్తూ వున్నా అవేవీ ఆయన్ను అభిమానించడానికి అడ్డం కాలేదు. ❑

## ఆర్వీయార్ 'యుగకర్త శ్రీశ్రీ' పుస్తకం నుండి..

శ్రీశ్రీ కవిత్వం సామాజిక చైతన్య ప్రతినిధి. "అలజడి మాజీవితం. ఆందోళన మా ఊపిరి, తిరుగుబాటు మావేదాంతం" అనే నినాదంతో నూతన సాహిత్య గవాక్షాల్ని తెరిచింది. "మాకు గోడలు లేవు గోడలను పగులగొట్టడమే మా పని" అని నిర్భయంగా ప్రకటించుకుంటుంది. ముందుకుపోతాం మేము ప్రపంచం మావెంట వస్తుంది అన్న ధీమాని ప్రకటిస్తుంది అభిప్రాయం కోసం బాధలు లక్ష్యపెట్టని వాళ్లు మాలోకి వస్తారు అని యీ పంథా ననుసరించే వాళ్ల యోగ్యతా పత్రాన్ని ప్రచురిస్తుంది. అలా వచ్చే వాళ్లే అభ్యుదయ పథగాములు. శ్రీశ్రీ తన రచనలతో ఆ పథం నిర్దేశించేడు. అభిప్రాయాల ఔన్నత్యం సంతరించుకున్న వాళ్లు ఆ పథం మీద నడిచేరు. అదే అభ్యుదయ సాహిత్య ఉద్యమం. ఈ ఉద్యమంలో శ్రీశ్రీ నిర్వహించిన పాత్ర యుగకర్తగా భాసించే దీప్తినిచ్చింది.

శ్రీశ్రీ వాడిన ప్రతీకలన్ని సంప్రదాయం నుంచి గ్రహించినవే. "హరోం! హరోం! హర! హర! హర! హర! హరోం హరా" అనే నినాదంతో కదలమంటాడు "యముని మహిషపు లోహఘంటలు", "కనకదుర్గ సింహం", "ఇంద్రదేవుని మదపుటేనుగు", "నందికేశుడు", "అది సూకరవేద వేద్యుడు", "అవతారం"లో కొత్త సృష్టిని స్ఫురింపించడానికి ప్రతీకలు అవుతాయి! "ఐ"లో "యజ్ఞోపవీతం", "వైష్ణవగీతం"లో సహా మన్నన అందుకుంటుంది. "శైశవగీతి"తో చిరుతలు "పరమాత్ములు", పతితుల ఉద్ధరణకి "జగన్నాథ రథచక్రాల్ని" భూమార్గం పట్టిస్తాడు. మార్క్స్ ఎంగెల్స్ "మహాప్రవక్త"లై మానవ పురోగమన మార్గాలు తెరుస్తారు. లెనిన్ "తపస్సు" స్టాలిన్ "సేద్యం" జ్వలించి, ఫలించి సోవియట్ సోషలిస్టు రాజ్యం యేర్పడింది. ఇలా సాంప్రదాయిక ప్రతీకలు వాడడం వల్ల శ్రీశ్రీ యెంచుకున్న నవీన రీతికి, శ్రీశ్రీ నవీనగీతికి యేమాత్రం సొడ్డు పడలేదు.

# ఆర్వీయార్ : ప్రజాస్వామిక లౌకిక స్వాతంత్ర్య సమర చరిత్ర

పుస్తకాలు - పరిచయాలు



- కొప్పర్తి వెంకటరమణమూర్తి

అకడమిక్ చరిత్రలను అటుంచితే, తెలుగులో సంక్షిప్తంగా సమగ్రంగా అంటే అరచేతిలో ఉసిరికాయలా వచ్చిన భారత స్వాతంత్ర్య సమర చరిత్రలు ఎక్కువగా ఏమీ లేవు. అందులోనూ అనువాదాలు కాకుండా స్వతంత్ర రచనలు అనదగ్గవి ఇంకా తక్కువ. వాటిల్లోనూ విషయ పరిపుష్టి కలిగిన చిన్న చిన్న వాక్యాలతో, సరళంగా, తెలుగు నుడికారంతో సామాజిక ఆర్థిక కోణం నుంచి వచ్చిన చరిత్రలు ఒకటో రెండో ఉంటాయి. వాటిల్లో ఆర్వీయార్ రాసిన 'భారత స్వాతంత్ర్య సమర చరిత్ర' ఒకటి. మతతత్వంతో చరిత్రను వక్రీకరించి మతాల మధ్య, మనుషుల మధ్య దూరాన్ని పెంచుతున్న కాలంలో ప్రజాస్వామిక లౌకిక దృక్పథంతో రాసిన ఈ చరిత్ర ఆ విషానికి విరుగుడు.

ఫ్రెంచ్ విప్లవంతో ఆధునిక యుగం ఆరంభమైందనుకుంటే అమెరికా స్వాతంత్ర్య సమరాన్ని, ఇటలీ జర్మనీ ఏకీకరణలను, బాల్కన్‌లలో జాతీయోద్యమాల్ని, రష్యా చైనా విప్లవాలను, ఆసియా ఆఫ్రికాలలో విమోచనోద్యమాలను పురోగామి సంఘటనలుగా చెప్పాలి. ఫ్రెంచ్ విప్లవం 'అలగా' జనం అండదండలతో మధ్యతరగతి చేసిన విప్లవం. మొదటిసారి స్వేచ్ఛ సమానత్వాలను పాదుకొల్పిన మహత్తర సంఘటన. అమెరికా స్వాతంత్ర్యసమరం అమెరికన్ వలస సైనికులకూ బ్రిటన్ సైన్యాలకూ జరిగిన ప్రత్యక్ష యుద్ధం. ఫలితం అమెరికా పుట్టడమే ప్రజాస్వామిక దేశంగా పుట్టడం. ఇటలీ ఏకీకరణ, జర్మనీ ఏకీకరణ అంటే విదేశీ జాతుల ఆక్రమణలో ముక్కలు చెక్కలుగా ఉన్న తమ జాతుల్ని సార్డీనియా, ప్రష్యాలు యుద్ధంతో యుద్ధదౌత్యంతో గెలిచి వరుసగా ఆ దేశాలుగా అవతరించడం. ఇక రష్యా, చైనా విప్లవాల సంగతి తెలిసిందే. అవి రాచరిక, భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థల మీద కార్మిక కర్షక వర్గాలు చేసిన తిరుగుబాట్లు, ఫలితంగా ఏర్పడిన శ్రామిక నియంతృత్వాలూ. పైసంఘటనలన్నీ అపూర్వాలే. కానీ ఒకొక్క దానిలో పాల్గొన్న వర్గాల సంఖ్య పరిమితం. అయితే సైనికులు, లేదా దిగువ వర్గాలు, కాకపోతే మధ్యతరగతి నడిపిన ఉద్యమాలవి. ఆ తర్వాత సంభవించిన భారత స్వాతంత్ర్య ఉద్యమం అపూర్వమే కాదు, అసాధారణం కూడా. పై సంఘటనలన్నిటిలో ఉన్న మౌలిక లక్షణాలన్నిటిని సంతరించుకుని వాటికి తెలియని ఒక ప్రత్యామ్నాయ పోరాట మార్గంలో విజయం సాధించిన ఇతిహాసం అది. సంస్థానాధీశుల దగ్గర్నుంచి, భూస్వాములు, పెట్టుబడిదారులు, మధ్యతరగతి, న్యాయవాదులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కళాకారులు, అగ్రవర్ణాలు, బహుజనులు, దళితులు, రైతులు, స్త్రీలు, గిరిజనులు, ఒక్కమాటలో సబ్బండ వర్గాలూ పాల్గొన్న తొలి జాతీయోద్యమం. పై సంఘటనలన్నీ సంభవాలైతే భారత స్వాతంత్ర్య సాధన ఒక ఆవిష్కారం. చెలమగా మొదలై వాగుల్ని వంకల్ని కలుపుకుని పరవళ్లు తొక్కిన మహా ప్రవాహం. దీనికి అహింస ప్రధాన సాధనం. కానీ ఇందులో హింస ఉంది. విప్లవ మార్గం ఉంది. దౌత్యం ఉంది. కుడి ఎడమ పక్షాలు ఉన్నాయి. మతం ఉంది. సంస్కరణ ఉంది. ఎప్పటికప్పుడు తనను తాను మలచుకున్న ఉలితనం ఉంది ఈ అన్నిటినీ మించి అత్యంతా ధునిక ప్రభుత్వ రూపమైన ప్రజాస్వామ్య, లౌకిక, సామ్య వాద వ్యవస్థ నిర్మాణాన్ని గమ్యం గా కలిగి ఉంది. ఈ సంవిధా నాన్ని సమర్థవంతంగా వ్యక్తీక రించిన చరిత్ర ఇది. తెలుగు, ఇంగ్లీషు, సంస్కృత భాషల్లో సమాన పాండిత్యం ఉన్న వామపక్ష సిద్ధాంత అధ్యయన పరుడు, సాహిత్య విమర్శకుడు, మహా అనువాదకుడు అయిన ఆర్వీయార్ జాతీయోద్యమాన్ని ఆద్యంతం అధ్యయనం చేసి,



అర్థం చేసుకుని సమాచారంతో కాక సారంతో నింపిన చరిత్ర ఇది. విశాలాంధ్ర ప్రచురణాలయం వారు పంపిణీదారులుగా అమరావతి పబ్లికేషన్స్ గుంటూరు వారు 2012 లో ముద్రించిన ఈ చరిత్ర స్వాతంత్ర్యోద్యమ పార్శ్వాలన్నిటినీ తడిమింది. స్థబ్దంగా చలనరహితంగా ఉన్న భారతీయ సమాజంలోకి బ్రిటిష్ రాక ఎట్లా ప్రకంపనల్ని సృష్టించిందో, 'భారతీయ సమాజ చట్రాన్ని బ్రిటన్ ఎట్లా విచ్ఛిన్నం చేసిం'దో చెప్పడంతో ప్రారంభమైంది. మార్క్స్ భారతదేశం మీద రాసిన వ్యాసాలను పదేపదే ఉటంకించిన ఆర్వీయార్ భారతదేశానికి నూతనోత్సాహంతో కొత్తపుంతలు తొక్కే ఇంగ్లండ్ రాలేదనీ, ఫ్యూడలిజమ్ తో, తిర్యగ్ దృష్టితో కొట్టుమిట్టాడే ఇంగ్లండ్ వచ్చిందని, రాగానే అది ఇక్కడి ఫ్యూడల్ శక్తులతో చేతులు కలిపిందని రాశారు. ఈ సందర్భంగానే భారతదేశంలో జాతీయభావాన్ని బ్రిటిష్ వారు సృష్టించలేదనీ భావనలో ఉన్నదాన్నే సాకారంచేసి సన్నిహితం చేశారనీ అన్నారు. రాజకీయ ఏకీకరణ, పాశ్చాత్యవిద్య దేశాన్ని ఆధునిక బాట పట్టించాయనీ అన్నారు. కులవ్యవస్థ, లింగవివక్ష, సతి, బాల్యవివాహాలు, వితంతు వివాహ నిషేధం, బహు దేవతారాధన, జంతుబలులు, తప్తమాష పరీక్షలు (అగ్ని పరీక్షల వంటివి), మొదలైన దురాచారాలతో కునారిల్లుతున్న భారతీయ సమాజాన్ని సరిదిద్దడానికి సంస్కర్తలు చేసిన కృషినీ చర్చించారు. ముస్లిం సమాజంలో వచ్చిన సంస్కరణోద్యమం విస్మరణకు గురికాలేదు. బ్రిటన్ సాగించిన రాజకీయ ఆక్రమణ ప్రతిఘటనా రహితంగా ఏమీ సాగలేదనడానికి రుజువుగా జరిగిన ఆదివాసీ తిరుగుబాట్లను, రైతుల తిరుగుబాట్లనూ వివరించి, వాటికి పరాకాష్టగా 1857 తిరుగుబాటును చూపించారు. భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావాన్ని స్వభావాన్ని చెపుతూ 'ఆది నుంచి అది ఒక పార్లమెంట్ మాదిరి నిర్వహింప'బడిందన్న ప్రొ. బిపన్ చంద్ర అభిప్రాయాన్ని ఉటంకించారు. గాంధీ వచ్చిన తర్వాతే కాంగ్రెస్‌కు నిర్దిష్ట అవగాహన, కార్యాచరణ ఏర్పడడాన్ని, మార్క్స్ వచ్చి కమ్యూనిస్ట్ ప్రణాళిక రాసిన తర్వాతే కమ్యూనిస్ట్ లీగ్ కు దశ, దిశ సమకూరడంతో పోల్చారు. 'ఆర్థిక జాతీయవాదం' (Economic Nationalism) పేరుతో తొలి తరం జాతీయవాదులు చేసిన ఆర్థిక విశ్లేషణలో భారతీయ ఆర్థికవిధానాన్ని బ్రిటిష్ ఆర్థిక ప్రయోజనాలు కాపాడే విధంగా రూపొందించబడడాన్ని అర్థవంతంగా వివరించారు. ఆర్థిక విధానాలే రాజకీయాల్ని ప్రభావితం చేస్తాయని బ్రిటిష్ పాలన మన మూలుగుల్ని పీల్చేస్తుందనీ స్వపరిపాలనలోనే మన ఇక్కట్లు తొలగిపోతాయనే ఎరుక రెండవ తరం జాతీయవాదుల్లో రావడానికి పై ఆర్థిక విశ్లేషణే కారణం అన్నారు. ముస్లిం లీగ్ అవతరణ వెనుక ఉన్న విభజించి పాలించు విధానం గురించి చెబుతూ ఈ రోమన్ సూత్రాన్ని ఆధారం చేసుకునే వాళ్లు ఇన్నేళ్లూ భారత సామ్రాజ్యాన్ని తమ అధీనంలో ఉంచుకోగలిగారన్న మార్క్స్ విశ్లేషణని చూపించారు. ఇందులో భాగంగానే మహారాష్ట్రలో దళితుల ఆందోళన, దక్షిణాదిన బ్రాహ్మణ వ్యతిరేక ఆత్మగౌరవ ఉద్యమాలను తమకు అనుకూలంగా మార్చుకున్నా రని అంటూ, జస్టిస్ పార్టీ స్థాపన కాకతాళీయం కాదన్నారు. బ్రిటిష్ అణచివేతకు బాంబులతో జవాబు చెప్పాలన్న సమరశీల జాతీయవాద ధోరణి వెనుక స్వదేశీ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న వేళ కాంగ్రెస్ నాయకత్వంలో చీలిక రావడంతో యువతరం నిరాశ చెందడమే కారణం అన్నారు. కాగా ఉద్యమంలోకి గాంధీ ఆగమనాన్ని ఘనంగానే చాటారు ఆర్వీయార్. ఆయన్ని దిశానిర్దేశం చేసిన కాంతిపుంజం అన్నారు. సిద్ధార్థుడు బుద్ధుడైనట్టు, జీసస్ రక్షకుడైనట్టు, గాంధీ మహాత్ముడయ్యాడు అన్నారు. ఆఖరి ఘట్టం పొడవునా ఆయన నిర్వహించిన నిర్ణయాత్మక పాత్రను నిలబెట్టి చూపించారు. ఉద్యమానికి సమాంతరంగా సాగిన రాజ్యాంగ చరిత్రను ప్రస్తావన చేశారు. హిందూ మహసభను ఎక్కడుంచాలో అక్కడుంచారు. నెహ్రూ సోషలిజాన్ని, కమ్యూనిస్ట్ పార్టీని, కాంగ్రెస్ పారిశ్రామిక విధానాన్ని సందర్భోచితంగా ప్రస్తావించారు. విభజన రాజకీయాల్నీ, బోస్ ఎత్తుగడల్నీ విశ్లేషించారు.

చరిత్రను మతతత్వం కమ్ముకుంటున్న ఈ సమయంలో ఆర్వీయార్ చరిత్ర రచన నిష్పాక్షికతను, పురోగామి దృక్పథాన్ని సంతరించుకుంది. బ్రిటిష్ రాక నాటికి దేశం భౌగోళికంగా ముక్కలుగా ఉన్నా భావనాత్మక ఏకత కలిగి ఉందని భావించారు. మొఘల్ మహా చక్రవర్తులైన అక్బర్, జహంగీర్, షాజహాన్‌లు హిందూ ముస్లిం మిశ్రమ సంతతికి చెందిన వారని నొక్కి చెప్పారు. తిలక్ గణపతి ఉత్సవాల పేరిట ప్రజల్ని ఏకం చెయ్యడంలోని మతతత్వకోణాన్ని గుర్తించారు. విభజన రాజకీయాల్ని విద్వేషాల కతీతంగా వివరించారు. మొత్తంగా స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సామ్యవాదం అనే లక్ష్యాలు ముప్పేటగా సాగిన ఉద్యమంగా ప్రతిష్ఠించారు.

ఈ చరిత్ర రచనలో ఆర్వీయార్ అనుసరించిన శైలి సాధారణంగా మనం చరిత్ర పుస్తకాల్లో చూడనిది. వేగంగా అర్థవంతంగా ఖాళీలు లేకుండా సాగిన రచన ఇది. తెలుగు నుడికారంతో జాతీయాలతో విషయానికి విఘాతం కలుగకుండా సొగసుగా చెప్పిన వాస్తవిక కథనం ఇది. ప్రారంభంలోనే ఇరవయ్యో శతాబ్ది విశిష్టతను చెబుతూ శ్రీశ్రీ 'సదసత్సంశయం' ను ఉటంకించారు. వలస దేశాలు పులిపిరి కాయల్లా మానవజాతి వదనాన్ని వికృతంచేస్తూ దర్శనమిచ్చాయి అన్నారు. కాంగ్రెస్ స్థాపన వెనుక ఉన్న శక్తి ఏమిటో స్పష్టంగా తెలియరాలేదని చెబుతూ దాన్ని కర్ణుడి జననంతో పోలుస్తూ 'శూరుల జన్మంబు, సురల జన్మంబును, నేరుల జన్మంబును నెరుగనగునే' అనే పద్యాన్ని వల్లించారు. భారతీయ గ్రామస్థిరత్వ చట్రాన్ని

బద్దలుకొట్టిన బ్రిటిష్ వాళ్లు 'లోహ విహంగాలను' ఎగిరేటట్టు చేశారని (శ్రీశ్రీ) అట్లా ఎగరనిస్తే ఏమి జరుగుతుందో తెలియ చెప్పింది స్వాతంత్ర్యోద్యమం అనీ అన్నారు.

బ్రిటిష్ అనుసరించిన విధానాలు దేశంలో కరువు కాటకాలకు ఎట్లాకారణమయ్యాయో చెబుతూ నీటిపారుదల సౌకర్యాలను ఏర్పాటు చెయ్యడం ప్రభుత్వవిధి అని చెప్పే పద్యాలను భారతం నుంచీ, ఆముక్తమాల్యద నుంచీ మొత్తంగా ఉల్లేఖించారు. స్వదేశీ పరిశ్రమల స్థాపనకు కృషిచేయకుండా విదేశీ పెట్టుబడులతో స్థాపించుకున్న రైల్వేల వల్ల, సమాచార వ్యవస్థ వల్ల ప్రయోజనం ఉండదని చెబుతూ వాటికి పెళ్లికి పాతిన అరటి బోదెల మాదిరి నేలలో వేర్లు ఉండవంటారు.

దాదాభాయ్ నౌరోజి దేశ సంపద అంతా బ్రిటన్‌కు తరలిపోవడాన్ని సిద్ధాంతీకరిస్తూ ప్రతిపాదించిన 'డ్రెయిన్ థియరీ'లో డ్రెయిన్ అంటే ఒకవైపుకే ప్రవహించే ప్రవాహం అని మాత్రమే అర్థం తెలిసిన మనకు వట్టిపోయేటట్లు చెయ్యడం, ఓడ్చేయడం అనే కొత్త అర్థం చెప్పారు. బెంగాల్‌లో వెల్లువెత్తుతున్న జాతీయభావాన్ని నిరోధించడానికి ఆ రాష్ట్ర విభజన 'అనుకర్ర' గా దొరికిందంటారు. సురేంద్రనాథ్ బెనర్జీని చిలకమర్తి తన స్వీయచరిత్రలో ఆయన గురించి అన్న మాటలు 'ఇనుప ఊపిరితిత్తులు, కంచుకంఠం'తో పరిచయం చేశారు. ముస్లింలను ప్రలోభాలకు గురిచేస్తూ అరచేతిలో 'వైకుంఠం' చూపించారని సీరియస్‌గా రాస్తారు గానీ అందులో చమత్కారం మనం గ్రహించాలి. రాట్నంతో గాంధీ సాధించ దలుచుకున్న ఆర్థిక స్వావలంబన గురించి చెప్పేటపుడు 'కదురు, కవ్వం ఆడితే కరవే లేదు' అనే సామెతను గుర్తుకు తెచ్చారు.

సహాయ నిరాకరణోద్యమంలో విద్యాసంస్థల బహిష్కరణ సందర్భంలో మహీధర 'కొల్లాయి గట్టితేనేమి?'ని కుండలీకరణాల్లో ఉంచారు. ఏనుగును చూడగానే మావటీవాడు స్ఫురించే హస్తి హస్తిపక న్యాయాన్ని ఖద్దరునూ, టోపీని చూడగానే గాంధీ స్ఫురించడంగా ఉపమించారు. ఓడిపోబోతున్న ఇంగ్లండ్, యుద్ధం తర్వాత అధినివేశ ప్రతిపత్తి ఇస్తుందన్న క్రిప్స్ ప్రతిపాదనను గాంధీ 'దివాళా తీయబోయే బ్యాంకు పేరున రాబోయే తేదీ వేసి ఇచ్చిన చెక్కు' అంటే ఆర్వియార్ 'అయినంపూడి ఉద్యోగం అయితే గియితే, పెనిమిటి ఆవును కొంటే, పాలు పుట్టింటి వారికి పోయాలని భార్య, కుదరదని భర్త వాదించుకోవడం' అన్నారు. ఈ చరిత్ర రచనలో మార్క్స్ ఇండియా వ్యాసాల ప్రాసంగికత విస్తరించినంత వరకూ ఆ దారిలోనే నడచిన ఆర్వియార్ ఆ తర్వాత ప్రొ.బిపన్‌చంద్ర మార్గాన్ని అనుసరించినట్టు కనపడుతుంది. అన్ని వర్గాల పాత్రను గుర్తిస్తూనే కాంగ్రెస్ ను first amongst equalsగా గుర్తించారు. నెహ్రూ, ఠాగోర్, ప్రకాశం, రాజ్ మోహన్ గాంధీలను చాలాసార్లే ఉటంకించారు. ❑






# 'మన కాలం విమర్శకుడు'

## పుస్తకాలు - పరిచయాలు



- మందలపర్తి కిషోర్

జీవితకథలు రకరకాలు. కొందరు ప్రముఖులు తమ జీవిత పరిణామంలో అంతస్సూత్రంగా ఉండే కథను తామే అక్షరబద్ధం చేస్తూ రాసినవి కొన్ని. వీరేశలింగం, చిలకమర్తి రాసుకున్న స్వీయ చరిత్రలు అలాంటివి. తామే రాసుకున్న డైరీలూ, లేఖలూ, రచనలూ, జ్ఞాపకాల ఆధారంగా తమ జీవితకథల్ని అక్షరబద్ధం చేసినవారు మరి కొందరు-శ్రీపాద "అనుభవాలూ, జ్ఞాపకాలూ నూ' అలాంటి స్వీయచరిత్రే. ఇతరులు రాసుకున్న డైరీలూ, లేఖలూ, రచనలూ, జ్ఞాపకాల ఆధారంగా వారి జీవితకథల్ని అక్షరబద్ధం చేసినవారు మరి కొందరు. కె.వి.రమణారెడ్డి రాసిన "మహోదయం" గురజాడ జీవితకథ కాగా, "కవికోకిల" దువ్వూరి రామిరెడ్డి జీవిత కథ - ఇవి రెండూ ఇంతకుముందు చెప్పుకున్న కోవలోకి వస్తాయి!

### సృజనాత్మక జీవిత 'కథలు!'

కొందరు రచయితలూ-కళాకారుల సృజన ఆధారంగా వారి జీవితకథల్ని "సృజనాత్మకంగా" అక్షరబద్ధం చేసేవి ఇంకొన్ని. ఇర్వింగ్ స్టోన్ అనే అమెరికన్ రచయిత విన్సెంట్ వాంగో జీవిత కథ ఆధారంగా 1934లో రాసిన నవల "లస్ట్ ఫర్ లైఫ్". (ఇది "జీవన లాలస" పేరిట ఆ మధ్య తెలుగులోకి అనువాదమైంది.) అదే రచయిత మైఖెలేంజెలో జీవితకథ ఆధారంగా 1960 దశకంలో రాసిన నవల "ద ఎగనీ అండ్ ద ఎక్ స్టసీ" కూడా అలాంటిదే. కొందరి లెక్క ప్రకారం అవీ ఓ రకం జీవిత చరిత్రలే. కొన్ని జాతుల-దేశాల జీవితకథలుగా కనిపించే రచనలు మరికొన్ని. కొన్ని తరాల జీవితాల్లో కానవచ్చే సామాన్య అంత స్సూత్రాల్ని అక్షర బద్ధం చేసేవి. కానీ, కొన్ని జీవిత కథలు ఒక్కో బృందం జీవిత కథలలోని అంతస్సూత్రాన్ని మన కళ్ళ ముందు ఉంచుతాయి. 1945లో అజయ్ ఘోష్ రాసిన "భగత్‌సింగ్ అండ్ హిజ్ కామ్రేడ్స్" అనే పుస్తిక అలాంటిది. ఒకానొక తరానికంతటికీ సామాన్యమైన జీవిత కథ లాంటి సృజనాత్మక రచనలు కొన్ని లేకపోలేదు. శరత్‌బాబు నవలలు "భారతి", "శ్రీకాంత్" అలాంటివి. ఇవన్నీ ఇరవయ్యో శతాబ్దిలో వచ్చిన పుస్తకాలు.

### విలక్షణతే దీని లక్షణం!

ఆర్వియార్ మేస్టారు పందొమ్మిదో శతాబ్దిలోనే ఒకానొక శకానికి చెందిన యువత "జీవితచరిత్ర"గా రచించిన ఓ నవలను అనువాదం చేస్తూ, ఆ రచన గురించి, రచయిత గురించీ కూడా తెలుగు పాఠకులకు వివరంగా పరిచయం చేశారు. అది కూడా ఆ రచయిత "విలక్షణత"ను విశ్లేషించి చూపిస్తూ మేస్టారు పరిచయం చేశారు. ఇది చాలా అసాధారణమైన విషయమని "ప్రగతి' ప్రచురణల పాఠకులకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సాధారణంగా, "ప్రగతి" ప్రచురణలకు "ముందు మాట"లు కానీ, పరిచయాలు కానీ వుండవు. నూటికొక్క రచనల్లో, రచయితలే రాసుకున్న "పీఠిక"లు ఉన్నా, అవి కూడా క్లుప్తంగా వుండడం కద్దు. కానీ ఈ "ముందు మాట"కు ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. ఆ కారణం చేతనే దాన్ని మనమిక్కడ పరిశీలిస్తు న్నాం. అతి చిన్న టైపులో ఈ ముందుమాట 25 పేజీలు రావడం అన్నింటినీ మించిన విశేషం!




ముందుమాట రాసిన ఆర్వియార్

ఇప్పటి వరకూ చెప్తూ వచ్చిన ఆ రచన "మన కాలం వీరుడు" అనే రష్యన్ నవల. 1840 మేలో ఈ పుస్తకం, సెయింట్ పీటర్స్ బర్గ్‌లో సంచలనం సృష్టించిందట. దాని రచయిత మిహాయిల్ లేర్మంతఫ్. పందొమ్మిదో శతాబ్దికి చెంది న ప్రముఖ రష్యన్ రచయితల్లో లేర్మంతఫ్ ఒకరు. ఆయన కొన్ని అద్భుతమైన కవితలూ, ఒక మంచి నవలా రాశారు.

## 'మన కాలం వీరుడు' - కథా సారం

ఇంతకు ముందు చెప్పినట్టుగా, ఈ నవలను అయిదు నవలి కల రూపంలో రాశాడు లేర్మంతఫ్. పెచోరిన్ ఈ నవలకు కథా నాయకుడు కాడు కానీ అతనే దీనికి కేంద్రబిందువు. అతగాణ్ణి, యాంటీహీరో అనడం ధర్మం. ఆర్వియార్ మేస్టారు అన్నట్టుగా 'బైరానిక్ హీరో' పెచోరిన్. సాధారణంగా బైరానిక్ యాంటీ హీరోల్లో నైతికత-ఆదర్శవాదం-సాహసంలాంటి ఘనమైన లక్షణాలేం వుండవు. స్త్రీల మీద అతనికి ఉన్న అభిప్రాయాలే పెచోరిన్ సంస్కారానికి గీటురాయి లాంటివి! తెలుగు సాహి త్యంలో అజరామరమైన 'ప్రతి-కథానాయకుడిగా' చిత్రితుడైన గిరీశం కన్నా ఈ పెచోరిన్ కనీసం అర్ధశతాబ్ది పెద్దవాడు! ఏ మాటకామాట-పెచోరిన్ గిరీశం అంత ఒరిజినల్ పాత్ర కాదు. పూష్కిన్ సృష్టించిన ఎవ్గేనియ్ అనేగిన్‌కు-ప్రతిబింబం కాకపో యినా-ప్రతి ఫలనమే పెచోరిన్. అనిగీన నది పేరు స్ఫురించే లా పుష్కిన్ తన కథానాయకుడికి అనేగిన్ అని నామకరణం చేయగా, పెచరీన నది గుర్తుకువచ్చే రీతిలో పెచోరిన్ పేరు పెట్టాడు లేర్మంతఫ్. సారాంశంలో ఇద్దరూ బైరానిక్ యాంటీ హీరోలే అనేది ముఖ్యం! గిరీశానికీ, పెచోరిన్ కీ ఉన్న పెద్ద తేడా ఆత్మవిమర్శ. పెచోరిన్ ప్రేమించినట్టు నటించే రాకుమార్తె మేరీ విషయంలో అతగాడికి కించిత్తు ఆత్మవిమర్శ ఉన్నట్టు లేర్మంతఫ్ రాశాడు. బుచ్చమ్మ విషయంలో గిరీశానికి అలాం టిదేం లేదు-ఎటొచ్చీ, కోరిక తీర్చుకుని వదిలేయకుండా, ఆమెని పెళ్ళి చేసుకుని, తన కీర్తి దిక్కులు పిక్కటిల్లేలా కిక్కిరిసి ప్రతిధ్వనించేలా చెయ్యాలని మాత్రమే గిరీశం అనుకుంటాడు. ఆ పిడకల వేట అలా వుంచండి. కానీ, వేర విషయంలో పెచోరిన్ ప్రేమాభిమానాలు నికార్సయినవి. అతని నిజస్వ రూపం ఆమెకి తెలియందికాదు-అయినా అతనంటే ఆమెకి అభిమానం! వాళ్ళ ప్రేమ ఫలిస్తుందని, కనీసం ఫలిస్తే బావుణ్ణని అనిపింప చెయ్యడంలో లేర్మంతఫ్ సంవిధాన ప్రజ్ఞ ప్రదర్శిం చాడు. వేర, తర్వాత రంగప్రవేశం చేసిన స్త్రీ బేల. వాయవ్య-కాకసస్ ప్రాంతానికి చెందిన ముస్లిం గిరిజన తెగ నాయకుడి కూతురు బేల. వాళ్ళిద్దరిదీ అదోరకం ప్రేమ! అసాధారణమైన సహనంతో ఆమెకోసం ప్రయత్నించి లొంగదీసుకున్న తర్వాత, పెచోరిన్ పక్కచూపులు చూడ్డం మొదలుపెడతాడు! 'నేను నీ బానిసను కాను సుమా- ప్రేమించినంతకాలమే నీతో ఉంటా!' అన్న బేల మాటలు అతనికి నాటుకుంటాయి. ఆమెపై తనకు ప్రేమ ఉంది కానీ, అలా కట్టుకొయ్యకు కట్టుబడి వుండడం తన స్వభావం కాదని కుండబద్దలుకొట్టేస్తాడు మన బైరానిక్ యాంటీ హీరో! తీరా, అతని శత్రువు బేలను ఎత్తుకుపోయిన క్షణం నుం చీ గిలగిలతన్నుకుంటూనే వుంటాడతను!! ఈ మూడు కథలకు తోడు మరో రెండు కథలను చేర్చి లేర్మంతఫ్ తన నవలను వండి, వడ్డించాడు. తనది 'ఆత్మ వినాశకరమైన ప్రవృత్తి' అంటా డు పెచోరిన్ ఓ చోట. వాస్తవానికి లేర్మంతఫ్ తో సహా ఆ తరానికంతటికీ వర్తించే స్వభావం అది! ఒక్కమాటలో చెప్తే, ఆ స్వభావమే, ఈ నవలకు ఇతివృత్తం!! ❑

ఆయన నవల "గొప్ప సంచలనం" అనిపించుకోడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. మొట్ట మొదటిది, ఈ నవల రాసినవాడు జారు సైన్యంలో పెద్ద పదవిలో ఉండిన జూనియర్ ఆఫీసర్. ఇది 1840లలోనే, ఆ నాటి జారిస్టు రష్యాలో విరచితమై, అయిదు విడిభాగాలుగా అచ్చై, ఆ తర్వాతనే పుస్తక రూపంలో విడుదలై పాఠక హృదయ సామ్రాజ్యాన్ని దోచుకోవడం! ఇక ఈ నవలను రాసేనాటికి రచయిత వయసు పాతికేళ్ళే కావడం మరో కారణం! ఇదే రచయిత, ద్వంద్వ యుద్ధంలో హతుడైన రష్యన్ మహాకవి అలె క్సాంద్ర్ పూష్కిన్ మృతి సందర్భంగా, 1937లో ఓ స్మృతి గీతం ("కవి మరణం") రాశాడు. మరో మూడేళ్ళకు లేర్మంతోఫ్ స్వయంగా మరో ద్వంద్వయుద్ధంలో హతుడయ్యాడు. అప్పటికే అతగాడి నవల "మన కాలం వీరుడు" సెయింట్ పీటర్స్ బుర్గ్ సాహితీ సామ్రా జ్యాన్ని ఓ కుదుపు కుదిపింది! ఈ నవల అంత సంచలనాత్మక రచన కావడానికి ఇవి కొన్ని కారణాలు మాత్రమే!

**శిల్ప సంచలనం!**

శిల్పసంబంధమైన కొన్ని కారణాల వల్ల కూడా "మన కాలం వీరుడు" గొప్ప సంచలనాన్నే సృష్టించింది. ఉదాహరణకి, ఇది "అతేచెస్త్వెన్నియె జపీస్కి" (మాతృభూమి గురించిన విశేషాలు) అనే పత్రికలో అయిదు నవలికల రూపంలో అచ్చయింది. తర్వాత అన్నిటినీ – కథా పరిణామం తాలూకు కాలక్రమంతో సంబంధం లేకుండా – కలిపే అచ్చు వేసినా, వాటిని పాఠకులు విడివిడిగానే చదువుకుని ఆనందించినట్టు కనిపిస్తుంది. నిర్మాణ సూత్రాల మేరకు మాత్రమే కట్టుబడి చెయ్యడం తాపీమేస్త్రుల పని. సృజనాత్మక రచయితలు అలా ఎందుకు చేస్తారు ? సాహితీ లోకం ఆమోదించిన మూసకట్టు నిర్మాణ సూత్రాలకు భిన్నమైన కొత్తసూత్రాలను ప్రయత్నించకపోతే వాళ్ళని "సృజనాత్మక" రచయితలని పిలవడం ఏం భావ్యం ? ఈ రచనలోని నిర్మాణం అపూర్వంగా వున్న సంగతి గ్రహించి, జీర్ణించుకోడానికి పాఠకులను ఆర్వియార్ సన్నద్ధులను చేశారు. ఇదీ, అనువాదకుడు ఆర్వియార్ మాటు నుంచి ఆర్వియార్ మేస్టారు పక్కకొచ్చి నిలబడిన తొలి సందర్భం ! సాధారణంగా ముందు మాటలు ఎవరు రాస్తారు? రచయిత గురించీ, ఆయన/ఆవిడ రచనల గురించీ బాగా తెలిసిన ప్రముఖుల చేతనే ముందు మాటలు రాయించుకుంటారు. పాఠకులలోనూ విశ్లేషణాత్మక

దృక్పథం – అంతో ఇంతో – వుంటుంది. దాన్ని వెలికి తియ్యడం ముందు మాట రాసే ప్రముఖుడి నుంచి ఆశించే తొలి ప్రయోజనం. పాఠకుడిలోనూ ఓ విమర్శకుడు దాగి వుంటాడు. అతగాడు బయటికి వచ్చేలా చెయ్యడానికి ముందుమాట మంచి సందర్భం. సాహిత్యం తాలూకు ప్రభావం – ప్రాధాన్యం భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో కొనసాగుతుంది. అందుకే, సాధారణంగా ముందు మాటల్లో ఆ రచనకున్న కాలిక ప్రాధాన్యాన్ని చర్చించడం కద్దు. ఈ నిర్వచ నాలన్నీ కేంబ్రిజ్ యూనివర్సిటీ డిక్షనరీలో ఉండేవే! ఇంగ్లిష్ భాషా సాహిత్యాల్ని పాఠాలుగా చెప్పడమే వృత్తిగా పాతికేళ్ళు బతికిన ఆర్వియార్ మేస్టారికి ఈ మాట మనం చెప్పాలా?

### కాలిక ప్రాధాన్యం!

వాస్తవానికి, "మన కాలం వీరుడు" నవలకున్న ఇతరేతర ప్రాధాన్యాలూ ప్రయోజనాలను మించింది ఈ "కాలిక ప్రాధా న్యం". ఈ నవల వెలువడే నాటికి రష్యన్ జాతి విప్లవాత్మక పరిణామాల ముంగిట్లోవుంది. ఆ తరం విద్యార్థికులూ, రచయి తలూ, మేధావులూ, స్వేచ్ఛా పిపాసులైన యువ జనులందరూ– అక్షరాలా దిక్కు తోచక– చౌరస్తాలో నిలబడివున్నారు. అలాంటి తరం నుంచి ఓ వీరుడు ఉద్భవించే అవకాశం వుందా? ఒకవేళ ఆ తరానికి ప్రతినిధిగా ఒకడు ఉద్భవిస్తే అతగాడి రూపరేఖా లావణ్యాలు ఎలా వుంటాయో మనకి చూపించేందుకే, లేర్మంతఫ్ ఈ నవల రాశాడు. పాఠకుల్లో ప్రతి ఒక్కరూ ఈ వాస్తవాన్ని కచ్చితంగా గుర్తించేలా చెయ్యడానికే ఆర్వియార్ మేస్టారు ఈ ముందుమాట రాశారు! ఇది ఒక తరం తాలూకు జీవిత కథగా రచించిన నవల అనే విషయాన్ని స్వయంగా లేర్మంతఫ్. చెప్పుకుని వున్నాడు. ఆర్వియార్ కూడా ఆ మాట నేరుగానే చెప్పారు. అదేమిటో చూద్దాం: పందొమ్మిదో శతాబ్ది మొదట్లో, పాతికేళ్ళపాటు, రష్యా చక్రవర్తిగా ఓ వెలుగు వెలిగిన జార్ అలెక్సాండ్ర్ కొన్ని కీలకమైన సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. ముఖ్యంగా నెపోలియానిక్ యుద్ధాల నేపథ్యంలో అలెక్సాండ్ర్ పాలన రష్యన్ ఉదారవాదులకు ఊరటనిచ్చింది. పాలనలో సంస్కరణలకు తోడుగా, చిన్నా చితకా సామాజిక సంస్కరణలు కూడా ప్రవేశపెట్టిన అలెక్సాండ్ర్ ప్రజాభిమానానికి నోచుకోవడం సహజమే. ఒక దశలో –1816 ప్రాంతంలో– పావెల్ పేస్తెల్ ప్రభావంలో జార్ అలెక్సాండ్ర్ రష్యన్ అర్ధబానిస వ్యవస్థను తొలగించే దిశగా ఆలోచించాడనే పుకార్లూ షికార్లు చేశాయి మరి! అయితే, 1925లో, టైఫస్ వ్యాధికి గురైన జార్ అలెక్సాండ్ర్ అకస్మాత్తుగా మరణించడం, అతగాడి చిన్న తమ్ముడు నికలస్ జార్ కావడం జరిగిపోయాయి. దాంతో ఉదారవాద స్వప్నం భళ్ళున బద్దలైంది. దాని ఫలితం 1925 డిసెంబర్ చివర్లో, క్రిస్మస్ ముగిసిన మర్నాడు, సెయింట్ పీటర్స్ బుర్గ్ పీటర్ స్క్వేర్లో పరవళ్ళు తొక్కింది. మూడు వేల మంది డిసెంబరిస్టుల తిరుగుబాటును జార్ నికలస్ ఉక్కు పాదంతో అణిచేశాడు. అలా రష్యన్ ఉదారవాదపు తొలి స్వప్నం భగ్నమయింది. ఆ కాలపు యువత డిసెంబరిస్టు తిరుగుబాటుపై ఎన్నో ఆశలు పెంచుకుంది. అవన్నీ బూడిదలో పోసిన పన్నీరు చందంగా ఇంకిపోయాయి.

### ప్రతిధ్వనులూ, ప్రతిస్పందనలూను..

చారిత్రక ఘటనలు ప్రవాహ ప్రాయంగా సాగుతాయి. వాటికి ముందు వెనుకలుగా ప్రతిధ్వనులు ప్రతిస్పందనలూ వినిపిస్తా యి, కనిపిస్తాయి. చరిత్ర స్తంభించి పోయినట్టు కనిపించినప్పు డు, ఆ కాలానికి చెందిన జనం గిడసబారిపోయినట్టే కనిపిస్తారు. అలాంటి వారిని గురించి వింటూ, చూస్తూ పెరిగిన వాడే మన నవలాకారుడు లేర్మంతఫ్. అతను పుట్టింది కులీన స్కాటిష్ నేపథ్యం కలిగిన సైనిక కుటుంబంలో. కానీ మనసు మాత్రం ఉదార భావాలకు నిలయమైంది. ఆ వాతావరణంలో నిత్యం జరిగే చర్చలు డిసెంబరిస్ట్ తిరుగుబాటు చుట్టూ కేంద్రీకృతమై వుండటం సహజం. అవే, లేర్మంతఫ్ బుర్రలో సుళ్ళు తిరిగి అయిదు నవలికల రూపం తీసుకున్నాయి. ఈ నవలికలకు కథా నాయకుడు కాకపోయినా, ప్రధాన పాత్రధారి పెచోరిన్. అతగా డు నడి వయసులోనే ముసలి వాడైపోయాడని చిత్రించాడు లేర్మంతఫ్. అదో ఆలంకారిక భావప్రకటన! ఆ తరానికి చెందిన యువకుల గురించి లేర్మంతఫ్ అంచనా అది. అతని సమకాలి కుడైన సుప్రసిద్ధ రష్యన్ రచయిత ఈ తరం గురించి ఇలా అన్నట్టు ఆర్వియార్ ముందుమాటలోనే ఉంది: "వాళ్ళు పెద్ద వాళ్ళవలేదు, భగ్నమయిపోయారు. యే రకమైన జీవితాసక్తులూ లేక, క్షుద్రంగా, పిరికిగా, బానిసత్వంతో ఉన్న సమాజ పరి వేష్టితులై మిగిలిపోయారు." వాస్తవానికి, ఇది ఒక నవలకో, ఓ రచయితకో పరిమితమైన ముందుమాట కాదు! నన్నడిగితే ఇది సాదాసీదా ముందుమాట అసలే కాదు–ఆర్వియార్ మేస్టారు తన సాహిత్య పరిశోధన పద్ధతి తాలూకు మెథడాలజీ గురించి రూపొందించిన పేపర్ ఇది. కొన్ని రచనల – కొండొకచో, కొందరు రచయితల–స్థానం ఎక్కడో నిర్దిష్టంగానూ, నిర్దుష్టం గానూ గుర్తించి చూపించడానికి స్థల కాలాల గ్రాఫ్ పేపర్ మీద గీసిన రేఖాచిత్రం ఈ ముందుమాట. తరగతి గదిలోని అతి సామాన్య విద్యార్థిని వుద్దేశించి చెప్పే పాఠంలా వుంటుంది ఈ ముందుమాట. విదేశీ సాహిత్యాన్ని పరిచయం చేయడానికి ప్రతి అనువాదకుడూ ఇలాంటి ముందుమాట తప్పకుండా రాయాలి. దురదృష్టం ఏమి టంటే "మన కాలం వీరుడు" నవలకు ఆర్వియార్ రాసిన ముందుమాటల్లాంటివి ఒకటో అరో తప్ప పెద్దగా కనిపించవు! అందుకే నేను మా మేస్టారిని "మన కాలం విమర్శకుడు" అనడానికే ఇష్టపడతాను. ❑

# అనువాద సమస్యలపై ఆర్వీయార్



- కె.పి.అశోక్‌కుమార్

**అనువాదాలు ఒక సంస్కృతిని, ఒక జాతి ఆలోచన సరళిని విశ్వవ్యాప్తంగా ప్రసరింపచేయడానికి ఎంతగానో దోహదపడ తాయి. అసలు అనువాద సాహిత్యం వల్లనే మూలకృతి, అనువాద నిపుణులు సాహిత్య చరిత్రలో శాశ్వతస్థానం సంపాదించుకోగలిగారు. సాహిత్య కృతులనే కాదు. మత ధర్మశాస్త్రాలు, నీతి బోధలు, శాస్త్ర గ్రంథాలు -ఒకటనే ఏమిటి? అన్ని శాఖల జ్ఞాన క్షేత్రాల సంపద అనువాదాల రూపంలో సుదూర తీరాలకు చేరుకున్నాయి. అక్కడి సంస్కృతిని సుసంపన్నం చేశాయి. అనువాదాల ప్రాముఖ్యం ఎంతటిదంటే కొన్ని సందర్భాల్లో మూల గ్రంథం అలభ్యంగా నష్టపోయి నప్పుడు, అనువాద ప్రతి నుంచి దాన్ని రూపొందించడం జరిగింది. ఉదాహరణకు మన దేశంలో బౌద్ధ గ్రంథాలు నాశనం కాగా టిబెట్, చైనాలో వాటి అనువాదాలు చూసి మరల రూపొందించుకోవడం జరిగింది.**

అనువాదాల్లో ఆవిష్కరణలు, ఆధిపత్యాలు లాంటి అంశాలకు ఉన్న కారణాలు చారిత్రకమైనవి. ఆ ఫలానా చారిత్రక నేపథ్యం లో సంభవించిన పరిణామాలు ఏమిటో గుర్తించాలి. అప్పుడే ఆయా అనువాదాల గురించి తులనాత్మక విశ్లేషణ చేయడానికి వీలు పడుతుంది. ఈ కోణంలో నుంచి చూస్తే 'అనువాదం' అనే మాటకు ఈనాడు ఉన్న అర్థం రావడమే చారిత్రక పరిణామం. అందుకనే నన్నయ్య తిక్కనాదుల కృతుల్ని ఈనాటి అర్థంలో అనువాదం అనలేం అని చెప్పడం. మూల విధేయానువాదం, పదానువాదం, భావానువాదం, స్వేచ్ఛాను వాదం అన్న మాటలు పుట్టుకు రావడానికి ఇదే హేతువు. ఇంగ్లీషు నుండి అనువాదం చేసుకునేటప్పుడు వాక్య నిర్మాణాల పట్ల జాగ్రత్త వహించాలి. ఇంగ్లీషు నుంచి అదే తీరు వాక్య నిర్మాణాన్ని తెలుగులోకి దించితే భాష చెడుతుంది. అనుబంధమూ చెడుతుంది. ఇదే కాకుండా పదాల అర్థాలకు సంబంధించి, నుడికారానికి సంబంధించి, జాతీయాలకు సంబంధించి, లక్ష్యార్థ ప్రయోగాలకు సంబంధించి అనేక రకాల ఇబ్బందులు ఉంటూ ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో నిఘంటువుల మీదనే ఆధారపడటంకంటే అనౌచిత్యం మరొకటి ఉండదు. ఎందుకంటే నిఘంటువులు అంత దోహదపడే సాధనాలు కావు. వాటిని వాడటంలో ఎంతో మెలకువ ఉండాలి. అవి నూటికి 99 శాతం సరిగ్గా నప్పే పదాన్ని అర్థస్ఫూరకంగా అందించవు. నిఘంటువుల్లో పదానికి పదం సూటిగా లుప్తం కావడం ఒక ఎత్తు అయితే, అనేకార్థక పదాలలో దేన్ని ఎలా ఎంపిక చేసుకోవాలలో అయోమయంలో పడిపోవడం మరో ఎత్తు. జాతీయాలు, ప్రత్యేకార్థ ద్యోతక పదాలు కూడా అనువాదంలో అవస్థలు తెచ్చి పెడుతుంటాయి.

'అమ్మ' నవలలో పోవేల్‌ని పాష అని కూడా పిలుస్తారు. ఇలాంటి ఇబ్బందులు ఎందుకని ఒక్కలాగే నవల అంతా ఆ పేరు ఉండేటట్లు చూశాం. రష్యన్ సంపాదకులు తెలుగు పాఠకుల సౌకర్యార్థం తమ సంప్రదాయాన్ని పక్కన పెట్టేందుకు ఒప్పుకోవడం సుకృతం. ఇలా పేర్ల తకరారే కాకుండా వర్ణక్రమ వ్యత్యాసం వల్ల ఉచ్చారణ భిన్నంగా ఉండడం కనిపిస్తుంది. ప్రఖ్యాత రచయిత 'టాల్ స్టాయ్'ను రష్యన్‌లో తోల్ స్తోయ్" అని అంటారు. డాస్టవిస్కీ కాదు దాస్తయేవస్కీ. ఇప్పుడు వీటిని యథాతథంగా రాయడంకంటే రూఢీలో ఉన్న పదాలని వాడటం వల్ల అనవసర గందరగోళం తప్పుతుంది. రష్యన్‌లో ఉన్న వర్ణక్రమానికి తెలుగులో సూటిగా వ్యవహరించే వీలు లేకపోవడం కూడా ఒక కారణం. ప్రఖ్యాత కథా రచయిత చెహోవ్-చెఖోవ్ అని రెండు వర్ణక్రమాలలోనూ కనిపించడం ఈ కారణం వల్లనే. ఖ, హ రెండు ధ్వనులు రష్యన్ అక్షరానికి ఉంటాయి. అలా అని నిర్దిష్టంగా ఫలానాదే అని లేదు. ఇక బంధుత్వ సంబంధాలు, కుటుంబ సంబంధాలు ఆయా సమాజాలను బట్టి విశిష్టంగా ఉంటూ ఉంటాయి. ఈ సంబంధాల్ని సూచించే పదాలు ఆ భాషల సాంఘిక నేపథ్యాన్ని తెలియజేస్తాయి. అలాగే మర్యాద మన్ననలు సూచించే తీరు భిన్న భాషలకు భిన్నంగా ఉంటూ ఉంటుంది. సంబోధనలో అంతరం ఉంటూ ఉంటుంది. వేష భాషలు ఇంత గట్టుగా ఉంటే వాతావరణ పరిస్థితులు తక్కువ తినలేదన్నట్టు ముందుకు వస్తాయి. ఇక సాంఘిక జీవిత నేపథ్యం తెచ్చిపెట్టే చిక్కులు ఉన్నాయి. ఉదాహరణకి 'ద్వోర్యాన్ ష్కాయెగ్నెజ్డా' నవల ఇంగ్లీషు అనువాదంలో a nest of the gentry అని ఉంది. 'ద్వోరాన్ ష్కాయె'కి gentry ఇంగ్లీషులో సమానార్థక పదం. రష్యన్-తెలుగు నిఘంటువులో 'కులీన

వర్గం' అనే అర్థం దీనికి తగ్గట్టుగా ఇచ్చారు. అలాగని గ్రంథనామంగా 'కులీనుల గూడు' అని పెడితే బాగుంటుందా? బాగా ఆలోచించి తెలుగులో ఈ నవలకు 'గొప్ప వారి గూడు' అని పేరు పెట్టడం జరిగింది. భారతదేశంలో లక్ష్మీ కటాక్షం అందరూ కోరుకుంటారు. కానీ పాశ్చాత్య సంప్రదాయంలో బంగారాన్ని the yellow devil అని వాళ్ళు ఆధ్యాత్మిక దృష్టితో తూష్ణీం భావంగా చూస్తారు. అతి కష్టంగా దీన్ని 'స్వర్ణ పిశాచం' అని అనువాదం చేశారు. మన దేశంలో కళ్ళ కద్దుకునే బంగారం పిశాచం ఎలా అవుతుంది? కథలను, నవలలను అనువాదం చేసుకునేటప్పుడు సన్నివేశం, వాతావరణం, పాత్రల నేపథ్యం లాంటివన్నీ ఇలాంటి అవస్థలని తెచ్చి పెడతాయి. వర్ణనలు, వ్యంగ్యోక్తులు, జాతీయాలు వగైరా ఉద్రేకానుభూతులు వెల్లడి చేసేవన్నీ సందర్భాన్ని చిక్కులు తెచ్చి పెడుతూనే ఉంటాయి. కాల్పనిక సాహిత్యం అనువాదంలో మూల ప్రతిని అక్షరాల లక్ష్య భాషలోకి తీసుకురావాల్సిన ఆగత్యం లేదు. అయితే శాస్త్ర గ్రంథాలని అనువాదం చేసేటప్పుడు ఆ అవసరం ఉంది. ఏమంటే సాంకేతిక పరిభాషను వదిలిపెట్టడానికి లేదు. ఆ పరిభాష లక్ష్య భాషలో ఉండకపోతే వెగటు పుట్టని తీరులో సృష్టించుకోవాలి. భాషా సంప్రదాయాలు భిన్నంగా ఉన్నా సాంఘిక, నాగరిక, సాంస్కృతిక నేపథ్యం సరితూగుతూ ఉన్నచోట - అనువాదం అంత క్లిష్టంగా కనిపించకపోవచ్చు. ఈ నేపథ్యంతోపాటు భాషా సంప్రదాయాలు భిన్నంగా ఉన్నచోట అనువాదంలో అవస్థలు మరింతగా ఉంటాయి. అనువాదం బాగా లేకపోవడం అంటే ఏమిటి ? మూలాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవడం. భాష మీద పట్టు లేకపోవడం కారణాలుగా చెప్పుకోవచ్చు. ఇంగ్లీష్ మూలంలోని వాక్యాలనీ, తెలుగు అనువాదాల వాక్యాలని పక్కపక్కనే పరిశీలిస్తే అనువాదం పద్ధతులు, అనువాదంలో శైలి తెలుస్తాయి. అనువాదకులు పదబంధాన్ని ఎంచుకున్న తీరు తెలుస్తుంది. అనువాదం లక్ష్యం ఎలా ఉన్నదీ తెలుస్తుంది.

అనువాదాన్ని మాస్కో ప్రచురణాలయం వారు ప్రచురణకు తీసుకున్నాక, యథాతథంగా ఆ అనువాదం ఉంచకుండా తర్వాత చిన్నాచితక మార్పులు చేయడం జరుగుతూనే ఉందనీ, వాటివల్ల అసలు అనువాదానికి భంగం వాటిల్లకపోవచ్చు. కానీ అక్కడి సంపాదకత్వ వైఖరి అది. 1981-91 కాలంలో మాస్కోలో రాదుగా ప్రచురణాలయంలో అనువాదకులుగా, తర్వాత పూర్తి కాలం అనువాదకుడిగా పనిచేసిన రకరకాల అనుభవాలలో నుండి ఆర్వియార్ 'అనువాదాలు' (ఆవిష్కరణలు -అవస్థలు) అనే పుస్తకాన్ని తీసుకువచ్చారు. ఇది వీరి 150వ పుస్తకం. ఇందులో భాష-లిపి పుట్టుకలు, రకరకాల భాషలు - సాహిత్యాలు ప్రాచీన సంస్కృత-పాళీ భాషలు, దేశీయ, విదేశీయ భాషలలో అనువదించిన చరిత్రను, విదేశీ-స్వదేశీ భాషల సాహిత్యం తెలుగులోకి వచ్చిన తీరును వివరించారు. తర్వాత అనువాదం- సిద్ధాంతాలు: సూత్రీకరణలు, కొన్ని ప్రసిద్ధ రచనలు అనువాదాలా? అనుసృజనాలా? అని చర్చించి, అనువాదాల్లో అపశృతులు, అనువాదంలో అవస్థలు, అనువాదాల రమ్యత, అనువాదాల ఆవశ్యకత గురించి విపులంగా చర్చించారు. తెలుగులో అనువాదాలపై అరడజను పుస్తకాలు వచ్చినప్పటికీ, ఈ పుస్తకం ఇచ్చే సమాచారం దీని గొప్పదనమే వేరు.

అనువాదకుడిగా ప్రసిద్ధి చెందిన ఆర్వియార్ ఇప్పటికీ ఆంగ్లం నుండి తెలుగులోకి 122 గ్రంథాలు, తెలుగు నుండి ఆంగ్లానికి ఎనిమిది గ్రంథాలు అనువాదం చేశారు. ఇది 2009 నాటి మాట. అప్పటినుండి మరణించే వరకు మరో 12 గ్రంథాలను వెలువరించారు. అత్యంత ఎక్కువ అనువాదాలు చేసిన వీరిని ఎంతోమంది సాహితీ మిత్రులు 'అనువాద చక్రవర్తి' అని ప్రశంసిస్తుంటారు. ఆంగ్ల ఉపన్యాసకునిగా పనిచేసిన ఆర్వియార్‌కు ఆంగ్ల భాషపై ఉన్న పట్టుకు నిదర్శనంగా వారు రాసిన, అత్యంత ప్రజాదరణ పొందిన 'ఈజీ ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్సు, ఆర్వియార్ ఇంగ్లీషు గ్రామర్, విశాలాంధ్ర ఇంగ్లీషు-తెలుగు పాకెట్ డిక్షనరీ'లు నిలిచిపోతాయి. ❑

## అభ్యుదయ రచయితల కర్తవ్యం : ఆర్వియార్

ఇప్పుడు అభ్యుదయ రచయితల సంఘం నిర్వహించాల్సిన కర్తవ్యం గురించి విశ్లేషించుకోవాలి. దేశాన్ని వెనక్కి నడిపించే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. మత ఛాందసవాదం పెచ్చరిల్లుతోంది. మైనార్టీల మీద దాడులు విజృంభిస్తున్నాయి. భారతదేశ సంస్కృతి అన్న భావన కాక హిందూ సంస్కృతి అన్న భావనకు పాలక వర్గమే పట్టం కడుతోంది. ఎన్నో జాతులు, ఎన్నో మతాలు, ఎన్నో భాషలు కలిసి రూపొందించిన యీ మహత్తర సంస్కృతిలోని ఆణిముత్యం లాంటి సూక్తి 'సహనమే సంస్కృతి' అన్నది కలుషితం అయిపోతోంది. ఈ దశలో సమాజ శ్రేయస్సును కోరే అభ్యుదయ రచయితలు మౌనంగా వుండడానికి వీల్లేదు. ప్రజల పక్షాన, ప్రజల్ని కలుపుకుని తీవ్ర ప్రతిఘటన చెయ్యాలి. ఇది మనకి సంబంధించిన సమస్య కాదు. అని చేతులు ముడుచుకు కూర్చోవడం విపత్తుకు దారి తీస్తుంది.

**పుస్తకాలు - పరిచయాలు**

# అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ.. అందరికీ 'పనికొచ్చే ముక్క' !



- డి.సోమసుందర్

మాతరం టీనేజీ కుర్రాళ్ళం 'కన్యాశుల్కం' విపరీత ఆకర్షణలో పడి కొట్టుకుంటూ నిండా మునిగిపోయిన రోజులవి. ఎప్పటికైనా, సురేంద్రనాథ్ బెనర్జీ అంతటివాళ్ళం అయిపోవాలని గట్టిగా ట్రై చేస్తున్నట్లు ఉండేది మా వ్యవహారం. ఆర్నెల్లకో మాటు పుస్తకాలు తెరిచే రకాలం కదా. మన పుస్తకాల్లో పనికొచ్చే ముక్క ఒక్కటీ లేదనే ఓ గట్టి నమ్మకం అప్పటికే గట్టిగా పాతుకుపోయి ఉండేది. కన్యాశుల్కంలోని కీలక పాత్రధారుల్లో ఒకడూ, చురుకైన వాడూ అయిన మహేశం తీరే వేరు! అర్థం తెలియకపోయినా బోలెడు పార్సీ, అరబ్బీ పదాలు వల్లె వేస్తాడు.

చాంతాడంత సంస్కృత శ్లోకాలు గడగడ చదవగలడు.

అలాంటివాడు కాబట్టి మా మహేశం తాను చదివే పుస్తకాల్లో 'పనికొచ్చే ముక్క' ఒక్కటీ లేదని ధైర్యంగా తేల్చి చెప్పగలిగాడు. కాళిదాసుకు లేని మహిమలు తెల్లవాడికి ఉన్నాయని గట్టిగా బల్ల గుద్ది మరీ వాదించగలిగాడు. అలాంటి మహేశం మాకు ఆదర్శ నమూనా అయిపోయాడంటే అందులో విడ్డూరం ఏముంది ?

మేం కన్యాశుల్కం అర్ణవంలో పడి కొట్టుకుంటూపోతున్న సమయంలో ఆర్వియార్ మాస్టారి 'పనికొచ్చే ముక్క' శీర్షిక 'విశాలాంధ్ర'లో మొదలయ్యింది. పాతకులతో సంభాషణా ధోరణిలో వారం వారం మాస్టారు సాగించిన మాటకచేరీ మమ్మల్ని 'పనికొచ్చే ముక్క' ఆకర్షణ వలయంలోకి లాగేసింది. ఆయన హాస్య, వ్యంగ్య వచోవైభవం మమ్మలని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆంగ్ల, ఆంధ్ర, సంస్కృత సాహిత్యాలలో మాస్టారికి గల అపారమైన పట్టు మాకు దిమ్మ దిరిగేటట్లు చేసింది.

'నాతో మాట్లాడ్డమే ఓ ఎడ్యుకేషన్" అంటూ గిరీశం స్టయిల్లో మేం గర్రా పోతున్న రోజుల్లో ఆర్వియార్ మాస్టారు సౌజన్యారావు పంతుల్లా మాకు కళ్ళు తెరిపించారు. సత్పురుషుడై సత్యాన్ని బోధపరిచారు. మా 'పై చదువులకు సాయం' చేశారు.




మేం అంతటి వాళ్ళమే గానీ

'అప్పుడప్పుడూ బుద్ధి దాట్లేస్తుందన్న' అసలైన స్పృహను మాకు కలిగించారు. 'న్యాయమైన దారి' చూపించారు. ఆ రోజుల్లోనే 'యువజన' మాసపత్రికలో వర్మ గారు 'గిరీశం పొలిటికల్ లెక్చర్లు' రాస్తూ యువతను విశేషంగా ఆకట్టుకున్నారు.

గిరీశం ఉండి ఉంటే అలనాటి రాజకీయ పరిణామాలకు ఎలా స్పందిస్తాడన్న ఊహతో వర్మ గారు పార్టీ ఆఫీసులో చుట్టలు కాలుస్తూ రాస్తూ ఉండేవారు. వాటిని కూడా మేం మా మజాగా చదువుతూ ఉండేవాళ్ళం.

ఆర్వియార్ మాస్టారి 'పనికొచ్చే ముక్క' మాత్రం జీవితంలోని బహుముఖ పార్శ్వాలను, వైవిధ్యాలను, వైరుధ్యాలను సూటిగా సరళంగా ఎత్తి చూపించింది! సాహిత్య, సామాజిక, రాజకీయ అంశాలపై మాస్టారి వివరణలు మాకు అద్భుతంగా ఉండేవి. ఆయన చెప్పే అంశాలలో మాస్టారి సాహితీ విశ్వరూపం సాక్షాత్కారం అయ్యేది. మాస్టారు మాస్కో వెళ్ళాక 'పనికొచ్చే ముక్క' ఆగిపోయింది.

ఎన్నోఏళ్ళ తర్వాత మాస్టారు మాస్కో నుండి తిరిగి వచ్చారు. ఆ తర్వాత ఆయన చాలా పుస్తకాలు రాశారు. అవన్నీ చదువుతూ ఉండేవాళ్ళం!

ఉద్యోగ బాధ్యతల నుండి పదవీ విరమణ చేశాక మాస్టారు తిరిగి 'ఆంధ్రభూమి' దినపత్రికలో 'పనికొచ్చే ముక్క' కాలమ్‌ను రాయడం ప్రారంభించారు.

మళ్ళీ మేం దంగయిపోయాం.

ది ఇలెవెన్ కాజస్ ఫర్ ది డీజనరేషన్ ఆఫ్ ఇండియా గురించి మాస్టారి పనికొచ్చే ముక్కలో వారం

వారం చదివే వాళ్ళం. 1998 అక్టోబరు నుంచి 2001 అక్టోబరు వరకూ మూడేళ్ళపాటు 134 వారాలపాటు రాసిన వాటిని 2006లో అదే పేరుతో మాస్టారి సతీమణి ఆర్.సుందరి గారు ప్రచురించారు. ఆనాటి సమకాలీన సాహిత్య, రాజకీయ, సామాజిక అంశాలలో ఏదో ఒక 'పనికొచ్చే ముక్క'ను పట్టుకుని మాస్టారు దాన్ని సమగ్రంగా వివరిస్తూ, విశ్లేషిస్తూ, విమర్శిస్తూ, మొద్దు చర్మాలను కొరడాలతో కొడుతూ, చురకలు వేస్తూ రాశారు.

వ్యంగ్యం, హాస్యం పాతకాలం నాటి రూపును మార్చుకుని సున్నితంగా, నాజూకుగా తయారయ్యాయి. వేదాలు, ఉపనిషత్తులు, వేదాంగాలు, పురాణాలు, ఇతిహాసాలు, స్మృతులు, ప్రబంధాలు, శతకాలు, ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృత సాహిత్యాలలో పేరు మోసిన ఉద్గ్రంథాలు, నీతిశాస్త్రాలు, లక్షణ శాస్త్రాలు, వ్యాకరణం, ఆయన పనికొచ్చే ముక్కలో నిత్యం దర్శనం ఇచ్చాయి. ప్రాచీన, సంప్రదాయ సాహిత్యంలోని ప్రగతిశీల, హేతువాద, అంశాలను ఆయన వెలుగులోకి తెస్తూ ఆధునిక శాస్త్రీయ దృక్పథంతో కూడిన విశ్లేషణను తన శీర్షిక ద్వారా అందించారు.

ప్రాచీనతలోని చాందసాన్ని ఖండించడం, మతంలోని సంకుచిత ధోరణులను ఎండగట్టడం, మత తత్వంలోని దుర్మార్గాన్ని దునుమాడటం మాస్టారి పనికొచ్చే ముక్క లోని జీవలక్షణం అని చెప్పాలి. రాజకీయ నేతల, పెత్తందారుల, మఠాధిపతుల, పెట్టుబడిదారుల, పచ్చి స్వార్థాన్ని, అవకాశవాదాన్ని, మాటలు మార్చే జిత్తులమారితనాన్ని మాస్టారు అత్యంత నిశితమైన వ్యంగ్యంతో, హాస్యంతో ఎండగట్టడం 'పనికొచ్చే ముక్క'లోని అంతస్సూత్రం.

పనికొచ్చే ముక్క పుస్తక రూపంలోకి వచ్చాక మరోసారి చదివినప్పుడు రోజులు మారినా లోకంపోకడ మారలేదని మాకు మరోసారి మాస్టారు చెప్పినట్లు అనిపించింది! ఇన్నేళ్ళ తర్వాత మళ్ళీ చదివితే ఇవాళ్టి సంగతులే మాస్టారు చెబుతున్నారని అనిపిస్తుంది. మొత్తం నూట ముప్పై నాలుగు పనికొచ్చే ముక్కలు వెయ్యి గ్రంథాల పెట్టు అని చెప్పాలి. ఒక్కసారి చదవడం మొదలుపెడితే ఆపబుద్దేయని ప్రవాహంలో పడి కొట్టుకుపోతాం. సమీక్ష కోసం అందులోని ఒక్కొక్క దాని గురించి వివరించాలంటే అదో పెద్ద గ్రంథం అయి కూచుంటుంది.

చటుక్కున పుస్తకం తెరిచి మహేశం మాదిరి కొన్ని పనికొచ్చే ముక్కల్ని ఇక్కడ గుర్తు చేస్తున్నాను. 'పనికిమాలిన జ్ఞానం' గురించి మాస్టారు రాస్తూ ప్రచార సాధనాలు విషయజ్ఞానం పెంచడానికి కృషి చేయడం లేదని అంటారు. పైగా ఒక ఛానెల్ మించి మరో ఛానెల్ పనికిరాని జ్ఞానాన్ని ప్రచారం చేస్తున్నాయని వాత పెడతారు.బీజేపీ హయాంలో విదేశీ ఉప్పు దిగుమతి సమస్యను ఎద్దేవా చేస్తూ మాస్టారు రాసిన 'లావణ్యపూరిత రాజకీయం"లో వ్యాపారస్తుల ఉప్పు తిన్న పాలకులు ఉప్పు ధరలు పెరిగినపుడు ఉదాసీనంగా వ్యవహరిస్తారని చురకలు వేస్తారు. 'మూషిక బాధ' గురించి ఆయన వ్యంగ్యంగా రాశారు. 'రాజకీయ నాయకులు తమ పార్టీలు కష్టకాలంలో పడ్డప్పుడు వదిలేసి వేరే పార్టీలో చేరడం జరుగుతుంది, అలాంటి వాళ్ళని రాట్స్ అని పిలుస్తారు. ఓ ఇల్లో, ఓడో ప్రమాదానికి గురైనప్పుడు ఎలుకలు వాటిని వదిలేసి పారిపోతాయి' ఫిరాయింపు నాయకులు కూడా అలాంటి వారేనంటారు మాస్టారు. ఎలుకల బాధ నివారణకు శాస్త్రవేత్తలు ఏవేవో కనిపెడతారు. కానీ రాజకీయ మూషికాల బారి నుండి రక్షణ ఎలాగా అని అడుగుతారు.

'కలలు కల్లలు' గురించి మాస్టారు రాస్తూ 'ఊహల్లో తప్పు జరిగే వీలు లేనివని కలల గురించి అంటూ ఉంటాం, గాంధీ మహాత్ముని కలలకు ఈ గండమే తగిలినట్టుంది, యాభై ఏళ్ల స్వర్ణ భారతంలో ఆయన కలలు కల్లలవుతున్నాయి' అంటూ చురకవేశారు. ఆపద్ధర్మ ప్రభుత్వాల ఏర్పాటులో దాగివున్న 'ఆపద్ధర్మం' గురించి రాస్తూ అవసరార్థం ఆచారాలను ఉల్లంఘించడమే ఆపద్ధర్మం అని మాస్టారు చేసిన ధర్మాధర్మ వివేచన కొరడాతో చెళ్ళు మనిపిస్తుంది. మాస్టారు భారతం, వేదాలు, స్మృతులు, ప్రస్తావిస్తూ తన వ్యాఖ్యను ధర్మబద్ధం అని నిరూపిస్తారు. మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి అప్పట్లోనే మాస్టారు 'ముదితల్ నేర్వగరాని విద్య గలదె' అంటూ రాశారు. బిల్లు విషయంలో మన నేతల నిర్వాకాన్ని ఎండగడుతూ 'మళ్ళీ శతాబ్దంలోనే అది తాకేటట్లు ఉందని' సరిగ్గా ఏం జరగబోతుందో పాతికేళ్ళనాడే చెప్పారు.

మన సమాజంలో న్యాయ వ్యవస్థ పని తీరును విమర్శిస్తూ మాస్టారు 'దోషంబెరిగి దండించే' అంటూ అప్పట్లోనే చెప్పిన సంగతులు ఇప్పటికీ అలాగే ఉన్నాయని హై ప్రొఫైల్ నేతల కేసుల దర్యాప్తు, విచారణ తీరు చూస్తే అర్థం అయిపోతుంది. దానికి మాస్టారు రామాయణ, మహా భారతాల ఉదంతాలను ఉటంకిస్తూ చేసే వ్యాఖ్యలు అర్థవంతంగా ఉన్నాయి. ఐటీ రంగంలో వచ్చిన సాంకేతిక విప్లవం గురించి మాస్టారు 'శక్తిదాయక జ్ఞానం' అంటూ రాసుకొచ్చారు. 'శక్తిదాయకమైంది జ్ఞానం అన్న ముక్క నిజమే అయితే సామాన్య ప్రజలకి తమని దోచుకుంటున్నదెవరో, ఆ దురవస్థ తప్పేదెలాగో తెలిసివచ్చే జ్ఞానం అందేదాకా అది అక్షరాలా నిజం కాలేదు' అని మాస్టారు స్పష్టం చేశారు. 'మానవయత్నం' గురించి రాస్తూ మానవ ప్రయత్నంలోని గొప్పదనాన్ని చెప్పడం బదులు మన ప్రసార సాధనాలు మహత్తుల్నీ, అతీత శక్తుల్నీ అందలం ఎక్కి ఊరేగిస్తున్న వైనాన్ని మాస్టారు తెగనాడారు. ఇలా చెప్పడం కంటే 'పనికొచ్చే ముక్క'ని మరోసారి కాదు మళ్ళీ మళ్ళీ చదవండి అని చెప్పడం న్యాయంగా ఉంటుంది. అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ అది పనికొచ్చే ముక్క అని మాత్రం చెప్పగలను! ❑

పుస్తకాలు - పరిచయాలు

# మాస్టారుతో నా అనుభవాలు - జ్ఞాపకాలు



- డి.రాధాకృష్ణమూర్తి

సోవియట్ యూనియన్ పతనమైన నాటి నేపథ్యంలో... పెద్ద పెద్ద కమ్యూనిస్టు పార్టీల ప్రచురణ సంస్థలేవీ కూడా పెద్దగా సైద్ధాంతిక గ్రంథాలను అనువదింపజేసి, ప్రచురించే ఆసక్తిని ప్రదర్శించని ఆ సంధి కాలంలో.. ముఖ్యంగా తెలుగు నాట మార్క్సిజంను సవాల్ చేస్తూ ముందుకు వచ్చిన పోస్టు మోడ్రన్, తదితర ధోరణులకు.. మార్క్సిజం వైపు నుండి జవాబులు అన్వేషించే/ఇచ్చే ప్రయత్నంలో భాగంగా... ప్రారంభమైన మా 'లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్' ప్రయత్నాల (మీటింగులు, ప్రచురణలు)లో భాగంగా మేము చేరువైన అతి కొద్ది మంది అనువాదకులలో RVR మాస్టారు ఒకరు. అలా.. ఆ మా ప్రయాణం.. చిన్నవి, పెద్దవి కలిపి.. దాదాపు 20 పుస్తకాల ప్రచురణల వరకు కొనసాగింది. ఇంకా ఒక ఉద్గ్రంథం (సతీష్ చంద్ర విద్యాభూషణ్ రచన : 'భారతీయ తర్కశాస్త్ర చరిత్ర') పరిష్కరించి, ప్రచురించాల్సిన బాకీ ఒకటి మిగిలే వుంది. త్వరలో ఆ ప్రచురణను ఆయనకే అంకితమిస్తూ.. ప్రచురించే ప్రయత్నంలో వున్నాము.

మా 'లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్' సంస్థ.. అనువాదకుల కృషికి మరింత గుర్తింపు రావాలి, ఇవ్వాలి అని భావించి, అనువాదకుల పేర్లు కూడా టైటిల్ పేజీపై ప్రచురించాలి అని నిర్ణయించి, ఆ మేరకు మేము పనిచేస్తున్న దాన్ని గుర్తించిన ఆర్వీయార్ మాస్టారు.. ఇది మంచి సంప్రదాయం అవుతుంది అని మమ్మలను అభినందించారు. ఆ క్రమంలోనే ఆయన మా సంస్థకు చేసిన మొదటి అనువాదాన్ని ప్రచురించినప్పుడు అట్టపైన 'ఆర్వీయార్ మాస్టారు' అని ప్రచురించినప్పుడు.. ఇలా 'మాస్టారు' అని వేశారేమిటి ? అలా వేయడం బాగుంటుందా ? అని మమ్ములను ప్రశ్నించారు ! అందుకు మాస్టారూ.. మీ వంటి పండితులను అలాంటి విశేషణంతో కలిపి తప్ప మరోలా భావించడం గానీ, పలకడంగానీ, రాయడం గానీ మాలాంటి వారికి సాధ్యం కావడం లేదని చెప్పినప్పుడు సంతోషంగా అంగీకరించారు. అయితే.. ఇక్కడ మీకో ముఖ్యమైన అంశం చెప్పాలి! ఆయనలోని సంతోషం కానీ, సంతృప్తి కానీ.. ఆయన ముఖంలో వుండే ఆ పెద్ద పెద్ద కళ్ళ నుండి నవ్వు రూపంలో జాలువారడాన్ని చూడడం అనేది నా లాంటి వాడికి ఓ వ్యసనంగా వుండేది !

అప్పట్లో (2002 - 2006) మధ్య నేను హైదరాబాదులోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌లోని.. నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్లో పనిచేస్తూ ఉండటం వల్ల... అప్పటి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ వై వి కృష్ణారావు గారు అప్పజెప్పిన పనిపైన గానీ, మా స్టడీ సర్కిల్ అనువాద పనులపైన గానీ వారి ఇంటికి తరచూ వెళుతుండేవాడిని.ఆయన మాకు సజీవ నిఘంటువులా కనిపించేవారు. ఆర్వీయార్ గురించి వైవి కృష్ణారావు గారు తరచూ ఒక మాట అంటుండేవారు. అర్ధరాత్రి ఫోన్ చేసి యే ఇంగ్లీషు, తెలుగు పదానికైనా అర్థం, సమానార్ధకాలు కావాలన్నా ఆర్వియార్ ను అడిగితే చాలు రాధాకృష్ణమూర్తి గారూ ! టక్కున మనకు కావలసిన సమాధానం లభిస్తుంది అనేవారు. అలా ఉభయ పనుల మీద వారింటికి వెళ్ళినప్పుడు వారు గానీ, వారి శ్రీమతి గారు గానీ మా పట్ల మంచి ఆదరణ చూపేవారు. అలా వారు చూపే ఆదరణతో పాటు.. అనేక విషయాలపై వారికిగల ఆసక్తులు మాతో పంచుకునేవారు. ముఖ్యంగా.. తన అరసం మిత్రుల గురించి, ప్రత్యేకించి రాయలసీమ కవి మిత్రుల గురించి, తాము సోవియట్ యూనియన్‌లో వున్నప్పుడు.. అక్కడ తమ ఇంటికి వచ్చిన తెలుగు వారి గురించి, అక్కడి అనువాద పద్ధతుల గురించి, అక్కడి సహచర అనువాద మిత్రుల గురించి, సోవియట్ పతనంపై ఆచరణలో జరిగిన పొరపాట్ల గురించి, అక్కడ నుంచి తిరిగి వచ్చిన తరువాత తిరిగి ఉద్యోగంలో చేరడానికి సహకరించిన వారి గురించి, తను రాసిన 'పనికొచ్చే ముక్క' గురించి.. ఇలా అనేక విషయాలు పంచుకునేవారు. అయితే ఆయన విషయంలో నాకు ఆశ్చర్యం కలిగించే విషయం ఏమంటే.. అలాంటి సందర్భంలో కూడా.. ఎప్పుడూ ఏ ఒక్కరి గురించి ఆయన కప్లైంట్‌గా మాట్లాడిన సందర్భం వుండేది కాదు.

ఆయన విషయంలో నన్ను ఆశ్చర్యపరిచే మరో విషయం ఏమంటే ఆయన అనువాదానికి కేటాయించుకున్న రోజుల్లో ఎక్కువ భాగం ఒక టైం కేటాయించుకుని అదే టైంలో పని పూర్తి చేస్తుండే వారు (దాదాపుగా అవి మధ్యాహ్నం ఒంటి గంట లోపుగానే ముగిసేవి). అది నాకు మరీ యాంత్రికంగా అనిపించి, ఈ మనిషికి 'మూడ్' అనే సమస్య ఏమీ వుండదా అని ఆశ్చర్యపోతుండే వాడిని ! మరో ముఖ్య అంశం ఏమంటే.. పార్టీ గానీ, ప్రజా సంఘాల వారు కానీ ఏదన్నా పని అప్పచెపితే.. దానికే ప్రయారిటీ ఇచ్చి తక్కిన పనులు పక్కన

పెట్టేసేవారు. ఒకసారి నేను కొంత నిరసనగానే.. వీళ్లకు మీలాంటి వారిని ఎలా వాడుకోవాలో కూడా తెలియడం లేదు. మీరు మాత్రమే చేయగలిగిన పనులు అలా పేరుకుపోయివుంటే, వాటిని చేయించుకో కుండా ఇలాంటి వేరే వారిచేత చేయించుకోగలిగిన పనులను కూడా మీకు అప్పచెప్పడం ఏమిటి ? మీరు అంగీకరించి ఫలానా ఆ పనిని పక్కన పెట్టడం ఏమిటి ? అని అడిగాను. ఆయన నవ్వుతూ.. 'మనవాళ్ళు పని అప్పజెప్పినప్పుడు తప్పదు కదయ్యా' అని నాకు సర్దిచెపుతూ అన్నారే గాని.. ఒక్క కామెంట్‌ను కూడా అవతలి వారిని గురించి నెగెటివ్ గా చేయలేదు. అంతటి సంస్కారి ఆయన.

ఇందుకు చాలాకాలం క్రితమే 2001 లో 'లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్' తరపున గుంటూరులో జరిగిన S.G.సర్దేశాయ్, దిలీప్ బోస్‌ల రచన 'మార్క్సిజం అండ్ భగవద్గీత' గ్రంథ పరిచయ సభకు ముఖ్య పరిచయకర్తగా ఆహ్వానించి.. ఆర్వియార్‌తో పాటు, పరకాల పట్టాభి రామారావు గారికి కూడా చిరు సత్కారాన్ని అందించే అవకాశం మాకు కలిగింది.

ఆర్వియార్ గారు చనిపోయిన రోజున.. నేను వేరే పనిపై వెళ్లి హైదరాబాదులోనే వున్నాగానీ.. నాకు ఆలస్యంగా తెలియడం వల్ల ఆయనను కడసారి దర్శించుకునే అవకాశాన్ని కోల్పోయాను. ఆ తరువాత వారి అబ్బాయి రాహుల్‌తో కొన్నిసార్లు ఫోన్‌లో మాట్లాడాను. ఆ సందర్భంగా వారి అమ్మ గారి ఆరోగ్యం గురించి వాకబు చేసేవాడిని. తరువాత అంతగా సంబంధాలు కొనసాగింది లేదు. 'లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్' ఇప్పటి వరకు చేసిన కృషి (చిన్నవి,పెద్దవి కలిపి వంద పుస్తకాల ప్రచురణ)లో ఎంతోమంది భాగస్వాములు ఉన్నారు. వారిలో ఆర్వియార్ గారిది చెప్పుకోదగ్గ భాగస్వామ్య పాత్ర వుందని చెపుతూ.. ఈ సందర్భంగా ఆయనకు మరోసారి కృతజ్ఞతలు తెలుపుకుంటూ.. ఆర్వియార్‌పై ప్రత్యేక సంచికను తీసుకువస్తున్న 'దారిదీపం' సంపాదకవర్గం ప్రయత్నానికి అభినందనలు తెలుపుతూ.. ఇలా ఆయనతో నా అనుభవాలను జ్ఞాపకాలను పంచుకునే అవకాశం కలిగినందుకు సంతోషిస్తున్నాను. ❑

**లెఫ్టిస్టు స్టడీ సర్కిల్ ప్రచురించిన ఆర్వియార్**
**అనువాదాలతోపాటు మరిన్ని పుస్తకాలు**
**ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.**
**వివరాలకు డి.రాధాకృష్ణమూర్తి**
**98488 77596లో సంప్రదించగలరు.**

# కృతజ్ఞతలు

**ఈ తరహా విశేష సంచికలు ప్రచురించాలన్న ఆసక్తి మా సంపాదకవర్గానికి ఉంది. ఇందులో 'వ్యయ-ప్రయాసలు' వున్నాయి. 'ప్రయాస'పడే శక్తి మాకుంది. కానీ, వ్యయం భరించటంలో అశక్తులం. డాక్టర్ రమేష్ గారు చొరవ తీసుకుని, మాస్కో విద్యార్థి బృందం మిత్రులతో సంప్రదించారు. వారు సంతోషంగా 'వ్యయ'భారాన్ని తలకెత్తుకున్నారు. మేమూ ఉన్నా మంటూ ఆర్వియార్ సోదరులు ఇతర మిత్రులు చేతులు కలి పారు. అసాధ్యం అనుకున్న దానిని సుసాధ్యం చేశారు. ఇలాంటి ప్రయత్నాలకు గొప్ప ప్రేరణ ఇచ్చారు. అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.**

## ఆర్థిక సహకారం అందించిన వారు

మాస్కో విద్యార్థి బృందం : **టి.సురేష్‌బాబు కె.అజయ్‌కుమార్, వి.దత్తాత్రేయశర్మ, అజయ్ కందిమళ్ల, విజయ్‌కుమార్ తాస్కెంట్, వీరవల్లి శ్రీనివాస్ నాగభూషణ్, డి.శ్రీనివాస్, ఎన్.మధు, కేఎస్ రావు, అజయ్ క్రాంతి, క్రొవ్విడి రవి, డి.లక్ష్మీనారాయణ, రావిళ్ల విజయ్, అనంతకుమార్, జె.ప్రభాకర్, మర్ల సోమసుందర్, బీఎన్‌ఎస్ నాయుడు, అప్పల రాజు, రామారావు, సీబీ రాజు, పి.అనూరాధ, డాక్టర్ రమేష్.**

మరికొందరు మిత్రులు : **బి.సంయుక్త, డి.కవిత, సంకు మనోరమ,**

సోదరులు : **రాళ్లభండి సీతారామం, గంగాధరం(పండు), వేణుగోపాల్ - గుళ్లపల్లి రాజా (మేనల్లుడు )**













# ఆర్వియార్
# అనువాద పుస్తకాలు

---

# లెఫ్టిస్టు స్టడీ సర్కిల్












## సాహిత్య పరామర్శ



# సంవేదనలో ఆర్వియార్

- కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి

'విశాలాంధ్ర'లోని విజయవాడ వాతావరణం సరిపడకా, గుమస్తా మాదిరి ఆఫీసు వర్కు చేయలేక, ఆరు నెలలకే రాచమల్లు రామచంద్రారెడ్డికి మొహం మొత్తింది. తిరుగు టపాలో-1964 జులై 1 నాటికి-కడపకు తిరిగి వచ్చేశారు. ఆ నాటి నుండీ కడపలో సాహిత్య వాతావరణం రసకందాయంలో పడింది. కొందరు కమ్యూనిస్టు మిత్రులూ, కడప ఆర్ట్స్ కాలేజ్ లెక్చరర్లూ, 'సవ్యసాచి' మిత్రులూ, రా.రా.ను ఉక్కిరిబిక్కిరి చేసేవారు. ఊపిరి సలపని ఆధునిక సాహిత్య చర్చోపచర్చల్లోకి ఆయన్ని లాక్కెళ్ళేవారు. సాయంకాలాలూ, ఆదివారాలూ ఆ చర్చోపచర్చలకు ఏ మాత్రం సమయం సరిపోక రా.రా. ఉక్కిరి బిక్కిరయ్యేవారు. ఆ 'ఉక్కిరి బిక్కిరి'కి మందుగా ఒక సాహిత్య పత్రిక తెస్తే తప్ప ఊపిరి పీల్చుకోవడం కష్టమని రా.రా. భావించారు. ఆయన ఆ సాహసానికి పూనుకొని, 1966 జనవరి ఒకటో తేదీ నుంచి, 'అభ్యుదయ' పేరుతో దాన్ని ఆరంభించాలని భావించారు ముందు. అయితే ఆ పేరుకు ప్రెస్ రిజిస్ట్రార్ అభ్యంతరం చెప్పడంతో దాన్ని మార్చి 'ఆవాహన' అనే పేరు ఖరారు చేశారు. తర్వాత ఏం జరిగిందో వివరంగా చెప్పలేను గానీ ఆ పత్రిక పేరు 'సంవేదన'గా మారి, ఏప్రిల్ 1967లో త్రైమాసిక తొలి సంచిక బైటపడిన తర్వాత గానీ - అంటే, 15 నెలల తర్వాత గానీ- నిమ్మళంగా ఊపిరి పీల్చుకొనే పురసత్తు రా.రా.కు దొరకలేదు.

'ఊహ తెలియం గల లేఖక పాఠకోత్తములనూ', 'ఒప్పు తప్పరయు రసజ్ఞులనూ' తానే స్వయంగా తయారు చేసుకొని, రా.రా. వారికి 'యుగసాహితి' ముద్ర వేశారు. 'సంవేదన' నిర్వహణలో రా.రా. వారికి భాగస్వామ్యం కల్పిస్తారని ఎట్లా పసిగట్టాడో కానీ, సమయం సందర్భం తెలిసిన వాడిలా ఆర్వియార్ అక్కడికి వచ్చాడు. కడప ఆర్ట్స్ కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా కాలు మోపి, 'యుగసాహితి'లోనూ, 'సంవేదన'లోనూ పాతకాపై కూర్చున్నాడు! 'యుగసాహితి' సభ్యులైన లెక్చరర్లు అందరూ కాలేజీకి దగ్గరగా వున్న యెర్రముక్క పల్లెలో వుండేవారు. అక్కడే తెలుగు లెక్చరర్ తరుగు చెన్నారెడ్డి వుంటున్న ఇంట్లోనే ఆర్వియర్ కూడా ఒక భాగంలో చేరిపోయాడు.

తర్వాత్తర్వాత, 'సంవేదన' కార్యకలాపాలకు ఆ యిల్లే కేంద్రమయింది. ఫిబ్రవరి 1967 నుంచీ ఆర్వియార్, నల్లపాటి



**సంవేదన సాహిత్య త్రైమాసిక పత్రిక ఆవిష్కరణ - కడప : 30 మార్చి 1968**

ఎడమ నుంచి కూర్చున్నవారు: 1. రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.), 2. ప్రొ॥ ఇ.యస్. రెడ్డి, 3. పుట్టపర్తి నారాయణాచార్యులు, 4. శ్రీశ్రీ, 5. కొడవటిగంటి కుటుంబరావు, 6. గజ్జెల మల్లారెడ్డి, 7. వై.సి.వి.రెడ్డి

నిల్చున్నవారు: 1. ఆర్వియార్, 2. ఐ.సుబ్బారెడ్డి, 3. టి.సాంబశివారెడ్డి, 4. వేటూరి సోమయాజులు, 5. కేతు విశ్వనాథరెడ్డి, 6. నల్లపాటి రామప్పనాయుడు, 7. వి.రామకృష్ణ, 8. చద్దా చంద్రశేఖరరెడ్డి (సి.సి.రెడ్డి), 9. టి.చెన్నారెడ్డి, 10. సొదుం జయరాం

రామప్పనాయుడు, కేతు విశ్వనాథరెడ్డి గార్లతో కలిసి రా.రా. 'సంవేదన' రూపురేఖలు దిద్దే పనిలో పడ్డారు. వారి కృషి ఫలితంగా, 'సంవేదన' ప్రారంభ వేడుక 28 మార్చి 1967న ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా మద్రాసు నుండి శ్రీశ్రీ, కొ.కు గార్లూ, తిరుపతి నుండి ఆచార్య జి.ఎన్.రెడ్డి గారూ, స్థానిక విద్వన్మణి పుట్టపర్తి నారాయణాచార్యులు గారూ పాల్గొన్నారు. విడి సంచిక వెల రూ.1.25గానూ, సంవత్సర చందా రూ.5.00 గానూ 114 పేజీలతో 'సంవేదన' తొలి సంచికను ఆవిష్కరించారు.

తొలి సంచికలో 'అపాలజీకి బదులుగా' అంటూ 'సంవేదన' చేయాలనుకుంటున్నదేమిటో యిలా వివరించారు: 'పుట్టగొడుగుల్లా వీధివీధినా పత్రికలున్న తెలుగుదేశం మీదకి మరో పత్రికను విసురుతున్నందుకు అపాలజీ చెప్పుకోవలసిందే. కానీ మా 'సంవేదన' కేవలం ఇంకొక పత్రికగా వుండకూడదన్న పట్టుదలే, వుండబోదన్న విశ్వాసమే, మా ధైర్యానికి కారణం. పత్రికలెన్ని వున్నా, తెలుగుజాతికి వున్న ఉత్తమాభిరుచిని యేదీ తీర్చడం లేదు. ఉత్తమ సంస్కార సుందరమైన ఉత్తమ జీవిత వ్యవస్థకు అభిముఖంగా తెలుగుజాతిని యేదీ నడిపించడంలేదు. యీ లోపాన్ని తీర్చడం కోసమే మా 'సంవేదన' అవతరిస్తున్నది. తెలుగు జాతికి 'సంవేదన'ను సమర్పించడానికే మా 'యుగ సాహితి' ఆవిర్భవించింది. పెనుభూతంలా విజృంభించిన వ్యాపార నాగరికత విషపు కోరల నుండి తెలుగు సాహిత్యాన్ని విడిపించాలని ఆవేదన చెందిన కొందరు సాహితీ ప్రియుల దీక్షకు సంస్థా రూపమే యుగసాహితి.'

సంవేదన' తొలి సంచికలోనే ఆర్వియార్ తొలి కథానిక వుంది. సొదుం జయరాం రాసిన 'వాడిన మల్లెలు' అనే కథపై, ప్రయోగాత్మకంగా 'ఒకే సన్నివేశం-నాలుగు కథలూ' అంటూ ఓ ప్రయత్నం చేశారు. జయరాం కథను చదివి రా.రా. తన కథ రాశారు. ఆ రెండూ చదివి ఆర్వియార్ మరో కథ రాశారు. ఆ మూడూ చదివి టి.సాంబశివారెడ్డి నాలుగో కథ రాశారు. ఈ కథా పరంపరపైన, కొడవటిగంటి కుటుంబరావు 'ఒకే యితివృత్తం-నాలుగు రచనలు' అంటూ యువ రచయితలకు మార్గదర్శకంగా చేసిన సమీక్ష కూడా వుంది. ఆ విధంగా, ఆర్వియార్ తొలికథ కొ.కు.దృష్టిని ఆకర్షించడం యాదృచ్ఛికమనే అంటారా? యుగసాహితి సభ్యులుగా ఉన్న కాలేజీ లెక్చరర్లు దాదాపుగా అందరూ, కాలేజీకి దగ్గర్లో వున్న యర్రముక్కపల్లెలోనే వుండే వారు. 1969 సెప్టెంబర్ 29న నేను, తాడేపల్లిగూడెం కాలేజీ నుంచి కడప ఆర్ట్స్ కాలేజీకి బదిలీ అయి, ఆర్వియార్ నా స్థానం లోకి మారిపోయే దాకా ఆర్వియార్ కూడా ఆ యర్రముక్క పల్లెలోనే వుండేవాడు. పోతూ పోతూ, ఆ ఇంటి భాగాన్నీ, 'సంవేదన' తాలూకు మిగిలిన సామాగ్రిని నాకే వదిలేసి వెళ్ళిపోయాడు.

'సంవేదన' కోసం ఆర్వియార్ వ్యాసాల ఎడిటింగు, ప్రింటింగు బాధ్యతలు నిర్వహించేవాడు. యుగసాహితి సహసభ్యుడు టి.సాంబశివారెడ్డి చలం మీద రాసిన వ్యాసాన్ని కుదించడంలో- తద్వారా దాన్ని ప్రచురణ యోగ్యంగా మార్చడంలో- ఆర్వియార్ అతనికి సహాయపడ్డాడు. దాంతో అది 'సంవేదన' మూడో సంచికలో ప్రచురితమైంది. 'సంవేదన'కు వచ్చిన ఉత్తరాల పరిష్కారంలోనూ, వాటిల్లో కొన్నింటికి సమాధానాలు రాయడంలోనూ రా.రా.కు చేదోడు వాదోడుగా ఉన్నాడు. రెండవ సంచికలో 'సాహిత్య కళాకేళి' పేరిట కళాకేళి పత్రికపైనా, నాల్గవ సంచికలో 'మాత్రాబద్ధ శంఖారావం' పేరిట గజ్జెల మల్లారెడ్డి కవితా సంపుటి 'శంఖారావం' మీదా సమీక్షలు రాశారు. ఏడవ సంచికలో 'కె.కె.శైలి' మీద ఒక వ్యాసం ప్రచురించారు. అప్పట్లో కావలి నుండి కె.వి.రమణారెడ్డి గారు రా.రా.కు రాసిన ఒక ఉత్తరంలో 'ఆర్వియార్ యెవరో తెలియదు గానీ బాగా రాస్తున్నారు' అని మెచ్చుకున్నారు కూడా.

అక్టోబరు 69లో మాస్కో ప్రగతి ప్రచురణాలయంలో అనువాదకునిగా బాధ్యతలు చేపట్టవలసి రావడంతో 'సంవేదన' యేడవ సంచికను 'కొ.కు. సంచిక'గా వెలువరించే బాధ్యతను రా.రా. ఆర్వియార్‌కే అప్పగించాడు. అప్పట్లో రా.రా. సొదుం జయరాంకు ఒక ఉత్తరంలో 'సంవేదన'ను కొనసాగించడం గురించి యిలా రాశారు : 'సంవేదన' ఆగిపోలేదు. రమణారెడ్డి లాంటివాళ్ళు దీన్ని ఆపడానికి సుతరామూ ఒప్పుకోకపోవడం వల్లా, ఆర్వియార్ సకల బాధ్యతలూ వహించడానికి పూనుకోవడం వల్లా దీన్ని కొనసాగించడానికి నిర్ణయించినాము. యుగసాహితిలో చర్చించడం అనే ఫార్మాలిటీ వల్ల ఒరిగేదేమీ లేదని ఆ ఫార్మాలిటీని పట్టించుకోలేదు. ఇప్పుడైనా ఆర్వియార్ ఐచ్ఛికంగా అన్నిటికీ బాధ్యత వహిస్తున్నాడు గనుకనే ఆ పత్రికను కొనసాగించడం సాధ్యమౌతున్నది. ఐనప్పటికీ మేటర్‌కు సంబంధించిన భయసందేహాలు ఆయనకూ వున్నాయి. డబ్బును గురించి కొన్ని అదనపు ఏర్పాట్లు చేసినాము.'

రా.రా. మాస్కో వెళ్ళిపోయిన తర్వాత గూడా దాదాపు నాలుగైదు నెలలు ఎనిమిదవ సంచిక శ్రీశ్రీ సంచికగా వస్తుందని ఎదురుచూశాడు. శ్రీశ్రీ మీద ఒక వ్యాసం రాసి ఆర్వియార్‌కు పంపాడు గూడా. చివరకు 11-5-70లో ఆశ వదులుకొని ఆర్వియార్‌కు ఇలా జాబు రాశాడు: 'మీరూ నేనూ ఉభయులమూ కడపలో వుంటే కూడా సంవేదనను కొనసాగించడం సులభంగా వుండేది కాదు. డబ్బు ఒకటే సమస్య అయితే తల తాకట్టు పెట్టి అయినా నడిపి వుందుము. కానీ ఇతర సమస్యలున్నాయి కదా.. అందుకనే నేనుండగానే దాని అంత్యక్రియలు జరుపుదామని చెప్పింది. కానీ మీరు అర్థం చేసుకోలేదు. మీ పట్టుదలనూ, పత్రిక పట్ల మీ లాయల్టీనీ చూసి మీ మాటకు బదులు చెప్పలేకపోయినాను.' శ్రీశ్రీ సంచిక

రాకపోవడానికి బహుశా నేను కూడా ఒక కారణమేమో! ఆర్వియార్‌ను తాడేపల్లిగూడెం పంపి నేను ఆయన స్థానంలో కడప కాలేజీలో చేరాను కదా! అయినా రా.రా. మాస్కో నుండి ఆర్వియార్‌కు రాసిన ఉత్తరం నాకు కొంత ఊరటనిస్తోంది.

యే కారణాలవల్ల నైతేనేమి, 'సంవేదన' ఆగిపోవడం సాహితీ ప్రియులందరికీ బాధ కలిగించే అంశమే. అందుకు పరిహారం గా, ఆయన స్థానంలోకీ, ఆయన వుండిన యింట్లోకీ, ఆయన నిర్వహిస్తున్న యుగసాహితి కార్యదర్శి పదవిలోకీ చేరిపోయిన నేను-యుగసాహితి కార్యదర్శిగా-కొన్ని మంచి పుస్తకాలు వెలుగు చూడడానికి కృషి చేశాను. వాటిల్లో 'విరసం సాహిత్య బండారం' (నల్లపాటి రామప్ప నాయుడు, సొదుం రామ్మోహన్, ఆర్వియార్), కేతు విశ్వనాథరెడ్డి తొలి కథల సంపుటి 'జప్తు', ఆర్వియార్ తొలి సాహిత్య వ్యాస సంపుటి 'సాహిత్యతత్వం', కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి కథల సంపుటి 'కుట్ర', రా.రా. తన కథలపై తనే వ్యాఖ్యానం రాసుకున్న కథల సంపుటి 'అలసిన గుండెలు', రా.రా. సాహిత్య సర్వస్వం నాలుగు సంపుటాలూ వున్నాయి. తర్వాత్తర్వాత, రా.రా. దారిలోనే ఆర్వియార్ అనువాదకునిగా, మాస్కోకు పోవాలని ఉబలాటపడి, ప్రభుత్వం లాంగ్ లీవ్ ఇవ్వనంటే కోపగించుకుని రాజీనామా వారి ముఖాన పారేసి పోయాడు ఆర్వియార్. సోవియెట్ యూనియన్ పతనమయ్యే వరకూ, మాస్కోలోని 'ప్రగతి' ప్రచురణాలయంలో అనువాదకుడిగా పనిచేశాడు. ఇండియాకు తిరిగివచ్చి, రాజీనామాను లాంగ్ లీవ్‌గా మార్చి, గప్ చుప్‌గా ఉద్యోగంలో చేరిపోయాడు ! ప్రిన్సిపల్‌గా రిటైరై, హైదరాబాద్‌కు మకాం మార్చాడు. ఆంధ్ర భూమి' కాలమిస్టుగా, 'ఈభూమి' నిర్వాహకుల్లో ఒకడిగా, 'విశాలాంధ్ర' సలహాదారుగా, శతాధిక గ్రంథకర్తగా, ఫ్రీ లాన్స్ అనువాదకునిగా రాణించాడు! ఇదంతా, ఆయన 'సంవేదన'లో సంపాదించుకున్న వొదుపు-సంస్కారం-తెగువల పర్యవసానమే నని నా నమ్మకం! 'వంద మైళ్ళ ప్రయాణం ఒక్క తొలి అడుగుతోనే మొదలైనట్టు..' ఆర్వియార్ వంద పుస్తకాల గ్రంథ సాంగత్యం 'యుగసాహితి' ప్రచురణగా వెలువడిన ఆయన తొలి పుస్తకం 'సాహిత్య తత్వం'తోనే మొదలు కావడం సాహితీ ప్రియులందరికీ ఆనందదాయకమే కదా! ❑

## రచయితగా పుట్టింది కడపలోనే : ఆర్వియార్

రాయలసీమ ప్రాంతం చూడాలన్న కోరికతో కోరి అక్కడకి వెళ్లేను. కడప వెళ్లడంతో రాయలసీమ దృశ్యాన్ని చూసినట్లు అయింది. వామపక్షభావాలతో తడిసి ఉన్నవాళ్లం కాబట్టి యే పక్షి ఆ గూడు వెతుకుతున్నట్లు కడపలో ఆ బృందంతోనే కలయిక జరిగింది. 'సవ్యసాచి' పత్రిక వెలువడేది. దానికి సంపాదకులు రా.రా.గా ప్రసిద్ధులైన రాచమల్లు రామచంద్రారెడ్డి. రా.రా.ది హిమాలయ శృంగమంత ఎత్తులో ఉన్న మేధ. ఈ రకంగా ఒక గాఢమైన భౌతిక వాతావరణంలో ఆలోచనా వాయువులు పీలుస్తూ, ప్రతిభ అంటూ యేమన్నా అంతో యింతో వుంటే, దానికి దోహదం చేసుకుంటూ ముందుకు అడుగులు వేశాం. 'ప్రగతి' ప్రచురణాలయానికి కడప పునాదిగా ఉన్న ఇద్దరం వెళ్లేం. మొదటి వారు రా.రా., రెండవ వ్యక్తిని నేను. నేను గోదావరి జిల్లా వాణ్ణి అయినా కడప పునాదిగా ఉన్న వాణ్ణని ఎందుకు అంటున్నానో చెప్పాలి కదా. అదే నా సీమ బంధం అంటున్నాను. మిత్రుడు పద్మనాభరెడ్డి యుగసాహితీ తరపున ప్రొద్దుటూరు నుంచి నా 'సాహిత్య తత్వం' ప్రచురించేడు. 'నేను పుట్టినది పశ్చిమ గోదావరి జిల్లాలో అయినా రచయితగా పుట్టింది కడపలోనే' అని ఆ సందర్భంలో అన్నాను. అంచేత నాది కడప.

(ఆంధ్రభూమిలో ఆర్వియార్ వ్యాసం)

## అనువాదకుడిగా పుట్టింది పశ్చిమ గోదావరిలోనే

ఆర్వియార్ రచయితగా పుట్టింది కడపలో ఐతే అనువాదకుడుగా పుట్టింది పశ్చిమ గోదావరిలో.. ఎస్ఎ డాంగే రాసిన The Driving Forces of Historyని నా బలవంతం మీద అనువాదం చేశారు. ఇది ఆయన తొలి అనువాదం. 'చరిత్ర చోదకశక్తులు' పేరుతో నేను ప్రచురించాను.

**ఆర్వియార్ ఉద్యోగం గురించి..**

ఆర్వియార్ ఉద్యోగం మీద చాలా విషయాలు ప్రచారంలో వున్నాయి. వాటిని నేను తప్పుపట్టడం లేదు. ఆయన అనువాదకునిగా మాస్కో వెళ్ళడానికి సుముఖం కాదు. మేము చివరికి ఒప్పించగలిగాం. అప్పుడు ఆయన తణుకులో పని చేస్తున్నందున (Through Proper Channel) అక్కడే 5 సంవత్సరాలకు 'లీవ్' దరఖాస్తు పెట్టి మాస్కో వెళ్ళారు. ఐదేళ్ల తర్వాత ఒక నెల వుండేలా తిరిగి వచ్చారు. హైదరా బాద్‌లో వాకబు చేస్తే తన 'లీవ్' దరఖాస్తుపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని తేలింది. పైగా వలంటరీ రిటైర్మెంట్‌కు దరఖాస్తు చేసుకోమన్న సలహా కూడా వచ్చింది. మేము అప్పుడు పెంట పాడులో వున్నాం. ఆయన వచ్చారు. తణుకు వెళ్ళి వలంటరీ రిటైర్మెంట్‌కు దరఖాస్తు ఇచ్చి మాస్కో వెళ్ళిపోయారు. ఈ దరఖాస్తు అలాగే వుండిపోయింది. తిరిగి 1981లో వచ్చిన తర్వాత మిత్రులు, తెలిసిన ఇతర పెద్దల సహకారంతో ఉద్యోగంలో చేరారు. ఇవి నాకున్న సాన్నిహిత్యంతో నాకు తెలిసిన విషయాలు.

- డీవీవీఎస్ వర్మ

# తూర్పు-పడమర తెలిసిన విమర్శకుడు ఆర్వియార్!

## సాహిత్య పరామర్శ



- మందలపర్తి కిషోర్

**చరిత్రలో ఏ పరిణామమూ, ఫలానా ముహూర్తానికి మొదలు కావడమనేది జరగదు. కానీ, మనకి చాలా పరిణామాలూ ఫలానా క్షణంలో మొదలయినట్లే 'గుర్తుంటాయి'. కానీ, ఆ పరిణామ క్రమాలు మనలోనూ-ఇతరుల్లోనూ కూడా ఎప్పుడో మొదలైపోయి వుంటాయి. చరిత్ర విద్యార్థిగా నాకీ చిన్న విషయం తెలుసు కానీ, నేను లోకరీతిని గౌరవించే సామాన్యుణ్ణి. అందుకే, మా సాహిత్య జీవితాలతో ఆర్వియర్ మేస్టారి ప్రమేయం 1972లోనే మొదలైనట్టు భావిస్తున్నా. "దారిదీపం" సంపాదకుల సూచన మేరకు నేనీ వ్యాసంలో ఆర్వియార్ మేస్టారు చేసిన రెండు-మూడు ప్రత్యేక అధ్యయనాల గురించి నా అవగాహన చెప్తాను. అంతకుముందు, మాకు ఎంతో సన్నిహితులైన మేస్టారి కి నా నివాళి కూడా అర్పిస్తాను. వ్యక్తిగతంగా, ఆయన నాకిచ్చిన సలహా నా జీవితాన్ని ఎలా ప్రభావితం చేసిందో వివరిస్తాను.**

### అందమైన జ్ఞాపకం!

1972లో మా వూరు తాడేపల్లిగూడెంలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా మహాసభ జరిగింది. ఆర్వియార్ మేస్టారిని అక్కడే మొట్టమొదటిసారి చూశాను. అప్పటికే ఆయన పేరు సుపరిచితం. మా అన్నయ్యలు ముగ్గురు అప్పటికే మేస్టారి దగ్గర చదువుతున్నారు. (మా వూరికి నాలుగు మైళ్ళ దూరంలో ఉండే పెంటపాడులో పెట్టిన డీ.ఆర్.గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్వియార్ మాస్టారు ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తుండేవారు. సాహిత్య సూక్ష్మాలను-విద్యార్థి జనాలకు-ఆసక్తికరంగా చెప్పే కళలో మేస్టారు దిట్ట. మమ్మల్ని కూడా ఆ చమత్'కారాల'తోనే ఆకట్టుకున్నారు మేస్టారు.) నేను గూడెంలో కాలేజ్ చదువులు చదవని కారణంగా, ఆయన దగ్గర ఎప్పుడూ పాఠాలు మాత్రం చదువుకోలేదు! కానీ, ఆర్వియార్ గారు మా కుటుంబానికంతటికీ గురుత్వం వహించిన మాట మాత్రం వాస్తవం. యండగండిలో (1975 సంవత్సరంలో అని గుర్తు!) మా మూడో అన్నయ్య నారాయణమూర్తి పెళ్ళి మేస్టారే చేయించారు. ఆ రోజున భోరున వర్షం కురుస్తుండగా మేమందరం మేస్టారి చుట్టూ మూగి కేరింతలు కొట్టుకుంటూ యండగండి బయల్దేరి వెళ్ళాం. అదో అందమైన జ్ఞాపకం!

### గాలి మార్పు

1972నాటి అరసం సభ మా తరం సాహిత్య జీవితాన్ని ఎలా మలుపు తిప్పేసిందో నేనింకా చెప్పలేదు. అప్పటికి అయిదారేళ్ళగా మా గురువుగారు రామప్పయ్యవారల దగ్గిర సంస్కృతం నేర్చుకుంటున్నాను. మా ఇంట్లో సాహిత్య వాతావరణం నా చిన్నప్పటి నుంచీ ఉంటూ వున్నదే! అయితే దానికి సమకాలీన స్వభావం లేదు. గజ్జెల మల్లారెడ్డి సంపాదకుడిగా మొదలైన విశాలాంధ్ర వారపత్రికతోనే దానికి ఆ స్వభావం ఏర్పడడం మొదలైనట్టుంది. వాస్తవానికి అరవై దశకం ఉత్తరార్థంలో వస్తూ వుండిన 'సంవేదన' త్రైమాసిక తెలుగు అభ్యుదయ సాహిత్య ప్రాంగణంలో గాలి మార్పు తెచ్చిపెట్టిందని మా అన్నయ్యలూ, మా ఇంట్లోనే వుంటూ చదువుకునే మా బావలూ, కోసూరి భోజరాజు లాంటి సీనియర్ మిత్రులూ అనుకునేవారు. అప్పటికి మా తరం ఇంకా రెక్కలు విప్పుకోలేదు మరి. అది డెబ్భయిల్లోనే మొదలైంది. మా వూరు వరకూ ఈ క్రమం వేగం పుంజుకోవడానికి కారకులైన ఇద్దరు ముగ్గురిలో ఆర్వియార్ మేస్టారు ఒకరు. నా వరకూ నాకు, ఆర్వియార్ మేస్టార్ని కలిసిన తర్వాతే సాహిత్య దృక్పథానికి సమకాలీన, ఆధునిక స్వభావం స్ఫుటంగా ఏర్పడింది. మా తొలి ఉపాధ్యాయుడు డీవీవీయస్ వర్మ - నిజానికి - ఈ క్రమానికి శ్రీకారం చుట్టినవారు. నేను హైదరాబాద్ వచ్చిన తర్వాత నార్ల చిరంజీవి గ్రంథాలయంలో సాహిత్య పాఠాలు నేర్చుకోవడానికి అవసరమైన మౌలిక శిక్షణ వర్మ - ఆర్వియార్ ద్వయం నుంచే నాకు లభించింది.

ఇంతకు ముందు అన్నట్టుగా, 1972 తాడేపల్లిగూడెం అరసం మహాసభ మా ఆలోచన ధోరణిని ఓ మలుపు తిప్పింది. మా గురువులు గజ్జెల మల్లారెడ్డి, రాంభట్ల కృష్ణమూర్తి ఆ సభకి హైదరాబాద్ నుంచి వచ్చారు. అవి అభ్యుదయ రచయితల సంఘం పునర్నిర్మాణానికి ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్న రోజులు. జిల్లాలు అన్నింటిలోనూ అరసం నిర్మాణాన్ని పటిష్ఠం చేయడం కోసం రాంభట్ల-మల్లారెడ్డి జంటగా రాష్ట్ర

మంతా తిరుగుతూ ఉండేవారు. అప్పటికే కృష్ణా జిల్లాలోనూ, తూర్పుగోదావరి జిల్లాలోనూ, గుంటూరు జిల్లాలో కూడా ఆ ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి. ఇక హైదరాబాద్, మద్రాస్ ప్రాంతాలు అప్పటికే ఈ దారిలో నాలుగడుగులు వేసివున్నాయి. అంతకు కొన్ని నెలల ముందే నాకు పరిచయమైన కవిగాయక మిత్రుడు అదృష్టదీపక్ తాడేపల్లిగూడెం సభకి రామచంద్రపురం నుంచి వచ్చాడు. అతను అప్పటికి తూర్పు గోదావరి జిల్లా అరసం కార్యదర్శి అని జ్ఞాపకం! ఇక నిడమర్తి ఉమారాజేశ్వర రావు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, సొదుం రామ్మోహన్, తుమ్మలపల్లి నరసింహమూర్తి, మల్లిక్, 'చోదకశక్తి' రవి తదిత రులు బెజవాడ నుంచి దిగారు. వాళ్ళలో కొందరు తిన్నగా మా ఇంటికే వచ్చారు! అక్కడే టిఫిన్లు చేసి అరసం సభకు వచ్చారు. వాళ్ళందరికీ 'లోకల్ గైడ్'గా ఉండే బాధ్యత నాకు అప్పగించారు పెద్దలు! ఆ వయసుకు అది థ్రిల్లింగ్‌గా ఉండే బాధ్యతే మరి!

## మేస్టారి ప్రత్యేకతలు !

నేనప్పుడు గమనించలేదు గానీ, వాళ్ళలో ఎవరికీ లేని ప్రత్యేక-విశిష్ట-లక్షణాలు కొన్ని మా ఆర్వియార్ మేస్టారికి ఉన్నాయి. ఈ వాస్తవం గ్రహించడానికి నాకు కాస్త టైం పట్టింది. మేస్టారికి సంస్కృత సాహిత్యంతోనూ, భారతీయ తత్వ శాస్త్రంతోనూ ప్రగాఢమైన పరిచయం ఉంది. ఇక యూరోపియన్-అమెరికన్ సాహిత్యధోరణుల గురించి విమర్శనాత్మక దృక్పథం ఉంది. అంతకుమించి, ఆ రోజుల్లో కార్చిచ్చులా వ్యాపిస్తూ ఉండిన 'విప్లవ' సాహిత్య ధోరణి విషయంలో అసాధారణమైన స్పష్టత ఉండేది. ముందే చెప్పినట్టు, ఈ విషయాలను నేను కాస్త ఆలస్యంగానే గ్రహించాను. 'భగ్న దిగంబర ముని వీస్తున్న తూర్పు గాలి' అంటూ అప్పట్లో ఆర్వియార్ మేస్టారు విశాలాంధ్ర వారపత్రికలో ఓ సమీక్ష రాశారు. దాదాపు అదే రోజుల్లో, నల్లపాటి రామప్పనాయుడు మేస్టారు కూడా 'హై హై రమణారెడ్డీ, నైనై నీలో కవితాశక్తీ' అంటు మరో సమీక్ష విశాలాంధ్ర వారపత్రికలోనే రాశారు. అవి చదువుకుని ఆనందించిన వాళ్ళలోను, అందులో మా మేస్టార్లు విసిరిన విసుర్లు చూసి నవ్వుకున్న వాళ్ళలోనూ నేనూ ఒకణ్ణి. అయితే మా మేస్టార్లు సాదాసీదా ఎంటర్‌టైనర్స్ కారనే సత్యం గ్రహించడానికి నాకు కొన్నేళ్ళు పట్టింది.

## షేక్స్పియర్ ఎఫిషియనాడో!

ఆర్వియార్ మేస్టారు పెద్ద షేక్స్పియర్ ఎఫిషియనాడో! ఈ విషయం నాకు తెలియవచ్చిన క్రమంలోనే గొప్ప చమత్కారం దాగి వుంది. 1976లో నేను నిజాం కాలేజీలో బియ్యే స్పెషల్ ఇంగ్లిష్ కోర్సులో చేరాను. అది జరిగిన కొత్తలో మేస్టారు మా ఇంటికి వచ్చారు. ఆయనతో పిచ్చాపాటీగా మాట్లాడుతూ మా నాన్నగారు మేస్టారికి ఆ విషయం చెప్పారు. ఆయన నన్ను పిలిచి ఇంటరాగేషన్ మొదలు పెట్టారు. ఆయన వేసిన మొదటి ప్రశ్నే 'షేక్స్పియర్ ఎప్పుడు పుట్టాడు?' అని. ఆ వెనకనే, 'షేక్స్పియర్ ఎప్పుడు పోయాడు? ఎన్నేళ్ళు రాశాడు? ఎన్ని నాటకాలు రాశాడు ? ఎన్ని సానెట్స్ రాశాడు?' - ఇలాంటి ప్రశ్నలు సంధిస్తూపోయారు. వికీపీడియా స్వామీ, గూగులమ్మ తల్లి లాంటివాళ్ళ కటాక్షం మాకింకా దక్కని అంధ యుగం అది ! అయితే, నేను నిజాంస్‌లో చేరిన సంవత్సరం, డిగ్రీకి సైతం ఎంట్రెన్స్ టెస్ట్ రాయాల్సి వచ్చింది. దానికోసం ముక్కున పట్టిన ముక్కలు గుర్తుండడం చేత మేస్టారి ఇంటరాగేషన్ టెస్టులోనూ గట్టెక్కాను. నాకు పాస్మార్క్ మాత్రమే వేస్తూ, 'చూడు కిషోర్- నువ్వు తెలివైన వాడివే, ఏదో సబ్జెక్ట్ తీసుకుని అయిందని పించగలవ్. లిటరేచర్ విషయంలో మాత్రం అది సాధ్యం కాదు. మనసు పెట్టి చదివే దురుద్దేశం ఉంటేనే ఆ సబ్జెక్ట్ తీసుకో! లిటరేచర్ చదవాలంటే కాస్త రసపిచ్చి ఉండి తీరాలయ్యా ! ఆషామాషీగా చదివే కాడికి లిటరేచర్ ఎందుకయ్యా నీకు?' అని క్లాసు పీకారు మేస్టారు. నా మహదహం తీవ్రంగా దెబ్బ తింది కానీ, ఆయన ఎప్రోచ్ నాకు బాగా నచ్చింది.

ఆ రోజు సాయంత్రం 'నార్ల చిరంజీవి గ్రంథాలయం'లో మన తెలివితేటలు బయటపడ్డాయి. మా గురువులు రాంభట్ల-మల్లారెడ్డి-బూదరాజు గార్లతో సహా లైబ్రరీలో ఉన్నవాళ్ళనంద రిని నేనే ప్రశ్నలే వేశాను. 'నాకు ఇంగ్లీషు బొట్టు రాదు!' అని రోజుకు ఒకసారి గర్వంగా ప్రకటించే గజ్జెల మల్లారెడ్డితో సహా ప్రతి ఒక్కరికీ ఆర్వియార్ మేస్టారు నన్నడిగిన విషయాలు క్షుణ్ణంగా తెలుసు. ఇక మిగతా వాళ్ళ మాట చెప్పాలా?

## పనికొచ్చే ముక్క!

నా ఇంటరాగేషను జరుగుతూండగా, వల్లంపాటి వెంకట సుబ్బయ్య గారు మా లైబ్రరీకి వచ్చారు. ఆయన జరుగుతున్నదంతా వినోదంగా కొంతసేపు గమనించి 'ఏం కిషోర్ ? స్పెషల్ ఇంగ్లిష్ కోర్స్‌లో చేరినావా? లేక ఎవడేనా ఇంగ్లిష్ మాస్టర్ తగుల్కొన్నాడా పొద్దున్నే?' అనడిగారు నవ్వుతూ. రెండూ జరిగాయని నేను చెప్పిన తర్వాత నన్నొక్కణ్ణే వేరే కూర్చోబెట్టి వల్లంపాటి కూడా ఆర్వియార్ మేస్టార్ చెప్పిన విషయమే-వేరే మాటల్లో-చెప్పడం వింతగా అనిపించింది. సాహిత్య పరిణామాల్ని చారిత్రక పరిణామాలతో ముడిపెట్ట కుండా చదివితే ఎలాంటి భ్రమా ప్రమాదాలూ ఎదురవుతాయో

వల్లంపాటి వివరంగా చెప్పారు. ఆర్వియార్ మేస్టారు అలా చెప్పారు! అవి మనంతట మనమే-ఒళ్ళొంచి, కష్టపడి-తెలుసుకోవాలన్నది ఆర్వియార్ మేస్టారి ఉద్దేశం. అలా నేర్చుకున్నవి మర్చిపోం – అంచేత ఆ విషయాలు అలాగే నేర్చుకోవాలన్నది మా మేస్టారి ఆలోచన అయివుంటుంది! దీన్ని క్లాసికల్ మెథడ్ అని కొట్టి పారేస్తారు కానీ, ఇది బోధనలో పనికొచ్చే ముక్క!

## అప్లయ్డ్ విమర్శకులు!

మన చారిత్రక పరిజ్ఞానాన్ని, సామాజిక సాహిత్య సమాచారానికి 'అప్లై' చేస్తే తప్ప అది పనికి రాదని మేస్టారు మామూలు మనుషుల భాషలో సరళంగా చెప్పారు. ఉదాహరణకు ఓ విషయం చెప్తా – మేస్టారు ప్రతి సంవత్సరం స్పాట్ వేల్యుయేషన్ పని మీద హైదరాబాద్ వచ్చేవారు. అలా వచ్చినప్పుడల్లా ఆయన ఓ కొత్త హైపోథీసిస్ ప్రతిపాదించి వెళ్ళేవారు. తెలుగు కాల్పనిక సాహిత్యంలో ఉత్తమ పురుషలో కథ చెప్పే సంప్రదాయం ఎలా బలపడిందని ఓ సారి ఆయన అడిగారు. ఆ ప్రశ్న విని మేమందరం తెల్లమొహం వేశాం ! స్వీయ జీవిత కథపైనా – ఇతరుల జీవిత కథలపైనా ఆధారపడిన నవలలు నాలుగు రాసి ప్రపంచ ప్రసిద్ధుడైన విలియం సోమర్సెట్ మాం ప్రభావం కారణంగానే తెలుగు కాల్పనిక సాహిత్యంలో ఉత్తమ పురుష కథనం ఓ సంప్రదాయంగా బలపడిందన్నది మేస్టారి ప్రతిపాదన. ఈ ఒక్క అంశంపైనే డాక్టరేట్ చెయ్యొచ్చు అనేవారట కాకాని చక్రపాణి గారు!

అలాగే, శ్రీశ్రీ 1934లో రాసిన కవితల్ని విడిగా-లోతుగా-పరిశీలించాలని ఆర్వియార్ మేస్టారు తరచూ అనేవారు. పెద్దవారు చెప్పారు కదాని ఆయన మాస్కో వెళ్ళిన యేడాది (1982) వేసవి సెలవుల్లో అదేపనిగా 1934 నాటి శ్రీశ్రీ కవితల్నే చదివా! 'మహాప్రస్థానం' శ్రీశ్రీ తాలూకు మూలస్వరూపం ఈ కవితల్లోనే దొరుకుతుందని నాకు అనిపించింది. అది మా నాన్నగారు పోయిన కొత్త అమ్మ ఆస్పత్రిలో ఉంది. నా మనఃప్రవృత్తి 'మహాప్రస్థానం' నాటి శ్రీశ్రీ ప్రవృత్తికి సన్నిహితంగా ఉన్న దశ అది. సాహిత్యం అధ్యయనం చేయడం ఆషామాషీ వ్యవహారం ఎందుకు కాదో కొంత వరకూ నాకు బోధపడింది. ఆయన తిరిగి వచ్చిన తర్వాత మేస్టారితో ఈ విషయం వివరంగా మాట్లాడే అవకాశం చిక్కలేదు. 90 దశకం నాటి పరిణామాల నేపథ్యంలో సాహిత్యం బ్యాక్ సీట్‌లోకి వెళ్ళి కూర్చుంది! 'తొలగిన స్వర్గం' గురించిన విషాదాశ్రువులూ, విలాపాగ్నులూ దీర్ఘశ్రుతిలో, తీవ్రధ్వనితో సాగుతూ ఉండిన రోజులవి.

## అప్లయ్డ్ విమర్శ

మేస్టారిది మౌలికంగా అప్లయ్డ్ విమర్శ. ఆయన శైలి గురించి చెప్పాలనుకున్న సైద్ధాంతిక విషయాలు అన్నిటినీ, 'కె.కె.శైలి' అనే వ్యాసంలో ప్రతిక్షేపించి చూపించారు. అది కె.కె. గురించిన వ్యాసం మాత్రమే కాదనీ, ప్రాథమికంగా అది శైలి గురించిన వ్యాసమనీ మనం గ్రహించడానికి కొంత టైం పడుతుంది. అది విమర్శకుడిగా ఆర్వియార్ మేస్టారి 'శైలి' అనుకోవాలి! అలాగే, 'శ్రీశ్రీలో ఆలంకారికత' వ్యాసం కూడా. అసలు ఆధునిక కవితలో మెటాఫర్ – ఇమేజరీ– ఎలా వ్యక్తమవుతుందనే విషయాన్ని శ్రీశ్రీ పరంగా చెప్తారు మేస్టారు. అటు కె.కె. (కొడవటిగంటి కుటుంబరావు) అయినా, ఇటు శ్రీశ్రీ అయినా స్వయంభువులైన యుగకర్తలు. వాళ్ళ రచనల్లోంచి ఉదాహరణలు తీసుకుని ఓ సైద్ధాంతిక ప్రతిపాదన చేస్తే అది, శ్రోతల మెదళ్ళలో పాతుకుపోతుంది. ఇది ఒక రకమైన మెథడ్. బహుశా ఉపాధ్యాయ వృత్తిలో ఉండి వుండకపోతే, ఆర్వియార్ మేస్టారు ఈ మెథడ్ పాటించగలిగి వుండేవారు కారేమో!

విమర్శ పద్ధతుల్లో అకాడమిక్ విమర్శను రా.రా. గారు, 'సంవేదన' బృందంలోని చాలా మంది విమర్శకులు పెద్దగా మెచ్చలేదు. సరిగ్గా విశ్లేషించుకుంటే, ఆర్వియార్ మేస్టారిది ప్రాయికంగా అకాడమిక్ విమర్శే. అయితే, ఆయనలోని అకడమీషియన్ కీ, కళాత్మకతను గాఢంగా ప్రేమించే రసజ్ఞుడికీ ఏ వైరుధ్యం లేకపోవడం గొప్ప విశేషం.

## శైలి అంటే 'వ్యక్తిత్వమా' ?

యూరోప్‌లో ఓ సామెత లాంటిది ఉంది – "స్టైల్ ఈజ్ ద మ్యాన్ హింసెల్ఫ్" అని. పద్దెనిమిదో శతాబ్దికి చెందిన ఫ్రెంచ్ వైజ్ఞానిక వేత్త బఫోన్(న్) అన్నమాట ఇది. బఫోన్(న్) శాంపిల్ సర్వేల సేకరణను తీవ్రంగా వ్యతిరేకించిన న్యాచురల్ సైంటిస్ట్. ఇందులోని 'మ్యాన్' అంటే 'వ్యక్తి' అనే అర్థం, మనిషి అని కాదు. మనిషి అనే అస్తిత్వంలో వ్యక్తిత్వం ఉండదు – అది ఒక సామూహిక, సామాన్యత. వ్యక్తి అంటే అలా కాదు కదా! వాస్తవానికి, 'జీవుల ప్రత్యేక అస్తిత్వం వాటివాటి విశిష్టమైన లక్షణాల్లోనే వ్యక్తం అవుతుంది' అన్నది బఫో సైద్ధాంతిక ప్రతిపాదన తాలూకు సారాంశం. ఇది యథాతథంగా రచయితలకు సైతం వర్తిస్తుంది అన్నదే ఈ వ్యాసంలో ఆర్వియార్ మేస్టారు చేసిన ప్రతిపాదన. (ఇది నాకు అర్థమైన విషయం. తప్పైతే సవరించుకోడానికి భవదీయుడు ఎల్లెప్పుడూ సంసిద్ధుడే!) కె.కె. విశిష్టత, ప్రత్యేకత ఆయన శైలిలో వ్యక్తమవుతోందని మేస్టారు ఎన్నెన్నో ఉదాహరణల సహాయంతో రుజువు చేశారు. ఆద్యంతం ఒకే శైలిని పాటించేంత శిల్ప స్పృహ కొద్ది మంది చెయ్యి తిరిగిన రచయితలకే ఉంటుంది.

వాళ్ళలో కె.కె. ఒకరు కనుకనే ఆయన్ని 'కేస్ స్టడీ'గా తీసుకున్నారు మేస్టారు. 'కె.కె. శైలి ప్రధానంగా ఆలోచనా ప్రేరకమైంది. మెదడులో మత్తుగా పడుకుని వున్న జీవకణాలకి మత్తు వదిలి రాకెట్ వేగంతో పోయే ఆలోచనా పరత్వాన్ని కలిగిస్తుందాయన శైలి. హృదయ వ్యాపారమైన ఉద్రేకాన్ని కాక మేధా వ్యాపారమైన ఆలోచనను రేకెత్తిస్తుందీ శైలి' అన్నారు ఆర్వియార్ ఒకచోట. వైజ్ఞానిక సాహిత్యాన్ని సృజించే మంచి శిల్పులైన ఏ రచయిత శైలికైనా ఈ లక్షణం ఉండొచ్చు - ఇక కె.కె. విశిష్టత ఎక్కడుంది మరి ? కె.కె 'చేసింది ప్రధానంగా సాహిత్య కృషి. సాహిత్యానికి ప్రధానంగా కావలసింది హృదయ ఉల్లాసం. ఉద్రేకాన్ని సృష్టించడం. అలాంటిది లేకుండా ఆలోచనా ప్రేరకంగా తయారుజేయడం బలహీనతేగదా అనవచ్చు. కళా నియమాలు తెలీకుండా సంయమనం లేని వాడు చేస్తే బలహీనతే అవుతుంది. కె.కె.లాంటి స్థితప్రజ్ఞుడు ఇలాంటి అసిధారావ్రతాన్ని అవలీలగా నిర్వహించగలడు. ఆయన గ్రహించిన వస్తువే ఓ రకంగా ఉద్రేకాల ఆటుపోట్లు అవసరం లేనిది. ఆయన రాసిన యింతటి విస్తృతమైన కథా సాహిత్యంలోనూ తనకు అపరిచిత మైన గొప్పవాళ్ళ విషయమేమీ తేలేదు' అంటూ ఓ గొప్ప శిల్ప రహస్యాన్ని ఆర్వియార్ సరళంగా చెప్పేశారు. ఇదీ కె.కె. విశిష్టత! ఇదే విషయాన్ని వంద పేజీల పుస్తికగా రాస్తే ఆర్వియార్ మేస్టార్ని ఎవరూ విమర్శించి ఉండేవారు కాదేమో ! కానీ, ఆయన 'సూక్ష్మంలో మోక్షం' సిద్ధాంతాన్ని నమ్మినవాడు - అందుకే క్యాప్స్యూల్ లాంటి ఓ వ్యాసం తోనే సరిపెట్టారు. అందుకే మళ్ళీ చెబుతున్నా - ఇది ఆర్వియార్ విమర్శన శైలి అని మనం గ్రహించాలి!!

## ఏది సామాన్యం ? ఏది ప్రత్యేకం ?

కాగా, 'యుగకర్త శ్రీశ్రీ'లో ఉన్నదీ ఇదే శైలా? ఎంతమాత్రం కాదు! అక్కడ చర్చనీయాంశం శ్రీశ్రీ సాహిత్యం కాదు - తెలుగు కవిత్వ చరిత్రలో ఆయన యుగ కర్తృత్వ స్థానం. దాన్ని నిరూపించి, స్థాపించే లక్ష్యంతో రాసిందే 'యుగకర్త శ్రీశ్రీ'. అదే విధంగా 'రా.రా.విమర్శ ప్రమాణాలు' అనే వ్యాసం కూడా రా.రా గారి విమర్శన పద్ధతి గురించిన వ్యాసమే. మొత్తంగా సాహిత్య విమర్శ ప్రమాణాలకు సంబంధించినది కాదు! సామాన్య దృష్టికి ఇక్కడ మనం ప్రస్తావించుకున్న వ్యాసాల్లో మొదటి రకం వ్యాసాల స్వభావం సాధారణమన్నట్టుగా తోచవచ్చు. ఎందుకంటే, అవి ఒక వ్యక్తి గురించినవి కాక సాహిత్యంలో సార్వత్రికంగా కనిపించే ఆలంకారికత, శైలి లాంటి విషయాలను చర్చిస్తున్నాయి కనక. కానీ అది తప్పు! సాహిత్యాన్ని నిలువు కోత విశ్లేషణ చేసే సందర్భంలో మాత్రమే చర్చకు వచ్చే విషయాలు ఆలంకారికత, శైలి లాంటివి. వాటిని చర్చించడానికి లోతైన పరిజ్ఞానం అవసరం అవుతుంది. అది మేస్టారికి పుష్కలంగా ఉంది. (అర్థం చేసుకోవడానికి కూడా కనీస స్థాయి అవసరం! దాని సంగతి అలా వుంచండి!!) కాగా, రెండో రకం వ్యాసాల స్వభావం ప్రత్యేకమని పైపైన చూసే వారికి తోచవచ్చు. కానీ ఇవే సాధారణ స్వభావం కలిగివున్న వ్యాసాలు. శ్రీశ్రీని యుగకర్తగా స్థాపించే విషయంలో సాహిత్య చరిత్ర మొదలుకుని, సామాజిక - రాజకీయ - సాంస్కృతిక పరిణామాలన్నింటినీ పరస్పరం పోలుస్తూ ప్రస్తావించవలసి వస్తుంది. ఈ తరహా విషయాలు చర్చించేందుకు సమాంతర విశ్లేషణ ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఆర్వియార్ మేస్టారికి అందులోనూ మంచి నేర్పు ఉంది. అయితే, ఆయనలా విశిష్టమైన విషయాలను నిలువుకోతగా విశ్లేషించ గల విమర్శకులు మనకు తక్కువ. ప్రాక్పశ్చిమ దేశాల్లో అభివృద్ధి చెందిన తార్కిక-తాత్విక పద్ధతులు తెలిసిన విమర్శకులు మనకు మరీ తక్కువకావడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది. ఇదే ఆర్వియార్ మేస్టారి అరుదైన లక్షణం, బలం అని నాకు అనిపిస్తుంది.

## అనువాదం, కళ-శాస్త్రం!

ఆర్వియార్ మేస్టారు దశాబ్దాల కాలం కృషి చేసిన ఒక రంగం అనువాదం. బహుశా ఈ ఊబిలోకి ఆయన్ను దించిన ఘనత కూడా మా తొలి ఉపాధ్యాయుడు వర్మ గారికే దక్కాలి! నాకు తెలిసినంత వరకూ, 'చరిత్ర చోదక శక్తులు' మేస్టారి తొలి అనువాద రచన. 1969లో భోపాల్‌లో జరిగిన 'మధ్యప్రదేశ్ ఇతిహాస పరిషద్' ఆరో మహాసభలో ఎస్.ఏ.డాంగే ప్రారంభ ఉపన్యాసం చేశారు. 'డ్రైవింగ్ ఫోర్సెస్ ఆఫ్ హిస్టరీ-హీరోస్ అండ్ మాసెస్' శీర్షికతో పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ దాన్ని అచ్చువేసింది. మేస్టారి 'చరిత్ర చోదక శక్తులు' దానికి అనువాదం అని గుర్తు. వర్మ గారు దీని తొలి ముద్రణను 'యుగసాహితి' ప్రచురణగా వెలువరించారు. (సంవేదన పత్రికను యుగసాహితి తరఫున ప్రచురించే వారనే విషయం సాహిత్యాభిమానుల్లో చాలమందికి తెలుసు!) ఆ తర్వాత విశాలాంధ్ర ప్రచురణాలయం వారు 'చరిత్ర చోదకశక్తులు' పుస్తకాన్ని పునర్ముద్రించారు.

గురువుకు నామం పెడుతున్నా అనుకోకుంటే ఒక్క చిన్న మాట- నాకు, మేస్టారి అనువాద కళ మీద గొప్ప అభిప్రాయం ఎప్పుడూ లేదు. అయితే, అనువాద శాస్త్రానికి సంబంధించిన ఆయన పరిజ్ఞానమంటే నాకెప్పుడు గౌరవమే. గొప్ప శాస్త్రకారుల్లో గొప్ప కళాకారులు ఎప్పుడూ తక్కువగానే ఉంటారని లోకానికి తెలిసిన విషయమేగా! ఇలా ఆర్వియార్ మేస్టార్ని మరోసారి తల్చుకునే అవకాశం దక్కినందుకు మహదానందంగా ఉంది. ❑

# సాహిత్య తత్త్వమెరిగిన ఆర్వియార్

సాహిత్య పరామర్శ



- రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి

**రచయిత, కళాకారుడు అనే వారికి ఒక జీవిత దృక్పథముంటుంది. ఆ దృక్పథాన్ని బట్టే అతని సిద్ధాంతమూ ఆచరణా ఉంటాయి.**

**(ఆర్వీయార్ : సాహిత్య సిద్ధాంత వ్యాసం)**

ఆర్వియార్‌గా ప్రసిద్ధులైన అభ్యుదయ సాహిత్య విమర్శకుడు ఆర్.వెంకటేశ్వరరావు. ఈయన వృత్తి రీత్యా ఆంగ్ల అధ్యాపకుడు. ఈయన ప్రధానంగా సాహిత్య విమర్శకులు, అనువాదకులు. 147 గ్రంథాలను అనువదించారు. స్వయంగా 23 రచనలు చేసినట్లు తెలుస్తున్నది. ఈయన స్వీయ రచనలలో సాహిత్య తత్త్వం, పూర్వ గాథా కల్పతరువు, ఆంధ్ర సాహిత్య చరిత్ర, ఆర్వియార్ వ్యాసాలు, యుగకర్త శ్రీశ్రీ, 20వ శతాబ్దపు తెలుగు కవులు వంటివి ఉన్నాయి. కొన్ని కథలు కూడా రాశారు.

అభ్యుదయ సాహిత్య విమర్శకునికి సమాజ సాహిత్య సంబంధాలు, వాటి పరిణామాలు, జ్ఞానం ఉండాలి. సాహిత్యం, కళల పుట్టిక, వాటి ప్రయోజనం, రచయితలు వాళ్ల కర్తవ్యాలు వంటి అనేక విషయాలపట్ల శాస్త్రీయమైన అవగాహన ఉండాలి. అలాగే సాహిత్య విమర్శకులు, వాళ్ల కర్తవ్యాలు కూడా తెలియ డం అనివార్యం. సాహిత్య విమర్శకునికి దేనిని గురించైనా సాపేక్షంగా మాట్లాడడం తెలియాలి. అవతలపక్ష సాహిత్య వాదులను పూర్వపక్షం చేయడంలో తార్కిక బుద్ధి ఉండాలి. స్వపక్ష సాహిత్యంలోని లోపాలను ఎత్తి చూపడంలో నిజాయితీ ఉండాలి. తాను విమర్శకు తీసుకున్న సాహిత్యాంశాల చరిత్ర సారం విమర్శకునికి అవగాహనలో ఉండాలి. ఆర్వియార్‌లో ఇవన్నీ పుష్కలంగా ఉన్నాయి. ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య, సాహిత్య శాస్త్రాలపట్ల విమర్శనాత్మక అవగాహన ఉంది ఆయనకు. దేనిని గురించైనా శాస్త్రీయంగా ఆలోచించి విశ్లేషించగల సామర్థ్యం ఉంది. తెలుగు సాహిత్య విమర్శకుడిగా ఆర్వియార్ మార్క్సిజం పరిజ్ఞానంతో విస్తృతంగా విమర్శ రాశారు. ఆయన విమర్శ గ్రంథాలలో సాహిత్యతత్త్వం అనే గ్రంథాన్ని పరామర్శించడమే ఈ వ్యాస పరిమిత.

'సాహిత్య తత్త్వం' అనే విమర్శ గ్రంథం 1980లో వచ్చింది. దీనిని ప్రొద్దుటూరు యువ సాహితి ప్రచురించింది. రా.రా దీనికి క్లుప్తంగా ముందుమాట రాశారు. ఇందులో పదహైదు వ్యాసాలున్నాయి. వీటిలో ఆరు సాహిత్య సిద్ధాంత వ్యాసాలు, తక్కినవి రచయితల మీద రాసిన వ్యాసాలు. ఈ పుస్తకం 1980లో నాలుగు దశాబ్దాల నాడు వచ్చింది. అయినా ఈ గ్రంథంలోని అభిప్రాయాలు ఈ నాటి సాహితీపరులకు పనికి వస్తాయి. ఇందులోని వ్యాసాలను ఆర్వియార్ దేనిని ఎప్పుడు రాశారో తెలియదు. ముందుమాట రాసిన రారా 'పది పంద్రెండేళ్లుగా విమర్శనాత్మక వ్యాసాలూ, పుస్తక సమీక్షలూ రాస్తున్నారు' అని అన్నారు. అందువల్ల ఈ వ్యాసాలు 1967 ప్రాంతాల నుంచి రాశారని భావించవచ్చు. రా.రా., కుందుర్తి, వై.విజయకుమార్, ఆర్వియార్ వంటి అభ్యుదయ విమర్శకులంతా విప్లవ సాహిత్యం మొదలవుతున్న దశలో అభ్యుదయ దృక్పథంతో సాహిత్య విశ్లేషణకు పూనుకున్నారు.

'చలం, పఠాభి, శ్రీశ్రీ ఇంకా ఎవరిని గురించి ఆర్వియార్ రాసినా, ఆ రచన వెనుక మార్క్సిస్టు సిద్ధాంతబలం ఉంటుంది' అన్నారు. రా.రా. ముందుమాటలో ఆర్వియార్ అరసంలో క్రియాశీల పాత్ర నిర్వహించారు. సాహిత్యంలో సాహిత్యం ఉంటుంది కాని, సాహిత్యంలో లేదా సాహిత్యానికి సిద్ధాంతం ఉంటుందా ? అనే ప్రశ్నకు సమాధానంగా 'సాహిత్య సిద్ధాంతం' అనే వ్యాసం రాశారు ఆర్వియార్. దేవరకొండ బాలగంగాధర తిలక్ 'నా కవిత్వం కాదొకతత్వం' అన్న వాక్యానికి సమాధానంగా ఈ వ్యాసముంది. ఇలాంటి మాటలు ఇరవయ్యో శతాబ్దంలో కొందరు అంటున్నారు. కాని, నన్నయ్య నుంచి నిన్నటి రచయితల దాకా అంతా ఏదో ఒక తత్వాన్ని ఆశ్రయించుకున్న వాళ్లే' అని గుర్తుచేశారు. ఈ వ్యాసంలో ఆయన కళని, కళాకారులను సిద్ధాంతాలు అనివార్యంగా ఉంటా యని స్పష్టం చేశారు. రచయితలకు కళాకారులకొక జీవిత దృక్పథం ఉంటుందనీ, దానిని బట్టే వాళ్ల సిద్ధాంతాలూ, ఆచరణ లూ ఉంటాయని ఆర్వియార్ పేర్కొన్నారు. సాహిత్యానికి ప్రచార గుణం ఉంటుందనే వాదాన్ని ఆమోదించని వాళ్లకు ఆర్వియార్ రచయితలు వాళ్ల జీవిత దృక్పథాన్ని ప్రచారం చేస్తారని సమా ధానం చెప్పారు. ప్రచారం అంటే చవకబారు ప్రచారం కాదని స్పష్టం చేశారు. సాహిత్యం, కళలు ప్రయోజనం గురించి ఆర్వి యార్ చాలా చెప్పారు. సాహిత్యానికి కళలకూ మానవ సమాజం వికాసానికి తోడ్పడంలో ముఖ్యమైన బాధ్యత ఉంది అని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు 'మానవ జీవితాన్ని ప్రేమించి, మానవ తకి గుర్తింపు ఇచ్చి, మనుష్యులలో మహానుబాబు అనే చైతన్యం కలిగించేటట్టు చేయడం సాహిత్య కళలూ నిర్వర్తించవలసిన పని

అని స్పష్టం చేశారు. జీవితం సుఖమయం కావడానికి శాస్త్రం కృషి చేస్తుంది. ఆధ్యాత్మిక అవసరానికి కళ కృషి చేస్తుంది అనే అభిప్రాయం శాస్త్రీయమైనది. ప్రకృతిలో ప్రపంచంలో ప్రతీదీ మారుతూ ఉంటుందని మార్క్సిజం నమ్ముతుంది. అలాగే సాహిత్యం మారుతుంది. సాహిత్య భావనలూ మారుతాయి. అందుకే ఆర్వియార్ అభ్యుదయ భావన తన అర్థాన్ని మార్చుకుంటూ వస్తున్నది అని అన్నారు. కవిత్వంలోని వ్యక్తివాద మత్తు మీద తిరుగుబాటుగా అభ్యుదయ కవిత్వం పుట్టిందన్నారు. అభ్యుదయ రచయితలో ప్రస్ఫుటమయ్యేది సామాజిక చైతన్యమే తప్ప వ్యక్తి చైతన్యం లేదని ఆర్వియార్ స్పష్టం చేశారు. సాహిత్యం ఒక సామాజిక చర్య అన్నది మార్క్సిస్టు అవగాహన. ఈ అవగాహన లోంచే ఆర్వియార్, మానవుడో రాబోయే సంఘ జీవితానికి సైద్ధాంతికంగా తయారు చేయడమూ, అలాంటి భౌతిక పరిస్థితులకు ఈ సంఘంలో సృష్టించడమూ రచయితల కర్తవ్యమని నిర్దేశించారు. మనకు ఆధునిక సాహిత్య చరిత్రలు చాలా వచ్చాయి. అయితే అందులో ఆధునిక సాహిత్యం కాని, సాహిత్యాన్ని కూడా పరామర్శిస్తుంటారు. అంటే మనం ఆధునిక కాలంలో వచ్చిన సాహిత్యాన్నంతా ఆధునిక సాహిత్యంగా పరిగణిస్తున్నా మన్నమాట. ఇది సరైన పరిగణన కాదు. ఆధునికత అనే మాటకు శాస్త్రీయమైన అర్థం ఉంది. అందుకే ఆర్వియార్ సమకాలీనత, ఆధునికత ఒకటి కావని స్పష్టం చేసి 'ఆధునికత వున్నది కొన్ని లక్షణాల సమాహారంగా, ఒక దృష్టి స్వభావంగా గ్రహించాలి' అని పేర్కొన్నారు. 'ఆధునికత అనేది ఒక దృక్పథం' అని చెప్పారు. ఈ దృష్టితోనే ఆయన ఆంధ్ర సాహిత్యానికి, ఆంధ్ర జీవితానికి ఆధునిక స్పర్శ కలిగించిన వారు గురజాడ అని ఎరుక పరిచారు. అభ్యుదయ సాహిత్యానికి మార్క్సిజం అందించిన ఆలోచనలే ఉపాధులు. ఆ ఉపాధులను ఉపయోగిం చుకునే ఆర్వియార్ ఏ యుగపు చైతన్యమైనా ఆ యుగపు ఉత్పత్తి సాధనాల మీద, ఆ సంబంధాల మీద ఆధారపడి ఉంటుంది కాని, చైతన్యం మీద భౌతిక జీవితం ఆధారపడి ఉండదు. అని సూత్రీకరించారు.

ఆర్వియార్‌కు కళలూ, సాహిత్యంపట్ల శాస్త్రీయమైన అభిప్రాయాలున్నట్లే, సాహిత్య విమర్శపట్ల కూడా హేతుబద్ధమైన ఆలోచనలు ఉన్నాయి. సక్రమమైన విమర్శ లేకపోతే, సరైన సాహిత్యమూ రాదు అన్న అవగాహన గల ఆర్వియార్ 'ఏ కళనైనా అది పుట్టిన సాంఘిక పరిస్థితుల దృష్ట్యానూ, దాని విలువకు, దాని సాంఘిక ప్రయోజనం దృష్ట్యానూ విచారించాలి' అని సూచించారు. రచయితకు తన సాహిత్యం ద్వారా పాఠకులలో కదలిక, చైతన్యం మార్పు తీసుకుని రావాలన్నది ఒక ఆరోగ్యకరమైన ఆలోచన. అయితే ఆ మార్పు తిరోగమన మార్పు కాదు. పురోగమన మార్పు అని అభ్యుదయవాదులు భావిస్తారు. ఆర్వియార్ అభ్యుదయ సాహితీ విమర్శకుడిగా ఈ అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. 'రచయితలు తమ చైతన్య స్థాయిలో పాఠకుల చైతన్య స్థాయిని పెంచాలి. తర్వాత జీవితం మారేటట్టుగా చేయాలి' అని రా.రా. వంటి వారు బాగా ప్రచారం చేసింది. సాహిత్య పాఠకులు సంస్కారంలో మార్పు తీసుకురావాలని ఆర్వియార్ దానినే చెప్పారు. 'మానవుణ్ణి సంస్కారవంతుణ్ణి చేయడమే సాహిత్య ప్రయోజనం'. కవిత్వంలో అలంకారాల అవసరం గురించి ఛందస్సును గురించి చర్చించే సమయంలో కూడా ఆర్వియార్ అనేక సాహిత్యాంశాలను వివరించారు. కవులు కేవలం వస్తుబలం వల్ల కవులు కాలేరు అంటూ ఏ వస్తువైనా కాని, ఆవేశ బలాన్ని వ్యక్తీకరణ విధానాన్ని అనుసరించి కవ్వితం అనడం, కాకపోవడం జరుగుతుంది. అలాగే అనుభూతి భావుకతలు ప్రాధాన్యం వహించే కవిత్వంలో భాష పాత్ర మహోన్నతంగా ఉంటుందని ఆర్వియార్ అభిప్రాయం. మామూలు మాటలు కవిత్వంలోకి ప్రవేశించి కొత్త శక్తినీ, పుష్టినీ సంతరించుకుని విలువైన ఆయుధాలవుతాయి అని అన్నారు ఆర్వియార్.

ఈ కవిత్వంలో అలంకారాల అవసరం గురించి, వాటి ప్రమేయాన్ని గురించి కట్టమంచి రామలింగారెడ్డి కాలం నుంచి చర్చ జరుగుతూనే ఉంది. కట్టమంచి 'కవిత్వమున కలంకార ములనావశ్యకాములు' అన్నారు. దానర్థం అసలే వద్దని కాదు. అవసరానికి మించి వద్దని. వెంటనే కురుగంటి సీతారామయ్య అలంకార తత్వ విచారము రాసి కట్టమంచిని వ్యతిరేకించారు. కుందర్తి వచన కవితను సామాన్యులకు చేరువ చేసే క్రమంలో అలంకార ప్రాధాన్యాన్ని తగ్గించారు. కాని, ఆర్వియార్ కవిత్వంలో అలంకారాలు ఉండాల్సిందేనని నొక్కి వక్కాణించారు. 'ఆలంకారికత లేకుండా కవి తన అనుభూతిని వ్యక్తం చెయ్యలేరా అంటే నిర్దిష్టంగా చెయ్యలేరనే చెప్పాలి. నిశితంగా అనుభూతి పాఠకునికి అందదనే చెప్పాలి. ఆలంకారిత లేకపోతే అది కవిత్వం కాకపోవచ్చు. అంతేకాదు, ఒక కవి ఆలంకారికత ఆ కవి వ్యక్తిత్వాన్నికి దర్పణం అని కూడా నిర్వచించారు. పైగా ఆలంకారికత అనేది కవి హృదయుడైన ప్రతి ఒకనికి స్వతాహాగా వస్తుందని, కవికి నేర్పలేనిదీ, నేర్వ లేనిదీ ఆలంకారికత అని కూడా ఆర్వియార్ చెప్పారు. ఆర్వియార్ కవిత్వంలో అలంకారాల ప్రాధాన్యాన్ని ఇంత గట్టిగా ఎందుకు చెప్పారంటే, భాష కవిత్వానికి వాహకం కనుక. కవిత్వం ద్వారా పాఠకుల సంస్కారాన్ని తాకాలి కనుక. కవిత్వం ఉద్రేకభరితమైనదీ, ఆవేశ ప్రధానమైనదీ కనుక, దానికనుగు ణమైన భాష ఆలంకారికంగా ఉండాలని ఆయన అభిప్రాయం. అలాగే శైలిని కూడా ఆర్వియార్ భాషా దృష్టితోనే వ్యాఖ్యానించారు. సాహిత్యం అనేది భాషలో జరిగే వ్యాపారం కాబట్టి మాటలసొగసులో ఉన్న వ్యక్తిత్వం ఆ మనిషికి గల శైలి అవుతుంది. ❑

సాహిత్య పరామర్శ

# 'సాహితీ సింధువు' ఆర్వియార్



- గుళ్లపల్లి రాజా

ఆధునిక యుగ ప్రవేశంతో తెలుగు సాహిత్యంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. విద్యావ్యవస్థపై కూడా ఆ మార్పులు ప్రభావాన్ని చూపాయి. 'ఆధునికత' అనేది ఒక నూతనమైన ఆలోచనా ధోరణి. ఆంగ్లేయ విద్యా ప్రభావంతో పొడచూపింది. ఈ ఆధునికత ప్రభావం విద్యారంగంపైనో, లేదా సాహిత్య రంగంపైనో మాత్రమే అనుకుంటే తప్పు. ఆ ప్రభావం యావత్ సమాజంపైనా ప్రసరించింది. హిందూ మతంపై కూడా ఆ ప్రభావం గాఢంగా ప్రసరించింది. దయానంద సరస్వతి, రాజా రామ్మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, స్వామి వివేకానంద వంటివారు ఈ సాంస్కృతిక మార్పునకు మార్గాన్ని సుగమం చేశారు. అంతవరకు ప్రచారంలో ఉన్న భావాలు, నమ్మకాలు, సాంప్రదాయాలు, ఆటుపోట్లకు లోనయ్యాయి. 'పొట్టకూటికి నేర్చు విద్యలు పుట్లకీళ్ళు' కదల్చివేశాయి. 'గతకాలమే మేలు వచ్చుకాలము కంటెన్' అనే ధోరణి పోయి, 'మంచి గతమున కొంచెమేనోయ్' అనేస్థాయి దాకా ఈ ఆధునికత తన ప్రభావాన్ని చూపింది. కాల్పనిక వాదం, మానవతావాదం వంటి విదేశీ ధోరణులు సాహిత్యంలో ప్రవేవించాయి.

**తెలుగు సాహిత్యంలో ఒకవైపు ఆధునిక ధోరణులు కనిపిస్తున్నప్పటికీ, మరోవైపు సాహిత్య సుందరి 'అందెలు బావిలీలు ధరించి కొంచెం మడిగా వంటచేసి పెట్టసాగింది. భోజనంలో పాత చింతకాయ పచ్చడీ, వంగ వరుగూ, పులుసూ; రుచిమాట దేవుడెరుగు గానీ, మాంచి ఆరోగ్యం తినగలిగిన మనిషికి'. (తిలక్ గారికి క్షమాపణలతో) సమ సమాజం కోసం వ్యవస్థలను విప్లవాత్మకంగా మార్పు చేయాలని ఆధునిక అభ్యుదయవాదుల ఆకాంక్ష. కార్ల్‌మార్క్స్ సిద్ధాంతం సమాజ పరివర్తనకు దారిదీపమైనది. అభ్యుదయవాదులకు శ్రీశ్రీ నాయకుడుగా నిలిచాడు. శ్రీశ్రీ 'తన కవిత్వాన్ని మార్క్సిస్ట్ తాత్విక దర్శనకు ఉదాహరణ ప్రాయం చేశాడు' (ఆర్వియార్).**

అల్లసాని పెద్దనాది కవులు పేర్కొన్న "అభ్యుదయ పరంపరాభివృద్ధి' అన్నమాట పరలోక సంబంధమైనది. శ్రీశ్రీ కాంక్షించిన అభ్యుదయం ఇహలోక సంబంధమైనది. అభ్యుదయ రచయితలందరి భావనాయిదే.

**ఎక్కడైతే చుక్క వెలిఁగెనొ**
**అక్కడొక్కటి కాంతి వెలసెను**
**అబ్బులెత్తి జనంబు లెల్లను**
**అద్భుతంబునఁ జూడఁగన్ (గురజాడ)**

అనంతర కాలంలో ఎందరో యువకవులకు, రచయితలకు శ్రీశ్రీ మార్గదర్శి అయ్యాడు. సోవియట్ రష్యా వారి దృష్టిలో భూతల స్వర్గమయ్యింది. నెహ్రూ అంతటి పాశ్చాత్య సంస్కృతీ ప్రభావితుడు కూడా ఆదేశం దర్శించి ముగ్ధుడయ్యేడు. భారత మేధావుల మీదా, కార్మిక వర్గం మీదా గాఢమైన ముద్ర వేసింది అక్కడి కార్యాచరణ. ప్రపంచ తాడిత, పీడిత వర్గాలకు విముక్తి వేగుచుక్కగా తోచింది సోవియట్ యూనియన్. మార్క్సిజం – గతి – తార్కికవాదం ఎందరో యువకులను, విద్యావంతులను ఆకర్షించి కలం పట్టించి రచనలు చేయించింది. ఆ కోవలో పేర్కొనదగిన వ్యక్తి శ్రీ ఆర్వియార్.

ఆర్వియార్ అసలు పేరు రాళ్ళభండి వేంకటేశ్వరరావు. నిరంతర అధ్యయనం, నిశిత పరిశీలన, ఆంధ్రాంగ్ల భాషలపై అపారమైన సాధికారత, అన్నింటికీ మించి రక్తదప్పుంగా ఒంట బట్టిన మార్క్సిజం ఆర్వియార్‌ని ఉన్నత స్థానంలో నిలబెట్టాయి. మూడు వందలకు పైగా రచనలు చేసిన ఆధునిక వ్యాసుడు ఆర్వియార్. ఆర్వియార్ భావజాలాన్ని అంగీకరించని వాళ్ళు సైతం ఆయన విశ్లేషణని, విషయగాఢతని, అందులోని సత్యాన్ని అంగీకరించక పోరు. ఏ విషయాన్ని గ్రహించి రాసినా, తనదైన ముద్ర చూపగలిగిన ప్రతిభాశాలి ఆర్వియార్. ఆయన స్పృశించని విషయం లేదు. 'సాహిత్య తత్వాన్ని' వివరించినా, 'తత్వశాస్త్ర మౌలిక సూత్రాలు' విశదీకరించినా, 'కుల వ్యవస్థ – భారతీయ సంస్కృతి' గురించి చర్చించినా నూతన ఆవిష్కరణలు చేసిన అసాధారణ మేధావి ఆర్వియార్.

విద్యార్థి దశ నుండీ వామపక్ష భావజాలంవైపు మోజు. ఆంధ్రా యూనివర్సిటీలో 'ఆనర్సు' చదివే సమయంలో సమాన భావజాలం ఉన్న మిత్రులతో నిరంతర గోష్ఠి ఆయనలోని జిజ్ఞాస మారాకు తొడిగింది. ఆర్వియార్ సాహిత్య ప్రస్థానంలో కడప పట్టణానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఒక గాఢమైన

భౌతిక వాతావరణంలో ఆలోచనా వాయువులు పీలుస్తూ, ప్రతిభకు దోహదం చేసుకుంటూ ముందుకు అడుగులు వేసిందిక్కడే. ఆర్వియార్ ఉద్యోగరీత్యా కడప ప్రభుత్వ కళాశాలలో ఆంగ్లోపన్యాసకుడుగా పనిచేశారు.

'భీష్మద్రోణకృపాది ధన్వి నికరాభీలంబు' అన్నట్లు అప్పుడు కడపలో ఉన్న పెద్దలు రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.), సరస్వతీ పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు, గజ్జెల మల్లారెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి తదితరుల సాహచర్యంలో తనలోని సహజ మైన ప్రతిభను సానపెట్టడం జరిగింది. వెరసి కడప (వాసం) ఆర్వియార్ వామపక్ష భావజాల విస్తృతికి, మంచి రచయితగా మారడానికి వేదికయ్యింది. రా.రా. సంపాదకత్వంలో వెలువడిన 'సంవేదన' పత్రికా నిర్వహణలో పాలుపంచుకోవటం జరిగింది. (చూడు. 'సీమబంధం' ఆర్వియార్ సాహిత్యవాసాలు. 2010) తాను స్వీకరించిన అంశాన్ని సమూలంగా నిశితంగా పరిశీలన చేయడం ఆర్వియార్ నైజం. ఒక్కోసారి ఆయన స్వీకరించిన అంశాలు పాఠకులను ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. ఇందుకు ఉదాహరణలుగా ఆయన రాసిన 'మతం – మార్క్సిజం', 'భగవద్గీత – మార్క్సిజం' వంటివి పేర్కొనాలి.

పరస్పర విరుద్ధ భావజాలాలతో నిండిన ఆ విషయాలను గురించి ఆర్వియార్ విశ్లేషణ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆయన నిశిత పరిశీలన దృష్టి, విషయ నిర్వహణాశక్తి అనితరసాధ్యం. చూడడానికి పై రెండు రచనలు పరిమాణంలో చిన్నవే అయినా ప్రశస్తమైనవి. ప్రకృతి శక్తుల ఆరాధన మతానికి తొలిరూపం. తొలిదశలో ప్రకృతి శక్తులు అనేక దేవతామూర్తులుగా ఆవాహన అయేయి. తర్వాత సాంఘిక శక్తులకు ఆ రూపాలు అతుక్కున్నాయి. భౌతిక కారణాలను అనుసరించి సాంఘిక జీవితానికి నైతికపరమైన దృక్పథంతో విశ్లేషణ చెయ్యడమే మతం సాగించింది. మతబోధ విశ్వాసాలను పునాది చేసుకొని నిలబడింది. శాస్త్రం భౌతిక కారణాలను అన్వేషిస్తుంది. మార్క్సిజం శాస్త్ర విజ్ఞానం పెరిగేకొద్దీ బలపడుతుంది. అప్పుడు మత విశ్వాసాలకు పట్టు సడలుతూ ఉంటుంది. అంటే భౌతిక శక్తులు మనిషి అధీనంలోకి వచ్చేకొద్దీ జీవితం మతదృష్టి నుండి వేరవుతుంది. మార్క్సిజం భౌతిక శక్తులను గతి తార్కిక దృక్పథంతో అధ్యయనం చేస్తుంది. భౌతిక శక్తుల ప్రాబల్యం పెరిగి, సమాజం గురించి అవగాహన పెరిగి అనేక శక్తులు మనిషి అధీనంలోకి వచ్చినప్పుడు మతశక్తి ముడుచుకుపోతుంది. మతాన్ని – మార్క్సిజాన్ని గూర్చి ఆర్వియార్ చేసిన సమగ్ర పరిశీలనా సారాంశం యిది. ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే అభివృద్ధి చెందిన శాస్త్ర విజ్ఞానం వల్ల సామాన్యుని బ్రతుకు సుఖమయమవుతుంది. అంతేకాని ఇది దైవానుగ్రహమనే నమ్ముతూ ఉంటే సాంఘిక అసమానతలకు పరిష్కారం దొరకదు. ఆ పరిష్కారం చూపించడమే మార్క్సిజం లక్ష్యం. ఆర్వియార్ పేర్కొన్న పై వాదననుబట్టి సమాజం పట్ల ఆయనకు గల సంపూర్ణ అవగాహన, ఆలోచన అవగతమవుతుంది. మతం ప్రచారం చేసిన నమ్మకాలు శాస్త్ర విజ్ఞానాభివృద్ధికి గుదిబండలు అవబట్టే మతం మత్తుమందులా తయారైందని ఆయన నిశ్చితాభిప్రాయం. అంతమాత్రం చేత ఆర్వియార్ నాస్తికుడు కాదు. (ఇక్కడ 'నాస్తిక' శబ్దానికి వేదనిందకః అని అర్థం. నాస్తికోవేదనిందకః) జ్ఞానమనేది వేదాల్లో ఉన్నా, మార్క్సిజంలో ఉన్నా స్వీకరింపతగినదేనని ఆయన అభిప్రాయం. అంతమాత్రం చేత 'అన్నీ వేదాల్లో ఉన్నాయష' అంటే కుదరదు. మతవాదులకు ఈ అభిప్రాయాలు అంగీకారయోగ్యం కాకపోగాక. తాను నమ్మిన విషయాన్ని సాధికారికంగా చెప్పగల్గిన మేధాశక్తి ఆర్వియార్ సొంతం.

**మతములన్నియు మాసిపోవును;**

**జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును.**

మతం – మార్క్సిజం వంటిదే ఆర్వియార్ మరో రచన 'భగవద్గీత – మార్క్సిజం' (జూలై 2002) భారతీయులకు పరమ పవిత్రమైన గ్రంథం భగవద్గీత. ఇది హైందవ ధర్మాన్ని నిలబెట్టే ప్రామాణిక గ్రంథంగా ప్రసిద్ధి చెందింది. భగవద్గీత ఎందరికో ఎన్నో రకాలుగా కన్పించింది. దీనినే అలంకార శాస్త్రంలో చెప్పాలంటే ఉల్లేఖాలంకారం. ఒకే వస్తువు అనేకమందికి అనేక రకాలుగా కన్పించడం ఉల్లేఖ. ప్రాచీన కాలం మాట ప్రక్కన పెడితే, ఆధునికులకు కూడా భగవద్గీత శిరోధార్యమే. భగవద్గీత లేనిదే గాంధీజీ లేరు. తిలక్ మహాశయునికి గీత 'కర్మ' మార్గాన్ని ఉద్బోధించింది. ఆదిశంకరులకు జ్ఞాన, మోక్ష మార్గాలను చూపించింది. స్వరాజ్య ఉద్యమంలో ఖుదీరాంబోస్ వంటి వాళ్లు భగవద్గీతను చేతిలో పట్టుకునే ఉరికంబమెక్కారు. గీత దేశభక్తుల్ని ఉత్తేజితం చేసే పాత్ర పోషించింది. ఆత్మకు చావు లేదనే భావంతో త్యాగాలు చేసే ఉత్సాహం కలిగించింది. మహాభారతాన్ని పంచమవేదముగా పేర్కొన్నా, భగవద్గీత హిందూ సమాజంలో పొందిన స్థానం భారతం పొందలేదు. ఇటువంటి భగవద్గీతను మార్క్సిజం దృష్టితో సునిశిత విశ్లేషణ చేశారు ఆర్వియార్. హిందూ సమాజానికి ఆత్మవంటి భగవద్గీతను ఈ విధంగా విశ్లేషణ చేయడం ఒక విధంగా దుస్సాహసమే. మతవాదులకు ఈ సమాలోచన అంగీకార యోగ్యం గాకపోగాక. మనసుపెట్టి ఆలోచిస్తే అందులో సత్యం లేకపోలేదు. ఈ పుస్తకం చదివితే ఆయనకు భగవద్గీత వంటి గ్రంథాలపై గల సాధికారతతోపాటు మార్క్సిజం పట్ల గల గాఢ అవగాహన, నిబద్ధత ఆశ్చర్యపరుస్తుంది. అసలు మూల భారతంలో భగవద్గీత ఇంత సుదీర్ఘంగా ఉందా లేదా అన్నది ప్రశ్న. యుద్ధరంగంలో ఇంత సుదీర్ఘ సన్నివేశానికి ఆస్కారమెక్కడ? స్వామి వివేకానంద కూడా అది అసంగతంగా

ఉందన్నారు. వ్యాసప్రణీత మూలభారతంలో బహుశా బీజప్రాయంలో ఉండి ఉండవచ్చునేమో. విజయం సాధిస్తే రాజ్యం, మరణం పొందితే స్వర్గం లభిస్తాయని ఉత్తేజకరమైన మాటల్లాంటివని ఆర్వియార్ అభిప్రాయం. మరి ఇంతటి సుదీర్ఘ గ్రంథం ఎలా తయారైందో ఆర్వియార్ ఇలా వివరిస్తారు. బౌద్ధమతం క్షీణించడంతో కొత్త రాజకీయ సంబంధాలు తెర మీదకు వచ్చాయి. ఆ పరిస్థితులకు తగ్గ సైద్ధాంతిక పునాదిని అందించడానికి గీతను కల్పించడం జరిగింది. వైదిక మత పునాదుల్ని కదిలించడంలో బౌద్ధం కృతకృత్యమైంది గాని, ప్రత్యామ్నాయ మతంగా ప్రజల్ని బంధించి ఉంచే పట్టు దానికి లేకపోయింది. అందుకే బౌద్ధమతం క్షీణించిన తరువాత అందులోని 'శరణం గచ్ఛామి' భావాన్ని భగవద్గీత స్వీకరించింది. అందుకే గీతలో కృష్ణుడు 'మామేకం శరణం వ్రజ' అంటాడు. సనాతన ధర్మం మళ్ళీ పునరుజ్జీవం పొందే సమయంలో వ్యవస్థని పటిష్టం చేసుకునేందుకు, పునర్జన్మభావాన్ని పాదుకొల్పేందుకు, ఆత్మ శాశ్వతత్వాన్ని చాటుకొందుకు గీత విస్తృతి పెరిగింది. బౌద్ధం తర్వాత వచ్చిన హిందూమతం పురాణ హిందూమతమని ఆర్వియార్ ఆలోచన.

చివరగా అందరికీ మోక్షమన్న గీత, సాంఘిక అసమానతలు తొలగించే మార్గమేదీ చూపించలేదు. ఆనాటి సాంఘిక ఉత్పత్తి విధానానికి నప్పిన ఆ అంతరాన్ని అలానే శాశ్వతం చేసింది. సేవ చెయ్యడం, స్వధర్మం నిర్వర్తించి తరించడం వంటి విషయాలనే శ్లాఘించింది. గీతాసారం నుండి ప్రజలకు అందే సందేశం క్రియాశీలకమైన దృష్టి కాదు, కార్యాచరణకు నడిపించే మార్గం కాదు. సంఘర్షణ నుంచీ, సమస్యల నుంచీ పారిపోయి మానసిక ఊరట పొందే దారి అని ఆర్వియార్ అభిప్రాయం. మార్క్సిజం పోరాట మార్గంలో ఒడిదుడుకులు ఎదురైనా లక్ష్యశుద్ధి పోగొట్టుకోకుండా చేసే లక్షణాన్ని నేర్పుతుంది. భౌతిక, సామాజిక కార్యాచరణకు నడుం బిగించే స్థితప్రజ్ఞతను అలవాటు చేస్తుంది. సమాజంలో ఉన్న అంతరాలు పోతేగాని భౌతిక జీవితం సుప్రతిష్ఠితం కాదు. అందుకు వర్గచైతన్యం కావాలి. సాంఘిక సమానత్వం, సామ్యవాద వ్యవస్థ రావాలీ అంటే పరిస్థితి మారాలి. భగవద్గీత ఈ మార్గం చూపించలేదు. గీత ఇవాళ సాంఘికంగా నిర్వహించగలిగిన పాత్ర ఏమీ లేదు. ఆధునిక జీవిత సమస్యల పరిష్కారానికి ఆధునిక సిద్ధాంతాలు దోహదపడతాయి గాని, ఎంత ఘనకీర్తి గలవైనా పాత జీవిత దృక్పథాన్ని తవ్వి తలకెక్కించే సిద్ధాంతాలు కాదని ఆర్వియార్ నిశ్చితాభిప్రాయం. ఆయన వాదనతో అంగీకరించే వాళ్ళు, సంపూర్ణంగా విభేదించే వాళ్ళూ ఉండవచ్చు.

**లోకమందున మంచి చెడ్డలు లోకులెఱుగుదురా!**

ఈ రెండు పుస్తకాలు గురించి ఇంత విస్తృతంగా చెప్పడానికి కారణం ఆర్వియార్ ధిషణాశక్తిని, తార్కికపటిమను తెలియజేయడానికి మాత్రమే. ఈ విధంగా ఏ విషయాన్ని గ్రహించి చెప్పినా తన నిశిత పరిశీలన దృష్టితో నూతన ఆవిష్కరణ చేయడం ఆర్వియార్ ముద్ర. అందుకే సాహిత్యలోకంలో ఆయన అభిప్రాయం నికషోపలమైంది. విమర్శకుడుగా కూడా ఆర్వియార్ లబ్ధప్రతిష్ఠులు. ఏ పుస్తకాన్ని విమర్శ చేసినా సీమోల్లంఘన చేయని విమర్శకుడు. సదరు రచయిత సైతం ఆ విమర్శను అంగీకరించడం అందుకు నిదర్శనం. మనస్సుకు బాధ కల్గించే 'unkind critic' కాదు. నగ్నముని 'కొయ్య గుర్రం', ద్వానాశాస్త్రి 'ఆంధ్రసాహిత్య చరిత్ర' వంటివి ఉదాహరణలు. ఆంధ్రదేశంలో కవులకు, రచయితలకు లోటు లేదు. కాని మంచి అనువాదకులు మాత్రం అరుదు. ఆ లోటు తీర్చిన వారిలో ఆర్వియార్ ఒకరు. తెలుగు, ఇంగ్లీషు భాషలపై పట్టు, దేశకాల ఆచార వ్యవహారాలపై అవగాహన, భాషా పరమైన మర్యాదలపై అధికారత ఆయనను ఉత్తమ అనువాదకునిగా నిలబెట్టాయి.

దశాబ్దకాలంపాటు మాస్కోలో ఎన్నో పుస్తకాలను ఆంధ్రీకరించడం జరిగింది. ఆయా సందర్భాల్లో అవసరమైన చోట తెలుగు నేలకు, తెలుగు భాషకు తగ్గట్టుగా మూలాన్ని మార్చడం ఆయన విజ్ఞతకు నిదర్శనం. అనువాదం చేసేటప్పుడు ఎదురయ్యే సమస్యల్ని దృష్టిలో పెట్టుకుని 'అనువాదాలు – ఆవిష్కరణలు – అవస్థలు' అనే పుస్తకాన్ని వ్రాశారు. ప్రతి అనువాదకుడు, జర్నలిస్టు తప్పక చదవాల్సిన పుస్తకమిది. ఆర్వియార్ అనువాదాల్లో మార్క్సిస్టు గత తార్కిక సమస్యలు, ఎవరీ ఛత్రపతి శివాజి, మానవుడే మహాశక్తి సంపన్నుడు మొదలైనవి ముఖ్యమైనవి. పైన పేర్కొన్న అనువాద పుస్తకాలు చదువుతుంటే ఒక స్వతంత్ర రచన చదువుతున్న అనుభూతి కలుగుతుందే తప్ప అనువాదమనే ఆలోచనే రాదు. ఆర్వియార్ పేరు చెపితే ముఖ్యంగా గుర్తుకువచ్చేది "పనికొచ్చే ముక్క" శీర్షిక. విశాలాంధ్ర, ఆంధ్రభూమి వార్తాపత్రికల్లో కొన్ని వారాలపాటు (కాదు కాదు) సంవత్సరాలపాటు ఆ కాలమ్ ఎంతో సమర్థవంతంగా నిర్వహించడం జరిగింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాలపై ఆయన ఏం రాస్తారో అని పాఠకులు ప్రతీవారం నిరీక్షించే వాళ్ళు. ఆ శీర్షిక కోసం విశాలాంధ్ర దినపత్రికకు చందాదారులైన వాళ్ళు కూడా ఉండేవారంటే అతి శయోక్తి కాదు. కన్యాశుల్కం నాటకంలో కరటకశాస్త్రి శిష్యుడు, కాళిదాసు కుమారసంభవం చదువుతూ "పనికొచ్చే ముక్క ఒక్కటీ ఈ పుస్తకంలో లేదు" అన్నమాటలోని 'పనికొచ్చేముక్క' అన్న పదాన్ని శీర్షికగా తీసికొని ఎన్నో ఏళ్ళపాటు మనకెంతో పనికొచ్చే ముక్కల్ని ఆర్వియార్ అందించారు.

ఇరవయ్యో శతాబ్దాన్ని ప్రభావితం చేసిన 'తెలుగు కవులు' గురించి తన 100వ పుస్తకంగా ఆర్వియార్ అందించారు. లబ్ధప్రతిష్ఠులైన 11 మంది మన కవుల గురించి చక్కని వ్యాసాల సంకలనం ఈ పుస్తకం. అలాగే 2010లో విశాలాంధ్ర వారు ముద్రించిన 'ఆర్వియార్ సాహిత్య వ్యాసాలు', 1980లో ప్రొద్దుటూరు యుగసాహితి వారు ప్రచురించిన 'సాహిత్య తత్వం' మొదలైనవి ఆర్వియార్ సాహితీ ప్రస్థానంలో ముఖ్యమైనవి. ఆర్వియార్‌కు ఇష్టమైన పుస్తకం గురజాడ కన్యాశుల్కం. సందర్భం వచ్చినప్పుడు అందులోని మాటలను ఉటంకిస్తూ మాట్లాడడం ఆయనకు పరిపాటి. దానిపై చక్కని నోట్స్ కూడా తయారుచేశారు. కాని నేడు ఆ నోట్స్ ఏమైపోయిందోమరి! ఎవరైనా దాన్ని సేకరించి ముద్రిస్తే మేలు చేసిన వాళ్ళవుతారు.

సోవియట్ రష్యాలో దశాబ్దకాలంపాటు పనిచేయడం వల్ల సోషలిస్ట్ వ్యవస్థలోని మంచిచెడ్డలను చాలా దగ్గరనుంచి ఆయన పరిశీలించడం జరిగింది. తన అనుభవాల అక్షరరూపమే 'తొలగిన స్వర్గం'. ఆ వ్యవస్థలోని సుగుణాలను శ్లాఘిస్తూనే, లోపాలను కూడా నిర్మొహమాటంగా పేర్కొనడం జరిగింది.

అక్కడి విద్యా వ్యవస్థను, రవాణా వ్యవస్థను, మనుషుల మంచి తనాన్ని, అమాయకత్వాన్ని మెచ్చుకుంటూనే వారి బద్ధకాన్ని సున్నితంగా గర్హిస్తారు. అందుకు ప్రభుత్వం కల్పించిన విపరీత సాంఘిక భద్రత కారణమంటారు. ప్రజలందరినీ సోషలిస్టు నిర్మాణంలో భాగస్వాముల్ని చెయ్యలేకపోవడం, జీవితాన్ని సిద్ధాంత మూసలో పొయ్యడం, సాటి మనిషిని నమ్మలేని వాతా వరణం దాపురించడం, వ్యక్తికి సమాజానికి ఉండే సంబంధం ఏమిటో గ్రహించలేకపోవడం వంటి లోపాల వల్ల సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలు పతనం అయ్యాయం టారు. మొత్తం మీద సోషలిస్టు మానవుడి గురించి మనకు ఉన్న ఊహలు తప్పని సోవియట్ యూనియన్‌ని దర్శించేక తెలిసిందని ఆర్వియార్ పేర్కొనడం జరిగింది. సోవియట్ రష్యా గురించి సమగ్రంగా తెలుసుకోవాలనే వారికి 'తొలగిన స్వర్గం' కరదీపిక.

జూన్ 2006లో వెలువడిన 'కవి చౌడప్ప శతకం' (168 నీతి, శృంగార పద్యాలు-భావంతో) అన్న చిన్న పుస్తకం వెలువడడంలో ప్రచ్ఛన్నంగా ఆర్వియార్ హస్తం ఉంది. సంఘ దురాచారాలను తూర్పారబట్టిన చాటుకవి కుందవరపు చౌడప్ప. ఆయన పద్యాలలో బూతుల కంటే నీతులు, రీతులు ఎక్కువగా ఉన్నాయని, తెలియజెప్పేందుకే ఈ పుస్తకం. మహాకవి అన్నట్లు, కాదేదీ కవితకనర్హం.

ప్రవృత్తి రీత్యా మార్క్సిస్టు మేధావి, రచయిత అయినా వృత్తి రీత్యా ఆయన మంచి ఆంగ్లోపన్యాసకుడు. అనేకచోట్ల ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకునిగా పనిచేసి ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేశారు. ఆంగ్లభాషపై ఆయనకు ఉన్న అపారమైన పాండిత్యం అనితరసాధ్యం. విద్యార్థి లోకంపై ఉన్న ప్రేమవల్ల ఆయన పిల్లలకు ఉపయోగపడే అకడమిక్ రచనలు కూడా చేశారు. ఈజీ ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్, విశాలాంధ్ర ఇంగ్లీష్ గ్రామర్ & కాంపోజిషన్, ఆర్వియార్ ఇంగ్లీష్ గ్రామర్, ఇంగ్లీష్ – తెలుగు డిక్షనరీ మొదలైనవి. అనేక పునర్ముద్రణలు పొందిన ఈ పుస్తకాలు, విద్యార్థులకే కాక పెద్దలకు కూడా ఎంతో ఉపయోగపడుతున్నాయి.

ఇంత వరకు ఆర్వియార్ రచనలు గూర్చి స్థాలీపులాక న్యాయంగా వివరించడం జరిగింది. నేను స్పృశించని ఎన్నో పార్శ్వాలు, పుస్తకాలు ఇంకా మిగిలే ఉన్నాయి. పది మంది కలిసి చేయవలసిన పనిని ఒంటిచేత్తో నిర్వహించిన అసాధారణ మేధావి ఆర్వియార్. చాలా ఆత్మీయమైన వ్యక్తి. సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు భాషలనుండి ఎన్నో విషయాలు అలవోకగా వివరించగల ఆయన పాండితీగరిమ అబ్బురపరుస్తుంది. సద్యస్ఫురణ, ధారణ, వివరణ ఆయనకే సొంతం. ఆయనలా ఏ విషయాన్ని గురించి అయినా సాధికారంగా మాట్లాడగలిగిన వాళ్ళు సకృత్తుగా ఉంటారు. "గురూణాం గురుః" అన్న వాక్కుకు నిలువెత్తు సాక్ష్యం ఆర్వియార్. మూడు, నాలుగు పరిశోధనా వ్యాసాలకు చాలినంత విషయాన్ని ఆయన మనకు మిగిల్చి వెళ్ళిపోయారు. (ఈ పని విశ్వవిద్యాలయాలు స్వీకరిస్తే బాగుండును.)

**నిరంతర పఠనం, రచనా వ్యాసంగం ఆర్వియార్ ప్రవృత్తి. తాను చేస్తున్న పని మీదనే ఆయన దృష్టి. పదవులు, బిరుదులు, సత్కారాలు ఆశించని వ్యక్తిత్వం ఆర్వియార్‌ది. అభ్యుదయ రచయితల సంఘ కార్యవర్గ సభ్యునిగా కొనసాగారు. నిబద్ధత కలిగిన మార్క్సిస్టు మేధావి. తాను నమ్మిన సిద్ధాంతాన్ని కడదాకా ఆచరించిన హేతువాది. తెలుగు, ఇంగ్లీషు, సంస్కృత భాషలలో అపారమైన పాండిత్యం ఆయన సొంతం. అందుకే ఆయన సాహితీ సింధువు.**

ఆయన ప్రతిభకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు అందుకొ న్నారు. శ్రీ పులుపుల వెంకట శివయ్య స్మారక పురస్కారం, శ్రీ ఏటుకూరి బలరామమూర్తి స్మారక అవార్డు, 2003లో ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం 'తెలుగు భాషా పురస్కారం' మొదలైనవి. ఆయన మరణానంతరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించింది. తెలుగు సాహిత్యంలో అందునా రచయితలలో ఇటువంటి విజ్ఞానమూర్తులు అరుదు. ❑

# అనువాద ఉద్దండుడు ఆర్వియార్

**సాహిత్య పరామర్శ**



- భండారు శ్రీనివాసరావు

ఎనభయ్యవ దశకం చివర్లో, నేను మాస్కో రేడియోలో పని చేస్తున్న కాలంలో అక్కడ చదువుకుంటున్న ప్రతి తెలుగు పిల్ల వాడికీ తెలిసిన పేరు ఆర్వియార్. కానీ ఆయన్ని వాళ్ళెవ్వరూ ఆ పేరుతో పిలవరు. అందరికీ ఆయన మేస్టారే. కానీ ఆయన పాఠాలు చెప్పే మాస్టారు కాదు. విద్యార్థులలో ఒక విద్యార్థిగా కలిసిపోయి, వారితో కూర్చుని హాయిగా కలగలుపుగా ముచ్చట్లు చెప్పే ఆర్వియార్‌లో వారికి ఒక గురువుగారే కాదు ఒక 'యార్' (మిత్రుడు) కూడా కనిపించేవారు. వారాంతం వచ్చిందంటే చాలు, వాళ్ళందరూ పొలోమని అంతా వాళ్లింట్లో వాలిపోయే వాళ్ళు. ఆర్వియార్ గారి భార్య సుందరమ్మ గారిని చూస్తుంటే, 'వండనలయదు వేవురు వచ్చిరేని.. అన్నపూర్ణకు నుద్దియౌ అతని గృహిణి' అని మనుచరిత్రలో ప్రవరాఖ్యుడి భార్య గురించి చదువుకున్న పద్యం గుర్తుకు వచ్చేది. ఆ అన్నపూర్ణ నిలయంలో ప్రతి రోజూ ఎంతమందో సుందరమ్మ గారి చేతివంట రుచి చూసి వెళ్ళేవారు. ఆర్వియార్ గారి ముచ్చట్లు, సుందరమ్మగారి చేతి వంటలు వినీ, తినీ భుక్తాయాసంతో వెనక్కిమళ్లడం నాకింకా గుర్తు. ఇక ఆ మాస్టారు ఉన్నారే ఆయన సామాన్యుడు కాదు. ఆర్వియార్‌గా తెలుగు సాహితీ లోకంలో సుప్రసిద్ధ గ్రంథ విమర్శకుడిగా ప్రసిద్ధి చెందిన రాళ్ళభండి వెంకటేశ్వరరావు గారు. (రాల్లభండి అనే ఇంటి పేరులో, 'భ' వత్తు 'భ' అని మరీ వత్తి వత్తి చెప్పేవారు) మాస్కోలో మాత్రం ఆయన పేరు ఆర్వియార్. రాదుగ ప్రచురణ విభాగంలో పనిచేసి, అనేక సోవియట్ కథలను, నవలలను తెలుగులోకి అనువదించిన ఉద్ధండుడు. (సుప్రసిద్ధ రచయిత రాహుల్ సాంకృత్యాయన్ మీది అభిమానంతో తన ఏకైక పుత్రుడికి ఆ పేరే పెట్టుకున్నారు)

## ఇక అనువాదాల విషయానికి వస్తే

'అనువాదం ముఖ్యోద్దేశం అర్థం కావడం' అనేవారు పద ప్రయోగ దురంధరులు అయిన ఆర్వియార్. నా మాస్కో రేడియోలో ఉద్యోగ పర్వంలో ఈ అనువాద సమస్యలు నాకూ ఎదురయ్యాయి. ప్రతిరోజూ ఓ గంట వ్యవధికి సరిపోను రేడియో కార్యక్రమాలను తెలుగులో రూపొందించాల్సిన బాధ్యత నాపై వుండేది. రష్యన్ రేడియో అధికారులు కార్యక్రమాల మూల ప్రతిని ఇంగ్లీష్‌లో ఇచ్చేవారు. దాదాపు ఎనభయ్‌కి పైగా ప్రపంచ భాషలకు ప్రాతినిధ్యం వహిస్తూ అక్కడ పనిచేసే మేమందరం వాటిని ఎవరి భాషలోకి వాళ్ళం అనువాదం చేసుకుని ప్రసారం చేసేవాళ్ళం. నాటి కమ్యూనిస్టు ప్రభుత్వం తాలూకు భావ జాలాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసుకోవడం కోసం ఈ ఏర్పాటు. అందువల్ల కొన్ని కొరుకుడు పడని వాక్య నిర్మాణాలు, పదజాలాలు అక్కడ పనిచేసే వాళ్లకు కాస్త ఇబ్బందికరంగా వుండేవి. ఈ నేపథ్యంలో, ఆర్వియార్ గారు(ఇప్పుడు కీర్తిశేషులు) నాకు 'అనువాద సమస్యలు' అనే పుస్తకాన్ని కానుకగా ఇచ్చారు.

'రారా' గా ప్రసిద్ధులయిన రాచమల్లు రామచంద్రారెడ్డి గారు రాసిన ఈ పుస్తకానికి సాహిత్య అకాడమీ పురస్కారం కూడా లభించింది. (రెడ్డి గారు కూడా అనేక సంవత్సరాలపాటు మాస్కోలో అనువాదకుడిగా పనిచేశారు) అనువాద సమస్యలు అన్నింటికీ ఈ పుస్తకం పరిష్కారం చూపలేకపోవచ్చు కాని అనువాదాల పట్ల అనురక్తి వున్న ప్రతి ఒక్కరు చదవదగ్గ పుస్తకం అని నా ఉద్దేశ్యం. అనువాదం ఎలా చేయాలో, ఎలా చేస్తే మూలానికి దూరం జరగకుండా చదువరికి అర్థం అయ్యేలా సుబోధకంగా అనువాదం ఎలా చేయొచ్చో తెలుసుకోవాలంటే ఈ పుస్తకం చదివి తీరాలి. మాస్కోలో వారాంతపు రోజుల్లో సాయం కాలక్షేపాలు చేసేటప్పుడు, నాకూ ఆర్వియార్‌కు నడుమ తెలుగు భాష, అనువాదాలకు చెందిన అనేక విషయాలు దొర్లేవి. ఆయన అనేక కబుర్లు ఆసక్తికరంగా చెప్పేవారు. 'పరమహంస విద్యానాథ స్వామివారు, షేక్స్పియర్ పేరుని 'శూలపాణి' అని అనువదించారుట. కందుకూరి వీరేశలింగం గారి స్వీయ చరిత్రలో, డిస్ట్రిక్ట్ జడ్జికి 'ప్రాడ్వివాకుడు' అని, మెయిన్ రోడ్‌కి 'ప్రధాన రధ్య' అనీ, రైల్వే లైన్‌కి ఇనుపదారి, అయోమార్గం అనీ ఇలా అనువాదాలు కనిపిస్తాయి. కట్టమంచి రామలింగారెడ్డి గారు కూడా హోం వర్క్ కి 'గైహికము' అనీ, డిక్టేషన్‌కి 'ఉక్త లేఖనం' అనీ తెలుగు పదాలు ఇచ్చారట.

అయితే, ఈ తెలుగు ప్రయోగాలకంటే, ఆ ఇంగ్లీష్ పదాలే వాడుకలో ప్రాచుర్యం పొందాయి. వాటి అర్థం అందరికీ తెలిసేటప్పుడు ఇక అయోమయ పద కల్పన ఎందుకన్నది ఆర్వియార్ అభిప్రాయం. విద్యార్థి కల్పతరువు అనే పుస్తకం వుంది. ఇప్పుడు దొరుకుతున్నదో లేదో తెలవదు. అందులో ధర్మామీటర్ (తాపమానిని), కెమెరా (ఛాయాగ్రాహక యంత్రం), టెలిగ్రాఫ్ (తాజావార్తా యంత్రం), ఇలా అర్థ వివరణ ఇచ్చారు. అయితే అర్థం అవడం ముఖ్యమా అనువాదం ముఖ్యమా అనే

ప్రశ్నకు జవాబు దొరకాలి. సర్వీస్ కమీషన్‌కి తెలుగేమిటి? దాన్ని మక్కికి మక్కి అనువాదం చేసి అదే ప్రశ్న అడిగితే 'ఎవరికీ ఉద్యోగాలు రావు' అనేవారు రాళ్ళభండి వెంకటేశ్వరరావు గారు.

90 దశకం పూర్వార్ధంలో కన్నుమూసిన సుబ్రహ్మణ్యం గారు నయాగరా కవిత్రయంలో ఒకరు. మిగిలిన ఇద్దర్లో ఒకరు బెల్లంకొండ రామదాసు గారు కాగా మరొకరు వచన కవి కుందుర్తి ఆంజనేయులు గారు. ఏల్చూరి సుబ్రహ్మణ్యం గారి తమ్ముడు ఏల్చూరి విజయరాఘవరావు గారు ప్రముఖ వేణుగాన విద్వాంసులు. కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ లోని ఫిలిమ్స్ డివిజన్‌లో చాలా కాలం మ్యూజిక్ కంపోజర్ గా పనిచేశారు. సుబ్రహ్మణ్యం గారి కుమారుడు మురళీధర రావు గారు న్యూఢిల్లీలో ప్రొఫెసర్. తెలుగులో నడిచే నిఘంటువుగా పేరు తెచ్చుకున్నారు. సుబ్రహ్మణ్యం గారు చాలా కాలం మద్రాసులో సోవియట్ భూమి తెలుగు విభాగంలో పనిచేశారు. బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు గారు, శెట్టి ఈశ్వర రావు గారు, తాపీ మోహనరావు గారు (తాపీ ధర్మారావు గారి తనయుడు) ఆయనకు సహచరులు. శ్రీశ్రీ, ఘురుఖ్ శాస్త్రి గార్లకు సుబ్రహ్మణ్యం గారు సన్నిహిత మిత్రులు. వారి నడుమ సంభాషణలు కవితాత్మకంగా, కొండొకచో రసాత్మకంగా వుండేవని చెప్పుకునేవారు. ఒకసారి శ్రీ శ్రీ సుబ్రహ్మణ్యం గారి గురించి చెబుతూ ప్రాసక్రీడల్లో అనుకుంటాను.

"ఏ సోడా! ఏ నీళ్ళూ వీసం కూడా కలపక సౌనాయాసంగా విస్కీ సేవించే ఏసుకు ..." అని ఆశువుగా ఆలపించారు. ఇక్కడ సౌనాయాసంగా అంటే సునాయాసంగా – ఏసు అంటే ఏల్చూరి సుబ్రహ్మణ్యం. అలా వుండేదన్న మాట మహాకవితో ఆయన గారికున్న సాన్నిహిత్యం. సుబ్రహ్మణ్యం గారు మద్రాసులో వున్నప్పుడు రాళ్ళభండి వెంకటేశ్వరరావు (ఆర్వియార్) గారు పాస్ పోర్ట్ పనిమీద అనుకుంటాను అక్కడికి వెళ్లారు. ఆయన మద్రాసు వెళ్ళినప్పుడు సుబ్రహ్మణ్యం గారిని కలిసారు. పక్కన వున్న శెట్టి ఈశ్వర రావుగారు 'జగమెరిగిన బ్రాహ్మణుడు' అంటూ సుబ్రహ్మణ్యం గారిని ఆర్వియార్ గారికి పరిచయం చేయబోయారు. 'అదేమిటండీ అలా అంటారు చొక్కా లోపల నుంచి జంధ్యం అలా కనబడుతుంటేనూ' అని ఆర్వియార్ గారు తన సహజ శైలిలో అనేసారుట – 'జగమెరిగిన బ్రాహ్మణుడికి జంధ్యమేలా?' అన్న నానుడిని గుర్తు చేస్తూ.

సుబ్రహ్మణ్యం గారి వియ్యంకులు ధనికొండ హనుమంతరావు గారికి మద్రాసులో తెలుగు ముద్రణాలయం వుండేది. ఎవరయినా రచయిత పుస్తకం అచ్చుపని ఎప్పుడు పూర్తవుతుందని అడిగితే ఆయనకు చర్రున మండుకొచ్చేదిట. 'ఏమిటయ్యా హడావిడి. బట్టలు ఇస్త్రీకి ఇచ్చినప్పుడు వాళ్ళు ఎప్పుడు ఇస్తే అప్పుడే కట్టుకోవాలి కాని ఇలా వెంటపడితే ఎలా' అనేవారని ఆర్వియార్ గారు చెప్పారు.

అన్నట్టు, ఆర్వియార్ గారు కూడా మాస్కో రేడియోలో ఆపద్ధర్మంగా వార్తలు చదివేవారు. రష్యన్–తెలుగు డిక్షనరీ కూడా తయారు చేశారు. వ్యాపారపు పనుల మీదా, ఇస్కస్ (ఇండో సోవియట్ కల్చరల్ సొసైటీ) ఆహ్వానం మీదా సోవియట్ యూనియన్ సందర్శించే తెలుగు వారికి ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా వుండేది. ❑



ఆర్వియార్ ఇంట 'పండనలయదు వేవురు వచ్చిరేని..
అన్నపూర్ణకు నుద్దియౌ అతని గృహిణి'
సుందరి గారితో మాస్కో విద్యార్థి బృందం

# అరసం మణిపూస ఆర్వియార్

## సాహిత్య పరామర్శ



- గుజ్జుల ఓబులేసు

శతాధిక గ్రంథకర్త, అనువాద చక్రవర్తి, విశాలాంధ్రలో 'పనికొచ్చేముక్క' శీర్షిక ద్వారా రాష్ట్రమంతటా ఆర్వియార్ పేరుతో మార్మోగిన పెద్దలు ఆర్.వెంకటేశ్వరరావు చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయారు. డిసెంబరు 16 ఉదయం అనగా వెళ్లి పోతే సాయంత్రము వరకు గాని నాకు తెలియకపోయింది. మరుసటి రోజు ప్రొద్దున్నే పెద్దలందరితో కలిసి మల్కాజిగిరి ఆయన ఇంటికి వెళ్లి చూశాను. అభ్యుదయాన్ని సాంప్రదాయ వాదం చుట్టేసినట్లుంది. అక్కడి వాతావరణం. ఇంతలోనే కాదు అంటూ ప్రజా సాహిత్యం వర్ధిల్లాలి-మార్క్సిజమ్-వర్ధిల్లాలి-అభ్యుదయ రచయితల సంఘం-వర్ధిల్లాలి,-జోహారు-ఆర్వియార్ అనే నినాదాలు గుప్పుమని సాంప్రదాయ పద్ధతిని కప్పేశాయి. అటు నుంచి బన్సీలాల్ పేట శ్మశానవాటికకు చేరుకొని అక్కడి పరిస్థితిని చూస్తే- 'ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలం నిప్పులలో గరగిపోయే' అన్న జాషువా పద్యం గుర్తుకు వచ్చింది. ఆ ఆలోచనలు ముసురునుంచి తేరుకోక ముందే అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రముఖులు సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, చరిత్ర పరిశోధకులు వకుళాభరణం రామకృష్ణ, అరసం నాయకులు డా॥ యస్వీ సత్యనారాయణ, పెనుగొండ లక్ష్మీనారాయణ, 50 ఏండ్ల కమ్యూనిస్టు ఉద్యమంలో సాహిత్య, సాంస్కృతిక రంగానికి వారధిగా ఉన్న కందిమళ్ళ ప్రతాపరెడ్డి, డి.వి.వి.యస్.వర్మ, ఆయన శిష్యులు ఢిల్లీ నుంచి వచ్చిన వారు సంతాప సూచకంగా ఒక్కొక్కరూ పొడి పొడిగా మాట్లాడినా ఎంతో గంభీరంగాను లోతుగానూ ఆర్వియార్‌ను పరిశీలించినట్లు తోచింది. వారంతా తలో జ్ఞాపకాన్ని నెమరు వేసుకుంటుంటే నా మదిలో అనేక ఆలోచనలు మెదిలాయి. ఆర్వియార్ మాస్టారు 1968 నుంచి 1974 దాకా కడపలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే కడపలో 3 రోజులపాటు 'సాహిత్య విమర్శనా' సదస్సు జరిగింది. డిగ్రీ చదువుతూ ఏఐఎస్ఎఫ్ కార్యకర్తగా ఆ సభల్లో వాలంటీరుగా పాల్గొని అనేక మంది ఉద్దండులు వివిధ ప్రక్రియలపై ఇచ్చిన ఉపన్యాసాలు-సమర్పించిన పత్రాలు ఎంత విజ్ఞాన దాయకమైనవో, ఎంత విలువైనవో ఆ రోజు మాకు అంతగా తెలియలేదు. ఆర్వియార్ గారు తర్వాత దశలో ప్రొద్దుటూరులో జరిగిన సిపిఐ కడప జిల్లా మహాసభలో 'ఆరు పదుల ఆదర్శం' పుస్తక ఆవిష్కరణ అభినందన సభలో పాల్గొనడానికి వచ్చినప్పుడు ఐ.సుబ్బారెడ్డి, సొదుం జయరాం, కేతు విశ్వనాథ రెడ్డి సమక్షంలో పాత స్మృతులను గుర్తుకు తెచ్చుకొనే సందర్భంలో ఆర్వియార్ ఎన్‌సైక్లోపీడియా అర్థమైంది. ఈ మధ్య 4ఏండ్ల క్రితం 2008 కడపలో 2 రోజుల పాటు అరసం రాష్ట్ర మహాసభలు రా.రా.(రాచమల్లు రామచంద్రారెడ్డి) ప్రాంగణంలో, గజ్జెల మల్లారెడ్డి వేదిక, వై.సి.వి.రెడ్డి నగర్లో జరిగినప్పుడు వారితో ఆయనకున్న అనుబంధాన్ని కడప క్షేత్రంగా చేసిన సాహిత్య సేద్యంలో నడచిన సాహిత్య త్రైమాసిక పత్రిక 'సంవేదన'లో ఆయన నిర్వహించిన ప్రధాన భూమిక గురించి పాత్రికేయుల సమావేశంలో చెపుతూ వుంటే ఆ గడ్డ బిడ్డలంగా, ఆ ఉద్యమంలోంచి వచ్చిన వారిగా ఎంత సంతోషపడ్డామో మాటల్లో చెప్పలేము. వ్యక్తిగతంగా మల్లారెడ్డితో ఆర్వియార్ ఎంతసన్నిహితంగా, ఆత్మీయంగా ఉండినా ఆయన కవిత్వాన్ని పరామర్శించినప్పుడు సమీక్షించినప్పుడు శంఖారావాన్ని మాత్రా బద్ధ శంఖారావంగానే నిర్మోగమాటంగా చెప్పారు. ఇక రా.రా. తో అయితే ఆర్వియార్ సంబంధం-సాహిత్య బాంధవ్యం గురించి చెప్పాలంటే (మాస్కో ప్రగతి ప్రచురణలు, సోవియట్ ప్రచురణల) అనువాదాల గురించి - రామప్పనాయుడు, లచ్చప్ప, డి.శివారెడ్డి, ఐ.సుబ్బారెడ్డిగార్ల చర్చల్లో రా.రా, ఆర్వియార్ల ప్రస్తావన - కడప ఎడిటర్స్ కాఫీ క్లబ్‌లో జరిగిన రచయితల గోష్ఠుల గురించి ముచ్చటించు కోవడానికి రోజులు చాలవు. యాదృచ్ఛికం కాకపోతే గజ్జెల మల్లారెడ్డి, ఆర్వియార్, రా.రాలు ముగ్గురు భాగ్యనగరిలోనే తనువు చాలించి వారి కమ్మని కలాల్ని మూగపోయేటట్లు చేశారు. మార్క్సిజం మానవుల్ని మహోన్నతులుగా, క్రాంతదర్శులుగా, పురోగామి శక్తులుగా తయారు చేస్తుందంటే ఇదేనేమో. తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమం ఎన్ని కొత్త పుంతలు తొక్కిందో -ఎందర్ని గొప్ప కళాకారులుగా, రచయితలుగా, కవులుగా తీర్చి దిద్దిందో చరిత్రను మననము చేసుకుంటే నూతనోత్తేజం కల్గుతుంది. అందులో ఆర్వియార్ పాత్ర విస్మరించలేనిది. అరసం 3 మూల స్థంభాల్లో ఆర్వియార్ ఒకరు. రెండో తరంలో రాంభట్ల క్రిష్ణమూర్తి, రా.రా. గజ్జెల మల్లారెడ్డి, ఏటుకూరి ప్రసాద్, డా కేతు విశ్వనాథరెడ్డి, డా॥ వి.సంజీవమ్మ సహకారంతో నేటితరం అరసం నాయకులు డా॥ యస్వీ సత్యనారాయణ, పెనుగొండ లక్ష్మినారాయణ, రాచపాళెం, వేల్పులతోను పనిచేసిన గొప్ప

సహృదయుడు, స్నేహశీలి. చేయి తిరిగిన కథారచయితల, కలం పరవళ్ళు త్రొక్కే కవితామూర్తుల, అనువాద దిగ్గజాల, (చాసో, కొ.కు, శ్రీ.శ్రీ.రా.రా) అనుభూతులను, రచనా సంవిధానాల్ని అలవోకగా అర్థం చేసుకొన్నారు. గురజాడ, చలం లను లోతుగా పరిశీలించారు. ప్రబంద సాహిత్యం, పురాణ సాహిత్యం, ఆధునిక సాహిత్యాన్ని మదింపు చేసారు. రా.రా. చెప్పినట్లు అనువాదం కత్తి మీద సాము. అనువాదం చేయాలంటే బైబిల్ నుంచి భారతం వరకూ అన్నింటిలో ప్రవేశం ఉండాల్సిందే. వాటి మూలాల్లోకి వెళ్ళ గలిగితేనే అనువాదం చేయ డానికి వీలవుతుంది. చేసిన దానికి లంకె కుదురుతుంది. ఇది సరిగ్గా ఆర్వియార్‌కు అతుకుతుంది. ఆర్వియార్ అనువాద రచనలు గానీ, సొంత రచనలుగానీ చదివితే మనకు సమాజాన్ని ఒక కొత్త కోణం నుంచి అర్థం చేసుకోవడానికి ఉపయోగ పడుతుంది. యుగకర్త శ్రీ.శ్రీ పుస్తకాన్ని ఇటీవలే వెలువరించారు. మహా ప్రస్థానం, ఖడ్గ సృష్టి, మరో ప్రస్థానంల యొక్క విలువ, సాధికారత ఎప్పటికీ తరగదనే సత్యవాణిని ఎంతో చక్కగా విన్పించారు. డా॥ టి.మాచిరెడ్డి దాన్ని హిందీలోకి అనువదించారు. 1990 దశకం నుంచి వివిధ పత్రికల్లో రాసిన వ్యాసాలను 'ఆర్వియార్ సాహిత్య వ్యాసాలు' పేరుతో గొప్పవ్యాస సంపుటిని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ద్వారా వెలువరించారు. అందులో 28 వ్యాసాలు ఉన్నాయి. దేనికి అదే ఒక మచ్చు తునక. ఇంత మంది గొప్ప వారిని ఇంత నిశితంగా సామాజిక కోణం నుంచి సాహిత్య కోణం నుంచి ఎంత గొప్పగా విశ్లేషించారో ? ఆ పుస్తకం చదివితే కథా ప్రక్రియను, వచనాన్ని, కవిత్వాన్ని, అనువాద సాహిత్యాన్ని, స్త్రీ, దళిత సాహిత్యాన్ని, విప్లవ కవిత్వాన్ని, భావవాద, అభ్యుదయ వాదాల్ని ప్రజల పక్షాన ఎంత చక్కగా పరికించి–పాఠకుల హృదయానికి, మేథకు పదును పెట్టాడబ్బా అని అనిపిస్తుంది. సాహిత్యానికి సద్విమర్శ కరదీపిక. సరైన విమర్శ లేకపోతే చవకబారు విమర్శలదే పైచేయి అవుతుంది. దీనివల్ల సాహిత్య ప్రయోజనమే దెబ్బ తింటుంది. అంచేత ఉత్తమ సాహిత్య సృష్టికి ఉత్తమ విమర్శ నిర్దేశకంగా ఉంటుంది. విమర్శలో మొహమాటాలు, నీళ్ళు నమలడాలు ఉండకూడదు. పాక్షికత అసలు పనికిరాదు. ఉత్తమ సాహిత్యం, ఉత్తమ విమర్శ ఉన్నపుడే సమాజానికి మేలు జరుగుతుంది అన్న రా.రా. సిద్ధాంతాన్ని ఆర్వియార్ ఒంట బట్టించుకున్నారు. ఇది ఆయన సమీక్ష వ్యాసాల్లో అడుగడు గునా మనకు అగుపిస్తుంది. అందుకేనేమో ఆధునిక సాహిత్యం లో కవిత్వానికి శ్రీ.శ్రీ, వచనానికి కొడవటిగంటి పథనిర్దేశకులైతే, విమర్శకి రా.రా. అని ఆర్వియార్ తెగేసి చెప్పారు. కరువు సీమ, వెనకబడిన రాయలసీమ పట్ల ఆర్వియార్‌కు ఎంతటి ప్రేమ, వాత్సల్యమో 'సీమ బంధం' చదివితే ఇట్లే అర్థమవుతుంది మాస్టారు విశ్రాంత జీవితం మల్కాజిగిరిలో ఒంటరిగానే సాగింది. ఎప్పుడన్నా సమావేశాలు, సభల్లో కలిస్తే వెంటనే వెళ్లిపోవాలి. అమ్మగారి ఆరోగ్యం బాగా లేదని చెప్పేవారు. నేను వచ్చి దిగబెడుతాలేవోయ్ అని కేతు విశ్వనాథరెడ్డి బలవంతం చేస్తే, అయిష్టంగానే కాసేపు ఉండి వెళ్లిపోయేవారు. అరసం నేతలతోనే కాక విరసం ఇంకా ఇతర రచయితలతో కూడ మంచి సాన్నిహిత్యాన్ని పాటించేవారు. కవులం, రచయితలం కాకున్నా కళాభిమానం, సాహిత్యాభిలాష ఉన్న మా లాంటి చిన్న వారితో కూడ ఎంతో స్నేహంగా, ఆత్మీయంగా ఉండగల్గిన సహృదయుడు ఆర్వియార్. నిజంగా అరసానికి ఆయనొక మణిపూసలాంటి వాడు. అప్పుడే వెళ్లిపోవడం విషాదమే. తీరనిలోటు కూడా. రాంభట్ల, ఆర్వియార్ రా.రా.లను, వారి స్మృతులను భద్రపరచి భావితరాలకు అందించడమే అరసం, అభ్యుదయ సాహిత్యోద్యమం యొక్క కర్తవ్యంగా ఉండాలి. అదే ఆర్వియారు అర్పించే నివాళి. ❑

# కమ్యూనిస్టు పార్టీ ప్రవేశ పెట్టిన నూతన ధోరణలు

సాంఘికంగా కమ్యూనిస్టు పార్టీ వివాహవ్యవస్థ విషయంలో, స్త్రీ పురుష సంబంధాల విషయంలో అనేక నూతన ధోరణులని ప్రవేశపెట్టింది. మంత్రతంత్రాలకీ, హంగు ఆర్భాటాలకీ తావులేని వివాహ పద్ధతిని జనంలో ప్రాచుర్యం చేసింది. 'దండల పెళ్లి 'కమ్యూనిస్టు పెళ్లి' అని పేర్లు సంతరించుకున్న యీ నూతన ధోరణి కమ్యూనిస్టు కార్యక్రమంలో భాగంగా వుండేది. అంతేకాక స్త్రీ, పురుష సంబంధాలకు ఆత్మీయాను రాగాలు ముఖ్యం కాని అంతస్తులు, ఆస్తులు కావని తెలియచెప్పింది. కులాంతర వివాహాలు యివాళ ఏ విధమైన వింతగానూ లేకపోవడానికి ఆనాడు కమ్యూనిస్టు పార్టీ అనుసరించి అమలు జరిపిన ఆచారమే నాంది. సమాజంలో అట్టడుగున అణగారిన వర్గాలకు సాంఘికంగా ఒక హోదానీ, ఆత్మగౌరవాన్నీ కలిగించిందీ కమ్యూనిస్టు పార్టీయే. ఆ వర్గాలకు పైవాళ్లు ఏదో ప్రాపకంగా ఆసరా అందిస్తున్నట్లుగానే కాక, వాళ్ల సామాజిక హక్కుగా సమానత్వాన్ని కలిగించాలన్న దృష్టిని కమ్యూనిస్టు పార్టీయే అందించింది.

ఆర్వియార్ సాహిత్య వ్యాసాల నుండి..

# వయోజన విద్యకు ఆర్వియార్ సేవలు

సాహిత్య పరామర్శ



- డాక్టర్ కృష్ణమోహన్‌రావు

అక్షరాస్యత, వయోజన విద్యకు ఆర్వియార్ చేసిన కృషి చాలా మందికి తెలియదు. వారు ఈ రంగంలో రెండు రకాలుగా సేవ చేశారు. మొదటిది పశ్చిమగోదావరి జిల్లాలో ప్రయోగాత్మకంగా తయారుచేసిన అక్ష రాస్యతా వాచకం. ఈ పుస్తక రూపకల్ప నలో డి.వి.వి.ఎస్.వర్మ, కేతు విశ్వనాథ రెడ్డి గార్లతో కలిసి ఆర్వియార్ గారు కీలకపాత్ర వహించారు. దీనిలో మొద టిసారిగా చదవడం, రాయడం వేర్వేరు వాచకాలు ప్రవేశపెట్టారు. ముందు చదవటం, తర్వాత రాయడం నేర్ప డానికి ఒక ప్రయత్నం జరిగింది. అప్పటి వరకు వయోజన విద్యా రంగంలో వాడుతున్న వాక్య పద్ధతిలో కాకుండా ప్రజలకు అలవాటైన అక్షర పద్ధతిలో ఈ వాచకాలు తయారు చేశారు. తెలుగులోని 56 అక్షరాలను ఒకేసారి కాకుండా దశలవారీగా ప్రవేశ పెట్టారు. రెండోది వయోజన విద్యారంగంలో ప్రపంచంలోనే అతి ముఖ్యమైన పుస్తకం పాలో ఫ్రెయిరె రచించిన 'పెడగాజీ ఆఫ్ ద అప్రెస్డ్' పుస్తకాన్ని 'విముక్తి-విద్య' పేరుతో తెలుగులో అనువదించారు. వర్గ సమాజాలలో ప్రజా విముక్తి కోసం పోరాడే వారందరూ అవశ్యంగా అర్థం చేసు కోవలసిన ముఖ్యాంశాలను ఫ్రెయిరె ఆచరణాత్మక అనుభవంతో వివరించారు. ఒక విధంగా చెప్పాలం టే ఈ పుస్తకం రాజకీయ, సామాజిక, మనస్తత్వ, విద్యా సంబంధమైన సమస్య లను ఏకసూత్రంతో విశ్లేషిస్తుంది. ఈ పుస్తకాన్ని అనువదించడం చాలా కష్టం. తత్వశాస్త్రంతోనూ, విద్యా రంగంపైన సమగ్ర అవగాహన గల వ్యక్తులు మాత్రమే దీన్ని చేయగలరు. ఈ విషయాన్ని గుర్తించి ప్రజాశక్తి ప్రచురణ సంస్థ వారు ఆర్వియార్ గారిని ఈ పుస్తక అనువాదం చేయవలసిందిగా కోరడం, వారు ఈ బాధ్యతను చేపట్టి 2002లో ఈ అనువాదం చేశారు. ఈ రకంగా విద్యా తత్వవేత్తలను విశేషంగా ఆకర్షించిన గొప్ప గ్రంథం తెలుగు పాఠకులకు అందుబాటులోకి వచ్చింది. వామ పక్ష మేధావులు, సామాజిక కార్యకర్త లు, విద్యావేత్తలు ఈ పుస్తకాన్ని వయో జన విద్య పట్ల సమగ్ర అవగాహనకు కరదీపికగా పరిగణిస్తారు. ఈ పుస్తకం కేవలం విద్యా బోధనకి కాకుండా ప్రజల విముక్తి కోసం పోరాడే వాళ్ళ వైఖరి ఎలా ఉండాలో వివరిస్తుంది. పీడక సమాజంలో పీడనకు గురవుతున్న వాళ్ళ మనస్తత్వాలలో వచ్చే మార్పులను విశ్లేషిస్తుంది. పీడితులు తమ స్థితిని గుర్తించి మార్పు కోసం పోరాడే చైతన్యం సంతరించుకోవాలంటే వారితో సంభాషణ తప్ప మార్గం లేదని, సంభాషణ సంస్కృతిని ప్రబోధిస్తుంది. ప్రజల విమోచన కోసం పోరాడాల నుకునేవారు ఆ పనికి ప్రజలను సన్నిద్ధం చేయాలంటే వారు ప్రజల నుంచి నేర్చుకోవాలి. దాన్ని తిరిగి ప్రజల వద్దకు తీసుకెళ్లాలి. దాన్నే ఫ్రెయిరే 'సంభాషణ సంస్కృతి' అన్నాడు. ఆయన సూత్రాల్లోకెల్లా ఇది అతి ప్రధానమైనది. ప్రపంచం ఎప్పుడూ మారిపోతూనే ఉంటుంది. ఆ మార్పును పసిగట్టాలంటే జనంతో ప్రత్యక్ష సంబంధం, సంభాషణ ఉండి తీరాలి. పీడిత ప్రజలతో సంభాషణ జరుపుకుండా ఎవరూ వారికి విముక్తి ప్రసాదించలేరు. వాళ్ల జీవిత వాస్తవాన్ని వాళ్ళ అనుభవం ద్వారానే తెలియజేసినప్పుడు కదలిక ప్రారంభ మవుతుంది. ఎందుకంటే ప్రజలు తమ పరిస్థితిని గుర్తించలేనంతగా వర్తమానం లో కూరుకుపోయి ఉంటారు. పాలక వర్గం కల్పించిన అనేక వక్రీకరణలు వారిపై ప్రభావం చూపుతుంటాయి. సంభాషణ ద్వారా దాని నుంచి బయటికి లాగాలి. అధ్యయనం ఆచరణలు సమ్మేళనంతో వారిని ముందుకు నడపాలి. ప్రపంచంలోనే అనేక దేశాల్లో ముఖ్యంగా లాటిన్ అమెరికన్ దేశాలైన బ్రెజిల్, చిలి, క్యూబా నికార్గువ వంటి దేశాల్లో ఈ పద్ధతిని అవలంబించి విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారు. మన దేశంలో అనేక స్వచ్ఛంద సంస్థలు ఈ విధానాన్ని పాటిస్తున్నాయి. ❑




మేలు మరవని
పిచిక


రంగురంగుల
చేపలు


అడవిలో
ఇళ్లు


ఇద్దరు
మిత్రులు
నీతి కథలు

# పిల్లల పుస్తకాలు


టి. మకారొవా
ధైర్యంగల
చీమ




నొప్పిడాక్టరు


అలెక్సేయ్ తాల్‌స్తోయ్
బంగారు తాళం
అనే
బురతీనో సాహసకృత్యాలు

# మరుపురాని మనిషి

## ఆప్తవాక్యం



- ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

ఆర్వియార్(ఆర్.వెంకటేశ్వరరావు) ఆంధ్ర విశ్వ విద్యాలయం లో (వాల్తేరు) ఇంగ్లీష్ ఆనర్స్ చదువుతుండగా, నేను హిస్టరీ (చరిత్ర) ఆనర్స్ చదువుతుండేవాడిని (1957-59). మా ఇద్దరిని పరిచయం చేసింది విద్యార్థి ఫెడరేషన్ సంస్థ. అప్పట్లో విద్యార్థి ఫెడరేషన్‌తోపాటు విశ్వ విద్యాలయంలో విద్యార్థి కాంగ్రెస్, డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ వుండేవి. విద్యార్థి ఫెడరేషన్లో ఉండిన ప్రముఖుల్లో కొందరు సత్యమూర్తి గంగరాజు, హరి పురుషోత్తమరావు, వాసిరెడ్డి వెంకటప్పయ్య ఇప్పటికీ గుర్తు ఉన్నారు. విద్యార్థి ఫెడరేషన్ సంస్థ, వామపక్ష భావజాలంతో కమ్యూనిస్టు పార్టీకి దగ్గరగా ఉండేది. అప్పట్లో ఆ సంస్థ ఆంధ్ర దేశంలో ప్రముఖ విద్యార్థి సంఘం. డిటెన్షన్ విధానం, విద్యా సంస్థల్లో నెలకొన్న అప్రజాస్వామిక పెత్తందారీ విధానాలను ప్రతిఘటిస్తూ పేద విద్యార్థుల స్థితిగతులను మెరుగు పరుస్తూ వారిని వామపక్ష భావాలవైపు మరలించడం, అధ్యయన తరగతులు నిర్వహిస్తూ, విద్యా ప్రమాణాలను మెరుగు పరచడం, ఈ సంస్థ ప్రధాన ఆశయాలు. అలాగే యువజన సంఘాలు గ్రామ సీమల్లో బడుగు జీవితాలను మెరుగు పర్చడం, పెత్తందారీ విధానాలను వ్యతిరేకించడం వంటి కార్యక్రమాలు ద్వారా సాంస్కృతిక చైతన్యం ప్రోది చేస్తూ బడుగు జీవుల బతుకుల్లో చిరుదీపాలు వెలిగించడానికి కృషి చేస్తుండేవి. 1952 ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన రాజ కీయ పక్షంగా గెలిచి 1955 ఎన్నికల్లో అనేక కారణాల వల్ల ఓడిపోయింది. 1955 తర్వాత పైన చెప్పిన నేపథ్యంలో ఆ తర్వాత రెండు సంవత్సరాలకు 1957 ఆంధ్ర విశ్వ విద్యాల యంలో చేరినప్పుడు ఆర్వియార్ పరిచయమయ్యాడు. 1955లో నీరసపడ్డ కమ్యూనిస్టు ఉద్యమం తిరిగి పుంజుకుం టున్న కాలం. పార్టీకి చెందిన అన్ని ప్రజా సంఘాలు విద్యార్థి ఉద్యమంతో సహా పునరుజ్జీవం పొందుతున్న సమయం. శిథిలాల నుంచి (ఎన్నికల తర్వాత) కమ్యూనిస్టు ఉద్యమం పునర్నిర్మించుకునే కీలక సమయం.

ఆ నేపథ్యంలో 1957లో నేను ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చేరడం, విద్యార్థి ఫెడరేషన్ తరపున యూనియన్ అధ్యక్షుడిగా పోటీ చేయడం జరిగిన సందర్భంలో ఆర్వియార్ పరిచయమ య్యాడు. యూనియన్ అధ్యక్షుడిగా నేను, ఇంగ్లీషు అసోసియేషన్ కార్యదర్శిగా ఆర్వియార్ వుండడం, తరచూ మేము కలుసుకోవడం జరిగేది. అప్పట్లో మా సన్నిహితత్వం అంతవరకే ! యూనివర్శిటీ పొలిమేరలు దాటి, ఉద్యోగాల్లో ప్రవేశించాక, మేము తరచూ కలుసుకునేవాళ్లం కాము. తర్వాత ఆర్వియార్ సోవియట్ యూనియన్ వెళ్లాడనని, అక్కడ రారా తదితరులతో తెలుగు పుస్తకాల ప్రచురణ పనిలో ఉన్నాడని తెలిసింది. మాస్కో నగరానికి ఆంధ్ర దేశం నుంచి ఎవరు వెళ్లినా వారింట్లో ఆతిథ్యం కబుర్లు ఆర్వియార్ సతీమణి సుందరమ్మ గారు మితభాషి. అతిథులను ఆదరించి, మృష్టాన్న భోజనం వడ్డించేది. ఆమె చేతి వంటకం అమృతప్రాయం. (ఇది స్వానుభావం) ఆర్వియార్ సోవియట్ రష్యా నుంచి తిరిగి వచ్చాక హైదరాబాద్‌లో ఉన్నారు. ఉద్యోగం లేదు. కష్టకాలం. అప్పటికే హైదరాబాద్‌లో వున్న నాతో, గత పరిచయం వల్ల సన్నిహితమయ్యాడు. ఆర్వియార్‌కు ఉద్యోగం కావాలి.

మేమిద్దరం తొక్కని గడపలేదు. అనువాదపు పని ఇస్తాడేమోనని తెలుగు అకాడమి సంచాలకుణ్ణి కలిశాం. మిత్రుడు ఏబీకే ప్రసాద్ ఏదో పత్రికలో పనిచేస్తున్నాడు. వారిని కలిశాం. అప్పట్లో విశాలాంధ్ర ప్రచురణాలయం మేనేజర్ రాజేశ్వర్రావు కలిశాం. ఆయన స్నేహశీలి, సహాయకారి. వారి నుండి కొంత వరకు సహాయం (పని) అందినట్లు గుర్తు. ఇంతకి తాను రష్యా వెళ్ళే ముందు చేస్తున్న కళాశాల ఉద్యోగం ఏమయింది ? దాన్ని గూర్చి వాకబు చేశాం. అప్పటికే కొందరు మిత్రులు ఆ దిశలో ఆలోచించి, పనిచేసున్నట్టు తెలిసింది. ఉన్నత విద్యా అధికారి శ్రీ తాటిపర్తి వెంకటరెడ్డి గారిని కలిసి మాట్లాడితే, కనీసం ఒక ఉత్తరం (లెటర్) కూడా ఇవ్వకుండా వెళ్ళాడని, తిరిగి ఉద్యోగం ఇవ్వడం కష్టమని చెప్పినా ఆ తర్వాత వెంకటరెడ్డి గారు, ఆర్వియార్‌ను తిరిగి ఉద్యోగంలో నియమించారు. ఆర్వియార్ గట్టునపడ్డాడు. వెంకటరెడ్డి గారు చేసిన సహాయం మరువలేనిది.

ఆ తర్వాత, జీవితం ఉద్యోగంతోపాటు, సాహిత్యపరంగా సజావుగా సాగింది. కళాశాలకు ప్రిన్సిపాల్ అయ్యాడు. ఇంటి కొచ్చే సాహితమిత్రులతో కాలం గడిపేవాడు, తన యితరత్రా సాహిత్య వ్యాసంగం నిర్వహించుకుంటూనే! నేనూ, లలిత,

**(మిగతా 93వ పేజీలో)**

# మా ఆర్వియార్ మాస్టారు

**ఆప్తవాక్యం**



- డా॥ సురేష్ బాబు

70వ దశకంలో విజయవాడ లయోలా కాలేజీలో చదువుకునే రోజుల్లో ఆంధ్రపత్రికలో ప్రతి వారం ప్రచురింపబడిన ‘పనికొచ్చే ముక్క’ అనే శీర్షిక ద్వారా నాకు కామ్రేడ్ ఆర్వియార్ గారితో పరిచయం ఏర్పడింది. అయితే నేను ఆయనను వ్యక్తిగతంగా అప్పుడు కలవలేదు. ఎందుకంటే ఆయన అప్పట్లో కాలేజీల్లో అధ్యాపకునిగా పనిచేసేవారు. ‘పనికొచ్చే ముక్క’ నేను క్రమం తప్పకుండా చదివేవాడిని. ఆ సమయంలో జరిగినటు వంటి వివిధ రాజకీయ, సాహిత్య పరిణామాల మీద ఆర్వియార్ గారు తమదైన వ్యంగ్య శైలిలో అందరికీ సులభంగా అర్థం అయ్యే విధంగా తెలుగు భాషలో విశ్లేషించేవారు.

1981లో నేను మాస్కోలోని పాట్రిస్ లుముంబా విశ్వ విద్యాలయంలో రష్యన్ భాషా శాస్త్ర విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరంలో ఉండగా ఆర్వియార్ గారిని మొదటిసారి కలిశాను. అదే సంవత్సరం ఆయన కుటుంబ సమేతంగా మాస్కోలోని ప్రగతి ప్రచురణాలయంలో రష్యన్ సాహిత్య రచనల అనువాదకుడిగా చేరారు. ఆయన రాక ముందే కామ్రేడ్ కొండేపూడి లక్ష్మీనారాయణ గారు, కామ్రేడ్ నిడమర్తి ఉమా రాజేశ్వరరావు గారు ఆ సంస్థలో ఉండేవారు. బహుశా ఆర్వియార్ గారి కుటుంబంతో పరిచయం చేసుకున్న మొట్ట మొదటి తెలుగు విద్యార్థులలో నేనే మొదటివాడిని అనుకుంటాను. అలాగే క్రమంగా నాతోటి విద్యార్థులు కొంత మంది ఆయన ఇంటికి తరచుగా వారి కుటుంబం సెటిల్ అవ్వటానికి కొంత సహాయం చేశాం. వారిలో సీనియర్ మిత్రులు రమేష్ చంద్రబాబు, అనంత్‌కుమార్ నా సమకాలికులు వాసుదేవ్, జంధ్యాల ప్రభాకర్, అప్పలరాజు శ్రీనివాసరావు, రవీంద్రనాథ్ తదితరులు ఉండేవారు. మా తర్వాత తరానికి చెందిన చాలా మంది విద్యార్థి మిత్రులు కామ్రేడ్ ఆర్వియార్ కుటుంబంతో అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. ఆర్వియార్ గారికి మార్క్సిస్ట్, కమ్యూనిస్టు, సైద్ధాంతిక పరిజ్ఞానం, భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర గురించి ఆంగ్లభాషా సాహిత్యం గురించి తదితర అంశాల మీద బాగా పట్టు ఉండేది. ఆయన గతంలో అనేక సంవత్సరాలు కాలేజీలో అధ్యాపకునిగా పనిచేశారు కాబట్టి మా అందరికీ పైన ఉదహరించిన అంశాల మీద ఎలా ఎక్స్‌ప్లయిన్ చేస్తే మాకు సులభంగా అర్థమవుతుం దనేది బాగా తెలుసు. అందుకనే కొద్ది కాలంలోనే మాకు అందరికీ ఆయన ‘ఆర్వియార్ మాస్టారు’ అయ్యారు. మాస్టారు గారి ప్రత్యేకత ఏంటంటే ఆయన మా అందరిని వ్యక్తిగతంగా పలకరించి మా బాగోగులు, చదువు, మా తల్లిదండ్రుల యోగక్షేమాలు అడిగి తెలుసుకునేవారు. అత్యవసర పరిస్థితుల్లో మాలో కొంతమందికి ఆర్థిక సహాయం చేసిన సందర్భాలు ఉన్నాయి. మాలో ఎవరికైనా స్వల్ప అనారోగ్యం వచ్చిన సందర్భాలలో సుందరమ్మ గారు తల్లిలా ఆదుకునేవారు. మరో మాటలో చెప్పాలంటే ఆర్వియార్‌గారు ఆయన సతీమణి సుందరమ్మ గారు మా అందరికీ అన్ అపాయింటెడ్ లోకల్ గార్డియన్స్‌గా వ్యవహరించేవారు. ఒక వారం రోజులు మాలో ఎవరైనా కనిపించకపోయినా, ఫోన్ చేయకపోయినా వెంటనే ఎవరో ఒకరి ద్వారా కబురు పంపి మా క్షేమం గురించి విచారించే వారంటే మా అందరికీ



**ఆర్వియార్ ఇంట మాస్కో విద్యార్థుల వేదిక**

ఎటువంటి విచక్షణా లేకుండా పర్సనల్ హ్యూమన్ టచ్ ఇస్తున్నారనిపించేది.

ఆర్వియార్ గారు మాస్కో వచ్చిన సంవత్సరానికే ఆయన మా తెలుగు తదితర విద్యార్థులకు ఆర్వియార్ మాస్టర్ ఒక పెద్ద దిక్కుగా నిలిచి పోయారు. మా ఆర్వియార్ మాస్టారులో ఇంకొక ప్రత్యేకత ఉండేది ఇంటి వెలుపల ఎటువంటి వాతావరణం ఉన్నప్పటికీ అంటే ఆయన ఎముకలు కొరికే చలిలో గాని వేసవిలో గాని సుందరమ్మ గారి ఆప్యాయత ఆదరణతో ఇంటికి పిలిచి భోజనం వడ్డించి మా అందరికీ పెట్టేవారు. అందువలన మా అందరికీ ఆయన కుటుంబంతో సంపూర్ణ అనుబంధం ఏర్పడింది. ఆర్వియార్గారు నిజమైన గురువు గారనుకోవడంలో నేను సందేహించను. ఆయన మాస్కోలో ఉన్న పది సంవత్సరాలలో మాలో చాలా మందికి అనేక విధాలుగా సహాయపడ్డారు. అందులో ఒక విషయం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. మేమందరం మాస్కోలో చదువుకునేందుకు రాక ముందు వివిధ సామాజిక ఆర్థిక విద్యా సాంస్కృతిక వర్గ కుటుంబాలకు చెందిన వారం.

మా అందరి ఆలోచన విశ్లేషణ వాక్చాతుర్య సామర్థ్యాలు వివిధ స్థాయిల్లో ఉండేవి. ఈ విషయాన్ని ఆర్వియార్ గారు బాగా గ్రహించి మాలో సైద్ధాంతిక విశ్లేషణ సామర్థ్యాన్ని పెంచేందుకు మరియు విషయాలను అర్థం చేసుకొని అన్వయించుకుని వాటి సారాంశాన్ని తెలుగు భాషలో లేదా ఇంగ్లీష్ భాషలో ఎక్స్ప్రెస్ చేయగల విశ్వాసాన్ని (కాన్ఫిడెన్స్)ని పెంపొందించేందుకు 'వేదిక' అనే ఒక డిబేట్ ప్లాట్ఫామ్ను మాతో ఏర్పాటు చేయించారు. ఇందులో భాగంగా భారతదేశ నుండి ముఖ్యంగా తెలుగు ప్రాంతాల నుండి మాస్కో వచ్చిన వారిని లేదా వేరే పని మీద వచ్చిన వారిని తమ ఇంటికి ఆహ్వానించి వారి సమక్షంలో వివిధ అంశాల మీద మా అందరితో మాట్లాడించేవారు. In other words RVR made all efforts to create analytical debating speaking argumentative and interactive skills in us మాస్టారు గారు చొరవ తీసుకొని ఏర్పాటుచేసిన వేదిక 'డిబేట్ ప్లాట్ఫాం' మా తరం వారికంటే (అప్పటికే మేమందరం దాదాపు చదువు పూర్తిచేసుకుని వెళ్లిపోయాం). మా తర్వాత మాస్కోలో ఉన్నత విద్య కోసం వచ్చిన తెలుగు విద్యార్థులకు అప్పటికి సోవియట్ మరియు ప్రపంచ రాజకీయ పరిణామాల గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడింది.ముఖ్యంగా Gorbachev perestroika glasnost విధానాల వలన సోషలిస్ట్ వ్యవస్థ లాభపడిందా, లేదా మరియు ప్రపంచవ్యాప్తంగా సోషలిస్ట్ సిద్ధాంతానికి క్రైసిస్ ఏర్పడిందా? ఈ సిద్ధాంత ఆచరణలో తీవ్రమైన తప్పులు జరిగిపోయాయా? సోవియట్, తూర్పు యూరప్ వ్యవస్థ ఉనికికే ముప్పు వాటిల్లిందా ? తదితర పరిణా మాలను విశ్లేషించుకోవడానికి ఆర్వియార్ గారు ఏర్పాటు చేసిన 'వేదిక' బాగా పనికొచ్చింది.

కామ్రేడ్ ఆర్వియార్ గారు మాస్కోలో గడిపిన పదేళ్లు ముఖ్యంగా చివరి ఐదు సంవత్సరాలలో సోవియట్ యూనియన్ క్రమంగా పతనావస్థలోకి జారిపోయింది. దీనికి అనేక కారణాలు ఉన్నాయని సోషలిస్ట్ వ్యవస్థ నిర్మాణ ఆచరణలో జరిగిన తప్పులు లోపాల గురించి తమ 'తొలగిన స్వర్గం' అనే పుస్తకంలో మాస్టారు గారు విశదీకరించడానికి ప్రయత్నించారు. ఈ ప్రత్యేక సంచికలో వారి కుటుంబంతో మా అందరికీ ఏర్పడిన అనుబంధం గురించి వారి జ్ఞాపకాల గురించి క్లుప్తంగా మిత్రులందరికీ తరపున రాసే అవకాశం కల్పించిన సంపాదక వర్గానికి ధన్యవాదాలు. వారిద్దరూ సోవియట్ యూనియన్లో 1980వ దశాబ్దంలో చదువుకున్న తెలుగు విద్యార్థుల జ్ఞాపకాలలో శాశ్వతంగా ఉండిపోతారు. ❑

# మరుపురాని మనిషి

(91వ పేజీ తరువాయి): రాజోలులో ప్రతి ఏటా, డాక్టర్ అల్లూరి రాజకుమారి గారు నిర్వహించే సాహిత్య సభలకు వెళ్ళి కలిసి రెండు రోజులు హాయిగా గడిపేవాళ్ళం. విశాలాంధ్ర ప్రచురణాలయం అప్పటి మేనేజర్ రాజేశ్వరరావు గారు ఆర్వియార్ దగ్గరి స్నేహితుడు విశాలాంధ్ర ప్రచురణలకు సాయం చేసేవాడు ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ చేపట్టి ప్రచురించిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర – సంస్కృతి మొదటి సంపుటి – చరిత్ర పూర్వ యుగం – ఆంగ్ల గ్రంధాన్ని తెలుగులోకి అనువదించాడు. ఇలా సాగింది మా స్నేహ ప్రస్థానం, ఆర్వియార్ తుది శ్వాస దాకా. ఆర్వియార్ సాహిత్య కృషిని సాహిత్యకారునిగా ఆయన సామర్థ్యాన్ని వెలకట్టే శక్తి నాకు లేదు. ఆంగ్లంలో నేను రాసిన కొన్ని వ్యాసాలను తెనిగించాడు.అనువాదాలు అంత సరళంగా వుండేవి కావని నా అభిప్రాయం. రష్యా నుండి వచ్చాక "తొలగిన స్వర్గం" రాశాడు. వాస్తవాలే రాసినా, ఆ గ్రంథం చాలా మందికి బాధకలిగించింది. విస్తారంగా గ్రంథాలు రాశాడు. "భగవద్గీత – మార్క్సిజం" పనికొచ్చే ముక్క" యింకా మరెన్నో నా దృష్టికి రానివి. గ్రంథ రచన ప్రక్రియ అటుంచి ఆర్వియార్ ప్రధానంగా మంచి చదువరి, సంభాషణా చతురుడు. మిత్రులు చెప్పినట్టు, ఆధునిక తెలుగు సాహిత్యంలో గురజాడ, శ్రీశ్రీ, కొడవటిగంటి సాహిత్యాలపై సాధికారిత సాధించాడని విన్నాను. ఆర్వియార్తో పరిచయమున్న వారికి, ఆయన మరపురాని మనిషి! ❑

# ఆర్వియార్ గారితో మాస్కో విద్యార్థులు

ఆప్తవాక్యం



- అజయ్ కంభంపాటి

ఆర్వియార్ గారి వ్యక్తిత్వం గురించి ఒక్క మాటలో చెప్పలేం. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఏ విషయాన్నయినా ఏ మార్క్సిస్ట్ దృక్పథంతోనే అర్థం చేసుకునేవారు. ఆయన వాదనల్లో గతి తార్కిక భౌతికవాదం దానిని అన్వయిస్తూ మాట్లాడటం కొట్టచ్చి నట్టు కనపడేది. ఆయనకి ఆంగ్ల తెలుగు భాషల మీద మంచి పట్టు ఉండేది. స్వతాహా సాహిత్యం బోధించడమే కాకుండా దాని కి మార్క్సిస్ట్ విశ్లేషణని జోడించేవారు. అటు వేదాలు ఉపనిషత్తు ల నుంచి, ఇటు మార్క్సిజం, సమకాలీన గ్రంథాలను, వ్యక్తులనూ ఉటంకిస్తూ మాట్లాడేవారు. ఆయన మాట్లాడినా, రాసినా ఏ ఒక్క పదం అదనంగా వాడేవారు కాదు. ఆయనకున్న జ్ఞానాన్ని నలుగురితో పంచుకోవటానికి ఇష్టపడేవారు. బహుశా ఈ గొప్ప లక్షణాల వల్లే మాస్కో విద్యార్థులు ఆయనకు ఆకర్షితులు అయ్యారేమో ! ఆర్వియార్ గారు మాస్కో వచ్చినప్పటి నుంచి తెలుగు విద్యార్థులు (సోవియట్ యూనియన్‌లో ఉన్న) అందరి తోనూ పరిచయం చేసుకున్నారు. ఆయన అందరితోనూ చాలా కలివిడిగా ఉండేవారు. ఆయనతోపాటు, ఆయన సతీమణి సుందరమ్మ గారు కూడా అందరినీ చాలా ఆదరంగా, ఆప్యా యంగానూ చూసేవారు. మాస్కోలో ఉన్న విద్యార్థులు తరచూ వారింటికి వెళ్లడమే కాకుండా, వేరే పట్టణాల్లో ఉన్న విద్యార్థులు కూడా మాస్కో వచ్చినప్పుడు ఆయనని కలవకుండా వెళ్లేవారు కారు. పైన చెప్పినట్టు ఆర్వియార్ గారికి అనేక ఆర్థిక, సామా జిక, సాంస్కృతిక అంశాలపై మంచిపట్టు ఉండేది. ఏ అంశాన్ని అయినా మార్క్సిస్ట్ కోణం నుంచే చూసేవారు. రా.రా. గారితో కలిసి పనిచేయడం వలనేనేమో ఆయన తన అభిప్రాయాలని నిర్భయంగా, నిష్కర్షగా వెలిబుచ్చేవారు. మేము కూడా అనేక అంశాలపై ఆయనతో గంటల తరబడి చర్చించడం ద్వారా మాకు అనేక కొత్త విషయాలు బోధపడ్డాయి. ఉదాహరణకు సృజనాత్మక విమర్శ చేసినప్పుడు దానిని నిర్భయంగా (కొంత కటువుగా ఉన్నా) చెప్పాలని అంటుండేవారు. ఏ విమర్శకైనా ఆయనకి మార్క్సిజమే మూలం. ఇది మాకెంతో స్ఫూర్తినిచ్చింది. దీనిలో భాగంగా మాస్కోలో వున్న తెలుగు విద్యార్థులందరూ కలిసి 1982 లో 'వేదిక' అనే సంస్థను ఏర్పాటు చేసుకున్నాం. ఈ సంస్థ సమావేశాలు ఆర్వియార్ చొరవతోనే ప్రతినెలా వారింట్లోనే జరిగేవి. వీటిలో మేము అనేక శాస్త్రీయ, సామాజిక, వైజ్ఞానిక అంశాలతోపాటు సమకాలీన రాజకీయాలను చర్చిస్తూ ఉండేవారం. ఈ చర్చల్లో ఆర్వియార్ గారు చురుకుగా పాల్గొని మాకు అనేక అంశాలపై మరింత లోతైన అవగాహనని కల్పించే వారు. వేదిక ప్రేరణతోనూ, స్ఫూర్తితోనూ చాలా మంది మన తెలుగు విద్యార్థులు ఇండియన్ అసోసియేషన్‌లోనూ, భారతీయ విద్యార్థుల ఇతర సంస్థలలోనూ అనేక ముఖ్య బాధ్యతలు నిర్వహించారు. ఏటా వేదిక వార్షికోత్సవం జరిపేవారం. దీనితో పాటు 'వెలుగు' అనే లిఖిత పత్రికను తీసుకొచ్చేవారు. ఈ పత్రి కలో విద్యార్థులు అనేక అంశాలపై వ్యాసాలు రాసేవారు. ఈ వ్యాసాలకు ఆర్వియార్ గారు సూచనలు, సలహాలు ఇచ్చేవారు.

ఎవరు మాస్కో సందర్శించడానికి వచ్చినా ఆర్వియార్ గారిని కలవకుండా వెళ్లేవారు కాదు. వాళ్ళని తన ఇంటికి పిలిచిన ప్పుడు, ఆయన అందరు విద్యార్థులకి కబురు పెట్టేవారు. వారి వారి రంగాలలో ఎవరయినా నిష్ణాతులు ఉంటే, వారితో వేదిక ప్రత్యేక సమావేశాలు నిర్వహించడానికి ఆర్వియార్ గారు ఎంతో తోడ్పడేవారు. మాస్కో నుంచి హైదరాబాద్ తిరిగి వచ్చిన తర్వాత కూడా అందరి విద్యార్థులతో తనకున్న బంధాన్ని, అనుబంధాన్ని కొనసాగించారు. వయసుతో నిమిత్తం లేకుండా ఆయన అంద రు పూర్వ విద్యార్థులతోనే కాకుండా, వారి కుటుంబ సభ్యులతో కూడా కలిసిపోయేవారు. ఇతరుల ఆలోచనలను, భావాలను గౌరవిస్తూనే తనదైన శైలిలో విమర్శిస్తూ అందరికి తలలో నాలిక గా మెలిగేవారు. ఆయన మాస్కోలో మా హాస్టల్స్‌కి చాలా దూరం గా నివసించేవారు. హైదరాబాద్‌లో కూడా ఆయన మల్కాజ్‌గిరి లో ఉండేవారు. దూరంతో నిమిత్తం లేకుండా అందరం కూడా ఆయనని కలవడానికి ఎంతో ఇష్టపడేవాళ్ళం. ఈ ఒక్క ఉదాహర ణ చాలు మా అందరికి ఆయనపై ఉన్న గౌరవమూ, అభిమా నమూ, ప్రేమనూ చెప్పడానికి. అలాగే సుందరమ్మ గారు కూడా అందరిని ఎంతో ప్రేమతో పలుకరించి ఆదరించేవారు. ఆర్వియార్ ఒక అరుదైన వ్యక్తి. మానవ సంబంధాల పట్ల ఆయనకు అపారమైన నమ్మకం, గౌరవమూ ఉండేది. పైన చెప్పి నట్లు ఆయనతో పరిచయమూ, చర్చలూ మాకెంతో ఉపకరిం చాయి అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అటువంటి గొప్ప వ్యక్తి మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. అందుకే నేటికి ఆయన గురించి మేమందరం ఎప్పుడు కలిసినా ఆ జ్ఞాప కాలను నెమరేసుకుంటూ ఉంటాం. ఆర్వియార్ గారితో మాకున్న అనుబంధాన్ని పంచుకునే అవకాశం కల్పించిన దారి దీపం పత్రిక సంపాదకులకు మా ధన్యవాదాలు. వారి కృషి అభినందనీయం. ❑

# సునిశిత హాస్యం ఆయన సొంతం

ఆప్తవాక్యం



- డా॥ బి.రమేష్‌చంద్రబాబు

ఆర్వీఆర్ మాస్టారు తణుకు డిగ్రీ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తుండగా 1979వ సంవత్సరంలో నేను మాస్కో నుంచి ఇంటికి వచ్చాను. అప్పటిది ఆయనతో నా పరిచయం. మా ఇంటి సమీపంలోనే ఉండేవారు. వారి ఇంటికి వెళ్లడంతో సుందరమ్మ గారు వారి అబ్బాయి రాహుల్‌తో పరిచయం అయ్యింది. మా కుటుంబంతో వారికి ముందే పరిచయం ఉండేది. అదే సంవత్సరం నా పెళ్లి. మాస్టారే నా పెళ్ళికి నిర్వాహకులు. కొద్ది కాలం ఉండి తిరిగి నేను మాస్కోకి వచ్చేసాను.

1981లో మాస్టారు ప్రగతి ప్రచురణాలయంలో అనువాదకునిగా పని చేయడానికి మాస్కో వచ్చారు. మా హాస్టల్‌కు దగ్గరలోనే బిల్యా యోవ మెట్రో స్టేషన్‌కు దగ్గరలో అపార్ట్‌మెంట్‌లో మకాం చేశా రని తెలిసి వెళ్లాను. రాహుల్, సుందరమ్మ గారు చాలా సంతోషించారు. వారు నన్ను తమ కుటుంబసభ్యునిగా ఆదరిం చారు. తెలుగులో మాట్లాడటానికి ఒక మనిషి ఉన్నట్లు ఆనందించారు. అప్పటి నుంచి మొదలుకొని వారు వేరే ప్రాంతం కలోమెన్స్కు యాకు వెళ్లినా ప్రతి శనివారం వారింటికి నేను వెళ్లేవాడిని. మాస్టారు శనివారం ఉదయాన్నే ఫోన్ చేసి పిలిచేవారు. అలా నా చదువు పూర్తయి 1983లో తిరిగి ఇండియాకు వచ్చేవరకు అన్ని పండగలకు మరియు ప్రతి శనివారం వాళ్ళ ఇంటికి వెళ్లేవాడిని. మాస్టారు గారు ఉదయమే తన అనువాదం పని ఇంచుమించు మధ్యాహ్నం వరకు చేసుకునేవారు. సాయంత్రం బయటికి వెళ్లడం లేదా తెలుగు విద్యార్థులం వారి ఇంటికి వెళ్లడం జరిగేది.

మాస్టర్ గారి ఇంటికి వెళ్లినప్పుడు కాలం ఇట్టే గడిచిపోయేది అంతా మాస్టర్ మాట్లాడేవారు మేమంతా శ్రోతలమే. అశువుగా తెలుగు సంస్కృతం ఇంగ్లీషు పద్యాలు చెబుతుంటే అందరం ఆసక్తిగా వినే వాళ్ళం ఏ విషయాన్ని అయినా పిల్లలకు బాగా వివరించేవారు. సునిశిత హాస్యం ఆయన సొంతం. సుందరమ్మ గారు అందరికీ తెలుగు రుచులు వండి వార్చేవారు. రష్యా రుచులు తెలుగు వారికి అంతగా నచ్చవు. ఇప్పటిలా అక్కడ కారాలు అవి దొరికేవి కావు. అయినా అక్కడ దొరికే వాటితోనే పిండి వంటలు చేసే వారు. రాహుల్ మేము వెళ్ళేటప్పటికి వాటిని తెచ్చి మా ముందు పెట్టేవాడు. సుందరమ్మ గారు శుద్ధ శాఖాహారి అయినా కూడా మా కోసం మాంసాహారం వండి వడ్డించేవారు. ఒకసారి పచ్చి ఆపిల్‌తో తోణికి ఆవకాయ పట్టారు. అందరికీ నచ్చింది అదే సమయంలో అద్దంకి మన్నార్ మాస్కో రేడియోలో పని చేయడానికి వచ్చారు. ఆయన అది మామిడికాయతో ఇక్కడ మామిడికాయలు దొరుకుతాయా అని అడిగారు. కాదని అన్నా చాలా కాలం నమ్మలేదు. సుందరమ్మ గారి వంటలు అంత బాగుండేవి. రాహుల్ స్కూల్లో చదివేవాడు. మేము వచ్చేసరికి చాలా ఆనంద పడేవారు. మాస్టారు ఇండియా వచ్చాకే మళ్ళీ ఎక్కువ కలవటం జరిగేది. ఇండియాకు వచ్చాక రాజోలు కాలేజీలో మళ్లీ లెక్చరర్‌గా చేరారు. రెండు మూడుసార్లు ఆయన ఉండే దొరగారి తోటకు వెళ్లాను. తాడేపల్లిగూడెంలో మాస్టర్ అన్నయ్య ఉండేవారు. అక్కడికి వచ్చినప్పుడు తణుకు కూడా వచ్చేవారు. ఇండియాలో ఉండగా ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఫోన్‌లో సంప్రదించేవారు.

ఒకసారి ఆయన అనువాద పుస్తకాలలో ఒక పుస్తకం 'చరిత్ర చోదక శక్తులు' కాపీ ఎంత వెతికినా దొరకలేదు అందరినీ అడిగారు. ఆఖరికి నా వద్ద ఉందని చెప్పాను. దాన్ని మళ్ళీ పునః ముద్రించడానికి కావాలన్నారు. అది ఆయన అనువదించిన మొదటి పుస్తకం. అందుచేత ఏ మార్పు

(మిగతా 96వ పేజీలో)



డీవీవీఎస్ వర్మ, ఆర్వీయార్, కేతు విశ్వనాథరెడ్డి గార్లతో నేను

# ఆయనతో మాట్లాడడమే ఓ ఎడ్యుకేషన్

ఆప్తవాక్యం



- డి.సోమసుందర్

ఆర్వియార్ మాస్టారుకు నేను ప్రత్యక్ష విద్యార్థిని. తాడేపల్లి గూడెం డి.ఆర్. గోయెంకా ప్రభుత్వ కళాశాలలో ఆర్వియార్ మాస్టారు పని చేస్తుండిన రోజుల్లో ఆయన ఇంగ్లీషు బోధిస్తూ ఉండేవారు! అప్పట్లో నేను ఇంటర్మీడియట్ చదువుతుండే వాడిని. మాకు రెండేళ్ళూ ఆయనే ఇంగ్లీషు చెప్పారు. అప్పుడే కొత్తగా ఓ చిన్నపాటి పట్టణం మాదిరిగా తాడేపల్లిగూడెం ఎదుగుతూ ఉన్న రోజులవి. గ్రామీణ ప్రాంతాల నుండి కళాశాలకు వస్తూ ఉండిన మాబోటి పల్లెటూరి గబ్బిలాయిలకు ఇంగ్లీషు చదవడమే గొప్ప. ఇక మాట్లాడం అంటే గగనం. మా బొట్లేరు ఇంగ్లీషు ఉచ్చారణ తెలుగు వాసనతో ఉండేది. అసలు ఉచ్చారణ ఎలా ఉంటుందో తెలియని మేము ఆర్వియార్ మాస్టారి స్వచ్ఛమైన ఇంగ్లీష్ ఉచ్చారణను వేళా కోళంగా అనుకరించేవాళ్ళం! అయితే మాస్టారు మాట్లాడేదే అసలైన ఇంగ్లీష్ అని మాకు ఆ తర్వాతి కాలంలో ఎప్పటికో తెలిసి సిగ్గుపడ్డాం! క్లాసులో ఎంతో సీరియస్‌గా పాఠం చెప్పే మాస్టారు బైట కుర్రాళ్లతో బాగా మాట్లాడేవారు. కళాశాల మాగజైన్‌కు సంపాదకత్వ బాధ్యతల్లో ఉండటంతో సాహిత్యం అభిరుచి ఉన్నవాళ్ళని మాస్టారు కనిపెట్టుకుని ఉండేవారు. రాయమని ప్రోత్సహిస్తూ ఉండేవారు. కుర్రాళ్ళు రాసిన రచనల మంచి చెడ్డలు విశ్లేషించే వారు. రాయడంలో మెళకువలు నేర్పేవారు. అయితే అప్పటికి మాస్టారి విద్వత్తు, రచనా ప్రతిభ, విశ్లేషణా సామర్థ్యం, మాకు బొత్తిగా తెలియదు.

ఆ రోజుల్లో తాడేపల్లిగూడెంలో ఏ.ఐ.ఎస్.ఎఫ్. కార్యకర్తగా నేను చురుగ్గా ఉండేవాడిని. మాకు ప్రతీ బుధవారం సాయంత్రం ల్యాండ్ మార్ట్ గేజ్ బ్యాంక్ ఆవరణలో స్టడీ సర్కిల్ జరుగుతూ ఉండేది. సైద్ధాంతిక, రాజకీయ అంశాలతోపాటు సాహిత్య అంశాలపై అక్కడ చర్చలు జరుగుతూ ఉండేవి. వర్మ గారు, ఆర్వియార్ మాస్టారు వివిధ అంశాలపై వివరణ ఇస్తూ ఉండేవారు. వచ్చే వారం ఫలాన పుస్తకంపై చర్చ ఉంటుందని ముందుగానే ప్రకటించేవారు. దాంతో అందరం ఆ పుస్తకాన్ని చదువుకుని స్టడీ సర్కిల్‌కు హాజరయ్యేవాళ్ళం.

స్టడీ సర్కిల్ రోజున కూడా ఆ పుస్తక పఠనం జరుగుతూ ఉండేది. పుస్తకం చదవడం ఒక అనుభవం అయితే, ఆర్వియార్ మాస్టారి విశ్లేషణ మాకు వినూత్న అనుభవంగా ఉండేది. రచనలోని మాకు తెలియని కొత్త కోణాలను ఆయన ఆవిష్కరించే వారు. ఆయన ప్రసంగాలు వ్యంగ్యంతోనూ, హాస్యంతోనూ నిండి ఉండేవి. ఆర్వియార్ మాస్టారి విశ్వరూపం మాకు స్టడీ సర్కిల్ రోజుల్లోనే అర్థం అవుతూ వచ్చింది.

యుగ సాహితి ప్రచురణ 'చరిత్ర చోదక శక్తులు', 'విరసం సాహిత్య బండారం' వంటి చిన్ని పుస్తకాలు ఆ రోజుల్లోనే ఉత్సాహంగా చదివాం. 'సంవేదన' పత్రికల బైండును ఆరాధనగా చూసేవాళ్ళం. ఆయనకోసం రా.రా. గారు తాడేపల్లిగూడెం వస్తే ఆయన్ని చూసి థ్రిల్ అయిపోయాం. స్టడీ సర్కిల్‌కు విద్యార్థులు, యువకులు, బ్యాంకు ఉద్యోగులు, అధ్యాపకులు, ఆర్టీసీ కార్మికులు, సీపీఐ కార్యకర్తలు హాజరయ్యేవారు. ఆర్వియార్ మాస్టారు బదిలీ అయ్యారు. మనోరమ గారి బదిలీ కారణంగా వర్మ గారి మకాం కూడా మారిపోయింది. అయితే మా స్టడీ సర్కిల్ చిరకాలం కొనసాగింది. సాహిత్యపు కొత్త బంగారు లోకం వాకిళ్ళను తెరిచిన అలనాటి మా స్టడీసర్కిల్లో మా 'తొలి ఉపాధ్యాయుడు' ఆర్వియార్ మాస్టారే! తాడేపల్లిగూడెంలో జరిగిన అరసం కార్యకలాపాలకు ఆయనే స్ఫూర్తి! మేం 'కాహళి' సాహిత్య లిఖిత మాస పత్రికను నడుపుతుంటే ప్రోత్సహించి పిల్ల రచయితలకు సాహితీ ప్రక్రియలను తన వ్యాసాలతో పరిచయం చేసింది కూడా మాస్టారే! ఉద్దండ పండితులతో తిరిగినా మాకు బుద్ధి ఏ మాత్రం పెరగని రోజుల్లో నిజంగా ఆర్వియార్ మాస్టారితో మాట్లాడ్డమే ఓ ఎడ్యుకేషన్!

ఆయన మాకు నిజంగా మాస్టారే! ❑

## సునిశిత హాస్యం ఆయన సొంతం

(95వ పేజీ తరువాయి)

లేకుండానే విశాలాంధ్ర వారు పునః ముద్రించారు. చివరగా మా అమ్మాయి పెళ్లి జూలై 2012లో జరిగింది. మా అమ్మాయి వివాహం కూడా మాస్టర్ గారు జరిపించారు. అదే ఆఖరిసారి అని అనుకోలేదు. అప్పుడు డిసెంబర్‌లో మాస్టర్ గారు చనిపోయారని తెలిసింది వెంటనే హైదరాబాద్ వెళ్లాను. దురదృష్టం అంత త్వరగా మనల్ని వదిలి వెళ్ళిపోతారను కోలేదు. సుందరమ్మ గారిని కూడా అప్పుడే ఆఖరిసారి చూశాను. ❑

# అక్షరాల లక్షాధికారి - మాటల కోటీశ్వరుడు

ఆప్తవాక్యం



- సంకు మనోరమ

అభ్యుదయం అన్న పదాన్ని ఒక సంస్థకు మాత్రమే పరిమితం చేయకుండా, విశాల అర్థంతో మార్క్సిస్టు సాహిత్య చింతనగా గ్రహించిన మేధావి ఆర్వియార్ గారు. అభ్యుదయ సాహిత్యంలో ఆర్వియార్ పాత్ర అద్వితీయమైంది. సుందరి, ఆర్వియార్ నాకు ఆత్మ బంధువులు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా కష్టసుఖాలను పంచుకున్న స్నేహబంధం మాది. ఇంకో రకంగా చెప్పాలంటే వారి ఉమ్మడి కుటుంబానికి మా దంపతులది ఆత్మీయ బంధమే. 1970లో నర్సాపురంలోని ఓ ప్రైవేటు కాలేజీలో పనిచేస్తున్న నన్ను మిత్రుడు మందలపర్తి శ్రీపతి పెంటపాడు(గూడెం) తీసుకువెళ్ళి ఆర్వియార్‌కి పరిచయం చేశారు. అది మొక్కు బడిగా సాగిన తొలి పరిచయం. 1971లో నేను గుంటూరు గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజ్‌లో పొలిటిక్స్ లెక్చరర్‌గా చేరాను. 1972లో ఆర్వియార్ ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌కు ఏలూరు వచ్చారు. కృష్ణంరాజు గారింట వారి బస. భోజనాది విషయాలు చూసే బాధ్యత నాకు, అడబాల రాజారావు గారికి అప్పగించారు వర్మ గారు. ఆయనతో రెండు వారాలు చాలా ముభావంగా దొర్లిపోయాయి. 1974లో గుంటూరు నుంచి ట్రాన్స్‌ఫర్ మీద పెంటపాడు (తాడేపల్లిగూడెం) గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జాయిన్ అయ్యాను. ఆర్వియార్, నేను కొలీగ్స్‌గా పనిచేసింది. ఆ ఒక్క కాలేజి లోనే. ఆర్వియార్, సుందరి గార్ల ఏకైక కుమారుడు రాహుల్. ఆయనకు ఇద్దరు అన్నలు, ముగ్గురు తమ్ముళ్ళు, ఒక సోదరి. వారంతా అన్నదమ్ములకంటే స్నేహితుల వలె వేళాకోళాలతో సంబంధ బాంధవ్యాలు నెరిపే కుటుంబ మది. ఆర్వియార్ చిన్న తమ్ముడు వేణు - కామేశ్వరి పెళ్ళి మొదలు వేణు కొడుకు ఇంద్రజిత్ కొడుకు పెళ్ళి వరకు అన్ని శుభ కార్యాలకు వారింట నాకు ప్రత్యేక ఆహ్వానమే.



ఆర్వియార్ దంపతులతో.. నేను

తోడికోడళ్లు సత్యవతి, పేరిలక్ష్మి, కామేశ్వరి అందరూ నన్ను ఇంటి ఆడపడుచుగా ఆదరించి అభిమానించేవారు.

పెంటపాడులో ప్రారంభమైన స్నేహ ప్రస్థానం అనేక దశాబ్దాలుగా మరింత గాఢమైన అనుబంధాలను నెలకొల్పింది. నేను వంట చేసుకున్నా, కాలేజ్ నుంచి వస్తూ వారింట భోజనం చేయాల్సిందిగా సుందరి గారు పట్టుపట్టి మరీ పెట్టేవారు రుచికరమైన భోజనం వండి వడ్డించడం ఆమె జీవ లక్షణం. కాలేజ్‌లో ఒకసారి నేను పది రోజులు ఇన్విజిలేషన్ చేస్తే 70 రూపాయలు వచ్చాయి. ఆమె పట్టుబట్టి స్టీలు పళ్లెం కొనిపించారు. వంటింటిలో ఇప్పటికీ ఆ పళ్ళెం సుందరి గారి స్మృతిగా నన్ను పలకరిస్తూనే వుంటుంది. సుందరి గారు మిత భాషి. కాని చాలా పట్టుదల గల వారు నేను, శాంతి, ఇస్కస్ సంఘాలలో క్రియాశీలంగా పని చేస్తున్నప్పుడు "ఫాసిస్టు వ్యతిరేక సదస్సు" పాట్నాలో జరిగింది. నేనూ, సుందరి గారు డాక్టర్ శ్రీరాములు గారు వెళ్ళాలని నిర్ణయించుకున్నాము. ఆర్వియార్ భయపడి ఆమెను వెళ్ళవద్దని అన్నా, ఆమె మాతో పాట్నా వచ్చారు. బుద్ధగయ, రాజగిరి, నలంద వంటి చారిత్రక ప్రదేశాలను సందర్శించాం. ఆ రోజుల్లో ఆంధ్రప్రదేశ్ గవర్న మెంట్ కాలేజ్ టీచర్లు అసోసియేషన్‌లో వామపక్షాల నాయకులు మెజారిటీ స్థానాల్లో వుండి నడిపించేవారు. హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర మీటింగ్‌లకు ఇద్దరం వెళ్లేవాళ్లం. కాలేజ్ యూనిట్ ఎన్నికలకు ఆర్వియార్ నన్ను ప్రెసిడెంట్ కాండిడేట్‌గా నిలబెట్టారు. కామరాజ్‌నాదార్, ఇందిరాగాంధీ అంటూ మమ్మల్ని ప్రత్యర్థులు వేళాకోళం చేసేవారు కాలేజ్‌లో విద్యార్థుల మధ్య ఏ సమస్య వచ్చినా, ప్రిన్సిపల్ గారు ఆర్వియార్‌కు అప్పగించి పరిష్కరించమనేవారు. ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌కు నేను, ఆర్వియార్ హైద్రాబాద్‌లో వెళ్ళేవాళ్ళం. ఆయన తమ్ముడు పండు-భార్య సత్యవతి మల్కాజ్‌గిరిలో వుండేవారు. అక్కడే మా మకాం.

మా నాన్న సంకు అప్పారావు గారు రాష్ట్ర కమ్యూనిష్టు పార్టీ సీనియర్ నాయకులు. పార్టీ పనుల మీద తిరుగుతూ తణుకులో వున్నప్పుడు సుందరి గార్ని మాసిన నేత పంచెలు ఉతికించమని అడిగేవారు. రెండు పాలిస్టరు పంచెలు కొనుక్కోమని ఆర్వియార్ సలహా చెబితే. అలాంటి పంచెలు కట్టుకుంటే కమ్యూనిస్టులని నమ్మరని ఆర్వియార్‌తో అనేవారట. ఆ విషయం పదే పదే

తలుచుకుని నాకు మా మాస్టారు చెప్పేవారు. ఆర్వియార్ 1981లో మాస్కోలోని 'రాదుగ' ప్రచురణాలయంలో అనువాద కునిగా పనిచేయడానికి వెళ్లి 1991 వరకు ఉన్నారక్కడ. 1973లో మహిళా సమాఖ్య తరపున వలెంతిన తెరెష్కోవా ఆహ్వానం మేరకు ఇంధిరాగాంధీ మేనత్త షీలాకౌల్ నాయకత్వాన ఒక సెమినార్‌కు నేను గుంటూరు నుంచి మాస్కోకు వెళ్లాను. రాష్ట్ర విద్యా శాఖ నుండి మందపాటి నాగిరెడ్డి గారు పర్మిషన్ ఇప్పించారు.

ఢిల్లీలో అరుణా ఆసఫ్ ఆలీ గారు వీసా ఇప్పించారు. తర్వాత నన్ను పర్మినెంట్ చేయమని ఉన్నత విద్యా శాఖను అడిగితే పర్మిషన్ లేకుండా రాళ్ళబండి వెంకటేశ్వరరావు గారు, మీరూ వెళ్ళారు. పనిష్మెంట్ తప్పదని చెప్పేవారు. చివరికి మంత్రిగా వున్న ముద్రగడ పద్మనాభం గారి సాయంతో నేను బయటపడ్డాను. ఆర్వియార్ గారు మాస్కో తిరిగి వచ్చి అనేక ప్రయత్నాలు చేసి రాజోలు కాలేజ్‌లో లెక్చరర్‌గా చేరి 1967లో రామన్నపేట కాలేజ్‌లో ప్రిన్సిపల్‌గా రిటైర్ అయ్యారు.

రాజోలులో డాక్టర్ అల్లూరి రాజకుమారి గారు ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో సాహితీ హేమంతం పేరుతో లబ్ద ప్రతిష్టులయిన సాహితీవేత్తల గోష్ఠి నిర్వహించేవారు. అక్కడే వున్న ఆర్వియార్ కుటుంబం ఆమెకు అండదండలుగా సాహితీ వారోత్సవాలు నడిపేవారు. పరకాల పట్టాభి రామారావు గారు, వకుళాభరణం రామకృష్ణ గారు, వారి సతీమణి లలిత గారు, కేతు విశ్వనాధరెడ్డి దంపతులు, వర్మగారు ఇంకా అనేకమంది సాహితీ ప్రముఖులతో సంబరంగా కోనసీమ ప్రకృతి సమక్షంలో ఆనందంగా గడిపిన మధుర జ్ఞాపకాలవి. దశాబ్దంపాటు మాస్కోలోని ఆర్వియార్ గారి ఇల్లు లుముంబా యూనివర్శిటీలో చదువుకునే స్టూడెంట్స్‌కు అన్నింటిలోను మార్గదర్శి. ముఖ్యంగా తెలుగు స్టూడెంట్స్, పార్టీ నాయకులు కూడా ఆ దంపతుల ఆతిథ్యం పొందారు. పాక శాస్త్ర ప్రవీణురాలు సుందరి గారితో కావలసిన వంటకాలు వండించుకొని తినేవారట. సురేష్, రమేష్, రామదాసు, అనురాధ, సమతా రోష్ని ఎంతోమందికి స్వంత ఇంటి స్వేచ్ఛ, ప్రేమ అక్కడ దొరికేవి. అక్కడ దొరికే దినుసులలో యాపిల్ లాంటి వాటితో ఊరగాయలు తయారు చేసేవారంట సుందరి గారు. ఆర్వియార్ గార్కి నేను చేసే దిబ్బ రొట్టె చాలా ఇష్టం. సుందరి గారు ఎన్ని పిండి వంటలు, వంటలు వండినా, ఆమె పిండి పులిహోర చాలా బాగుండేది. మంగళంపల్లి బాలమురళీకృష్ణ, సినిమా హీరో చిరంజీవి, వ్యాపారవేత్త రాయపాటి సాంబశివరావు వంటి వివిధ రంగాల ప్రముఖులు సుందరి గారి భోజనం, ఆర్వియార్ చతురోక్తులను మాస్కోలో ఆస్వాదించిన వారే. 1979లో ఆర్వియార్ గారు తణుకు కాలేజిలో పని చేస్తున్నప్పుడు డా॥ రమేష్ - దుర్గ దండల పెళ్ళికి ఆధ్వర్యం వహించారు. తణుకు లో 2012 సంవత్సరంలో డా॥ రమేష్ కుమార్తె సంయుక్త - రాహుల్ దండల పెళ్ళికి ఆర్వియార్ అధ్యక్షులు. డా॥ రమేష్ 12 సంవత్స రాలు మాస్కోలో వైద్య విద్యనభ్యసించారు. కామ్రేడ్ మణ్యం గారితో మా దంపతులతో గల నలభై ఏళ్ళ అన్యోన్య స్నేహ బంధాలకు గుర్తుగా ఆయన రచించిన "సాహిత్య వ్యాసాలను "మా ముగ్గురికి అంకితం ఇచ్చారు. నా హృదయం విశాలమైం దని' హార్ట్ ఎన్‌లార్జ్ అని డాక్టర్ చెప్పినప్పుడు హాస్యమాడేవారు. "వర్మ ది ఇరిటేటింగ్ మోడెస్టీ" అని చెప్పేవారు ఆర్వియార్.

ఒకసారి హైదరాబాద్ సెంటర్ యూనివర్శిటీలో మానవ హక్కుల వర్క్ షాపులో మూడు వారాలపాటు పాల్గొన్నాను యూనివర్శిటీలో అన్ని సౌకర్యాలు ఉన్నా, సుందరి-ఆర్వియార్ మల్కాజ్‌గిరిలో వారింట్లో వుండి వెళ్ళి రమ్మని పట్టుపట్టారు. నా పట్ల వారిద్దరికి గల ప్రేమాభిమానాలలో మూడు బస్సులు మారి అష్టకష్టాలు పడినా ఆనందంగా గడిపిన రోజులు గుర్తు వస్తున్నాయి. ఇబ్రహీంపట్నంలో జనహర్షలో ఆయన స్థలం కొని, నాతో కొనిపించాడు. అక్కడ ఫామ్ హౌస్ వేసుకొని అందరం కలిసి ఉందామనే వారు ఆర్వియార్ దంపతులు. రోజు వారీ సంభాషణలలో ఆయన పాండిత్య విస్ఫోటనం ఆశ్చర్యం కలిగించేది. ఆయన మాట్లాడుతుంటే వినడమే విషయ పరిజ్ఞానమనిపించేది. అంత గొప్ప సంభాషణా చాతుర్యంగల ఆయన సంభాషణ సమ్మోహపరిచేది. కాని ఆయన పబ్లిక్ ఉపన్యాసాలు సాదాసీదాగా అనిపించేవి. మార్క్సిస్టు శాస్త్రీయ సాహిత్య విమర్శలో ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పిన రాచమల్లు రామచంద్రారెడ్డి గారి ప్రభావానికి లోనయిన వ్యక్తి ఆర్వియార్. అద్భుతమైన రా.రా గారి మేధస్సును తరచూ ప్రస్తావించే వారాయన. గజ్జెల మల్లారెడ్డి, కేతు విశ్వనాధరెడ్డి, రామప్ప నాయుడు, వై.సి.వి.రెడ్డి, చెన్నారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సొదుం జయరామ్, ఇంకా అనేకమంది కడప సాహిత్యమిత్రుల సహచర్యం గురించి ఎప్పుడూ తలచుకుంటూ ఉండేవారు. ఆర్వి యార్ అక్షరాల లక్షాధికారి. మాటల కోటీశ్వరుడు. లోక్‌సత్తా కార్యకలాపాల నిమిత్తం హైదరాబాద్‌లో వుండడం వల్ల తరచు గా ఆ దంపతులతో కలిసి ఉండే అవకాశం కలిగింది. డా॥ చెలికాని కృష్ణమోహనరావు గారు కూడా ఆర్వియార్‌తో సన్నిహి తంగా వుండేవారు. 2012 డిసెంబరు 14వ తేదీ సాయంకాలం నా యోగ క్షేమాల గురించి, ఫోను చేశారు. ఆర్వియార్ తనకు కొంతనలతగా వుందని చెప్పారప్పుడు. మర్నాడే డిసెంబరు 15న ఆయన మరణం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మర ణాన్ని తట్టుకోలేని సుందరి గారు తర్వాత కొద్దికాలానికే మృతి చెందడం విషాదకరం. ఆ దంపతులు నా జీవిత కాల జ్ఞాపకం. వారి నిష్క్రమణ నా మనస్సుకు శాశ్వత గాయం. ❑

# హాస్య చతురుడు

## ఆప్తవాక్యం



- ఎస్.మల్లేశ్వరశాస్త్రి

ఒక పండితుడు, వక్త, శతాధిక గ్రంథ రచయిత, సాహితీ వేత్తలలో గణనీయమైన లబ్ధ ప్రతిష్టుడు. ఇలాంటివాడిని గురించి రాయాలంటే అతని పాండిత్యస్థాయికి తగ్గట్టు ఉండాలి. కాని ఏవో చిన్ననాట ఊసుబోక కబుర్లు అతన్ని గురించి, మంచి పాండిత్య జ్ఞాపికా సంచికలో సరిపోదేమోనని చాలా కాలం తటపటాయించాను. ఎందుకంటే నాకున్న అతని సాహిత్య పరిచయం, లోతైన పరిజ్ఞానం లేదు. తీరా చూస్తే మా అబ్బు (ప్రకాష్) ఒక్క సిట్టింగ్‌లో రాసి పంపించేశాడు. అది చూసిం తర్వాత కొంచెం ధైర్యం చిక్కింది. శ్రీశ్రీ గారు చెప్పినట్లు నా సమిధనొక్కటి ఆహుతివ్వాలి అనిపించింది. నేను (మల్లి), ప్రకాష్ (అబ్బు), లక్ష్మీనారాయణ (నారాయణ) మా చల్లపల్లి వెంకటరావు మాస్టారి అబ్బాయి, ఎస్.వి.జీ. హైస్కూల్ మార్టేరులో ఒకే బెంచి. ఒకే సెక్షనులో చదువుకున్నాం. రాళ్ళభండి సత్యనారాయణ మాస్టారి కొడుకు. రాళ్ళభండి మాస్టారు ఇంగ్లీషు, సోషల్ చెప్పేవారు. నాకు ఆయన అంటే భయంగా ఉండేది. ఒకసారి ఇంగ్లీషు పేపరు ఆయనే సెట్ చేశారు. బాగానే రాసినా మంచి మార్కులు రావేమోనని భయంగా ఉండేది. (వెంకటరావు అని పిలిచేవాళ్ళం) వాళ్ళింటికి పిలిచి నా ఆన్సర్ పేపర్ చూపించాడు రహస్యంగా. అది వాళ్ళ నాన్నగారు దిద్దుతున్నారు. నాకు 64 మార్కులు వచ్చాయి. అదే ఫస్ట్ మార్కట. మాస్టారు పేపర్ దిద్దుతూ నన్నెంతో మెచ్చుకున్నారట. ఆ విషయం నాతో చెప్పాలని వెంకటరావు ఎంతో ఉబలాటపడటం-వాడు ఏ విధమైన అసూయ పడకుండా నాకు చూపించటం ఇప్పటికి వాడి మంచి తనానికి ఉదాహరణగా గుర్తుంది. అబ్బు, దగ్గిరగా కాల్వగట్టున ఇళ్ళలో ఉండేవాళ్ళు. నేను నెగ్గిపూడి (కాలవ అవతల లాకు దగ్గిర) మా అత్తయ్య ఇంట్లో ఉండేవాడిని. మా ముగ్గురికి కలిసే చోటు మార్టేరు వంతెన. మధ్యాహ్న భోజనం అయినతర్వాత వంతెన దగ్గిర కలుసుకుని కబుర్లు చెప్పుకుంటూ స్కూలుకు నడుచుకుంటూ వెళ్ళే వాళ్ళం. ఎప్పుడూ కమూనిష్టు సాహిత్యం మార్క్స్, ఏంగిల్స్, హెగెల్ గతితార్కిక సిద్ధాంతం గురించి మాట్లాడేవాడు. వేరే ఎన్నో విషయాల మీద మాట్లాడు తూనే ఉండేవాడు. మంచి చదువరి, విశ్లేషణకర్త. అతని స్ఫూర్తి వల్లే నాకు శ్రీశ్రీ మహాప్రస్తానం నోటికి వచ్చేసింది. వెంకటరావు నాన్న గారు (రాళ్ళభండి మాస్టారు) పిల్లలని చాలా డెమోక్రాటిక్‌గా పెంచారు. సరదాగా జగన్నాధరథ చక్రాలు మిమిక్రీ చేసేవారట. పిల్లలు వస్తువులు వెతుక్కుంటూ వుంటే నా బట్టలు, నా బుక్కులు, నా పెన్ను ఎక్కడున్నాయ్, ఎక్కడున్నాయ్' అని పాడేవారట. ఇంట్లో పిల్లలకు కూడా శ్రీశ్రీ పిచ్చేనట. అబ్బు మంచి జోకులు వేసేవాడు. మా teachersని మిమిక్రీ చేసి నవ్వించే వాడు. వంతెన దగ్గిర కాఫీ హొటల్‌లో మంచినీళ్ళ కోసం వెళ్లేవాళ్ళం. అసలు విషయం ఏమంటే అక్కడ సర్వర్లు కాఫీ సాగతీస్తూ ఉండేవాళ్ళు. గ్లాసులో కాఫీ అడుగు నుండే ఇత్తడి కప్పులోకి ఏటవాలుగా కింద ఒక్క చుక్క కూడా పడకుండా కలుపుతూ కిందికి పైకి సాగ తీస్తున్నట్లు పోసేవారు. మేము వాళ్ళ నైపుణ్యానికి ఆశ్చర్యపోతూ చూస్తూ ఉండేవాళ్ళం. మా స్కూలులో వెంకటరెడ్డి మాస్టారు లైబ్రేరియన్‌గా ఉండేవారు. చాలా మంచివారు. మేమంటే చాలా ఇష్టం. Child classics జెసిరోలో అనే ఆయన రాసిన abridged editions ఉండేవి – అవేకాక ఈసప్స్ ఫేబిల్స్, tales of Pandeva princes అని మహాభారతం కథలు, ఇచ్చి చదివించే వారు. ఆ విధంగా మేము ముగ్గురం పోటీ పడి libraryలో ఉన్న ఇంగ్లీష్ పుస్తకాలన్నీ చదివేసాం. నాకు శరత్ సాహిత్యమంటే పిచ్చి. ఆయన రాసిన నవలలు, వ్యాసాలూ అన్నీ చదివేసాను. అచ్చం తెలుగులో రాసినట్లుంటాయి. బొందలపాటి శివరామకృష్ణ, శకుంతలా దేవిగారి అనువాదం అంత బాగుంటుంది. శరత్ తెలుగు వాడని ఆర్వియార్‌తో వాదించి- వాడికేమి తెలియదనుకుని శరత్ తెలుగు వాడని బెట్ కట్టి ఓడిపోయాను. నా ఉద్దేశ్యం ఏమంటే ఆర్వియార్‌కి కమ్యూనిస్ట్ సాహిత్యం తప్ప వేరే తెలియదని. కాని తర్వాత తెలిసిందేమంటే బొందలపాటి శివరామకృష్ణ, శకుంతలాదేవి గారు కమ్యూనిస్టులేనని. ఆర్వియార్, కాకినాడ పిఆర్ కాలేజీలో ఇంటర్‌లో ICE special English గ్రూప్‌లో చేరాడు. అప్పుడు ఆ గ్రూపు కాకినాడలోను, గుడివాడలోను వుండేవి. నేను కూడా ఆ గ్రూపులో చేరదామని వెళితే సీట్లు నిండిపోయాయి. ఆ కాలేజీలోనే కామర్స్ గ్రూపు ABCలో చేరా. ఆ తర్వాత ఆంధ్రా యూనివర్సిటీలో వాడు ఇంగ్లీష్ ఆనర్స్‌లోను నేను కామర్స్ ఆనర్స్‌లోను చేరాము. ఆ విధంగా మా అనుబంధం హైస్కూల్ తర్వాత కొనసాగింది. కాని స్కూల్లో ఉన్నా మజా లేదు. నేను యూనివర్సిటీలో ఎం.కాం చేసి గుల్బర్గాలో లెక్చరర్‌గా చేరాను. ఆ తర్వాత SBHలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా చేరాను. ఆర్వియార్ గవర్నమెంట్ **(మిగతా 103వ పేజీలో)**

ఆప్తవాక్యం

# Our memorable schooling days with RVR

- Nallamilli Prakash (Abbu)

I had the good fortune of growing up with RVR (we friends used to call him Venkatrao). We both attended SVG High School in Maruteru, West Godavari District and were classmates for over six years till SSLC. Our other close friends were Sonti Malleeswara Sastry (Malli) and Chellapilla Lakshminaray ana (Narayana). All four of us did reasonably well in SSLC but dispersed in different directions and lost touch until we got into employment. Both RVR and I got into teaching.

Our houses were close to each other fronting the canal that brought Godavari waters on its way to the sea past Narasapuram. We used to bathe in the canal and drink its water. We used to walk together to school and also in the evenings, along the canal bank (kalava gattu). He used to chat constantly and was a source of much information acquired no doubt rom his father and two elder brothers.

Even during school days, he was the only one who could talk unhesitatingly with the few girl students in the class. None of us others had the courage! We were avid readers and regularly visited the village library. We read magazines, fiction, non-fiction – in fact anything that we could lay our hands on. Our favourite pastime was raiding my grandfather's farms and help ourselves to seasonal produce like sugar cane, guavas, several varieties of mango, young fruit of palmyra palm (Tadi chettu) and coconut. We enjoyed eating pigeon pea seeds (kandulu) that were planted along paddy field boundaries. An annual activity before Deepawali for RVR, me and Narayana used to be the making of a variety of banasancha; under the eagle-eyed guidance of our multifaceted English teacher Chellapilla Venkata Rao garu- Narayanas father. We would start with making charcoal from the dried male flower clusters of tadichettu; and buying basic ingredients like surekaram; etc from the grocery shop. We used to prepare matabalu, chichu budlu, sisindrilu, bhoochakralu, tapakayalu. Sinsindrilu were a particular speciality of RVR and we used to test each batch. We children used to be mesmerised by this teacher who also used to treat people bitten by scorpions by chanting some mantras and waving twigs. He also wrote several popular fictional books.

I arrived in Maruteru at age 9 from Central India where my father worked in railways - Bengal Nagpur Railway (BNR) - as a station master. Since he used to be transferred often and the school facilities there were very poor, my maternal grandfather Chilra Subbi Reddy, who was the village munisiff (munsabu) offered to take me. Initially, my Hindi was better than my Telugu but I soon learned to cope with the Telugu medium. RVR grew up in a household of six boys and a girl. His father, Rallabhandi Satyanarayana, was a strict but scholarly teacher; he used to subscribe to "Bharathi". a literary magazine which we all read avidly. Much to our awe, he could write on palm leaves and had a good collection of palm leaf manuscripts.

Although we corresponded regularly when he was in Moscow and I was in Australia as a botanist, we caught up with each other in person only in Hyderabad after his sojourn in Moscow. By then he became a well-known scholar and contributed widely to magazines. Each time I saw him, he would present me a stack of books that he either wrote himself or liked. He will truly remain etched in my memory of the great carefree days we had together.

# మా అన్నయ్యతో మేము

## ఆప్తవాక్యం

- ఆర్.సీతారామం, ఆర్.ఎస్.గంగాధరం,
ఆర్.ఎస్.వేణుగోపాల్ - 98491 56025

మా అన్నయ్య శ్రీ ఆర్వియార్ గురించి ప్రత్యేక సంచిక వేస్తున్నాము. కొన్ని ఫొటోలు పంపమని శ్రీ వర్మ గారు అడిగినప్పుడు కొన్ని ఫ్యామిలీ ఫొటోలు పంపించాను. నన్ను కూడా ఓ వ్యాసం రాయమన్నప్పుడు పెన్ను ముందుకు కదల లేదు. ఈ మధ్య రాయడం తగ్గింది. మా ఇద్దరన్నయ్యలు ఆ పని నా మీదే పెట్టారు. శ్రీ ఆర్వియార్ పూర్తి పేరు శ్రీ రాళ్లభండి వెంకటేశ్వరరావు. మా తాతగారు శ్రీ వెంకయ్యగారు వారి పేరే మా నాన్న శ్రీ సత్యనారాయణ గారు పెట్టారు. కానీ ఇంట్లో అందరు వెంకట్రావు అనే పిలిచేవారు. హైస్కూలు మిత్రులు అబ్బు, ఎస్.మల్లేశ్వరశాస్త్రి, కనికిరెడ్డి చెళ్ళపిళ్ల లక్ష్మీనారాయణ వగైరా, కాలేజీకి వచ్చాక కాకినాడ పి.ఆర్. కాలేజీలో క్లాస్‌మేట్స్, అయ్యర్, (ఐ.ఏ.ఎస్., రిటైర్డ్), ఏటుకూరి ప్రసాద్, శ్రీ కె. భానుమూర్తి తదితరులు. అంతా ఆంధ్రా యూనివర్సిటీ సహాధ్యాయులు ఆంధ్ర యూనివర్సిటీ హాస్టల్ రూమ్మేట్స్. మా అన్నయ్యని ఆర్వియార్ అనే పేరు పెట్టింది శ్రీ భానుమూర్తి గారే. ఆయన మా అన్నయ్య పోయిన రోజున తరువాత రెండుసార్లు వచ్చి మమ్మల్ని మా వదినగార్ని పలకరించేవారు. ఈ మధ్యనే రెండేళ్ల క్రితం వయసురీత్యా కాలం చేశారు. అబ్బు, (ఎన్.ప్రకాష్), శ్రీ మల్లేశ్వరశాస్త్రి నాతో టచ్లోనే ఉంటూ మా యోగక్షేమాలు వాకబు చేస్తుంటారు. మా ఆర్వియార్ కి నాకు సుమారు 11/12 సంవత్సరాల తేడా ఉంది. అందుచేత ఆయన చిన్నప్పటి విశేషాలు పెద్దగా తెలియవు.

యూనివర్సిటీ చదువులో చేరాక మాకు బాగా జ్ఞానం వచ్చేసరికి తెలిసింది. ఆయన స్కూల్ చదువుల్లో ఆవరేజ్ స్టూడెంట్. యూనివర్సిటీకి వచ్చాక మార్టేరు మా ఇంట్లో ముందర గదిలో రాముల వారి ఫొటో, ఇతర దేవుళ్ల ఫోటోలు ఉండేవి. మా అన్నయ్య ఒక గ్లోబ్ పైన ఒక ఆడ, మగ సుత్తి కొడవలి ఉన్న పెద్దసైజు ఫ్రేమ్ ఫోటో విశాఖపట్నం నుంచి తెచ్చి, రాముల వారి ఫొటోల మధ్యలో పెట్టారు. మా నాన్న కూడ, ఆయన (ఆర్వియార్) భావజాల మార్పుకి ఏమీ అభ్యంతరం చెప్పలేదు. ఆ రకంగా మా కుటుంబంలో వామ పక్ష భావాలు నాటుకోవటానికి నాంది వేశాడు. వేసవి సెలవులకు వచ్చినప్పుడు మేమంతా ఆయనతోనే గడిపేవాళ్ళం. మా ఇంట్లో మా అన్నయ్య ఆర్వియార్‌కి ప్రత్యేక స్థానం. మా నాన్న గారి మాట ఫైనల్. ఆయనతో వాదించేందుకు ఎవరికీ ధైర్యం ఉండేది కాదు. కానీ చాలా డెమొక్రటిక్, ఉంటూ మమ్మల్ని ఎప్పుడూ ఏ విషయంలోనూ నిరుత్సాహ పరచలేదు. మా ఆర్వియార్, సెకండ్ బ్రదర్ వరహాలన్నయ్య (ప్రభాకరరావు) కొంచెం దగ్గర. 2-1/2 నుండి 3 సంవత్సరాల గ్యాప్. వాళ్ళ రాజకీయ విషయాలు, వాటిపై చర్చలు మాకు ఏదో కొత్తగా ఆనందంగా ఉండేది. మా వరహాలన్నయ్యకి డిగ్రీ రిజల్ట్స్ వచ్చిన వెంటనే ఎల్.ఐ.సి. బందరులో ఉద్యోగం వచ్చింది. ఆర్.వి.ఆర్. ఆంధ్ర యూనివర్సిటీ లో ఆనర్స్ పూర్తయ్యాక మార్టేరులో కొద్దిరోజులు మాత్రమే ఉన్నారు. అక్కడే వంతెన క్రింద శ్రీ డాక్టరు వనమరాజు గారి ఆస్పత్రిలో సాహిత్య చర్చలు జరుగుతుండేవి. ఎస్.బి.ఐ. క్యాషియర్, వనంపల్లి, వెలగలేరు, మార్టేరులో మరికొంతమంది సాహితీప్రియులు అక్కడ సాయం త్రం 6 గంటల నుంచి 8.30 వరకు సాహితీగోష్ఠి జరిగేది.

తరువాత మా అన్నయ్యకి మొదట కొత్తగూడెం మైనింగ్ ఇన్స్టిట్యూట్లో ఇంగ్లీష్ లెక్చరర్ గా ఉద్యోగం. అది కొద్ది నెలలే చేసారు. తరువాత కడప గవర్నమెంట్ కాలేజ్లో ఇంగ్లీష్ లెక్చరర్ ఉద్యోగం వచ్చాక వెళ్లారు. 1965లో కడపలో ఉన్నప్పుడే ఆయనకు మా వదిన శ్రీమతి సుందరి గారితో వివాహం జరిగింది. మాకు ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి అయ్యి, నేను మా ఎల్.ఐ.సి. అన్నయ్య వద్ద, మా పండు మా ఆర్వియార్ దగ్గర తలో 4 సంవత్సరాలు కాలేజీ చదువులు పూర్తి చేసేంత వరకు వాళ్ళతోనే ఉన్నాం. మా చిట్టి (శ్రీసీతారామం) ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి అయ్యాక కాకినాడ ఐ.ఐ.టి.లో డిప్లమో కోర్సు 1-1/2 సంవత్సరాలు చేసి, పెంటపాడు గవర్నమెంట్ స్కూల్లో జాబ్లో జాయిన్ అయ్యారు. నాకు డిగ్రీ ఫైనల్ ఇయర్‌లోనే తణుకు సెంట్రల్ బ్యాంకులో ఉద్యోగంలో సెలక్ట్ కావడం పండు (గంగాధరం) గారు డిగ్రీ పూర్తి అయ్యాక హైదరాబాద్లో ఉద్యోగానికి చేరేరు. 1970 నాటికి మేం అంతా జాబ్లో సెటిల్ అయ్యాము. మేము మొత్తం ఏడుగురి సంతానం. 3వ వారు ఆర్వియార్. తరువాత మా సీతారామం చిట్టి, తదుపరి మా అక్క కళ్యాణి ఒక్కరే ఆడసంతానం. మా అక్క తరువాత మేము ఇద్దరం (పండు, వేణు) అన్నదమ్ములం. మా అందరికీ ఒక్కరే సిస్టర్ గనుక ఆవిడ అంటే మా అందరికి ఎంతో ప్రేమ. మా అన్నలు మా నాన్న గార్లకు మరింత అభిమానం, ఇష్టం. క్లుప్తంగా ఇదీ కుటుంబ నేపథ్యం.

ఆ రోజుల్లో పెద్దేవం గ్రామంలో మాకు మా పెద్ద నాన్న గార్లకు కలిపి సుమారు 85/90 ఎకరాల భూస్వాములం. మా తాత, మా పెదనాన్న గార్లతే ఊరి అజమాయిషీ. 1930లో వయసు రీత్యా పంపకాలు చేసారే గానీ అంతా సమిష్టిగానే ఉండేది. మేము అన్నదమ్ములం కలిసి కట్టుగానే ఉన్నాం. 1987 తర్వాత మా అమ్మానాన్నలు కాలం చేశాక మా పెద్దన్నయ్య డి.ఇ.ఓ. శ్రీ శ్యామలరావు రిటైర్ అయినాక ఓన్లీ పేపర్స్ మీద మాత్రం భాగాలు రాసుకున్నాం. ఇప్పటికీ ఒకేమాటపై ఉంటూ ఉన్నాము. ప్రధాన నిర్ణయాలు, శ్రీ వరహాలు ఆర్వియార్ చూసేవారు. తతిమ్మా సోదరులెవరూ ఎదురు చెప్పేవాళ్లం కాదు. మా అక్క కల్యాణి, మా బావ శ్రీ ఈమని శేషగిరిరావు గార్లకు వివాహం జరిగింది. మా వరహాలన్నయ్య, మా బావగారు శ్రీ శేషగిరిరావు కాకినాడలో కాలేజీ క్లాస్‌మేట్స్. వీరితోపాటే సినీ హీరో శ్రీహరినాథ్ క్లాస్‌మేట్. చాలా అందంగా ఉండేవాడని మా అన్నయ్య, మా బావగారు కూడ చెబుతూ ఉండేవారు. ఆర్వియార్‌కి ఆంధ్ర యూనివర్సిటీలో పడిన సాహిత్యం బీజం, ఎ.ఐ.ఎస్.ఎఫ్. కార్యకర్తగా, పనిచేయటం వల్ల ఓ పెద్ద సాహితీ వేత్తగా పరిణతి చెంది కడప వెళ్లాక శ్రీ రా.రా. గారు, శ్రీ వై.ఈశ్వరరెడ్డి (ఎక్స్ ఎంపీ) శ్రీ కేతు విశ్వనాథరెడ్డి (ఈ మధ్యనే మూడు నెలల క్రితం) కాలం చేశారు. శ్రీ చెన్నారెడ్డి తెలుగు హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్, మరో ఇంగ్లీష్ లెక్చరర్, శ్రీ వి.రామ కృష్ణారావు గారు వీరంతా ఓ కుటుంబంలా ఉండేవారు. వాళ్లతో స్నేహం వల్లే మాకు కూడా బాగా చనువు ఏర్పడింది. పెంటపాడు గవర్నమెంటు కాలేజీలో చేరాక మా అన్నయ్య శ్రీ చిట్టి (సీతారామం) ఆర్వియార్ ఒకే ఇల్లు తీసుకుని ఉమ్మడి కుటుంబంలాగా ఉండేవారు. తరువాత పెంటపాడు ఆనర్స్, ఎమ్.ఎ. అయిన శ్రీ రామకృష్ణారావు ఇంగ్లీష్ లెక్చరర్‌గా పెంటపాడులో చేరాక మా అన్నయ్య గారింట్లోనే ఎప్పుడూ నిత్య అతిథి. ఓ వారాలబ్బాయికి, (ఆరోజుల్లో బీద విద్యార్థులు వారాలు చెప్పుకునేవారు) కి ఓ రోజు భోజనం, అప్పుడప్పుడు ఫీజ్ కి వగైరాలకు ఆర్థిక సహాయం చేసేవారు.

నేను తణుకులో 1969లో బ్యాంకులో చేరాక శని ఆదివారాలు తప్పక పెంటపాడు వచ్చేవాణ్ణి. నాతోపాటే మా బ్యాంక్ కొలీగ్ శ్రీ గంటి వెంకట్రామయ్య వచ్చేవాడు. రెండు వారాలు పెంటపాడు వస్తే ఓ వారం మా అమ్మా నాన్నల కోసం మార్టేరు వెళ్లేవాడిని. గవర్నమెంటు కాలేజీ పెంటపాడు ఇంగ్లీష్ హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ శ్రీ వై.చక్రధరరావుగారు, మా వరహాలన్నయ్య కాకినాడ పీఆర్ కాలేజ్‌లో క్లాస్మేట్స్ మరియు దోస్తులు. అప్పటి నుంచే మా ఆర్వియార్‌కి పనిపట్ల ఉన్న నిబద్ధత వల్ల పూర్తి బాధ్యతలు మా అన్నయ్యకు అప్పజెప్పేవారు. కడప నివాసంలో మా అన్నయ్య, శ్రీ రారాగార్లు మరికొంత మంది సాహితీ మిత్రులతో "సంవేదన" సంచిక వెలువడింది. దరిమిలా శ్రీ రారా గారు మాస్కో వెళ్ళటం మూలంగా నిలిపివేసారు. ఆరు/ఏడు సంచికలు వెలువడ్డా, సాహితీ విమర్శకుల లోకంలో సంచలనం సృష్టించింది. పైన పేర్కొన్న శ్రీ కేతు విశ్వనాథరెడ్డి గారు, రా.రా.గారు, చెన్నారెడ్డి గారు తదితరులతో మా కుటుంబంలో, అందరికీ సుపరిచితులు. మరో సోదరి శ్రీమతి ఎస్.మనోరమ గారు, పెంటపాడు వచ్చినాక, శ్రీమతి మనోరమ, శ్రీ వర్మగారు మాకు ఆత్మీయ బంధువుల య్యారు. మా అమ్మ, మనోరమ గారిని, ఏమమ్మా, మనోహరమ్మ అని పిలిచేది. అందరి మనస్సులను ఆకట్టుకుని మా ఇంట్లో మరో సోదరిలా కలిసిపోయింది. శ్రీమతి మనోరమ గారు, చిట్టి, పండు, నేను, బాగా దగ్గర చనువు. మా భార్యలతో సహా మా అమ్మ, నాన్నల భోజనాలయ్యాక, మేమంతా ఒకే సోదరవరంలా కలిసి భోజనాలు చేస్తూ కబుర్లు చెప్పుకుంటూ కనీసం ఓ గంట కంచాల వద్దే కూర్చునేవాళ్లం.

పెంటపాడులో మా ఇంట్లోనే శ్రీ రా.రా., గజ్జెల మల్లారెడ్డి, రాంభట్ల కృష్ణమూర్తి గారు, శ్రీకపర్ది గారు ఎట్లీస్ట్ వన్స్ ఇన్ టు మంత్స్ పెంటపాడులో, సాహితీ కచేరీ జరిపేవాళ్ళు. కడప నుంచి వచ్చి 3, 4 రోజులు ఉండేవారు. పెంటపాడు వర్గీయుల్లో తణుకులో పనిచేసే పి.రామకృష్ణరాజు (తెలుగు రాజు గారి అబ్బాయి. ఫిజిక్స్ లెక్చరర్ గారు కలిసేవారు. మా అక్క కల్యాణి లాగే శ్రీమతి మనోరమను మా అమ్మ ట్రీట్ చేసేది. మా అన్నదమ్ములకు మాత్రం వర్మగారితో సన్నిహితత్వం. అలాగే శ్రీ మణ్యంరాజు గారు వీళ్లందరూ మాకు హితులు, సన్నిహిత్యం. రారాగారు మాస్కో నుంచి తిరిగి వచ్చాక అక్కడ పి.పి.హెచ్.లో ఇంగ్లీష్ నుండి తెలుగు ట్రాన్స్‌లేటర్ అవసరం రాగా మొత్తం పార్టీ ఆర్వియార్ పేరును సూచించగా పర్మనెంట్ గవర్నమెంట్ ఉద్యోగం వదిలి రమ్మనడం ఎల్లా, అని ఆలోచించే సమయంలో శ్రీ కపర్దీ గారిని, రంగంలో దింపి ఒప్పింపచేసే బాధ్యత ఇచ్చారు. శ్రీ కపర్ది గారు, శ్రీ వర్మ గారు మా అన్నయ్యని ఒప్పించి, రాజీనామా చేయించి, మాస్కో పంపే సన్నాహాలు చేశారు. నేను మా వరహాలన్నయ్య ఢిల్లీ వరకు వెళ్లి అజయ్ భవన్‌లో రెండ్రోజులు ఉండి మా అన్నయ్యను మాస్కో ఫ్లైట్ ఎక్కించాము.

మా ఫాదర్ 1976 చివరిలో పోయాక, మా అన్నయ్య తణుకు నుంచి రాజోలు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. తణుకులో మా అన్నయ్య, నేను 78, 79లలో కలిసే ఉన్నాము. 1980లో ప్రమోషన్‌పై నేను విజయవాడకు వెళ్ళాను. మా ఆర్వియార్‌కు, అన్న దమ్ములతో కలిసి కాలం గడపడం అంటే ఎంతో ఇష్టం. కనీసం రెండు నెలలకోసారి మేము తాడేపల్లిగూడెం మా ఎల్.ఐ.సి. అన్నయ్య గారింట్లో రెండ్రోజులు గడిపేవాళ్లం.

ఆయనకి కూడా మాతో ఉంటే ఉల్లాసంగా ఉండేవారు. మాస్కోలో రాజకీయ పరిస్థితులు తారుమారయ్యాక అక్కడ ఉండలేక ఇండియాకు మకాం మార్చేసారు. సుమారు పుష్కరకాలం యు.ఎస్.ఎస్.ఆర్. లోనే గడిపి హైదరాబాద్ వచ్చాక మా పండుతోనే సుమారు రెండేళ్లు కలిసే ఉన్నారు. ఉద్యోగం మళ్లీ సంపాదించి పూర్తి జీతభత్యాలతో, ఆబ్సెంట్ పిరియడ్‌ను లాస్ ఆఫ్ పేగా ట్రీట్ చేస్తూ రాజోలు గవర్నమెంట్ కాలేజీకి తిరిగి తీసుకున్నారు. తరువాత ప్రిన్సిపాల్‌గా ప్రమోషన్ పై రామన్నపేట వెళ్లి అక్కడనే రిటైర్ అయ్యి, మల్కాజిగిరిలో సెటిల్ అయ్యారు. మా పండుకి, మా చిట్టి గారి పిల్లలకి దగ్గర లోనే ఉంటూ, మల్కాజ్‌గిరిలో ఇల్లు కొనుక్కుని సెటిల్ అయ్యారు. అన్నయ్య సిటీకి వచ్చాక కనీసం 15 రోజులకు ఓ సారి కలిసేవాళ్లం. నేను తమిళనాడు, బొంబాయి వగైరా ప్లేసెస్లో 12 ఏళ్లు ప్రమోషన్స్‌పై తిరిగి 2005లో హైదరాబాద్ వచ్చి ఇక్కడే 2009/2010 ప్రాంతాల్లో రిటైర్ అయ్యాను. ఫ్రెండ్, సోదర సమానులు, శ్రీ గంటి వెంకట్రామయ్య గారి ఇంటికి దగ్గరలో ఓ అపార్ట్‌మెంట్ కొని, ఇక్కడే సెటిల్ అయ్యాను.

మా వదిన శ్రీ పేరి లక్ష్మి గారు, శ్రీ సీతారామం గారి భార్య కూడా మరణించాక, మా అన్నగారి పిల్లలు వారిని ఇక్కడకు తీసుకొచ్చేశారు. పెంటపాడులో ఇల్లు కట్టుకొన్న మమకారంతో, మా అన్నగారి పిల్లలు వారిని నెలకో, నెలా పదిహేను రోజులకో మారు వెళ్లి వస్తుంటారు. వారితో మేము కలిసి సాధ్యమైనంత వరకు వెళుతుంటాము. ఇక్కడికి వచ్చాక శ్రీ పి.రాజేశ్వరరావు, విశాలాంధ్ర జీఎం గారితో మా బంధం బలపడింది. బూదరాజు గారు చనిపోయాక ఏ విషయానికైనా ఆర్వియార్ అన్నయ్యే నాకు ఎన్‌సైక్లోపీడియా. ఏ సాహితీ సమస్యకైనా నిఘంటువు మా అన్నయ్య అని రాజేశ్వరరావు గారు అంటూ ఉంటారు. 2012 జూలైలో మా వరహాలన్నయ్య అదే సంవత్సరం డిసెంబర్‌లో ఆర్వియార్ కూడబలుక్కున్నట్లు స్వర్గస్థులయ్యారు. ఆర్వియార్ వెళ్లిపోయాక 2014లో మా వదిన శ్రీమతి సుందరమ్మ కూడా పరమపదించారు.

ఆయన పోయినప్పుడు శ్రీ రాయపాటి సాంబశివరావు (ఎమ్.పి.), భండారు శ్రీనివాసరావు గార్లు, మాస్కో మిత్రులు చాలా మంది కడసారి దర్శించి నివాళులర్పించారు. అన్నయ్య మాస్కోలో ఉన్నప్పుడు అన్నయ్య గారింట్లో భోజనం చేయని వారు లేరంటే అతిశయోక్తి కాదు. శ్రీ గానగంధర్వ శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు, సినీ హీరో మెగాస్టార్ శ్రీ చిరంజీవి, శ్రీ నాగబాబు గారు, శ్రీ నీలం రాజశేఖరరెడ్డి లాంటి రాజకీయ ఉద్దండులు వారిలో ఉన్నారు. విశాలాంధ్రలో కీలకబాధ్యతలు వహించే శ్రీ పి.పి.సి. జోషి, (మాకు సమీప బంధువు. బావగారు అవుతాడు) మా అన్నయ్యని చాలా మిస్ అయ్యానని బాధపడేవాడు. ఆయన మరణానంతరం తర్వాత ఐదు, ఆరు రోజులకు అధికారికంగా "కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించింది. ఓ వారం ముందు వెలువడి ఉంటే అందరం ఎంతో సంతోషించేవాళ్లం. కుటుంబం అంతా ఆయనతో వెళ్లి ఉండేవారం.

మా వదినగారు అనారోగ్య కారణంగా ప్రయాణించలేక మానుకున్నారు. అన్నయ్య సాహితీ వ్యాసాంగం గురించి చాలా వ్యాసాలు వ్రాసారు. అందుచేత మేము వాటి జోలికి పోలేదు. ఇదీ కుటుంబం, వారి ఉద్యోగం, మిత్రులతో సాన్నిహిత్యం, క్లుప్తంగా రాసాను. నేను బ్యాంక్ యూనియన్స్ ఆఫీస్ బేరర్గా పనిచేసేవాణ్ణి. రాతలకు దూరమయి ఉన్నవాణ్ణి గనుక, తప్పులున్నా, అతి అనిపించినా క్షంతవ్యులం. మా అన్నదమ్ములం కలిసి రాసిన చిన్న వ్యాసం, స్వీకరించెదరు గాక. ❑

# హాస్య చతురుడు

**(99వ పేజీ తరువాయి)**

కాలేజీలో లెక్చరర్‌గా చేరాడు. అబ్బు Scienceలో దిట్ట. కామన్వెల్త్ స్కాలర్‌షిప్ మీద పీహెచ్‌డీ చేసిన వాడు కూడా టీచింగ్‌లోనే సెటిలయ్యాడు. ఇప్పుడు ఆస్ట్రేలియాలో యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యి బ్రిస్బేన్‌లో ఉంటున్నాడు. ఒకసారి మల్కాజిగిరిలో ఆర్వియార్ ఇంటికి వెళ్లాను వాడి దగ్గర ఉన్న తన రచనలన్నీ ఇచ్చాడు. తొలగిన స్వర్గం తన రష్యా ప్రస్థానం గురించి రాసింది ఇచ్చాడు అది బాగా నచ్చింది నాకు. వాడు చాలా పుస్తకాలు రాశాడు. అందులో 'పనికొచ్చే ముక్క', తెలుగు సాహిత్యం మీద రాసిన పుస్తకం చదివాను. నాకు ఈ పుస్తకాలు చాలా నచ్చాయి. లోతైన విశ్లేషణ, విషయ పరిజ్ఞానం చాలా అద్భుతమనిపించాయి. వాడి హాస్య చతురత, చమత్కార సంభాషణ మంచి లైవ్లీగా ఉంటాయి. అప్పుడప్పుడు ఆర్వియార్‌తో ఫోన్లో మాట్లాడుతూ ఉండేవాడిని. ఒక అనువాదకుడుగా అతనికి మంచి కీర్తి ప్రతిష్టలు వచ్చాయి. ఎంతో మంది కుప్పలు తెప్పలు గా పుస్తకాలు అనువాదానికి పంపించేవాళ్ళు. అందుకని ఎల్లా వున్నావురా అని అడిగితే నేను నా ఫ్యాక్టరీ (అనువాదాలు) బాగా నే వున్నాము అనేవాడు. రాసి రాసి వేళ్ళు నొప్పులు పెడుతున్నా యి అనేవాడు. మా నలుగురిలో ఆర్వియార్ పదేళ్లు ముందు వెళ్ళి పోయాడు. ఎప్పుడూ తలుచుకుంటూ ఉంటాము. ఈ విధంగా స్మారక సంచికలో వ్యాసం రాయటం వల్ల చిన్ననాటి మధుర స్మృతులు పునశ్చరణకి అవకాశం వచ్చింది. ❑

# సామాన్యులలో మాన్యుడు, అసామాన్యుడు, అగ్రగణ్యుడు

- వారణాసి సుధాకర్

'శ్రీరంగం శ్రీనివాసరావు' అంటే తెలియనివాళ్ళు కూడా 'శ్రీశ్రీ' అనగానే' ఓ..ఆయనా..' అన్నట్టుగానే.. 'రాళ్ళభండి వెంకట్రావు' అంటే కొద్దిమందికే తెలిసిన ఒక వ్యక్తి ఆర్వియార్ అనే మూడ క్షరాలతో, భారత కమ్యూనిస్టు కామ్రేడ్లకు, సాహిత్యలోకానికి, బంధుమిత్ర సపరివార సమేతులకు, సుపరిచితులు. నాకు హితుడు, స్నేహితుడు, సన్నిహితుడు, నా శ్రేయోభిలాషిగా నాకు కావలసినవాడు. బంధుత్వరీత్యా సోదర సమానుడు స్వర్గీయ ఆర్వియార్ గారు. 'మేము కలుసుకున్న సన్నివేశాలు తక్కువ. తలుచుకున్న సంఘటనలు ఎక్కువ' అని చెప్పవచ్చు. ఆయన ప్రక్కన కూర్చుని, 'పిచ్చా పాటీ' మాట్లాడుతుంటే, 'ఈయనలో ఇంత విద్వత్తు వుందా' అని ఆశ్చర్యపరిచే 'ఘనాపాటి' ఆయన !

ఈ కరుడుగట్టిన కమ్యూనిస్టు, 'మార్క్సిస్టు-లెనినిస్టు' సాహిత్యంలో ఉద్దండుడే కాదు. మన ఆగమ శాస్త్రాలు, సంస్కృతీ సంప్రదాయాలు, లోతుగా తెలిసిన పండితుడు. వాటిమీద పుస్తకాలు, వ్యాసాలు రాసిపడేసిన 'సవ్యసాచి'. "నడిచే విజ్ఞాన సర్వస్వం" కూడా !! ఆంగ్ల-ఆంధ్ర-గీర్వాణ భాషలను అక్షరాభ్యాసం నాడే ఔపోసన పట్టి, ఆచమనం చేసేసిన వాడనుకుంటా. బహుశా అందుకేనేమో.. నాటి సోవియట్ యూనియన్ వాళ్ళు, 'మీ భారతదేశంలో ఇంగ్లీషు-తెలుగు భాషల్లో దిట్టమైన వాడు ఎవరైనా వున్నారా ?' అని అడిగితే.. మనదేశ కమ్యూనిస్టులు, తమకి అత్యంత ఇష్టుడు, ఆ ఉభయభాషల్లో గరిష్ఠుడు, 'మావాడొకడు ఉన్నాడహో' అని చాటింపు వేయించి, 'ఆర్వీఆర్'ని దొరకపుచ్చుకుని, నిక్షేపంలాంటి ఇంగ్లీషు లెక్చరర్ని, దారా సుతులతో సహా, 'పన్నెండేళ్ళ విజ్ఞాన వాసం' చెయ్యమని, మాస్కో విమానం ఎక్కించేశారు! 'విద్వాన్ సర్వత్రా పూజ్యతే' అని మన ఆర్వియార్‌కి తెలుసు కాబట్టే, అక్కడిదాకా వెళ్ళి, ఆ చలిదేశంలో కూడా, తన సాహిత్య సౌరభాలు వెదజల్లాడు !

తన వృత్తి.. కాలేజీలో ఇంగ్లీషు పాఠాలు చెప్పడం అయితే, ప్రవృత్తిపరంగా.. రచయిత, పరిశోధకుడు, నిత్యాన్వేషి, అనువాదకుడు కాబట్టి, మాస్కోలో కూడా, 'చూస్కో నా తడాఖా' అని, ఇంగ్లీష్ భాషలోని పిల్లల రష్యన్ కథల్ని తెలుగులోకి పుంఖానుపుంఖాలుగా అనువదించి పడేసి, ఆ 'రాదుగా' సంస్థకి మంచి పేరు వచ్చేటట్టుగా చేసి, ఆర్వియార్ అనే తన మూడక్షరాల పేరుని, ప్రపంచ వ్యాపితం చేసుకున్నాడు. 'ఏదేశమేగినా.. ఎందుకాలిడినా' అన్నట్టు, మన తెలుగు వాళ్ళు, ఎవరు, ఎప్పుడు, ఏ పనిమీద, మాస్కో వెళ్ళినా, 'నేనున్నా.. నేనున్నానూ' అంటూ, వాళ్ళందరికీ, తెలుగు 'ఇష్టాన్న, మృష్టాన్న' భోజనాలతో, అతిథి సత్కారాలు అందజేసిన స్నేహశీలి మన ఆర్వియార్ ! అలాగని, ఆయనెప్పుడూ వంటలూ-వార్పులూ చెయ్యలేదు ! అందుకు, ఆయన అర్ధాంగి, మా వదిన సుందరమ్మ గారు, 'మాస్కోలో డొక్కా సీతమ్మ' పాత్ర పోషించింది. బాలమురళి, చిరంజీవి లాంటి ఉద్దండులు, వాళ్ళు పెట్టిన తెలుగింటి భోజనానికి ఉబ్బితబ్బిబ్బి అయిపోయి, ఇండియా వచ్చినపుడు, ఆర్వియార్ దంపతుల్ని తమ అతిథులుగా పిలిచి, వాళ్ళ 'ఉప్పు తిన్న' ఋణం, అంతకంతా తీర్చుకున్నారు ! ఎవరికైనా ఉపకారం చెయ్యాలంటే, 'క్యూ' పద్ధతి పాటించకుండా, అందర్నీ ప్రక్కకి తోసేసి, ముందుకొచ్చి నిలబడే వంశం మన ఆర్వియార్ గారిది ! ఎంత మందికో.. ఎన్నో రకాలుగా.. 'ఉప్పూ-కారాలు' తినిపించి, ఉపకారాలు చేసినా, చెప్పుకోవడం ఒక్కటే... ఆయనకి 'తెలియని విద్య' ! బహుశా అందుకేనేమో... కడపలో మొదలెట్టి, తణుకు నుంచి తాడేపల్లిగూడెం దాకా, రష్యా గుండా రాజోలు నుంచి రామన్న పేట దాకా, అందరూ ఆయన్ని ప్రేమతో తమవాణ్ణి చేసుకున్నారు ! ఆర్వియార్ అంటే, ఒక వ్యక్తి పేరు కాదు, ఆంధ్ర – గీర్వాణ – ఆంగ్ల భాషల ఉమ్మడి నిఘంటువు ! 'మేము ఆర్వియార్ గారి శిష్యులం' అని ఈనాటికీ గర్వంగా చెప్పుకుంటారు ! పిల్లలతో పిల్లాడుగా, కుర్రాళ్ళతో కుర్రాడుగా, మేధావుల్లో మేధావిగా మమేకమై వెలుగుతూనే, ఒం టరిగా వున్నప్పుడు, తన మేధస్సులో వున్న విజ్ఞానాన్ని భావి తరాల వారికోసం గ్రంథస్థం చేస్తూ, భావి జర్నలిస్టులకి పాఠాలు చెబుతూ, టీవీ చర్చల్లో తన దృక్పథాన్ని బలంగా వినిపిస్తూ, బహుముఖ ప్రజ్ఞాశాలిగా తన జీవితాన్ని సార్థకం చేసుకున్న అరుదైన వ్యక్తిత్వం కలిగిన మన ఆర్వియార్, సునాయాస మర ణం పొందిన ధన్యుడు, అన్నిటా అగ్రగణ్యుడు ! ఆయన ఆకస్మిక మరణం పొందిన రోజున, ఎంతో బిజీగా వుండే ఎంపీ, వ్యాపార దిగ్గజం, రాయపాటి సాంబశివరావు వంటి నాయకులు కూడా వచ్చి, ఆయనపట్ల గౌరవంతో, నివాళులు అర్పించారంటే.. అదే మన ఆర్వియార్ సంపాదించుకున్న ఆస్తి. ఆయన సత్కీర్తికి మరణం నాస్తి ! మా అన్నగారు, ఆర్వియార్ గారికి, ఇవే నా వినమ్ర నివాళులు ! ❑

# నేను
# నా పుస్తకాలు

## ఆర్వియార్ స్వీయ రచనలు - అనువాదాలు



- ఆర్వియార్

1. సాహిత్య తత్వం (ఆధునిక సాహిత్య విమర్శ) (3వ ముద్రణ)
2. మతం మార్క్సిజం (2వ ముద్రణ)
3. హిందూమతం (3వ ముద్రణ)
4. విశాలాంధ్ర ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు(7వ ముద్రణ)
5. విశాలాంధ్ర ఇంగ్లీషు గ్రామర్ కంపోజిషన్ (6వ ముద్రణ)
6. ఆర్వియార్ ఈజీ ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్సు (7వ ముద్రణ)
7. తత్వశాస్త్రం మౌలిక సూత్రాలు (గతి తార్కిక భౌతికవాద సిద్ధాంత పరిచయం)
8. రష్యన్ తెలుగు సంభాషణ (జిల్లా బరాన్ని కోవాతో కలిసి రెండో ముద్రణ)
9. ఆర్వియార్ ఇంగ్లీషు గ్రామర్ (3వ ముద్రణ)
10. సమతావాది బాబూ జగ్జీవన్ రాం
11. తొలిగిన స్వర్గం (పదేళ్ల సోవియట్ అనుభవాలు)
12. భగవద్గీత మార్క్సిజం
13. ఇరవయ్యవ శతాబ్ది తెలుగు కవులు (రేడియో ప్రసంగాలు) (3వముద్రణ)
14. పూర్వాధా కల్పతరువు (3వ ముద్రణ)
15. పనికొచ్చే ముక్క కథలు (ఆంధ్రభూమి)
16. ఆంధ్ర సాహిత్య చరిత్ర (2వ ముద్రణ)
17. భారతీయ సాహిత్య భావన (తెలుగు ఎమ్.ఎ. పాఠం)
18. అనువాదాలు ఆవిష్కరణలు, అవస్థలు
19. ఆర్వియార్ సాహిత్య, వ్యాసాలు
20. యుగకర్త శ్రీశ్రీ

## అనువాదాలు

1. బుల్లి మట్టి ఇల్లు (తొలిముద్రణ 1981
2. కొసక్కులు (టాల్ స్టాయ్)
3. పిల్లలకే నా హృదయం అంకితం(1983, 1987, 2000)
4. కమ్యూనిజం (ప్రశ్నలు - జవాబులు)
5. గడియారాల గురించి నీకు తెలుసా? (1983, 1989)
6. మానవుడే మహా శక్తి సంపన్నుడు (ఇల్విన్ సిగల్) 3 ముద్రణలు
7. మనం పరిత్యజించే వారసత్వం ఏమిటి? (లెనిన్)
8. ఎర్ర తెరచాపలు (గ్రిన్)
9. ఆకాశవీధిలో హాయిగా ఎగిరేవు
10. గొప్పవారి గూడు (ఇవాన్ తుర్గెనీవ్)
11. సాహిత్య వ్యాసాలు (మక్సీమ్ గోర్కీ)
12. మొదటి వేట 13. భయం లేని వీత్య (1985, 1989)
14. గ్రీష్మీ రోదసీ యాత్రికుడు 15. రాళ్ళవంకి (కుప్రిన్)
16. మనకాలం వీరుడు (లెర్మంతోవ్)
17. ప్రతిరూపాలు 18. సముద్రం మీద ఓడల విహారం
19. రంగు రంగుల చేపలు (3 ముద్రణలు)
20. నొప్పి డాక్టర్ 21. అగ్నికణం నుండి అణువిద్యుత్ దాకా
22. నీళ్లు ఎందుకు తడిగా ఉంటాయి?
23. టెలిస్కోప్ చెప్పిన కథ 24. పసివాడి పగ
25. ధైర్యం గల చీమ 26.జెంఘిజ్ఖాన్ (యాన్)
27. సమరంలో కలసిన గీతలు (పనోప్తెన్)
28. అపరాధ పరిశోధకుడి నోట్స్
29. మేలు మరవని పిచిక
30. భూమి ఇలా ఉందని ఎలా కనిపెట్టారు? (1987, 1989)
31. ఆలిస్ (నవల) 32. ఇవన్నీ కుక్కలే (శునకాల వివరాలు)
33. ఆకుపచ్చ ద్వీపం 34. అడవిలో ఇల్లు
35. ఇంటికి చేరిన చీమ 36. కళాతపస్వి యెగోర్
37. ఉక్రెయిన్ జానపద గాథలు
38. అన్నా కరేనినా (2 భాగాలు) టాల్ స్టాయ్
39. చిత్రాల్లో ఖగోళ శాస్త్రం 40. ఇకతియాండర్ (బెలాయెవ్)
41. బంగారు గిన్నె
42. నాన్నారి చిన్నతనం (వార్త దినపత్రిక ఆదివారం అనుబంధంలో సీరియల్)
43. బంగారు తాళం 44. బుల్లిభడవ ఎలుగు (గేయ కథ)
45. అడవిలో జంతువులు 46. నేరము శిక్ష (దాస్తయేవ్స్కి )
47. వెండిగిన్నె 48.ఇద్దరు మిత్రులు(టాల్‌స్టాయ్ పిల్లల కథలు)
49. షోలిపోవ్ కథలు 50, పీత సన్యాసి, కడలి గులాబి
51. పునరుత్థానం టాల్ స్టాయ్ (అముద్రితం)
52. గాయక కవి జిరేన్ షా సుందరి కరాంగి (కజక్ జానపద కథ)
53. (కిర్గిషు) కొంటి పిల్లవాడు 54. సముద్రంలో ఉండే జీవులు
55. కణాలు, ఇంకా ఎక్కువ కణాలు

53.సోవియెట్ దేశ అద్భుత కథలు
57.ఎగిరే గొంగళి పురుగు 58. మన ఇల్లు- భూగోళం
59.నక్క కుందేలు (రష్యన్ జానపద కథ)
60.ఇల్లు అలాంటి ఆవాసాలు (రాదుగ ప్రచురణలు)
61.చెహోవ్ కథలు 62.దేవుళ్ళు, దయ్యాలు, భూతాలు(డాక్టర్ కొవూర్)
63. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచనలు (వాల్యూం 6)
64. నసీరుద్దీన్ కథలు
65. ప్రపంచం పుట్టినప్పుడు (వెరియార్ ఎ ఎల్విన్)
66. భారతదేశ జానపద గాథలు
(సం.ఎ.కె రామానుజం ప్రచురణలు)
67. ప్రొ.వి. రామకృష్ణ ఆంగ్లవ్యాసాలు ఉపన్యాసాలు
68. డాంగ్ : చరిత్ర చోదక శక్తులు
69. ప్రాణదాత యల్లాప్రగడ సుబ్బారావు,
ఎస్.వి.కె.గుప్తా (ఆంధ్ర విశ్వవిద్యాలయం)
70. బాలల కోసం బుద్ధ కథ (నే. బు.ట్ర)
71. ప్రాచీన భారతదేశ చరిత్ర సంస్కృతి - స్థూల పరిశీలన
డి.డి. కౌశాంబి (తెలుగు అకాడమీ)
72. కమ్యూనిస్టు ప్రణాళిక - 150 ఏళ్ల తర్వాత
73. సృజనాత్మక జీవితం కోసం విద్య
(జపాన్ మూలం:మాకిగూచి) (నే, బు.ట్ర)
74. మదర్ థెరీసా : ఇంగ్లీష్ మూలం నవీన్ చావ్లా (3వ ము)
75. కొలచల సీతారామయ్య ఎస్.పి.కె.గుప్తా (అముద్రితం)
76. Industries Vastu 77. astu World
78. Gruhavastu Plans
79. Throne thrown to sandals (2nd Story of Ramayana Visha alouspo Vriksham by Ranganayakamma)
80. Yoga is Necter (ఇంగ్లీషులోకి చేసిన అనువాదాలు)
81. సామాజిక శాస్త్రం అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (2 సంపుటాలు) 82. పౌరస్పందన వేదిక (జాతీయ మానవ హక్కుల సంఘానికి లేఖలు)
83. విద్య కాషాయీకరణ 84. వ్యవసాయం - ప్రపంచీకరణ
85. ప్రాంతీయ అసమానతలు
86. విముక్తి- విద్య (పాలో ఫ్రెయిరె )
87. ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర (మొదట వాల్యూం)
(ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ (2వ ముద్రణ)
88 రెడ్డి రాజ్యాల చరిత్ర (ఇంగ్లీషు / 2వ ముద్రణ)
(అఖిల భారతరెడ్డి సమాఖ్య (శ్రీశైలం)
89.ఆర్థిక సమస్యలు రాజకీయాలు
90.ఇరాక్‌పై యుద్ధ మేఘాలు 91 వివేకానందుని సందేశం
92.మార్క్స్ సిద్ధాంతాలు 93.మానవ స్వభావం అంటే ? మార్క్స్
94. నీతి- అభివృద్ధి (వార్డు సెహోల్సామ్)
95. మార్క్సిజం - సామాజిక శాస్త్రం
96. హెగెల్ -హెగెలియానిజం
97. మార్క్సిస్టు తత్వశాస్త్ర నిఘంటువు -1
98. మార్క్సిస్టు తత్వశాస్త్ర నిఘంటువు -2
99. మార్క్సిస్టు తత్వశాస్త్రం -3, అయిదు అంశాలు
100. అశోక వీరనారాయణరెడ్డి రెడ్డి, ఐ.పి.ఎస్.
101. భారతదేశంలో తాగునీటి హక్కు (సెస్)
102. ఫెడరలిస్టు పత్రాలు (అమెరికన్ రాజ్యాంగ పత్రాలు పీకాక్ ప్రచురణలు)
103. భావజాలం - మార్క్స్
104. భారత తర్కశాస్త్ర చరిత్ర -సతీష్ చంద్ర విద్యాభూషణ్ (525 పేజీలు )
105. తత్వశాస్త్రం
106. మార్క్సిజం పాఠాలు -4 (పదాలు వివరణలు)
107. జ్ఞానం ఎలా వస్తుంది? (లెఫ్టిస్టు స్టడీ సర్కిల్)
108. విలువలు అంటే హెరాల్డ్ టిటస్ (లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్)
109. మనిషి స్వేచ్ఛ ఎంత ? హెరార్డ్ టిటస్
110. పౌరహక్కులు (లెఫ్టిస్టు స్టడీ సర్కిల్)
111. భావవాదం దాని అంతరార్థం
112 మానవ స్వభావం ఆత్మ భావం
113. నీతి శాస్త్రం - నీతి 114. జ్ఞానం స్వభావం
115. జ్ఞానం ప్రామాణికత 116.మతం-స్వభావ స్వరూపాలు
117. పాక్ పశ్చిమాలు, వ్యత్యాసపూరిత విలువలు
118. ఉపయోగితావాదం- అంతరార్థం
119. మౌనధ్యానం(చిన్మాయ్) 120.ప్రపంచ వాణిజ్య కరదీపిక
121 డిస్కవరీ పత్రిక వ్యాసాలు 122. నక్క - తోడేలు
123. వాస్య పిల్లి 124. స్వామి సుఖబోధానంద ఉపన్యాసాలు (జి.ఎమ్.ఆర్. గ్రూప్ ప్రచురణ)
125. చైనా - శ్రీమతి చక్రవర్తి (ఎన్.బి.టి)
126. ఆంధ్రప్రదేశ్ చరిత్ర (హిస్టరీ కాంగ్రెస్ రెండవ భాగం)
127. Little Rose Buds (English)
128. శివాజీ - విశిష్ట చక్రవర్తి (పన్సారే)
129. సోషలిజం ఎందుకు?
130. గతితర్క సమస్యలు (అనిల్ రాజివ్వాలె)
131. మేజిక్బస్ (యెనెస్కో) 132. భారత రైతాంగ స్థితిగతులు
133. కల్లలపై మనిషి పోరు (ఎన్.బి.టి)
134. 'పేకా' (కేంద్ర ప్రభుత్వక్రీడ యువజన శాఖ)
135. సంభాషణలు స్త్రీ శిశుసంక్షేమశాఖ
136. Panchayat Programmes (English)
137. పికా క్రీడలు (తయెక్వాండోత సహరి 8 క్రీడలు)
138. చరిత్ర తత్వం 139. తత్వశాస్త్రం - శాస్త్రీయ బోధనా పద్ధతులు 140. కళాతపస్వి యెగోర్ ❑













# ఆర్వియార్
# కొన్ని
# అనువాదాలు
























# ఆర్వియార్ కొన్ని స్వీయ రచనలు










